శివపురాణము.

(ఐదవసంపుటము.)

సూత్రిత్రియప్రణీతము.

నడకుదుటి వీరరాజు పంతులు,

సంపాదకుఁడు.

వెల రు ౧-౮-౦ లు.

పి ఠా పు ర ము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల,

౧౯౨౭.

విన్నపము.

—:O:—

ఈయైదవసంపుటములో శివపురాణము వాయవీయసంహిత రెండుభాగములును బూర్తియైనది. ఇఁక ధర్మసంహిత యొక్కటే యున్నది. అది రెండుసంపుటము లగును. పాఠకులరుచిపరివర్తనమునకై రాఁబోవునందిక బ్రహ్మపురాణము మూఁడవసంపుటమును బ్రకటింప నున్నాము. బ్రహ్మపురాణ మైదుసంపుటము లగునప్పటికి శివపురాణము సంపూర్ణము గాఁగలదు. తరువాత "వామనపురాణము" నారంభించి బ్రహ్మపురాణము పూర్తి యగువఱకును మార్చిమార్చి ప్రకటించుచుందుము.

మేమెట్టిలక్ష్యమును మనసునం దుంచుకొని యెంతపట్టుదలతో నీమహాకార్యమును నిర్వహింపఁ బూనుకొంటిమో యంతటిప్రోత్సాహము మాకాంధ్రలోకమున లభించుచుండుట లేదు. ఇప్పటి కష్టాదశ పురాణగ్రంథమాలిక వేయిరూపాయల వఱకు నష్టపడిపోయినది. మూఁడుకోట్లమంది యాంధ్రసోదరులలో నించుమించుగా నాలుగువందలమందిమాత్రమే దీని నాదరించుచున్నా రని వ్రాయుటకు మాలేఖిని నిరుత్సాహము నందుచున్నది. దేశోపకారకరంబు లగునిట్టిసత్కార్యముల కన్నిటికిని బ్రప్రథమమం దిట్టినిరుత్సాహములే కలుగుచుండు ననియు, పూనికతోఁ బ్రయత్నించినచో నెట్టిమహాకార్యము లైనను నిరంతరాయముగాఁ గొనసాఁగఁగలవనియు భావించి, మేము మా యాంధ్రసోదరులయందే భారమును వైచి యెప్పటికైనను మహోదారహృదయు లగు నాంధ్రప్రభువులయు, శ్రీమంతులయు సాహాయ్యప్రోత్సాహము

లు లభింపఁగలవనుధైర్యముతో నిక్కార్యము కష్టసాధ్యమైనను, ద్రవ్యసాధ్యమైనను బట్టుదలతో నిర్వహింప నుద్యోగించియున్నారము.

భాషాభిమానులగు నాంధ్రసోదరులును, గ్రంథభాండాగారాధిపతులును, స్థానికప్రభుత్వమువారును, భాషాపోషకులగు ప్రభువులును మాప్రయత్నము నాదరించి మాకుఁ దగురీతి నెల్లవిధములఁ జేయూఁతయొసంగి దేశభాషోపయోగకరంబగు నీఘనకార్యమును నిర్విఘ్నముగా మాచే నిర్వహింపఁజేయవలయు నని కోరుచున్నాము. మఱియు చందాదారు లగువారు మఱికొందఱిని చందాదారులుగ నుండునట్లు ప్రోత్సహింతు రని వేఁడుచున్నాము.

పిఠాపురము.
20-4-27.

నడకుదుటి వీరరాజుపంతులు,
సంపాదకుఁడు.

విషయసూచిక.

శ్రీరామచంద్ర.

శివపురాణము

వాయవీయసంహిత.

కార్తికేయజననము.

వాయుదేవు నుద్దేశించి మహర్షులు మరల నిట్లు ప్రశ్నించిరి. మహాత్మా! విచిత్రంబును, బరమగుహ్యంబును, అవిజ్ఞేయంబు నగు మహాదేవునిదివ్యచరిత్రంబంతయు నాలకించినకొలఁదిని మేము ముగ్ధులమైపోవుచున్నాము. శివశక్తితత్త్వములం దెలిసికొనుటకై యేవిధముగాఁ దర్కించినను దోషము లేదుగదా. ఏమనిన—ఆశివశక్తుల కార్యంబువలననే యనేకంబులగు ప్రాకృతభావములు పుట్టుచున్నవి. ఈ ప్రపంచమునందలి సృష్టిస్థితిలయంబులును, బ్రహ్మాదుల జీవితములునుగూడ నమ్మహాదేవుని నిగ్రహానుగ్రహంబులమీఁదనే యాధారపడి యుండును. మఱి శివుం డెవ్వరినిగ్రహానుగ్రహంబులకును బాత్రుఁ డగుట లేదు. కావుననే శివునియైశ్వర్య మందఱికంటె నధికమైనదనుట కెట్టిసంశయమును లేదు. అట్టియైశ్వర్యమును, స్వాతంత్ర్యమునుగూడ స్వభావసిద్ధములుగా నుండునాతఁడు శరీరి యెట్లయ్యెను? నిరాకారుం డగునాతఁడు మూర్తిమంతుం డెట్లగును? కారణవ్యతిరిక్తముగాఁ గార్యరూప మగుమూర్తి యెట్లు సిద్ధించును? అంతటనుగూడ మహేశ్వరుఁడు నిర్గుణుం డనియే ప్రశంసింపం బడుచున్నాఁడు. ఆతఁడు

మూర్తిమంతుఁ డని యన్నచో మూర్తి సగుణముగాక నిర్గుణ మెట్లగును? ఒక్కచోటనే నిర్గుణత్వమును, సగుణత్వమును గలుగుట యసంగతము గాదా? పరమేశ్వరుని పరమస్వభావము నిర్గుణమై, యదియే మరల సగుణ మెట్లు గాఁగలదు? స్వభావమునకుఁ బరివర్తనము లేదుగదా! స్వతంత్రుఁ డగునాపరమేశ్వరుని యిచ్ఛావశంబున స్వభావముగూడఁ బరివర్తితం బగునందు రేని—పరమేశ్వరుఁడు స్వేచ్ఛాక్రియంబున నిత్యవస్తువు ననిత్యముగను, అనిత్యవస్తువును నిత్యముగను జేయుట లేదేమి? నిర్గుణుం డగుశివునికంటె నన్యంబగుసగుణమూర్తి కలదనియు, దానికిని శివుఁడే యధిష్ఠాత యనియు వేదంబులు చెప్పుచున్నవందు రేని—ఆమూర్తియే శివస్వరూప మని చెప్పవలసి యుండును. ఏవిధముగా నైన నేమి మూర్తి యైనంతనే దానికిఁ బరతంత్రత యవశ్యముగా నుండితీరును. మూర్తికిఁ బరతంత్రతయే లేకున్నచో మూర్తిస్వీకారమువలనఁ బ్రయోజన మేమి? విశేషఫలసాధనంబుకొఱకే మూర్తి యంగీకరింపఁబడుచున్నది గదా! ఇచ్ఛానుసారంబుగ శరీరధారణంబు గావించుటవలన స్వాతంత్ర్యమునకు భంగము లేదందు రేని, పురుషాదులశరీరధారణముగూడ నట్టిదియేగాదా? పిపీలికాదిబ్రహ్మపర్యంతమును గలసకలజీవులును దమతమయిచ్ఛానుసారముగనే దేహధారణముం గావించుచుందురు. వారు కర్మాధీనులగుట లేదా? ఇచ్ఛానుసారంబుగ రూపంబులను ధరించుట యింద్రజాలసమం బని పండితులు చెప్పుదురు. అణిమాదిప్రభావంబుచే లోకవశీకరణంబు గావించుకొనుటకంటె నట్టిరూపంబులతో నితరప్రయోజనంబు లేదు. విశ్వరూపధరుం డగువిష్ణుదేవుఁడుగూడ యుద్ధమునందుఁ దద్రూపధరుం డగుదధీచిమహర్షిచే వంచితుం డయ్యెను. కావున సర్వశ్రేష్ఠుండును, బరమాత్ముండును నగుశివుండుగూడ రూపధారియే యైనచో శరీరధారుల

గుణీవ్రులకంటె నధికుఁ డెట్లగును? మఱియుఁ బరమకారణుం డగుశివుండు సర్వానుగ్రాహకుం డని నిర్దిష్టుం డయ్యెను. కాని యాతఁడు దేవాదులను నిగ్రహించుచుండును. అట్టిచో నాతనికి సర్వానుగ్రాహకత్వ మెట్లు సిద్ధించుచున్నది? ఆతఁడు కల్పాంతరములయం దప్పుడప్పుడు బ్రహ్మదేవుని పంచమశిరమును ఖండించుట, శరభావతారమునుదాల్చి నృసింహమూర్తి యగువిష్ణుదేవుని వక్షోభాగమును నఖముఖంబులచే విదారణంబు చేయుట మొదలగుకార్యములను గావించి యుండెను. దక్షయజ్ఞసమయంబున వీరభద్రునిచే సకలదేవతలను శిక్షితులం గావించెను. ఒక్కక్షణములోఁ దనఫాలనేత్రానలంబువలనఁ బుత్రమిత్రకళత్రసహితు లగుత్రిపురదానవులను బురంబులతోఁగూడ భస్మము గావించెను. దేవతలందఱును వలదని విలపించుచుండఁగా రతిపతియగు కందర్పుని దననేత్రానలజ్వాలల కాహుతి గావించెను. తనమస్తకంబున క్షీరక్షరణంబు గావించె నను క్రోధముచే నొక్కనిమిషములో నాకాశచరంబు లగుగోసమూహములను భస్మము గావించెను. అమ్మహాదేవుండు జలంధరుండను నసురుని ప్రార్థనముచేఁ దనపాదమూలంబున జలమును జక్రాకారముగఁ జేసి విష్ణుదేవు ననంతునిచే బంధించి యాతని శతయోజనదూరంబునకును విసరిపాఱవైచెను. ఆతఁడే మరల జలంధరాసురుని త్రిశూలముచే నిహతుం గావించెను. అమ్మహేశ్వరుని యనుగ్రహంబుచేఁ జక్రలాభముం గాంచిన విష్ణుదేవుఁడుగూడ నిరంతరము నసురసంహారము సేయుచుండును. అమ్మహాదేవుఁడు జ్వాలదగ్నిసదృశం బగుతనత్రిశూలముచే నంధకాసురుపక్షంబును దగ్ధంబు చేసివైచెను; కంఠమునుండి కాళాంగనను సృష్టించి దారుకుని సంహృతుం గావించెను; గౌరీశరీరకోశమునుండి కౌశికిని సృష్టించి యామెచే శుంభనిశుంభాదులను మృత్యుముఖపతితులం జేయించెను.

మఱియు స్కాందపురాణమునం దొకకథ యిట్లున్నది:—ఇం
ద్రునకు శత్రుండగు తారకుని వధించుటకై మహాదేవుండు బ్రహ్మాదేవు
లచేఁ బ్రార్థితుండై పార్వతీసహితంబుగ మందరాచలంబునకుం బోయి
శరీరాఘాతంబులచే భూమియంతయు రసాతలంబునకుఁ గ్రుంగిపోవున
ట్లుగా నచ్చట నామెతో విహరించుచుండెను. అనంతర మద్దేవుండు
దేవినిగూడ వంచించి యామెగర్భంబున కతిదుర్వహం బగుతన తేజము
ను బవిత్రఘృతరూపంబుగఁ జేసి యగ్నియందు నిక్షేపించెను. అయ్య
గ్నిదేవుండును భాగభాగములుగాఁ దత్తేజమును గంగాదులయందు వి
డిచెను. ఆతనిభార్య యగుస్వాహాదేవి కృత్తికారూపంబున ధననాథు
నితో రమించుచు మెల్లమెల్లఁగా నందందుఁ జెదరియున్నశివతేజము
నొక్కచో సంగ్రహించి మేరుపర్వతస్థితం బగుశరవణంబునం జేర్చె
ను. కాలవశంబునఁ గ్రమముగా ఆతేజఃప్రభలచే మేరుసహితంబుగ
నచ్చటిపర్వతంబు లన్నియును సువర్ణకాంతులచే దశదిశలను వెలిఁగిం
పఁదొడంగెను. తరువాతఁ జాలకాలంబునకు లోకంబునఁ గుమారుల
కెల్ల నాదర్శమూర్తియగు కుమారుం డుదయించెను. మనోహరంబు
ను, బ్రభామయంబు నగుకార్తికేయుని శిశురూపముం గాంచి దేవా
సురు లెల్లరును విస్మితులును, విమోహితులు నై పోయిరి. అప్పుడు
మహాదేవుండు పుత్రసందర్శనకుతూహలముతో స్వయముగా నచ్చటికి
వచ్చి కుమారు నెత్తికొని యాతనిమందహాసామృతమును బానముచే
యుచున్నవాఁడునుంబోలి యాబిడ్డను దేవియొడియం దుంచెను. అప్పు
డయ్యాదిదంపతు లిరువురును బ్రేమవివశులై పోయిరి. దేవతలును,
పితరాదు లగుతపస్వులునుగూడ నక్కుమారు ననేకవిధముల నెత్తికొని
ముద్దాడుచు నాడించుచు నాతని బాల్యక్రీడల నెన్నియోరీతులఁ బ్ర
శంసించుచు నక్కుమారునకుఁ బాలియ్యవలయు నని దేవిని బ్రా

చిరి. అప్పుడు దేవియు నమ్మతో పమానం బగుపుత్రస్నేహము నబ్బాఱిన కొసంగుచు "కుమారా! నీవు జగద్రక్షణంబునకై యవతరించితివి!" అనియెను. పార్వతీపరమేశ్వరులు సహ కుమారుని నెంతసేపు చూచి నను దనివి తీరకుండెను. పిమ్మట దారకాసురవధార్థము భయపడుచున్న దేవేంద్రుఁడు కుమారుని దేవసేనానాయకపదంబున కభిషిక్తుం గావించెను. ఇట్లింద్రునిచేఁ బెంపఁబడుచున్న పుత్రుని నిమిత్తమాత్రముగఁ జేసి మహాదేవుండు స్వప్రభావముచేఁ గ్రౌంచభేదనంబును, దారకాసుర సంహారంబును గావించి యింద్రుని నిర్భీతుం జేసెను—మఱియొకవిష యము—బాహుబలగర్వితుం డగురావణుం డొకప్పుడు కైలాసపర్వ తమును దనబాహువులచేఁ బైకెత్తుచుండఁగా మహాదేవుం డయ్యపరా ధమును సహింపఁజాలక తనపాదాంగుష్ఠముచే నొక్కి రావణుని భూత లంబునం దదిమివైచెను. మఱియు నద్దేవుండు తన్నాశ్రయించినయొక బ్రాహ్మణబాలకుని రక్షించుటకై యతిత్వరితంబుగఁ బోయి యముని బాదతాడితునిం గావించెను—ఒకప్పుడు తనవాహనమగు వృషేంద్రు ము గానంబడకుండుటచే నమ్మహాదేవుఁడు బడబానలముకంఠమును బంధించి బయటికిఁ దీసికొని వచ్చెను. అందుచే సకలజగంబును జల మయమైపోయెను. అలౌకికంబగు నానందావేశముతో నద్దేవుఁడు వివిధ రీతుల నృత్యము సేయుచుండెను. అప్పు డాతనియంగభంగులచే సక లలోకంబులును సంచలించిపోవుచుండును! అట్టిశివుండు శాంతుండును, సర్వదా జీవుల ననుగ్రహించువాఁడు ననుమాటయే నిశ్చయమైనచో పమర్థుండయ్యు నేకకాలమునందే యెల్లవారికినిగూడ ముక్తి నేల ప్రసా దింపకున్నాఁడు? అనాది యగుకర్మమై చిత్రమే దీనికంతకును నియా మకమని చెప్పుటకు వలనుపడదు. ఏమనఁ—కర్మ సాపేక్షమైనను జేతనే గదా కారణమగును దానికి నేమి? వేఱుమాట యేల?

కేవలము యుక్తులనుబట్టియే పోయినచోఁ దుదకు నాస్తిక్యముకంటె మఱి యేమియును గోచరించుట లేదు. కావున నోజగత్ప్రాణమూర్తీ! అట్టినాస్తికభావ మేవిధముగా నివృత్తియగునో యావిధముగా మాకుఁ దత్త్వము బోధింపుము.

—♦ శివతత్త్వము. ♦—

అని యిట్లు మహర్షులు ప్రార్థించుటయు వాయుదేవుం డిట్లని యెను. విప్రవరులారా! మీహేతువాదము యుక్తియుక్తమైనది. మంచియుద్దేశముతోఁ బ్రశ్నించుట నాస్తిక్యము గానేరదు. ఈవిషయంబున నేనిప్పుడు సప్రమాణముగా సంశయవిచ్ఛేదంబుగావించెదను. ఆప్రభునియనుగ్రహంబు లేని యసద్వ్యక్తుల కన్యథాభావంబు గలుగ వచ్చును. ఆపరమేశ్వరుని పరిపూర్ణానుగ్రహముం గాంచుటకంటెఁ దమ కిఁకఁ గర్తవ్యం బేదియును లేదని సాధువులు భావించుచుందురు. ఆతనిపరిపూర్ణభావరూపస్వభావమే పరానుగ్రహకార్యంబునఁ బర్యాప్తంబై యుండును. స్వభావశూన్యవ్యక్తి యెవ్వరినిఁగూడ ననుగ్రహింపఁజాలఁడు. తనకంటె భిన్నంబగు సకలపశుపాశమయం బగు జగంబంతయు నాదేవుని కనుగ్రాహ్యమైనదియే. ఇతరుల ననుగ్రహించుటకే యాతఁ డీశ్వరుఁడై యాజ్ఞ సేయుచుండును. మహేశ్వరుఁడు సకలంబునకుఁ బతియు, ఆజ్ఞాపకుఁడును, అనుగ్రహకర్తయు నై యుండును. పరానుగ్రహార్థమై శరీరధారణాదులఁ గావించునాతనికిఁ బరతంత్రత యెక్కడిది? అనుగ్రహించువానిని విడిచి యనుగ్రహ మెట్లుండఁగలదు? కావుననే స్వాతంత్ర్యశబ్దమునకుఁ బరమార్థ మపేక్షాశూన్యత యగుచున్నది. ఆదేవుని యనుగ్రహము లేనివాఁడే పరతంత్రుఁడు. ఆతనియనుగ్రహంబుకంటె భోగమోక్షంబులు లేవు.

శివతత్త్వవిషయంబు. నజ్ఞాననివృత్తుం డగువాఁ డనుగ్రహపాత్రుం డగును. ఈప్రపంచమునం దీశ్వరుని యజ్ఞానముచే నధిష్ఠితం బగువస్తువేదియును లేదు. నిర్గుణుం డగుపరమేశ్వరుఁ డేరూపముచే మనజ్ఞానదృష్టికి గోచరుం డగుచుండునో యదియే యాతని రూపముగా భావింపఁబడుచున్నది. పరమకారణుండును సాక్షాన్నిర్గుణుండు నగుసమ్మహేశ్వరుని సచ్చిదానందస్వరూపము జ్ఞానమునకుఁగూడ నగమ్యమైనది. అదివ్యరూపము కేవలము శ్రవణమననాదిప్రమాణములవలఁ ననుభవింపఁదగినదిమాత్రమే—ప్రత్యక్షదర్శనముననే గాని కేవలప్రమాణమునం దెవ్వరికిని సాధారణముగా విశ్వాసము గలుగదు. కావున నేదేనొక మూర్తియే యాత్మకు సాక్షాదుపలక్షకమై యుండవలయును. ఏమూర్తి శివోపలక్షకమైనదో యదియే శివమూర్తి యని భావింపవలయును. కాష్ఠాదులయం దారూఢము గాకుండఁ బ్రత్యేకముగ నగ్ని యెట్లు దర్శనీయము గాకుండునో యట్లే మూర్తులయం దావిర్భవింపకుండ నీశ్వరుఁడును దృశ్యుండు గానేరఁడు. నిప్పు దెమ్మనినచో మండుచున్నపుల్లలు మొదలగువానినే గాని ప్రత్యేకముగ నగ్నిని దేఁజాలము. అట్లే శివుని బూజింపవలయు నన్న మూర్తిమంతం బగువస్తువునందే యాతని భావించి పూజింపవలయును. శివోపలక్షకం బగుమూర్తియందుఁ గావింపఁబడినపూజ లన్నియును శివునియందుఁ గావింపఁబడినట్లే యగుచున్నవి. కావున లింగాదులయందును, బ్రతిమలయందును శివభావనంబు చేసి పూజించుట కర్తవ్యము. ఆమూర్తుల నాధారముగాఁ జేసికొని మనము సాక్షాత్సదాశివునే యుపాసించుచుందుము. అట్లు మూర్తిమంతంబులగు లింగములు, ప్రతిమలు మొదలగునవి పరమేశ్వరునిచే ననుగృహీతంబులైనట్లే యాశివాధిష్ఠితమూర్తులవలన మనముగూడ ననుగ్రహింపఁబడుచుందుము. పరమాత్ముం డగుశివుండు లో

కానుగ్రహంబు సేయుకొఱకు సదాశివప్రభృతిమూర్తులయాత్మలయం దధిష్ఠించి యుండును. ఆసదాశివప్రభృతులు పరాత్పరునిచే నట్లనుగ్రహింపఁబడి తాముగూడ లోకముల ననుగ్రహించుచుందురు. జీవులకు భోగమోక్షసంధాయకములై సిద్ధంబులును, గల్పితంబులు నగునట్టి మూర్తులు శివసంబంధములై యుండును.

సుఖదుఃఖసంకలిత మగుభోగమే కర్మవిపాకాత్మకమైనది. ఎట్టి కర్మమును లేని శివునకు భోగమనునది యేమున్నది? శివుఁ డెల్లర ననుగ్రహించుచుండును. ఆతఁ డెవ్వరిని నిగ్రహించుట లేదు. నిగ్రహాకారు లగువారికిఁ గలుగుదోషము లేవియు నాతనికి సంభవింపవు. బ్రహ్మాదిదేవతలయం దాతఁడు గావించిన ట్లగపడుచున్ననిగ్రహము లోకహితంబునకే చేయఁబడినది. ఆతఁ డీబ్రహ్మాండమున కంతకు నధీశ్వరుం డనుట కెట్టిసంశయంబును లేదు గదా! ఆమహాదేవుండు శ్రీకంఠనామకం బగులీలామూర్తి నధిష్ఠించి విరాజిల్లుచుండును. దోషకారిణు లగువా రెల్లరు నాతనిచే యథోచితముగ నిగృహీతు లగుచుందురు. అందుచే వారికిఁ బాపవిముక్తియు, లోకమునకుఁ బీడానివృత్తియు నగుచుండును. యథోచితనిగ్రహము నిందనీయము గానేరదు. ఈకారణముచేతనే రాజులు దండార్హులయెడలఁ గావించుదండవిధానము ప్రశంసితం బగుచున్నది. ఈశ్వరభావముచే సకలకార్యములను సిద్ధింపఁజేయునాతఁ డీశ్వరత్వమును వహింపకున్నచో జగదీశ్వరుఁ డెట్లగును? సమస్తకార్యవిధానకర్తృత్వమే యీశ్వరత్వము. విధాన మనిన నాజ్ఞ. ఆజ్ఞ యనిన "ఇట్లు చేయవలయును; ఇట్లు చేయఁగూడదు" అని శాసించుటయే—అట్టిపరమేశ్వరశాసనము ననుసరించువారే సాధువులు. తద్విపరీతాచరణులగువా రసాధువు లగుచున్నారు. కాని లోకమునం దందఱును సాధువులే యుండరు. కావున నసాధుభావమును గోలఁ

గించి సాధుభావమును రక్షింపవలయును. అందుకొఱకు సామాద్యుపాయంబులఁ బ్రయోగించి యంతకును దీఱకున్నచో దండము నుపయోగింపవలయును. కేవల లోకహితముకొఱకే దండాంతశాసనము విహితం బయ్యెను. లోకహితంబుగానిదండము సమ్మతము గానేరదు. ఈశ్వరుఁడే సర్వదాహితానుష్ఠానము గావించువారికి నిదర్శనస్వరూపుఁడై యున్నాఁడు. కావున నసాధువులను నిగ్రహించునీశ్వరుఁడు దూషణీయుఁ డెట్లగును? అకార్యము లొనరించువానిని వివేకులు తిరస్కరింతురు. లోకక్షోభకరంబగునదియే యకార్యము. లోకమునందుఁ జాలపఱకు ద్వేషము లేకుండఁగనే నిగ్రహకృత్యములు జరగుచుండును. తండ్రి కుమారునకు బుద్ధివచ్చుటకై నిగ్రహించుటయందు ద్వేషభావ ముండునా? మధ్యస్థులుగూడ లోకమునందు దోషులను నిగ్రహించుచుందురు. అందుఁ గొంచెమైనను నిర్దయత్వము లేకుండఁ బోదు. అట్టినిర్దయత్వమే లేకున్నచో దోషులనైనను నిగ్రహించుట యెట్లు పొసంగును? నిగ్రహ మనిన దుఃఖప్రదమగుహింస. అట్టిదుఃఖకరమగుహింసను జేయువాఁడు నిర్దయుఁ డని చెప్పవలయును. నిర్దయత్వమేయైనను దోషముగలచోట నిగ్రహము గావించుటయే యుచితమనియు, అట్లు చేయకూరకుండుట దోషమనియుఁ గొందఱు చెప్పుదురు. వైద్యుఁ డావశ్యకతనుబట్టి రోగిని నిగ్రహించుచుండును. అందెంతమాత్రమును నిర్దయత్వము లేదు. అతఁడు దయచేతనే యక్కార్యముం గావించుచుండును. శిక్షాప్రతిపక్షహింసనమునందుమాత్రమే దయయుండుట కెట్టియవకాశమును లేకుండును. అట్టిసమయములందు దయాపరుఁడుగూడ నిర్దయుఁడై పోవును. శక్తియుండియు విపన్నులగు సాధువులను రక్షింపకుండుట దోషమే యగును. క్రూరులు స్వలాభముకొఱకుఁ బరులను బాధించుచుండఁగా దయాస్వభావముచే నూరక

చూచుచుండుటయును దోషమే. క్రూరజంతువు మానవుని మ్రింగఁ బోవుచుండఁగా శక్తిగలిగియుండియు దాని నదలింపక క్షుద్బాధచే నది మరణించునేమో యని దయచే నూరకుండుట దోషము! కావున గృ పావలంబనము సర్వసమయములందును హితకరమైనది గాదు. అది యుచితకాలంబున సమ్మతమును, అనుచితసమయంబున నసమ్మతము నై యుండును.

శివునిప్రతిమూర్తులయందు వస్తుత్వముచే దోష మగపడుచున్నను నట్టిదోషములు శివున కెంతమాత్రమును సంబంధింపవు. అగ్నిచే దహింపఁబడుచున్న తామ్రమునందు నీలరేఖలు వెలువడును. అంతువలన నగ్ని కెంతమాత్రమును గళంకము లేదు. మఱియు నశుచివస్తు సంసర్గముచే నగ్ని కశుచిత్వము గలుగదు. ఇంతేకాక యగ్నిసంయోగముచే వానికి శుచిత్వము గలుగుచున్నది. ఇట్లే శోధనీయం బగు నాత్మసంయోగముచే మహాదేవుఁ డపరిశుద్ధుఁడు గానేరఁడు. శివసంయోగముచే నపరిశుద్ధం బగునాత్మయే శుద్ధం బగుచున్నది. మఱియు దాహశక్తి లోహమునందుఁ బ్రవేశించిన యగ్నిదే గాని లోహముది గానట్లు మూర్తియం దారోపితం బగునీశ్వరశక్తి మహాదేవునిదే గాని మూర్తిది యెంతమాత్రమును గాదు. అగ్నియే గాని కాష్ఠమూర్ధ్వముఖముగాఁ బ్రజ్వలింపఁజాలదు. బొగ్గులును, భస్మమును గాష్ఠసంబంధము లైనవేగాని యగ్ని కెంతమాత్రమును లేవు. ఇట్లే శివునకును, దత్ప్రతిమూర్తులకును గలసంబంధ మని యూహింపవలయును. ఇందుచేతనే శిలామృత్తికాదులయందలి శివావిర్భావమునందు శివత్వ మపచరింపఁబడుచున్నది. మైత్రి, క్షమ, దాక్షిణ్యము మొదలగుగుణములు జీవులకు గుణదోషములను గల్పించును గాని యనుగ్రహాకారి యగు మహాదేవున కవి యెంతమాత్రమును గుణదోషముల

ను గూర్పఁజాలవు. అనుగ్రహశబ్దమునకు “గౌణము” అనునర్థమును బెద్దలు నిర్దేశించి యుండలేదు. సంసారమోచనుం డగుశివునియాజ్ఞయే యనుగ్రహము. మహాదేవునియాజ్ఞానుష్ఠానమే హితము. ఆహితమే యనుగ్రహము. మహాదేవుఁడు సర్వభూతహితుండు గావున సకలానుగ్రహకారి యగుచున్నాఁడు. ఉపకార మనినను, అనుగ్రహ మనినను నొక్కటియే— ఉపకారము హితస్వరూప మగుటచేఁ బరమేశ్వరుఁడు సర్వోపకారకుఁడు. చిదచిదాత్మకం బగుసర్వంబును నాతనిహితమునందే నియుక్తంబై యున్నను, దత్తత్స్వభావంబునుబట్టి నిబద్ధంబై యీశ్వరుని సమహితలాభమునుం గాంచఁజాలకుండును. సూర్యకిరణంబులచేఁ బద్మము లన్నియును సమానముగ వికసింపవలసియున్నను, వానిస్వభావమునుబట్టి కొన్ని యట్లు సంపూర్ణవికసితములు గాఁజాలకుండును. కావున స్వభావమే వస్తువుల భవిష్యదర్థంబులకుఁ గారణ మగుచున్నది. వస్తువునందు లేనిస్వభావమును గర్త యెన్నఁడును గల్పింపఁజాలఁడు. అగ్ని సువర్ణమును గరఁగింపఁగలుగును గాని, యంగారమును గరఁగింపఁజాలునా? అట్లే యీశ్వరుఁడును బాపపరిపాకము నందనివారిని ముక్తులుగాఁ జేయఁజాలఁడు. సర్వానుగ్రహకారి యగుశివుండు స్వభావముచే నెంత నిర్మలుఁడో జీవు లంతటి మలినులై యుందురు. జీవు లెన్నఁటికిని నియమము నతిక్రమింపఁజాలరు. అట్టివారికి శివత్వ మెట్లు సిద్ధించును? ఈజీవుల కర్మమే, వీరిమాయాబంధమే సంసార మని పెద్దలు చెప్పుదురు. కర్మమాయాబంధములు జీవులకే గాని శివున కెంతమాత్రమును లేవు. బంధనరూప మగు నీమలినమే జీవులకు సహజహేతువై యున్నది. అట్టిమలినస్వభావమే యుపాధిహేతువై స్వామి దానికిఁగూడ నొకకారణ ముండవలసియున్నది. తుట్టతుద కేది మూలకారణమో యదియే సర్వశక్తివిశిష్టంబైన దని యూహింపవ

యును. కార్యభేదంబునుబట్టి యట్టిశక్తియందు భిన్నత్వముం గల్పించుట యుచితంబు గాదు. స్వభావముచే భిన్నరూపంబు లగుకర్మంబులును, మాయానుబంధములును భిన్నకార్యములకు హేతువు లని గ్రహింపవలయును. సకలజీవులును సమానాత్మకులే యైయున్నను సంసారమునఁ గొందఱు బద్ధులును, గొందఱు ముక్తులు నగుచున్నారు. అబద్ధులయందును గొందఱు లయభోగాధికారాసక్తులచే నుచ్చనీచభావసంకలితులై జ్ఞానైశ్వర్యవైషమ్యంబులతోఁ గానవచ్చుచున్నారు. అందుఁ గొంద ఱీశ్వరప్రతిమూర్తిస్వరూపులును, గొందఱు సాక్షాచ్ఛివస్వరూపులుగాఁ బరిగణింపఁబడుచు నూర్ధ్వస్థితులై యుందురు. కొందఱు మధ్యస్థితులై మహేశ్వరాదినామంబులచే విరాజిల్లుచుందురు. కొంద ఱధోభాగస్థితులై రుద్రాదినామంబులచే నొప్పుచుందురు. అయ్యాత్మస్థానంబులు మూఁడువిధంబులై యుండును. వానిలో నిమ్నస్థాన మాత్మ యనియు, మధ్యస్థాన మంతరాత్మ యనియు, నున్నతస్థానము పరమాత్మ యనియుఁ జెప్పంబడును. అవి యథాక్రమంబుగ బ్రహ్మవిష్ణుమహేశ్వరనామంబులచే నొప్పుచుండును. జీవులలోఁ గొందఱు పరమాత్మపదంబును, గొంద ఱంతరాత్మపదంబును, గొంద ఱాత్మపదంబును నాశ్రయించి యుందురు. శైవగణంబులు శాంత్యతీతపదంబును సేవించుచుందురు. మాహేశ్వరగణంబులు శాంతిపదంబు నుపాసించుచుందురు. రౌద్రగణంబులు విద్యాపదంబును, వైష్ణవగణంబులు ప్రతిష్ఠాపదంబును నాశ్రయించి యుందురు. బ్రహ్మయు, బ్రహ్మశరీరోత్పన్నులును, నివృత్తిపదమునం దుందురు—జీవులలో నెనిమిదివిధంబు లగుదేవయోనులు ప్రధానము లనియు, మానుషయోని మధ్యమం బనియు, నైదువిధంబు లగుపశుయోను లధమము లనియుఁ జెప్పంబడుచున్నవి. ఈవిధముగా జీవసముదాయ మంతయుఁ జతుర్దశయోనివిశిష్టమైనది.

జీవులయుచ్చనీచభావములకు స్వభావములమే కారణము. భుక్త వస్తువులకువలెనే సంసారకారణంబగుమలమునకు అపక్వమనియుఁ బక్వమనియు భేదము గలదు. అపక్వము మొదటియవస్థ తరువాతఁ గ్రిమముగాఁ బక్వావస్థ గలుగును. అపక్వమల మధోగతికిని, బక్వమలము క్రిమముగా నున్నతగతికిని గారణ మగుచున్నది. ఏకమల, ద్విమల త్రిమలంబులచే జీవు లుత్తమమధ్యమాధములగు చున్నారు. వారుత్తరోత్తరాధోభాగంబుల నాశ్రియించి యుందురు. సర్వోన్నతస్థానమునందు సర్వేశ్వరుం డగుశివుం డొక్కఁడే యధిష్ఠించి యుండును. ఈజగంబంతయు, అశివాత్మకం బయ్యును శివాధిష్ఠితమై యుండును. పక్వాపక్వవిధానస్వరూపంబు లగుత్రిమలంబులచేతనే జీవులకు సంసారరోగప్రివృత్తి యగుచున్నది. ఆజ్ఞారూపం బగునోషధినుండి జనించిన జ్ఞానమే యీరోగమునకు మందు. ఆజ్ఞాపకుండును, పరమకారణుండును, మంగళాధారుండు నగుసాక్షాన్మహేశ్వరుఁడే దీనికిఁ జికిత్సకుఁడు. అనాయాసముగ జీవులకు ముక్తిని బ్రిసాదింపసమర్థుఁ డగుమహాదేవుని కింత యాయాస మెందులకని శంకింపవలదు—స్వభావముచేతనే దుఃఖమయం బగుసంసారము దుఃఖశూన్యమగుట యెట్లు? స్వభావమున కెన్నటికిని వ్యత్యయంబు లేదుగదా! వైద్యునిచేఁగాని, యోషధిచేఁగాని రోగ మెన్నఁటికి నరోగము గానేరదు. కాని వైద్యుఁడు తనయోషధముచే రోగార్తుని రోగముక్తుని గావింపఁగలఁడు. ఇట్లే మలినస్వభావులును, దుఃఖితులు నగుజీవులను తనయాజ్ఞాజన్యంబగు జ్ఞానౌషధముచే నీశ్వరుఁడు దుఃఖవిముక్తులం గావించుచుండును. వైద్యుఁడు రోగమునకుఁ గారణుడు గాఁడు గాని శివుఁడు సంసారకారణుఁడుగదా యని యాతనియందు వైషమ్యమనుదోషము నారోపింపఁజనదు. స్వభావముచేతనే సంసారదుఃఖము గలుగుచున్నప్పుడు దానికిఁ

గారణము శివునియం దారోపించుట యుచితము గానేరదు. జీవులస్వభావమాలిన్యమే వారిదుఃఖములకుఁ బ్రేరక మగుచున్నది. అయస్కాంతమణిసాన్నిధ్యమే లోహచలనంబున కుపకారకమగుచున్నట్లు, శివసాన్నిధ్యముమాత్రమే యచేతనమాయాదిమలంబునకుఁబ్రవృత్తికారణ మగుచున్నది. ఆవిధముగనే శివునియందు సంసారకారణత్వమును గ్రహింపవలయు నని పెద్దలు నిర్దేశించి యున్నారు. సహకారణంబగు నిట్టిసాన్నిధ్యమును నివర్తింపఁజేయుట దుస్సాధము. అందుచేతనే శివుఁడు స్వయముగ నుదాసీనుఁడై యున్నను సంసారాధిష్ఠాతయైయుండె నని కల్పింపఁబడుచుండెను. శివసంబంధము లేకుండ నీజగంబునం దేవస్తువునకును బ్రవృత్తియే లేదు. కాని యందువలనఁగూడ శివుండు దూషణీయుఁడు గానేరఁడు. విశ్వతోముఖం బగునాతనియాజ్ఞాశక్తియే సమస్తమును నియమించుచుండును. దానిచేతనే సమస్తవస్తువులును నిర్మితంబు లయ్యెను. అందువలనఁగూడ శివున కెట్టిదోషమును లేదు. ఈప్రపంచమునం దేవస్తువును మొట్టమొదట లేదుగదా;—ఇన్నిటికంటె ముందుగ నాతఁడు నాతనియాజ్ఞయుమాత్రమేగదా యున్నది;—ఇట్లన్నిటిని గల్పించి వీనియం దధికారము నెఱపుట యాతనిదోషము గాదా యని శంకింపఁజనదు. అట్లు మహాదేవునియందు దోషవిచారము సేయువా రీశ్వరశక్తిపరిభావముచేఁ దమకుఁదామే నశింతురు. అట్లయినను మహాదేవుఁడు దూషణీయుఁడు గాఁడు.

అని యిట్లు వాయుదేవుండు చెప్పుచుండఁగా నప్పుడు వేదసమ్మతం బగు నశరీరవాణి "ఇదియంతయును సత్యము! అమృతము! సత్యము!" అని స్పష్టముగా వినవచ్చెను. మునులందఱు నవ్వాక్యముల నాలకించి యపగతసంశయులును, అనుపమానందభరితులును, అతితరాశ్చర్యావిష్టులునై ప్రీతిభాశాలియగు పవమానదేవునకుం బ్రణ

మిల్లిరి. అప్పుడు వాయుదేవుండు వీరికింకను సుస్థిరజ్ఞానము లభింపలేదని గ్రహించి మఱియు నిట్లు వచియింపందొడంగెను. మునివరులారా! జ్ఞానము పరోక్షం బనియు, నపరోక్షం బనియు రెండువిధంబులు. అందు పరోక్షజ్ఞాన మస్థిరమైనది. అపరోక్షజ్ఞానము స్థిరమైనది. అనుమానము, ఆప్తవాక్యము మొదలగు వానివలనఁ గలుగుజ్ఞానము పరోక్షము. ఉత్తమానుష్ఠానముచేఁ గలుగుజ్ఞాన మపరోక్షము. అపరోక్షజ్ఞానముచేఁగాని ముక్తి లభింపదని నిశ్చయముగఁ దెలిసికొని మీరందఱును శ్రేష్ఠానుష్ఠానసిద్ధికొఱకు శక్తివంచనము లేకుండఁ బ్రయత్నముసేయుఁడని యుపదేశించెను.

శివశ్రేష్ఠత్వము.

మోక్షమును గరగతంబు గావించు శ్రేష్ఠానుష్ఠానం బెదియో బోధింపవలయు నని మహర్షులు మరలఁ బ్రశ్నించుటయు మరుద్భగవానుం డిట్లనియెను. మునివరులారా! సాక్షాన్ముక్తిప్రదుం డగుమహాదేవుని బ్రత్యక్షుంబు గావింపఁజాలినశివధర్మమే పరమధర్మము. అదియే శ్రేష్ఠానుష్ఠానము. ఆధర్మము పంచాంశములుగా విభక్తంబగుటచేఁ దదనుష్ఠానంబుగూడ నైదువిధంబులై యుండును. క్రియ, తపము, జపము, ధ్యానము, జ్ఞానము ననునివి పంచానుష్ఠానములు. ఇవి మరల నితరధర్మవిశిష్టంబులైనచో "అపరమ" ధర్మసాధనంబు లగుచున్నవి. అపరధర్మము పరోక్షజ్ఞానమును, పరమధర్మము ముక్తిసాధనం బగునపరోక్షజ్ఞానమును గల్పించుచుండును. ఈపరమధర్మమును అపరధర్మమునుగూడ వేదోక్తములైనవియే—ధర్మశబ్దంబున కర్థనిర్ణయంబు సేయుపట్టున మనకు వేదమే ప్రమాణము. యోగపర్యంతంబు లగుపరమధర్మములు శ్రుతిశిరోభాగమునందును, అపరమధర్మం

బులు శ్రుతిముఖాద్యోభాగంబులందు నుండును. పరమధర్మంబునతి దెల్లవారికి నధికారంబు గలదుగావున నది సాధారణమైనది. అపరమ ధర్మము పరమధర్మమునకు సాధనమైనది. ఇది ధర్మశాస్త్రములచే సాంగంబుగ విస్తృతంబై యున్నది. అందుఁ బ్రధమం బగుపరమధర్మమే శ్రేష్ఠానుష్ఠాన మగుచున్నది. ఇది యితిహాసపురాణాదులచేఁ గొలఁది గా విస్తరింపఁబడి శైవాగమంబులచే సాంగోపాంగముగ సంస్కారాధికారంబులతో లెస్సగాఁ బ్రపంచింపఁబడి యున్నది. శైవాగమము శ్రౌతమనియు, అశ్రౌతమనియు ద్వివిధంబులై యున్నది. అందువేదామోదితంబైనది శ్రౌతంబనియు, నట్లు గానిది యశ్రౌతంబనియు నెఱుంగవలయును. అశ్రౌతధర్మము స్వతంత్రమైనది. అది మొదట దశవిధంబులుగను, పిమ్మటఁ బదునెనిమిదివిధంబులుగను విభక్తం బయ్యెను. ఇది కామికాదినామంబులచే సిద్ధాంతసంజ్ఞం గాంచుచున్నది—శ్రుతిసారమయంబగు శ్రౌతనామకశైవాగమము శతకోటివిధంబుల విరాజిల్లుచున్నది. అందుఁ బరమం బగుపాశుపతవ్రతజ్ఞాన ముపదేశింపఁబడి యున్నది. ప్రతియుగంబునందును శివుండు యోగాచార్యరూపంబున నవతరించి శిష్యులకుఁ బాశుపతవ్రతజ్ఞానమును బ్రసాదించుచుండును. రురుండును, దధీచియు, అగస్త్యుఁడును, మహాయశుం డగునుపమన్యుండును ఈశాస్త్రమును సంక్షేపముగఁ జేసి పాశుపతవ్రతప్రచారము గావించి యున్నారు. వీరలవంశములనుండి శతసహస్రగురుమూర్తు లవతరించి యున్నారు. ఈసకలశాస్త్రంబులయందును బరమధర్మము చర్యాదినామంబులచేఁ జతుర్విధంబుల విభక్తం బయ్యెను. వానిలోఁ బాశుపతయోగమే శివసాక్షాత్కారమునకుఁ బ్రధానసాధనమైనది. కావునఁ బాశుపతయోగమే శ్రేష్ఠానుష్ఠానము.

మునీంద్రులారా! ఈవిషయంబున బ్రహ్మదేవుండు చెప్పినవి

ర్థంబు నుపదేశించెద నాకర్ణింపుము! నామాష్టకమయం బగుయోగ ము శివునిచేఁ గల్పింపఁబడియెను. దానివలన నతిశీఘ్రముగ శివవిషయి కప్రజ్ఞ యుత్పన్నంబు గాఁగలదు. ఆప్రజ్ఞచే నచిరకాలములోనే పర మజ్ఞానలాభంబగును. జ్ఞానసంపన్నులకు శివుండు ప్రసన్నుండు గాఁగ లఁడు. శివప్రసాదముచేతనే పరమయోగసిద్ధి యగుచున్నది. పరమ యోగ మపరోక్షజ్ఞానమును గల్పించుటచే నట్టివారికి శివసాక్షాత్కార ము లభించుచున్నది. శివుం డపరోక్షుం డైనచో భవనాశనంబగును. అపరోక్షజ్ఞానియగువాఁడు సంసారవిముక్తుండును, శివతుల్యుండు నగు ను. శివుఁడు, మహేశ్వరుఁడు, రుద్రుఁడు, విష్ణువు, పితామహుఁడు, సంసారవైద్యుఁడు, సర్వజ్ఞుఁడు, పరమాత్మ యనునీనామములే నామా ష్టకము. ఇవియే మహాదేవప్రతిపాదకంబులై సర్వప్రధానములై యుం డును. ఇందు మొదటియైదునామంబులును శాంత్యతీతాదిపదానుసా రంబుగాఁ బంచోపాధులం గాంచి సదాశివప్రభృతులకు సంజ్ఞ లగుచు న్నవి. ఉపాధినివృత్తి యైనచో వారికిని నివృత్తి యగును. పదము ని త్యమే గాని పదాధికారులనిత్యులుగదా. పదపరివర్తనంబుచేఁ బదాధి కారులకు ముక్తియు, పరివృత్తివిశేషంబుచే మరలమాయాయోగంబునఁ బదప్రాప్తియు నగుచుండును. ఈమొదటియైదునామంబులును కేవలా త్మాభిధాయకంబు లైనవి. తక్కినమూఁడునామములును ఉపాదానా దియోగమువలనను, త్రివిధోపాధివచనమువలనను శివునియందే వర్తిం చుచున్నవి. అనాదిమలసంయోగప్రాగభావమువలనను, స్వభావము వలనను, శివుఁడు పరిశుద్ధాత్మస్వరూపుఁడుగాఁ బ్రశంసితుం డగుచు న్నాఁడు. అశేషకల్యాణగుణంబులచే ఘనభూతుండగునీశ్వరుఁడే శివుం డని శివతత్త్వవేదు లగు పాశుపతవ్రతులు భావించుచుందురు:—ఇరు వదినాలుగుతత్త్వంబులకును బరంబైనతత్త్వము ప్రకృతియనియు, ప్ర

కృతికిఁ బరంబైనయిరువదియైదవతత్త్వము పురుషుం డనియుఁ బండితులు నిర్దేశించియున్నారు. అతనినే వాచ్యవాచకభావముచే వేదాదిస్వరం బగుప్రణవముగాఁ బరిశంసించియున్నారు. అతనిప్రకృతిరూపము వేదైకవేద్యంబును, వేదాంతప్రతిష్ఠితంబు నైనది. ఆపురుషుఁడు ప్రకృతిభోక్త గావునఁ బ్రకృతియందు విలీనుఁడై యుండును. ఆప్రకృతిలీనుం డగుపురుషునికంటెను బరుం డగువాఁడే మహేశ్వరుఁడు. ప్రకృతిపురుషులప్రవృత్తు లన్నియు మహేశ్వరాధీనములై యుండును. మఱియుఁ ద్రిగుణాత్మస్వరూపంబైన మాయయే ప్రకృతి యనియు, మాయయే మహేశ్వరుం డనియు నెఱుంగవలయును—మహేశ్వరసంయోగముచే మాయావిక్షోభకారి యగునతండే విష్ణువు:—రుచ్ఛబ్దము దుఃఖము, దుఃఖహేతుకము ననునర్థము గలది. దుఃఖమును, దుఃఖహేతువును ద్రవింపఁజేయు పరమకారణం డగుశివుఁడే రుద్రుఁడు. మఱియు శివతత్త్వాదిభూమ్యంతమును గలశరీరాదులయందును, ఘటాదులయందును శివుండు వ్యాపించి యుండును గావునఁ జతుర్దశలయందును రుద్రగణంబులు నిలిచియుందురు:—శివుండు జగత్పితృభూతుండై స్వప్రతిమూర్తులగు నాత్మజులయందుఁ బితృభావంబుచే సన్నిధించి యుండును గావున నాతఁడు లోకపితామహుం డయ్యెను:—నిదానజ్ఞుఁ డగువైద్యుఁడు వివిధోపాయంబులచేతను, ఔషధంబులచేతను రోగనివృత్తిం గావించునట్లు భోగాధికారానుసారంబుగా సంసారరోగమును సమూలముగ నశింపఁజేయువాఁడు గావున సర్వతత్త్వార్థవేదులగుపండితులు శివునకు సంసారవైద్యనామమును నిర్దేశించి యున్నారు. శబ్దాదివిషయజ్ఞానసిద్ధికిఁ నిమిత్తంబులగు నింద్రియంబులు గలిగియుండియు జీవులు మాయారూపంబగు జీవమలంబుచే నావృతులై త్రికాలభావనీయంబు లగుస్థూలసూక్ష్మపదార్థంబుల నన్నిఁటిని సంపూర్ణముగా

సెలుంగఁజాలకున్నారు. కాని యట్టియక్షజ్ఞానహేతుకంబు లగునింద్రియంబులు లేకున్నను ననాయాసముగా సకలవస్తుతత్త్వంబులను గ్రహింపంగలవాఁ డగుటచే సదాశివునకు సర్వజ్ఞనామము ప్రసిద్ధం బయ్యెను:—ఇట్టి పరమంబులగు సర్వజ్ఞత్వాదిసకలగుణంబులను గలిగి లప కంబై క్షేత్రస్థంబగు నాత్మలేనివాఁడై సర్వాత్ముం డగుటచే సదాశివుం డు పరమాత్మనామంబునఁ బ్రశంసితుం డగుచున్నాఁడు:—

ఆచార్యానుగ్రహంబుచే నీనామాష్టకోపదేశంబు గాంచి నివృత్త్యాదిపంచకళాగ్రంధులను శివాదిపంచనామంబులచే సృష్ట్యాదిస్థానక్రమంబున సంస్మరించుచుఁ గ్రమముగా గుణానుసారంబుగ శోధింపవలయును. పిమ్మట సోద్ఘాతంబుగనైనను, నిరుద్ఘాతంబుగనైనను గుణితంబులగు నీపంచనామంబులచే హృదయము, కంఠము, తాలుదేశము, భ్రూమధ్యము, బ్రహ్మరంధ్రము నధిష్ఠించియున్న నివృత్త్యాదిపంచకళలను భేదింపవలయును. (నాభిమూలమునుండి ప్రేరితం బగువాయువుచే మస్తకంబున నాఘాతము సేయుటయే యుద్ఘాతము) తరువాత భూతేంద్రియమయములగు అష్టపురంబులకు నధిష్ఠాతయగుస్వీయాత్మను సుషుమ్నాపథంబునుండి మరలించి ద్వాదశదళహృత్కమలమునందలి చంద్రోపరిభాగమునందున్న శివతేజమునందు సమ్మిళితంబు చేసి స్వస్వకారణలయానంతరంబున శక్తిసంభూతం బగునమృతవర్షంబుచే స్వశరీరంబు నభిషిక్తంబు గావించి యమృతస్వరూపం బగునాత్మను హృదయమునం దవతరింపఁజేయవలయును. పిమ్మట హృత్కమలస్థితుం డగుచంద్రుని కుపరిభాగమునందున్న శ్వేతపద్మమునందు నిర్మలుండును, మధురమూర్తియు, శుద్ధస్ఫటికసంకాశుండును, శీతలద్యుతియు, అర్ధనారీశ్వరుండు నగుదేవదేవుని ధ్యానించుచు నామాష్టకంబుచేతను భక్తిపుష్పంబులచేతను నర్చించి మరలఁ బ్రాణాయామంబును, జిత్తేన

మూర్ధియుఁ గావించి యర్థసహితంబుగా నామాష్టకంబును జపింపవల
యును. ఆవెనుక నాభియం దష్టాహుతిహోమంబును పూర్ణాహుతియు
నమస్కారంబును గావించి యష్టపుష్పంబులచే నంత్యపూజ నిర్వర్తించి
జలగండూషమార్గముచే నాత్మసమర్పణంబు గావింపవలయును. ఇట్లు
గొంతకాలం బాచరించినమానవుండు శుభకరం బగు పాశుపతజ్ఞానం
బును, పాశుపతవ్రతలాభంబును గాంచఁగలిగి శీఘ్రయోగసిద్ధుండై
మోక్షప్రాప్తుం డగునను టెట్టిసంశయంబును లేదు.

—♦ పూజావిధినిరూపణము. ♦—

అని వాయుదేవుండు బోధించుటయు మహామును లో మహా
త్మా! ఏవ్రతంబు ననుష్ఠించుటచే బ్రహ్మాదిదేవతలు పాశుపతశ్రేష్ఠు
లైరో యెఱింగింపు మని ప్రార్థించుటయు వాయుదేవుండు మరల
నిట్లు చెప్పందొడంగెను. మునులారా! వేదోదితంబును, అథర్వవేద
శిఖాస్థితంబును, సర్వపాశవిమోచనంబును నగు పాశుపతవ్రతముం గూ
ర్చి యభివర్ణించెదను వినుండు. చిత్తానక్షత్రయుక్తం బగు పూర్ణిమ
యీపాశుపతవ్రతంబునకుఁ బ్రశస్తసమయము. దేవాలయంబులును,
పుణ్యక్షేత్రంబులును, పుణ్యారామంబులును, శుభలక్షణసంపన్నంబు
లగు ప్రదేశంబులును దీని కనుకూలస్థానములు. ఉపాసకుండగువాఁడు
పూర్వదివసంబునఁ త్రయోదశినాఁడు స్నానాహ్నికంబులు నిర్వర్తించి
యాచార్యుని యనుమతిం గాంచి, యాతనికిఁ బూజాప్రణామంబులు
గావించి విశేషపూజ యొనరించి శుక్లాంబరుండును, శుక్లయజ్ఞోపవీ
తుండును, శుక్లమాల్యధరుండును, శ్వేతచందనానులిప్తుండునునై దర్భా
సనంబున నుపవసించి దర్భముష్టియై ప్రాఙ్ముఖంబుగనైనను, ఉదఙ్ము
ఖంబుగానైనను బ్రాణాయామం బాచరించి, దేవదేవుని ధ్యానించి

సేవవ్రతంబు గావింతు నని వారిచే ననుజ్ఞాతుండై సంకల్పంబు చేసి వ్రతనిష్ఠితుండు గావలయును. ఈవ్రతం బింతకాలంబు సేయవలయు నను నియమంబు లేదు. బ్రతుకున్నినాళ్ళును గావింతు నని సంకల్పంబు చేయవచ్చును. కాదేని ద్వాదశవర్షంబులుగాని, షడ్వర్షంబులుగాని త్రివర్షంబులుగాని, ఏకవర్షంబుగాని, యర్ధవత్సరంబుగాని, మాసత్రయంబుగాని, ఏకమాసంబుగాని, ద్వాదశదినపర్యంతముగాని, షడ్దినపర్యంతముగాని, దినత్రయంబుగాని, ఏకదినంబుగాని, చేయునట్లు సంకల్పంబు చేయవచ్చును.

పిమ్మట విరజాహోమంబుకొఱకు విధివిహితంబుగా నగ్నిస్థాపనంబు చేసి యందు యథాక్రమంబుగ సమిధాజ్యచరుహోమంబు గావించి మరలఁ దత్త్వశుద్ధికొఱకు మూలమంత్రము నుచ్చరించుచు సమిధాదులచే “నా దేహమునందలి యీసకలతత్త్వంబులును బరిశుద్ధంబు లగుఁగాక !” యని భావించుచుఁ బ్రహ్మాదిహోమం బాచరింపవలయును. పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచకర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు, త్వగాదిసప్తధాతువులు, ప్రాణాది పంచవాయువులు, మనస్సు, బుద్ధి, అహంకారము త్రిగుణములు, ప్రకృతి, పురుషుఁడు, రాగము, విద్య, కళ, నియతి, కాలము, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుఁడు, సదాశివుఁడు, శక్తి, శివతత్త్వము అను నివియే, విఖ్యాతతత్త్వములు. విరజామంత్రంబులచే హోమంబు సేయువాఁడు విరజుండు (దోషరహితుఁడు) గాఁగలఁడు. తరువాత గోమయపిండమును మంత్రసంస్కృతంబు గావించి యగ్నియందు నిక్షేపించి, యగ్నిరక్షణంబు చేసి పిదప హవిష్యాశనుండై పరదినంబునఁ జతుర్థియందుఁ బ్రాతఃకాలంబున లేచి మరలఁ బూర్వోక్తసకలకర్మంబులం దీర్చి నిరాహారుండై యవశిష్టకాలంబును గడపవలయును. మరలఁ బ్రాహ్మ

మయందు బ్రాతఃకాలంబున నుక్తవిధుల ననుష్ఠించి హోమావసానం బున రుద్రాగ్ని నుపసంహరించి సప్రయత్నంబుగా భస్మగ్రహణంబు చేసి పిమ్మట జటిలుండై కాని, యేకజటాధారియై కాని స్నానంబుచేసి లజ్జితుండు గాఁజేని దిగంబరుండు గావలయును. లజ్జాయుతుం డయ్యె నేని కాషాయవస్త్రంబును గాని, చర్మంబును గాని, యేకవస్త్రంబును గాని వల్కలంబును గాని ధరించి దండమేఖలాధారి కావలయును. తరువాతఁ బాదప్రక్షాళనంబుచేసికొని రెండుసారు లాచమనం బాచరించి విరజానలసంభూతం బగు భస్మముం గైకొని యథర్వవేదోక్తంబులగు "అగ్నిః" ఇత్యాదిషణ్మంత్రంబులను బఠించుచు శరీరమును భస్మలిప్తంబు గావించుకొని మస్తకమునుండి పాదములవఱకును గల సకలాంగములను స్పృశింపవలయును. తరువాతఁ బ్రణవమంత్రమునుగాని, శివమంత్రమునుగాని జపించుచు సర్వాంగములను భస్మోద్ధూళనంబు చేసి త్ర్యాయుషనామకం బగు త్రిపుండ్రరచనము గావించి శివభావ సిద్ధుండై శివయోగానుష్ఠాన మాచరింపవలయును. త్రిసంధ్యలయందు నిట్లు పాశుపతవ్రతంబు సేయుచు లింగస్వరూపముచే సనాతనుం డగు మహాదేవుని బూజింపవలయును.

ఐశ్వర్యవంతుఁడైనచో నవరత్నంబులచే గూర్పఁబడి కర్ణికాకేసరయుతంబగు సువర్ణపద్మము నాలింగమూర్తి కాసనముగాఁ గల్పింపవలయును. ధనవంతుఁడు గానిచో శ్వేతకమలమునుగాని, రక్తకమలమునుగాని యాసనముగాఁ జేయవలయును. అదియును లభింపనిచోఁ గేవలకల్పితాసనంబు నర్పింపవలయును. ఆసనపద్మకర్ణికామధ్యంబునఁ బీఠికాయుతం బగుచిన్నశివలింగమును స్థాపించి లింగశోధనంబు చేసి, యథావిధిగఁ బ్రతిష్ఠించి, యాసనప్రదానంబు చేసి పంచవక్త్రవిధానంబున మూర్తిపరికల్పనంబు గావించి పంచగవ్యాదులచేఁ బరిపూర్ణంబు

లగు కలశంబులచే యథాశక్తి నభిషేకించి, కుంకుమ, కర్పూరము, చందనము మొదలగుగంధద్రవ్యములచే లింగమును బీఠమునుగూడ విలిప్తంబు చేసి బిల్వపత్రములు, కమలములు, శ్వేతరక్తనీలోత్పలములు, మఱియు నితరసుగంధపుష్పములు, శతపత్రములు, దూర్వలు, అక్షతలు మొదలగువానిచే విధివిధానంబున మహాపూజ చేయవలయును. ఆవెనుక ధూపదీపంబులును, అర్ఘ్యంబును నివేదించి ధనవంతుఁడైనచోఁ గల్యాణానుష్ఠానంబు గావింపవలయును. ఈవ్రతమునందు దుత్కృష్టంబులును, విశిష్టంబులును, న్యాయార్జితంబులు నగుద్రవ్యంబులను దానము చేయవలయును. బిల్వపత్రములను, పద్మములను, ఉత్పలములను ప్రత్యేకముగ వేయింటిని దానము చేయవలయును. శక్తి లేకున్నచో అష్టోత్తరశతంబునైనను దానము చేయవలయును. ఏవి లేకున్నను బిల్వపత్రములనైనను దానము చేయవలయును. బిల్వపత్రము లన్నింటికంటెను ముఖ్యమైనవి. అవిమాత్రము లేకుండఁ జేయరాదు. వేయిపద్మములతోఁ నొకస్వర్ణకమలమును, వేయియుత్పలంబులతో నొకబిల్వపత్రమును సమానములు. అన్యపుష్పములు లభించినంతవఱకు నివేదింపవలయును. ఉత్కృష్టం బగునష్టాంగార్ఘ్యంబును, ధూపాలేపంబులను నర్పింపవలయును. అఘోరముఖంబునఁ గృష్ణాగరును, సద్యోముఖంబున మణశ్శిలయు, వామదేవముఖంబునఁ జందనంబును, పౌరుషముఖంబున హరితాళంబును, ఈశానముఖంబున భస్మంబును విలేపింపవలయును. మఱియు నఘోరముఖంబున శ్వేతాగురుధూపంబును, పౌరుషముఖంబునఁ గృష్ణాగురుధూపంబును, సద్యోముఖంబున గుగ్గులుధూపంబును, సౌమ్యముఖంబున సౌగంధికధూపంబును, ఈశానముఖంబున నుశీరాదిధూపంబును నర్పింపవలయును. శర్కర, మధువు, కర్పూరము, గోఘృతము, చందనము మొదలగువా

ఇఁకఁ బ్రతిమాసంబునను గావింపవలసిన విశేషవిధింగూర్చి చెప్పెదను. వైశాఖమాసంబున వజ్రలింగమును, జ్యేష్ఠంబున మరకతలింగంబును, ఆషాఢంబున మౌక్తికలింగంబును, శ్రావణంబున నీలలింగంబును, భాద్రపదంబున బద్మరాగలింగంబును, ఆశ్వీనంబున గోమేధికలింగంబును, కార్తికంబున విద్రుమలింగంబును, మార్గశీర్షంబున వైడూర్యలింగంబును, పౌషంబునఁ బుష్యరాగలింగంబును, మాఘంబున సూర్యకాంతలింగంబును, ఫాల్గునచైత్రంబులయందుఁ జంద్రకాంతలింగంబును నుపాసింపవలయును. వీనికి వ్యత్యయంబులగు మణిలింగములైనను దోషంబు లేదు. సకలమాసంబులయందును రత్నలింగములనే పూజింపవలయును. రత్నాభావంబున హేమమయంబులైనను, రౌప్యమయంబులైనను, దారుశిలామయంబులైనను, శక్త్యనుసారంబుగా నుపయోగింపవచ్చును. మఱియు మృత్తిక, చందనము మొదలగు క్షణికంబులైన వస్తువులచే లింగమూర్తిం గల్పించి యారాధింపవచ్చును. వ్రతావసానంబున నిత్యక్రియల నిర్వర్తించి పూర్వోక్తవిధానంబున విశేషపూజయు, హోమంబును గావించి యాచార్యుని వ్రతులను నర్చించి యాచార్యానుమతంబునఁ బ్రాఙ్ముఖుండై గాని యుదఙ్ముఖుండై గాని దర్భాసనంబునం దుపవసించి ప్రాణాపానంబుల నిరోధించి శక్త్యనుసారంబుగ మూలమంత్రమును జపించుచు నంబికాత్ర్యంబకులను ధ్యానించి దేవతానుజ్ఞం గాంచి నమస్కారంబు చేసి యంజలిబద్ధుండై "మహాదేవా! నేనిప్పుడు నీయాజ్ఞచే వ్రతోత్సర్గంబు చేయుచున్నాఁడను" అని విజ్ఞాపనంబు చేయుచు లింగమూలంబున నుత్తరభాగంబున దర్భను విడిచి, దండమును, జటను, వల్కలమును, మేఖలను బరిత్యజించి మరల యథావిధిగ నాచమనంబు చేసి పంచాక్షరమంత్రము నుచ్చరింపవలయును.

ఇట్లు దేహాంతపర్యంతమును దీక్షితుండై యీవ్రతంబు ననుష్ఠించువాఁడు నైష్ఠికుండనియు, అత్యాశ్రమి యనియు, మహాపాశుపతుండనియుఁ బ్రశంసితుం డగుచున్నాఁడు. అతఁడే తపస్వి శ్రేష్ఠుఁడు, అతఁడే మహావ్రతి. ముముక్షువులలో నాతనికి సముండగుకృతకృత్యుం డెవ్వఁడును లేఁడు. మొదట యతియును, పిమ్మట నైష్ఠికుండు నగువాఁడు నైష్ఠికశ్రేష్ఠుఁడుగాఁ బరిగణింపఁబడును. పండ్రెండు దివసంబు లుపవసించి యీవ్రతంబు నిర్వర్తించువాఁడు కఠోరవ్రత నియమంబుచే నైష్ఠికతుల్యుండగును. ఘృతాక్తశరీరుండై రెండుమూఁడుదినంబు లీవ్రతంబు నాచరించువాఁడుగూడ నొకవిధముగా నైష్ఠికుఁడగుచున్నాఁడు. ఇది విధాయకకృత్య మని భావించి నిష్కాముఁడై సర్వదా శివునియం దాత్మసమర్పణంబు సేయుచు వ్రతాచరణంబు గావించువానితో సమానులెందును లేరు. జ్ఞానవంతుఁడై శరీరమంతటను భస్మవిలేపనంబు గావించుకొనువాఁడు తత్క్షణమందే పాపవిముక్తుం డగును. రుద్రాగ్ని సంబంధమగు శ్రేష్ఠతేజమే భస్మముగావున సర్వదా భస్మధారియగు మానవుఁడు తేజస్సంపన్నుండు గాఁగలఁడు. భస్మాగ్నిసంయోగముచే భస్మనిష్ఠునిసర్వదోషంబులును నిర్మూలంబు లగును. భస్మస్నానముచే విశుద్ధం బగు నాత్మగలవాఁడు భస్మనిష్ఠుఁ డనంబడును. భస్మలిప్తసర్వాంగుఁడై భస్మత్రిపుండ్రధారియై భస్మశాయియై యుండువాఁడు పాపవిముక్తుఁడై భస్మనిష్ఠుం డగుచున్నాఁడు. భస్మమైశ్వర్యప్రదం బగుటచే రక్షయనియుఁ బ్రశంసితం బగుచున్నది. వేయేల? భస్మస్నానముచే వ్రతియగువాఁడు సాక్షాన్మహేశ్వరుండు గాఁగలడు. పరమేశ్వరసంబంధ మగు నీభస్మమే శైవులకుఁ బరమాయుధము. ధౌమ్యాగ్రజుం డగునుపమన్యుఁడనువాని కీజన్మమూలముననే సకలాంతరాయములును నివారితంబు లయ్యెను. కావునఁ బాశుపతవరాయణులగువా

రెల్లవిధములఁ బ్రయత్నించి యైశ్వర్యమునందువలెనే భస్మమునం దాదరముంచి భస్మసంగ్రహంబు సేయుచు, భస్మస్నాననిరతులై యుండవలయును.

ఉపమన్యూపాఖ్యానము.

తపోధనుం డగునుపమన్యుండు సామాన్యబాలకుఁడు గాఁడు. ఆతఁడు ధీమంతుండును, మునిశ్రేష్ఠుండు నగువ్యాఘ్రపాదునితనయుఁడు. ఉపమన్యుండు పూర్వభవంబున సిద్ధుం డయ్యును గారణాంతరంబులచేఁ బదచ్యుతుండై పూర్వపుణ్యఫలంబున మునికుమారుండై పుట్టెను. పరమేశ్వరానుగ్రహ మాతనికి లభించునదృష్టంబు గలదుగావున నే పాలకొఱకుఁ గావించినయాతనితప మాయనుగ్రహసంపాదనకు నిమిత్తమాత్రం బయ్యెను. ఆతపంబువలననే మహాదేవుం డాతని క్షీరసాగరంబును, గణేశత్వమును, నిత్యకుమారత్వమునుగూడఁ బ్రసాదించెను. ఆశ్రీశంకరుని యనుగ్రహముచేతనే యాతనికి జ్ఞానలాభం బయ్యెను. కుమారజ్ఞానమే శక్తిసంపన్నం బైనదని పెద్దలు చెప్పుదురు. కార్తికేయునివలనఁ బరమజ్ఞానరహస్యమును గ్రహింపఁజాలిన నందీశ్వరునివలెనే యుపమన్యుకుమారుండును శివానుగ్రహంబున శైవశాస్త్రవక్త యయ్యెను.

పాలు గావలయు నని పట్టుపట్టి దుఃఖించుచున్నయుపమన్యుకుమారునిం గాంచి యాతనితల్లి యొకనాఁడు కడుపు దఱుఁగుకొనిపోవునట్లు దుఃఖించుచు "కుమారా! దరిద్రులచే వనవాసులమైయున్న మన కెక్కడ? మంచిపాలెక్కడ? దారిద్ర్యవశంబున మందభాగ్యురాల నగునేను నీయేడ్పు దీర్చుటకై జలంబులయందుఁ బిండిని గలిపి పాలని చెప్పి నీకిచ్చుచుంటిని. ఎన్నఁడును బాలరుచి యెఱుంగనివాఁడవు గా

వున నీవును వానిని ద్రాగి యూఱడిల్లుచుంటివి. ఇట్టినీవీదినము మా మేనమామయింటికిఁ బోయి యచ్చట గోక్షీరముల నించుక యాస్వాదించి పాలరుచి నెఱుంగఁగలిగితివి. అందువలన నేఁడు నేనిచ్చిన యీపిండినీళ్ళయందు నీకతృప్తి జనించుటచే “అమ్మా! నాకు నీవు నిజముగాఁ బాలీయలేదు” అని యేడ్చుచు నాదుఃఖమును మఱింత వర్ధిల్లఁజేయుచున్నావు. పరమేశ్వరానుగ్రహంబు లేక నీకుఁ బాలు ద్రాగుభాగ్య మెట్లు లభించును? గణపరివృతుండును, పార్వతీసహితుండు నగుశంకరుని పదపంకజములయందు భక్తితో నేదేనొకవస్తువు నర్పింపఁగలిగినచో నదియే సమస్తసంపదలకును గారణము గాఁగలదు. మేము పూర్వభవంబున ధనలాభంబు నపేక్షించి మహాదేవు నారాధింపలేము. అందుచే మేమిప్పుడు దరిద్రులమైతిమి. ఆకారణముననే మన యింటఁ బాలు లేకపోవుచున్నవి. తండ్రీ! ఎందుల కేడ్చెదవు?” అని తల్లి చెప్పుచున్న శోకోద్దీపకంబులగు హితవాక్యంబుల నాకర్ణించి ఋషికుమారుం డగునుపమన్యుం డంతరంగంబున సంతప్తుండై తల్లిం గాంచి ప్రగల్భవచనంబులతో “అమ్మా! అంబికాసహితుం డగుమహాదేవుం డిప్పుడుగూడ నుండుటయే నిజమైనచో నిఁక దుఃఖింపనక్కఱలేదు. ఆదేవునియనుగ్రహంబుచే నేనక్షయక్షీరలాభంబు నందఁగలను” అనియెను.

ఆమాట లాలకించి ప్రేమమయి యగునాతనితల్లి “కుమారా! ‘ఆమహాదేవుఁ డిప్పుడుగూడ నుండుటయే నిజమైనచో’ అని సందిగ్ధముగాఁ బలికెద వేల? సర్వకారణుండును, సర్వశ్రేష్ఠుండు నగు నాపరమేశ్వరుం డెప్పటికినిగూడ నుండువాఁడే. ఈసమస్తప్రపంచమును సృజియించినవాఁ డాతఁడే. బ్రహ్మాదిదేవత లందఱు నాతనికింకరులు. ఆతనియనుగ్రహముచేతనే వారందఱు నైశ్వర్యవంతు లైరి. ఆప్రభువ

గా మువమందఱమును దాసానుదాసులము. తండ్రీ! నీవు త్రికరణశుద్ధిగా నితరదైవతంబులను బరిత్యజించి భక్తిభావముతో నంబికాసహితుం డగునా దేవదేవునే యారాధింపుము. “నమశ్శివాయ”. అనునీ మంత్రమే యమ్మహాదేవుని సాక్షాద్వాచకము. ప్రణవసంయుతంబులగు సప్తకోటిమంత్రములునుగూడ నీమహామంత్రమునుండియే బయలుదేఱి దీనియందే విలీనంబు లగుచున్నవి. ఆమంత్రము లన్నియుం దమతమ యధికారానుసారంబుగఁ బ్రసన్నంబు లగును గాని యీమంత్రము మాత్రము పరమేశ్వరాజ్ఞచే సర్వాధికారములును గలిగి యుండును. మహాదేవుండు నికృష్టులను ఉత్కృష్టులనుగూడ సర్వదా రక్షింప సమర్థుం డైనట్లే యీమంత్రంబును సమర్థంబై యితరమంత్రంబులకంటెఁ బ్రబలంబై యుండును. సర్వజీవరక్షణంబున దీనికి సమం బగుమంత్రం బేదియును లేదు. కావున నితరమంత్రములను ద్యజించి యీపంచాక్షరమంత్రమునే సేవింపవలయును. జిహ్వాంచలమునం దీమంత్రము గలవానికి దుర్లభం బేదియును లేదు. శైవులకు రక్షాహేతువగు నుత్తమంబైనయమోఘాస్త్ర మీమంత్రసంభూతంబైనదే యని యెఱుంగుము. నీవీమంత్రము నాశ్రయింపుము. కుమారా! నేను మీతండ్రి యొద్దనుండి యాపన్నివారకంబును, విరజానలసంభూతంబును నగునీ యుత్తమభస్మమును బడసి యుంటిని. దీనిని నీవు ధరించి నాచే నుపదిష్టంబైన యీపంచాక్షరమంత్రమును జపంబు గావింపుము. నీ కిది రక్షణం బగుఁగాక!” అని యుపదేశించి తల్లి కుమారు ననేకవిధంబుల దీవించి పంపెను.

ఉపమన్యుం డప్పుడు తల్లికి వందనంబు చేసి “అమ్మా! నీయాజ్ఞ నిర్వర్తించెదను” అని పలికి తపశ్చరణంబునకుఁ బ్రవృత్తుం డయ్యెను. అప్పుడు తల్లి కుమారుం గాంచి “దేవతలు నీకు మంగళదాయ

కు లయ్యెదరుగాక!" అనియెను. ఉపమన్యుండు తల్లిచే నిట్లనుజ్ఞాతుం డై హిమాలయంబునకుం బోయి యందు సమాధినిష్ఠుండై వాయుమాత్రభక్షణంబు సేయుచుఁ గఠోరతపంబు సేయుండోడంగెను. అతఁ డెనిమిది యిటికలచే గృహంబు నిర్మించి యందు మృణ్మయలింగంబును స్థాపించి సగణుండును, సాంబుండును, అవ్యయుండు నగుమహాదేవు నావాహనంబు చేసి పంచాక్షరమంత్రముతోఁ బత్రపుష్పంబుల నర్పించి పూజించుచు నవశిష్టకాలం బంతయుఁ ఘోరతపంబు సేయుచుండెను. ఇట్లు తపశ్చరణంబుచేఁ గృశుండును, నేకాకియు నై యున్న బాలకుని బూర్వము మరీచిశాపముచేఁ బిశాచాకృతు లై యున్నమునులు పీడించుచుఁ దపోవిఘ్నంబు సేయఁదొడంగిరి. బాలకుండు వారిచేఁ బీడితుం డగుచుండియుఁ దపంబును విడువక సర్వదా ఆర్తనాదముతో నుచ్చైస్స్వరంబున "నమశ్శివాయ" యనుమంత్రము నుచ్చరింపఁదొడంగెను. ఆశబ్దశ్రవణముచేఁ దపోవిఘ్నకారు లగుమును లందఱును దమపిశాచభావంబులను విడిచి యాతని సేవింప నారంభించిరి. ఆవిప్రకుమారుని తపఃప్రభావముచేఁ గ్రమఁబుగ జగంబంతయును బ్రదీపితం బగుచుండెను.

అప్పుడు ప్రధానులగు దేవతలు విష్ణుదేవునిపాలికిం బోయి సకలవృత్తాంతమును నివేదించుటయు విష్ణుదేవుం డిదియేమని యాలోచించి కారణమును గ్రహించి దేవతాసహితుండై యాక్షణమునందే మందరాచలంబునకుం బోయి మహాదేవుని సందర్శించి ప్రణామం బాచరించి కృతాంజలిపుటుండై "మహాదేవా! ఉపమన్యుం డను నొక బ్రాహ్మణకుమారుఁడు దుగ్ధార్థియై మహాతపంబు గావించుచున్నాఁడు. ఆతపస్తేజముచే జగం బంతయును దగ్ధమైపోవుచున్నది. కావున నీవా రిపిపత్తునకు నివారణోపాయంబు గావింపవలయును" అని ప్రార్థించు

టయ్యు మహాదేవుం డింద్రరూపముం దాల్చి యటకుఁ బోవఁదలంచి తత్క్షణమందే యింద్రాకృతిం దాల్చి యైరావతము నధిరోహించి సురాసురసిద్ధచారణాదిపరివృతుండై మహాసంరంభముతో నుపమన్యునాశ్రమంబునకుం బోయెను. మునికుమారుండును, మునిశ్రేష్ఠుండును, మునియు నగునుపమన్యుం డప్పుడు శక్రరూపధరుం డగుమహాదేవుం గాంచి సాష్టాంగప్రణామంబు చేసి "దేవదేవా! జగన్నాథా! స్వర్గనాయకుండ వగునీవు నాయాశ్రమంబునకు విచ్చేయుటచే నీప్రదేశము పవిత్రమైనది" అని యనేకవిధంబుల వినుతించి ప్రాంజలియై నిలిచి యున్న మునికుమారుం గాంచి శతమఖాకృతి యగుశంకరుండు "వత్సా! నేను నీతపంబునకు సంతుష్టుండ నైతిని. నీయభీష్టం బేమియో తెలుపుము! నేను నీకోరికం దీర్చెదను" అని వచించుటయు నుపమన్యుకుమారుండు "అమరనాథా! నాకు మహాదేవునియందు దృఢభక్తి కావలయును" అని చెప్పి మరల నెప్పటియట్ల తనతపంబునందు నియుక్తుండై యుండెను.

అప్పుడు మహాదేవుం డుపమన్యునితపఃప్రదేశంబునఁ గూర్చుండి తనకల్పితగుణంబుల నుద్దేశించి తన్నుఁ దానే నిందించుకొనఁదొడంగెను. మునికుమారుం డాతఁడు నిజముగా మహాదేవుఁడే యని యెఱుంగక శివనింద వినవలసివచ్చెనని కోపించి తనకు మొదట గలిగిన దుగ్ధాభిలాషను బరిత్యజించి శివదూషకుఁ డగునింద్రుని వధింపవలయు నని నిశ్చయించి యఘోరాస్త్రమంత్రిత మగుభస్మమును గపటశక్రునిపైఁ బ్రయోగించి తా నాగ్నేయరూపముం దాల్చి యాతని నాక్రమింపఁ దలపడియెను. అప్పు డమ్మహాదేవుం డాతనియాగ్నేయాకృతిని నివారించివైచెను. మహాదేవాజ్ఞచే నందీశ్వరుఁ డాతనియఘోరాస్త్రమును నివారించి యాక్షణమునందే యక్కుమారుం బట్టుకొనియెను.

అప్పు డుపమన్యుకుమారుం డాకస్మికముగా గణేశ్వరపరివృతుండును, త్రిశూలాద్యస్త్రసహితుండును, దేవీసంయుక్తుండును, వృషభారూఢుండు నగుమహాదేవుని సందర్శించెను. ఆశుభసమయంబున దివ్యదుందుభులు మొరసెను. పువ్వులవానలు గురిసెను. బ్రహ్మేంద్రనారాయణాది సకలదేవతలును వచ్చి దశదిశల నిండుకొని యుండిరి. అప్పు డుపమన్యుకుమారుం డానందసాగరతరంగములం దేలియాడుచున్నవాఁడునుం బోలె భక్తిపూర్ణహృదయముతో భూతలంబున సాష్టాంగప్రణామంబు గావించెను. అంతఁ జంద్రశేఖరుం డక్కుమారు నెత్తికొని మూర్ధాఘ్రాణంబు సేయుచు "ఈతఁడు నీకుమారుఁడు" అని చెప్పుచు నాతని దేవీహస్తంబులయం దర్పించెను. దేవి యగునంబికయుఁ గార్తికేయునిం బోలె నక్కుమారునిఁ బ్రేమించి యాతనియుత్తమాంగంబునఁ గరకమలవిన్యాసంబు గావించి యాతని కవ్యయంబగుకుమారపదంబును బ్రసాదించెను. పిమ్మట నద్దేవి మూర్తీభూతంబగుక్షీరసాగరము తనకరకమలంబున విరాజిల్లుచుండ స్వాదుక్షీరధారణంబు గావించి వచ్చి యక్కుమారున కక్షయక్షీరదానంబు గావించెను. కుబేరుం డప్పు డాతనికి శాశ్వతైశ్వర్యప్రదానంబు చేసెను. అప్పటినుండియు నత్తపోధనుం డగునుపమన్యుండు ధనధాన్యసమృద్ధుం డయ్యెను. మహాదేవుం డక్కుమారునకుఁ బాశుపతజ్ఞానంబును, వ్రతయోగతత్త్వంబును, బ్రకృష్టం బగువక్తృత్వమును, బాదుకాద్వయంబును, సర్వజ్ఞత్వంబును బ్రసాదించి యంతర్హితుం డయ్యెను.

వాయవీయసంహిత.

ఉత్తరభాగము.

అనుపహతప్రభావుని, మహాత్ముని, నిర్మలసుస్వభావు, విశ్వనిలయు, నీశ్వరేశ్వరుని శాశ్వతు, సద్వయతేజు, విశ్వరూపుని, నజు, విశ్వకారణునిఁ బూజ్యుని, దేవుని, దివ్యశక్తియుక్తుని, శివు నాశ్రయించెద మకుంఠితవాగ్విభవప్రశస్తికిన్.

బ్రహ్మలోకద్వారంబును, ధర్మక్షేత్రంబును, మహాతీర్థంబును, గంగాయమునాసంగమస్థానంబు నగుప్రయాగక్షేత్రంబునఁ బ్రశంసితవ్రతు లగుశౌనకాదిమహర్షులు మహాయజ్ఞంబు గావించుచున్న యవసరంబున సాక్షాత్సాత్యవతేయశిష్యుండును, మహాత్ముండును, మేధావియు, త్రిలోకవిశ్రుతుండును, వాక్యగుణదోషజ్ఞుండును, బృహస్పతిని మించినయుత్తమవక్తయు, పౌరాణికశేఖరుండు నగుసూతుం డచ్చటి కరుదెంచుటయు మునులు పరమానందభరితులై యాతనికి యథోచితపూజావిధుల నిర్వర్తించి యర్హాసనాసీనుం గావించి విశుద్ధహృదయంబులతోఁ బురాణరహస్యంబుల నెఱుంగం గోరి "ఓసర్వజ్ఞా! మహర్షి వేదవ్యాసుని యనుగ్రహంబుచే సదృష్టవశంబున సకలపురాణవిద్యలును నీకుఁ గరతలామలకంబు లైనవి. సకలపురాణసారంబు లగురత్నంబులతో నీవు రత్నాకరునిం బోలి శోభిల్లుచున్నావు. ఈప్రపంచమునందు నీకవిదితంబు లగుభూతభవిష్యద్వర్తమానవిషయంబు లెవ్వి

యును లేవు. సౌభాగ్యవశంబున మాకు నీదివ్యసందర్శనంబు లభించినది. ఇందు శ్రేయోదాయకం బగుకార్యం బేదియైనఁ గావింపకుండ నూరక చనుట మీవంటివారి కుచితము గాదు. కావునఁ బవిత్రకథాజ్ఞానపూర్ణంబులును, మోక్షప్రదంబులును, వేదాంతసారసర్వస్వంబులును, అవశ్యశ్రోతవ్యంబులు నగుపురాణరహస్యంబులను మాకుపదేశింపుము” అని యనేకవిధంబులఁ బ్రార్థించిరి.

అప్పుడు సూతుండు న్యాయసమ్మతంబులును, శుభసముచితంబులు నగుమధురవచనంబులతో “మహర్షివరులారా! మీరు నాయెడల ననుగ్రహించి యింతశ్రద్ధతోఁ బ్రశ్నించుచుండఁగా ఋషిపూజితంబులగు పురాణవిషయంబులంగూర్చి యెట్లు మీకెఱింగింపకుండఁగలను? భగవానుం డగుమహాదేవునకును, దేవి యగుభవానికిని, కుమారుం డగుకార్తికేయునకును, గణనాయకుం డగునందీశ్వరునకును, గురుం డగువేదవ్యాసునకును బ్రణామంబు లాచరించి, శివజ్ఞానసముద్రస్వరూపంబును, వేదసదృశంబును, భుక్తిముక్తిప్రదంబును, బరమపవిత్రంబు నగు పురాణముంగూర్చి కీర్తించెదను. తొల్లి వాయుదేవుం డీపురాణమును మునుల కుపదేశించి యున్నాఁడు. మహర్షి యగు నుపమన్యునివలనఁ గర్మకుశలుం డగు శ్రీకృష్ణుండు జ్ఞానలాభంబును, శంకరసన్నిధానంబునఁ బుత్రలాభంబును గాంచిన యీచరిత్రమును గీర్తించువారును, వినువారును, వినిపించువారును గూడ విష్ణుజ్ఞానపాత్రులై ముక్తులు గాఁగలరు” అని చెప్పెను.

పాశుపతజ్ఞాననిరూపణము.

పాశుపతజ్ఞాన మెట్టిదియో, శివుండు పశుపతి యెట్లయ్యెనో, అద్భుతకర్ముం డగుశ్రీకృష్ణుండు ధౌమ్యాగ్రజుం డగునుపమన్యుంగూర్చి యీవిషయంబునుగూర్చి యేవిధముగాఁ బ్రశ్నించెనో తెలుపవలయునని

ప్రార్థించుటయు, మహర్షులకు వాయుదేవుం డిట్లనియెను. పూర్వము మందరాచలంబున శ్రీకంఠుండగు మహాదేవుండు దేవియగు నంబికకీపాశుపతజ్ఞానమును బోధించి యుండెను. దానినిగూర్చియే మరలఁ గృష్ణస్వరూపి యగువిష్ణుదేవుఁ డుపమన్యుంగూర్చి ప్రశ్నించెను. అంత నుపమన్యుండు కృష్ణునకుం దెలిపినయీవిషయమును సంక్షేపముగ నెఱింగించెద నాకర్ణింపుఁడు—భగవానుం డగు శ్రీకృష్ణదేవుం డుపమన్యుం బూజించి యుచ్చాసనోపవిష్టుండై యున్నయాతనిం గాంచి "మహాత్మా! భగవానుం డగుమహాదేవుండు దేవియగు పార్వతి కుపదేశించినపాశుపతజ్ఞానమును సమగ్రముగా నీవలన నెఱుంగఁగోరుచున్నాను. శివునకుఁ బశుపతి యనునామ మెట్లయ్యెను? పశువు లన నెవ్వరు? ఎట్టిపాశములచే వారు బద్ధులగుదురు? మరల వారెట్లు ముక్తు లయ్యెదరు?" అని ప్రశ్నించుటయు మహామహుం డగునుపమన్యుండు పార్వతీపరమేశ్వరులకుఁ బ్రణామం బాచరించి యిట్లు చెప్పందొడంగెను.

సంసారవశవర్తు లగుబ్రహ్మాదిస్థావరపర్యంతముం గలసకలజీవులును మహాదేవునకుఁ బశువులని చెప్పంబడుచున్నారు. వారికందఱకును బతి గావున నీశ్వరునకుఁ బశుపతినామము ప్రసిద్ధం బైనది. శివుండు బ్రహ్మాదిపశుసముదాయము నంతను మలమాయాదిపాశములచేఁ బంధించి తానుపాసితుండై తనభక్తులగువారి నాపాశములనుండి ముక్తులం జేయుచుండును. చతుర్వింశతితత్త్వంబులును, మాయాకర్మగుణంబులును, విషయములని చెప్పంబడుచున్నవి. ఇవియే జీవబంధనసాధనంబు లగుపాశములు. బ్రహ్మాదితృణపర్యంతముం గలసకలపశువుల నీపాశంబులచే బంధించి దేవదేవుం డగుమహేశ్వరుండు తనకార్యమును సాధించుకొనుచుండును. ఆమహేశ్వరునియాజ్ఞచేఁ బ్రకృతిపురుషోచితం బగుబుద్ధిని బుట్టించెను. ఆబుద్ధినుండి యహంకారంబు

ను, దానినుండి శ్రోత్రాదిదశేంద్రియములును, మనంబును, పంచత
న్మాత్రలును నుదయించెను. ఆపంచతన్మాత్రలును మహాదేవుని శా
సనముచే నాకాశాదిపంచభూతముల నుత్పాదింపఁజేసెను. ఆభూతము
లన్నియును శివాజ్ఞచే బ్రహ్మాదితృణపర్యంతముం గలసకలజీవులను బు
ట్టించెను. అందు బుద్ధి కధ్యవసాయంబును, అహంకారమున కభిమా
నంబును, చిత్తంబునకుఁ జేతనయు, మనంబునకు సంకల్పంబును గా
ర్యంబులు. శ్రోత్రము, త్వక్కు, చక్షువు, రసన, ఘ్రాణము నను
జ్ఞానేంద్రియపంచకంబునకుఁ గ్రమముగా శబ్దము, స్పర్శము, రూపము,
రసము, గంధము ననుపంచవిషయంబుల గ్రహించుట కార్యము. వా
క్పాణిపాదపాయూపస్థ లనుకర్మేంద్రియపంచకంబునకుఁ గ్రమంబుగా
వచనాదానచలన మలత్యాగ, మూత్రోత్సర్గంబులు కార్యంబులు.
అందు శబ్దాదులు గ్రాహ్యవిషయంబు లనియు, వచనాదులు కార్యవి
షయంబు లనియుఁ జెప్పంబడుచున్నవి.

ప్రకృత్యాదులగునీసకలభూతంబులునుగూడ ననతిక్రమణీయం
బగునీశ్వరాజ్ఞ నాశ్రయించియే యుండును. ఆతనియాజ్ఞచేతనే యా
కాశము సర్వవ్యాప్తం బగుచుండును; వాయువు ప్రాణాపానసమానో
దానవ్యాననామభేదంబుచే బహిరంతరంబుల జగద్ధారణంబు గావించు
చుండును; అగ్ని హవ్యమును దేవతలకొఱకును, కవ్యమును బితృదే
వతలకొఱకును వహించుచు పాకాదికారకమై యుండును; జలము స
కలజీవులను రక్షించుచుండును; విశ్వంభర యగుభూదేవి సమస్తమును
ధరించుచుండును——ఆదేవదేవునిశాసనము దేవతలకుఁగూడ నలంఘ్య
మైనది. ఆతనిశాసనంబుననే దేవేంద్రుఁ డమరపాలనంబును, అసురని
ధనంబును జేయుచుఁ ద్రిలోకములను రక్షించుచుండును. ఆతనియా
జ్ఞచేతనే యముఁడు, జీవితులగు నధర్మపరులకు రోగాదులను, మృత్యు

లగునధర్మపరాయణులకు నరకబాధాదులను గల్పించుచుండును. నిఋ
తియాతనిని యోగంబుననే రాక్షసాధిపతియై యవిధాయకంబు లగుక
ర్మంబులు నిష్ఫలంబులుగాఁ జేయుచుండును; వరుణుండు జలపతియై
బంధనీయులగుజీవులను బాశబద్ధులం గావించుచుండును; కుబేరుండు
పుణ్యానుసారంబుగా జీవులకు ధనధాన్యాదుల నొసంగుచుండును; ఈ
శానుం డైశ్వర్యంబును, జ్ఞానవృద్ధియు, దుష్టనిగ్రహంబును గావించు
చుండును. మఱియు ననంతుండు విశ్వంభరాభరణంబు సేయుటయు,
బ్రహ్మదేవుండు స్వమూర్తిభేదంబులచే సృష్టిస్థితి లయంబులఁ గావిం
చుటయు, విష్ణుదేవుండు వివిధావతారంబులచే విశ్వపాలనం బాచరిం
చుటయు నమ్మహాదేవుని యాజ్ఞచేతనే—ఆతనిశాసనముచేఁ గాల
ము సమస్తమును సృష్టించి సంహరించి పాలించుచున్నది. ఆతఁడు కా
లమునకుఁ గాలస్వరూపుఁడు. భానుండు తన తేజముచే వృష్టికారణుండై
యంతరిక్షమున వర్షించుచుండుటయు, చంద్రుం డోషధులను బోషిం
చి, సకలభూతానందవర్ధనంబు చేసి, దేవతల సంతృప్తులం జేయుటయు,
నాతనియాజ్ఞచేతనే—ఆదిత్యులును, రుద్రులును, వసువులును, మరు
ద్గణంబులును, ఖేచరులును, అశ్వినీకుమారులును, ఋషులును, సిద్ధు
లును, మానవులును, సర్పములును, పక్షులును, కీటంబులును, మొద
లగుజీవగణంబులు కాననపర్వతంబులును, సరోవరనదీసాగరంబులును
మొదలగుస్థావరంబులును, సాంగంబులగు వేదంబులును, శాస్త్రంబులును,
మంత్రంబులును, యజ్ఞయాగాదులును, కాలంబును, సకలభువనంబు
లును, తదధీశ్వరులును, బ్రహ్మాండంబులును, తదావరణంబులును,
భూతభవిష్యద్వర్తమానంబులును, దిగ్విదిక్కులును, కళాకాష్ఠాదులును
వేయేల—ఈజగంబున దృగ్గోచరంబులును, శ్రుతిగోచరంబు లగువ
స్తువు లన్నియును శంకరుండగు నమ్మహాదేవుని యాజ్ఞ ననుసరించియే

మెలంగుచుండును. ఆతనియాజ్ఞాబలంబునే పృథ్వియు, పర్వతంబులు ను, మేఘంబులును, సముద్రంబులును, నక్షత్రాదిజ్యోతిర్గణంబును, ఇంద్రాదిదేవతలును, సకలచేతనాచేతనంబులును, సమస్తస్థావరజంగమంబులునుగూడ నాశ్రయించి యున్నవి.

దిక్పతిగర్వభంగము.

ఉపమన్యుం డిట్లనియెను. వాసుదేవా! వేదోదితంబును, బరమేశ్వరునియాజ్ఞాకృతంబును, ఆశ్చర్యకరంబు నగు నొకవిషయముంగూర్చి చెప్పెదను వినుము. పూర్వమింద్రాదిదిక్పతులందఱు ససురవిజయంబు గాంచి యహంభావముచే "నేనుజయించితిని; నేనుజయించితిని" అని పరస్పరమును వివాదపడఁదొడంగిరి. అప్పుడు మహాదేవుండు యక్షరూపముం దాల్చి వారియెదుట నిలువంబడి "ఎవ్వఁ డీతృణంబును గ్రహించి వికృతంబుగాఁ జేయునో యాతఁడే దైత్యవిజయుఁడుగాఁ బ్రశంసింపఁదగినవాఁడు!" అని చెప్పెను. అప్పుడు వజ్రపాణియగు మహేంద్రుం డాయక్షునివచనంబులకుఁ గోపించి యాతనిఁ బరిహసించుచు భూతలస్థితంబగు నాతృణంబును గ్రహింపఁబోయెనుగాని యాతని కది యెంతమాత్రమును శక్యము గాకపోయెను. పిమ్మట నాతఁడు పరాభవఖేదముతోఁ దృణచ్ఛేదనంబుగావించుటకు వజ్రమును బ్రయోగించెను. కాని తృణస్పర్శమాత్రంబున నవ్వజ్రము కుంఠితాగ్రం బయ్యెను. అట్లే యగ్నిమొదలగు దిక్పతులందఱును గ్రోధముతోఁ దృణచ్ఛేదనంబునకై వేలకొలఁదియస్త్రంబులను బ్రయోగించిరి. అప్పు డగ్ని మహాజ్వాలలతోఁ బ్రజ్వలింపఁదొడంగెను. వాయువతిప్రచండముగ వీవఁదొడంగెను. ఆకారణముచేఁ బ్రళయకాలమునందునుం బోలె సముద్రము లుప్పొంగిపోయెను. కృష్ణా! ఈవిధముగాఁ దృణవిషయంబునఁ గావింపఁబడిన దేవతలమహాసంరంభం బంతయును యక్షస్వరూ

వి యగునీశ్వరునియాజ్ఞాబలముచే నిష్ఫలం బై పోయెను. అందువలన మహేంద్రుండు క్రోధోద్రిక్తుండై యక్కపటయక్షుం గాంచి నీవెవ్వఁడ వని యదలించెను గాని చూచుచుండఁగనే యక్షుం డంతర్హితుండై పోయెను. ఆసమయంబున గగనరంగమునందు శోభాశాలినియు, సర్వాలంకారభూషితయు, మృదుమందహాసవదనారవిందయు నగుగిరిరాజతనయ వారికన్నులయెదుట సాక్షాత్కరించెను. ఆదేవీమూర్తిం గాంచి మహేంద్రుండు విస్మితుండై “తల్లీ! అసామాన్యుం డగునా యక్షుం డెవ్వఁడు?” అని యడుగుటయు దేవి మందహాసము చేయుచు “నీవెవ్వని నెఱుంగం గోరితివో యాతఁడు మీకగోచరుఁడు. చరాచరం బగునీసంసారచక్రమునంతను బరిభ్రమింపఁజేయువాఁ డాతఁడే- ఆతఁ డీవిశ్వమునంతను సృజించి సంహరించుచుండును. ఆతనినియమించు నియామకుం డెవ్వఁడును లేఁడు. ఆతఁడే సకలంబునకును నియంత.” అని చెప్పి యమ్మహాదేవి యంతర్హిత యయ్యెను. అప్పుడు దేవతలందఱుంగూడ గర్వంబులను విడిచి యద్దేవికి నమస్కరించుచు విస్మయచేతస్కులై తమతమస్థానంబులకుం బోయిరి.

అష్టమూర్తినిరూపణము.

శ్రీకృష్ణా! అమేయాత్ముం డగుశివుండు తనమూర్తులచే సకలపదార్థంబుల నధిష్ఠించి యుండును. ఆతఁడు తనసకలమూర్తులచేతను నీవిశ్వమును విస్తరింపఁజేసి యున్నాఁడు. బ్రహ్మవిష్ణురుద్రమహేశ్వరసదాశివాదు లాతనిమూర్తులే. ఈజగంబునం దాతనిచేఁ బరివ్యాప్తంబుగాని దేదియును లేదు. ఈశానుఁడు, తత్పురుషుఁడు, అఘోరుఁడు, వామదేవుఁడు, సద్యోజాతుఁడు అనునీమహేశ్వరునిపంచమూర్తులును బంచబ్రహ్మలుగాఁ బ్రశంసితంబు లగుచుండును. ఈశాననామకం

బగునాతనిప్రథమమూర్తి ప్రకృతిభోక్త యగుక్షేత్రజ్ఞునధిష్ఠించి యుం డును. ద్వితీయం బగుతత్పురుషమూర్తి సత్వాదిగుణత్రయభోగ్యం బగుప్రకృతి నధిష్ఠించి యుండును. తృతీయంబగు అఘోరమూర్తి ధర్మాద్యష్టాంగసహితం బగుబుద్ధితత్త్వమునందును, చతుర్థంబగువామదేవమూర్తి అహంకారమునందును, బంచమం బగుసద్యోజాతమూర్తి మనంబునందును నధిష్ఠించి యుండును. మఱియు నమ్మహాదేవుని యీశానమూర్తి శ్రోత్రవాక్ఛబ్దవిభువ్యోమంబులకును, దత్పురుషమూర్తి త్వక్పాణిస్పర్శవాయువులకును, అఘోరమూర్తి చక్షుశ్చరణరూపాగ్నులకును, వామదేవమూర్తి జిహ్వాపాయురసజలంబులకును, సద్యోజాతమూర్తి ఘ్రాణగంధోపస్థాపృథ్వులకును నధీశ్వరత్వముం గాంచియుండు నని పురాణార్థవిదులగుపండితులు చెప్పుదురు. ఈపంచమూర్తులును శ్రేయోనిదానంబులు గావున మానవులకు వీని నారాధించుట కర్తవ్యము.

ఈజగంబంతయు నద్దేవుని యష్టమూర్తిమయం బైనది. అయ్యష్టమూర్తియందు నిఖిలజగంబులును సూత్రంబున మణిగణంబులునుం బోలె వ్యాపించి యుండును. శర్వుఁడు, భవుఁడు, రుద్రుఁడు, ఉగ్రుఁడు, భీముఁడు, పశుపతి, ఈశానుఁడు, మహాదేవుఁడు అనునివి మహాదేవుని యష్టమూర్తులకును నామంబులు. ఈయష్టమూర్తులు క్రమంబుగా భూజలానలానిలాకాశక్షేత్రజ్ఞ సూర్యచంద్రుల నధిష్ఠించి యుండును. అందు పృథివ్యాత్మకం బగుమొదటిశర్వమూర్తి స్థావరజంగమాత్మకం బగువిశ్వంబును భరించి యుండును. జలాత్మకం బగు రెండవభవమూర్తి సకలజగజ్జీవనరక్షణంబు సేయుచుండును. తేజోమయం బగుమూఁడవరుద్రమూర్తి జగద్బహిరంతరంబుల వ్యాపించియుండును. పవనాత్మకం బగునాల్గవయుగ్రమూర్తి తాను జలించుచు విశ్వంబును

జలింపఁజేయుచుండును. ఆకాశాత్మకం బగునైదవభీమమూర్తి సకల భూతభేదసాధనంబు సేయుచు విశ్వవ్యాప్తంబై యుండును. క్షేత్రజ్ఞాధిష్ఠితం బగునాఱవపశుపతిమూర్తి పశుపాశమోక్షణంబు సేయుచుండును. దివాకరాత్మకం బగునేడవయీశానమూర్తి జగద్దీప్తిజనకంబై యాకాశంబున వ్యాపించి యుండును. సోమాత్మకం బగునెనిమిదవ మహాదేవమూర్తి యమృతవర్షణంబు సేయుచు నఖిలభువనానందోత్పాదనంబు గావించుచుండును.

పరమాత్ముం డగుశివునియీయష్టమూర్తులును దమయితరమూర్తులయందు వ్యాప్తంబులై యుండుటం జేసి యీవిశ్వం బంతయు శివాత్మకం బయ్యెను. వృక్షమూలంబున జలసేచనంబు గావించినచో దానిశాఖలన్నియును బుష్టిం గాంచునట్లే శివుని బూజించుటవలన జగత్స్వరూపంబు లగునీయష్టమూర్తులును దుష్టిం గాంచుచుండును. శివారాధనం బెల్లవారికి నభయదాకం బనియు, ననుగ్రహోపకారకారణం బనియు నాగమజ్ఞు లుపదేశించుచుందురు. జనకుండు పుత్రపౌత్రాదులయానందముచే నానందితుం డగునట్లే భగవానుం డగుశ్రీకంఠుండు విశ్వప్రీతిచేఁ బ్రీతుం డగుచుండును. ఎవ్వం డెవ్వని నిగ్రహించినను, అష్టమూర్తియగుమహాదేవుని నిగ్రహించినట్లే యగుచున్నది. కృష్ణా! అష్టమూర్తులచే నీవిశ్వమంతట నధిష్ఠించియున్న పరమనిదానుం డగువిరూపాక్షుని భక్తియుక్తుండవై భజింపుము.

—♦ శివతత్త్వకథనము. ♦—

భవానీభవులయథార్థస్వరూపంబును, వారు స్త్రీపురుషభావంబులతో జగంబునం దెట్లు వ్యాపించియున్నదియు నెఱింగింపవలయు నని కృష్ణుండు ప్రశ్నించుటయు నుపమన్యుం డిట్లు చెప్పందొడంగెను.

వాసుదేవా ! ఇవ్విషయంబును సవిస్తరంబుగా వర్ణించుట మహాదేవుని కైనను శక్యము గాదు. మహాదేవి సాక్షాచ్ఛక్తిస్వరూపిణి. మహాదేవుఁడు శక్తిమంతుఁడు. చరాచరం బగుజగం బంతయు వారివిభూతిలేశము. కొన్నివస్తువులు చేతనంబులును, గొన్నియచేతనంబులు నై యుండును. ఆరెండును యథాక్రమంబుగ శుద్ధాశుద్ధపరాపరభేదంబులచేఁ గీర్తితంబు లగుచుండును. అజ్ఞానయుతం బగుచేతనవస్తు వశుద్ధంబును, అపరంబు నైనది. జ్ఞానయుతం బగునది శుద్ధంబును బరంబు నైనది. ఈరెండును స్వభావముచే దేవదేవీస్వరూపములే యని నిర్దిష్టంబు లయ్యెను. ఈవిశ్వంబంతయును శివశక్తుల కధీనం బైనది. కాని వారు మాత్రము విశ్వాధీనులు గారు. శివుఁడు శక్తిస్వరూపియు, శక్తి శివస్వరూపిణియు నై యుండును. అయ్యిరువురకును జంద్రికౌముదులకుం బోలె నెట్టిభేదంబును లేదు. చంద్రికాభావంబుచేఁ జంద్రుండు శోభాహీనుం డైనట్లు శక్తిరహితుండై శివుండు ప్రకాశింపఁజాలఁడు. ప్రభారహితంబుగా సూర్యుండును,సూర్యరహితంబుగాఁ బ్రభయు నుండఁజాలనట్లే శివశక్తు లొండొరుల విడిచి యుండఁజాలరు. దేనిసాహాయ్యము లేకుండ శివుండు జీవులకు భుక్తిముక్తులం బ్రసాదింప నసమర్థుండగునో యట్టిశివశక్తియగు నద్వితీయపరాశక్తి యాద్యాశక్తినామంబునఁ బ్రసిద్ధం బైనది. ఆశక్తి శివుని కనురూపగుణంబులచే విభూషితయై యుండుటచే దానిని శివసహధర్మిణిఁగాఁ బండితులు ప్రశంసించుచుందురు. అద్వితీయయు, చిత్స్వరూపిణియు, ప్రసవధర్మిణియు, పరమాత్మస్వరూపిణియు నగుశక్తి శివునియిచ్ఛాక్రమంబున విశ్వంబును బహుప్రకారంబుల విభజించుచుండును. అదియే మూలప్రకృతి—అదియే త్రిగుణాత్మిక యగు మాయ—అదియే విపర్యస్తంబగు నీజగంబును విస్తరింపఁజేయుచుండును. ఆశక్తియే యేకద్విశతసహస్రరూప

భేదంబులతో విరాజిల్లుచుండును.

ప్రథమసృష్టిసమయంబున శివతత్త్వంబున సమ్మిళితంబై యున్న యాపరమశక్తి యాశ్వరేచ్ఛచే శక్తిమంతుం డగుశివునినుండి తిలబీజము నుండి తైలముంబోలె వేఱై యుండెను. అప్పుడు శివునినుండియే యుత్పన్నంబైనక్రియాశక్తి యయ్యాద్యాశక్తిని క్షోభింపఁజేయుటయుఁ బ్రథమంబున నాదం బుదయించెను. ఆనాదమునుండి బిందువును, బిందువునుండి సదాశివుండును, అతనినుండి మహేశ్వరుండును బుట్టిరి. ఆమహేశ్వరునుండి వర్ణస్వరూపిణియు, మాతృకాభిధానయు నగువిద్య యుదయించెను. అదియే శివుని వాగీశ్వరీశక్తి. వర్ణస్వరూపిణి యగు నాశక్తి మాతృకారూపంబున జగంబున విజృంభించుచున్నది. అనంతర మనంతసమావేశముచే మాయాశక్తి కాలమును, నియతిని, కళను, విద్యను సంభవింపఁజేసెను. కళనుండి మరల రాగంబును బురుషుండును బుట్టిరి. ఆమాయనుండి మరలఁ ద్రిగుణాత్మకం బగు అవ్యక్తంబును, దానినుండి సత్వరజస్తమోగుణంబులును బుట్టెను. క్షోభ్యమానంబు లగుత్రిగుణంబులనుండి గుణేశ్వరులగుత్రిమూర్తులును,మహాదాదితత్త్వం బులు నుద్భవించెను. వానినుండి విద్యేశ్వరు లగు ననంతాదిచక్రవర్తులచే నధిష్ఠితంబు లగు ననేకాండపిండంబు లుత్పన్నంబు లయ్యెను. స్థూలసూక్ష్మాదిభేదంబులచే శక్తి బహుప్రకారంబుల నొప్పారుచుండును. రుద్రునకు రౌద్రియు, విష్ణునకు వైష్ణవియు, బ్రహ్మకు బ్రాహ్మణియు, ఇంద్రునకు ఐంద్రియు నై శక్తి యిట్లే యనేకరూపంబుల విశ్వాంతరంబున దేహాంతరంబున నంతరాత్మంబోలి వ్యాపించి యుండును. కావున స్థావరజంగమాత్మకం బగువిశ్వం బంతయును శక్తిమయంబై యుండును. ఆశక్తియందుఁ బరమాత్మాంశం బుండుటం జేసి యది పరాశక్తినామంబున వ్యవహరింపఁబడుచుండును. ఆశక్తి

యే యీశ్వరేచ్ఛచే విశ్వసృష్టిం గావించు నని శాస్త్రనిశ్చయము.

జ్ఞానశక్తి, క్రియాశక్తి, ఇచ్ఛాశక్తి యనుమూఁడుశక్తులచేతను బరమేశ్వరుండు శక్తిమంతుండనునామంబుతో విశ్వాధిష్ఠితుండై యుండును. నిత్యం బగునాతనియిచ్ఛాశక్తి కార్యాకార్యనియమంబు సేయుచుండును. జ్ఞానశక్తి బుద్ధిరూపిణియై యిచ్ఛాశక్తిసంబంధములగు కార్యకారణకరణప్రయోజనంబులను సాధించుచుండును. సంకల్పరూపిణి యగుక్రియాశక్తి యిచ్ఛాశక్తి ననుసరించి క్షణములో జగత్కార్యములను గల్పించుచుండును. ప్రసవధర్మిణి యగు పరాశక్తిప్రేరణంబుచే స్త్రీశక్తులును జగత్ప్రసవంబు గావించుచుండును. ఆశక్తి శివునియందే జనించుటంజేసి యీజగంబు శాక్తం బనియు, శైవంబనియుఁ గీర్తింపఁబడుచుండును. తల్లిదండ్రులు లేక తనయుం డుదయింపఁజాలనట్లే భవానీభవులులేక యీవిశ్వంబుదయింపఁజాలదు. ఈవిశ్వంబు స్త్రీపురుషసంభూతం బగుటచేతనే యిది యుభయాత్మకంబును, ఉభయవిభూతిస్వరూపంబును, స్త్రీపురుషమయంబు నై యున్నది. భవుండు పరమాత్మనాముండై నప్పుడు భవానీ శక్తినామంబులను, ఆతఁడు సదాశివ,మహేశ్వర, పరమేశ్వర, రుద్ర, విశ్వేశ్వరాదినామంబులచే విరాజిల్లునప్పు డద్దేవి మనోన్మనీ, మాయా, పరమేశ్వరీ, రుద్రాణి, విశ్వేశ్వరీప్రముఖనామంబులచే విలసిల్లుచుండును. ఇట్లే లక్ష్మీనారాయణులును, బ్రాహ్మీబ్రహ్మలును, ప్రభాభాస్కరులును, ఉమాశంకరులును, శచీశతముఖులును, స్వాహావైశ్వానరులును, మొదలుగాఁగలవారెల్లరును భవానీభవస్వరూపులే—వేయేల? పురుషులందఱును శివస్వరూపులును, స్త్రీలెల్లరును శక్తిస్వరూపిణులు నని యెఱుంగవలయును. భగవానుం డగుశివుండు భోక్తయు, భవానియగుశక్తి భోగసాధనవస్తువు నగుచున్నారు. శ్రోతయు, శ్రోతవ్యంబును, ద్రష్టయు, ద్రష్ట

వ్యంబును, మంతయు, మంతవ్యంబును శివశక్తిస్వరూపములే. మఱియుఁ బ్రాణంబును, ప్రాణస్థితియు, క్షేత్రజ్ఞుండును, క్షేత్రంబును, దివంబును, రాత్రియు, ఆకాశంబును, భూమియు, వృక్షాదులును, లతాదులును బుంస్త్రీమయంబులగుసకలంబును శివశక్తి స్వరూపంబు లనియే గ్రహింపవలయును. శక్తి శబ్దస్వరూపిణి, శివుఁడర్థస్వరూపుఁడు. పరమంబులును, బవిత్రంబులును, బుణ్యంబులును, మంగళమయంబులు నగుపదార్థంబు లన్నియును శివశక్తితేజములను బ్రకటించుచుండును. దీపము గృహమును బ్రకాశింపఁ జేయునట్లే శివశక్తులతేజము జగంబును బ్రకాశింపఁజేయుచుండును. తృణాదిశివపర్యంతముం గలయీవిశ్వంబంతయును దదంతర్గతంబగుశివశక్తిసాన్నిధ్యవశంబుననే యుత్పన్నంబగుచుండునని శ్రుతిప్రసిద్ధము. సకలమూర్తిమయం బగునీవిశ్వంబునకు మంగళముంగూర్చుచుండు పార్వతీపరమేశ్వరులు నిత్యపూజనీయులును, వందనీయులును, చింతనీయులు నేల గాకుందురు?

కృష్ణా! నేనిప్పుడు పరమేశ్వరతత్త్వమును నాశక్తికొలఁది నీయెదుట వర్ణించితిని. ఇంతకంటె నధికముగా వచించుట నాకేకాదు— నిశ్శేషముగా గీర్తించుట కెవ్వరికిని సాధ్యము గాదు. ఆశివశక్తులయథార్థస్వరూపము బ్రహ్మాదులమనంబులకుఁగూడ నగోచరమైనది. మావంటివారి కెట్లు గోచరించును? అది యనన్యభక్తియుక్తులై యీశ్వరార్పితచిత్తులగు మహాత్ములయంతరంగస్థితంబై యుండును. ఇతరులబుద్ధి కది గోచరంబు గానేరదు. సామాన్యరూప మితరులకు గోచరించినను సత్యస్వరూపముమాత్రము సామాన్యుల కగోచరమైనది. గూఢతత్త్వజ్ఞులగువారు ప్రకృతిసంభవంబగువిభూతి నపరానామంబునను, అప్రాకృతి యగువిభూతిని పరానామంబునను వ్యవహరించుచుందురు. గర్భకారాగారంబును ఛిద్రశూన్యంబుగాఁ జేయువారునుం

భోలె జితేంద్రియులగుమునులు శ్వాసనిరోధంబు గావించి యతిప్రయత్నంబున నద్దివ్యభూతిం గాంచుటకుఁ బాటుపడుచుందురు. సంసారసర్పదంశనంబున జీవన్మృతులై యున్నవారికి సంజీవనౌషధస్వరూపం బగు నవ్విభూతి నెఱింగినచో నెన్నఁటికిని భయంబు లేదు. పరాపరవిభూతితత్త్వంబుల నెఱింగినప్రాజ్ఞులు, అపరవిభూతి నతిక్రమించి పరవిభూతిని గ్రహించి ధన్యులగుచుందురు. ఇది శివశక్తుల నగుణస్వరూపంబు. శ్రీకృష్ణా! భక్తుండ వగునీవిప్పుడు వేదాంతప్రతిపాతంబగు నిర్గుణతత్త్వముంగూర్చి యాకర్ణించుటకు యోగ్యుఁడవు. నిర్గుణతత్త్వమును శఠులు, అభక్తులు నగువారి కుపదేశింపం జనదు. కావున నీవీ తత్త్వమును భక్తులయెదుటనే వర్ణింపవలయును. ఈతత్త్వము నెఱింగి నధన్యాత్ములు సంసారసాగరమునుండి యుత్తీర్ణులై శివసాయుజ్యముం గాంచఁగలరు. ఏతత్సంకీర్తనంబున సహస్రాధికమహాపాతకములు దూరీభూతము లగును. దీనిని నాలుగుసారులు కీర్తించువారికి శతుక్షయం బగును. మఱియు సత్యప్రవృత్తం బగుమతియును, విద్యయు, సుహృద్వృద్ధియు నగును. అట్టివానికి శివభక్తి యుత్పన్నంబై దుర్లభాభిలషితంబులుగూడ సిద్ధింపఁగలవు. కావున శివభక్తులు పవిత్రులును, విశ్వస్తులునై యీతత్త్వంబును గీర్తించినచో వారికి సర్వాభీష్టంబులును సిద్ధించును.

—♦ శైవతత్త్వము ♦—

శ్రీకృష్ణా! చరాచరం బగునీవిశ్వంబంతయును నీశ్వరస్వరూపం బని పశువులగుజీవు లెఱుంగం జాలరు. మహర్షులుగూడ భ్రాంతిశూన్యంబగు పరమతత్త్వము నెఱుంగంజాలక యద్వితీయం డగు నాతని బహుమూర్తులుగా నభివర్ణించి యున్నారు. కొంద ఱనాదినిధనుం డగు

పరమాత్మునిఁ బరబ్రహ్మస్వరూపుఁ డనియు, నపరబ్రహ్మస్వరూపుఁ
డనియుఁ జెప్పియున్నారు. అందు భూతేంద్రియాంతఃకరణప్రధానాది
విషయాత్మకం బపరబ్రహ్మమనియు, చిన్మయంబును, బృహద్వ్యాపక
త్వాదివిశిష్టంబగునది పరబ్రహ్మమనియు నిర్దేశించిరి. కొందఱు చేతన
మే విద్యయనియు, అచేతనమే యవిద్య యనియు, పరమేశ్వరుఁడు వి
ద్యావిద్యాస్వరూపుఁ డనియు, విద్యావిద్యాత్మకంబగు విశ్వమంతయు
నాతనిస్వరూపంబనియుఁ జెప్పియుండిరి. కొంద ఱీశ్వరుఁడు భ్రాంతి,
విద్యా, పరస్వరూపుఁడని నిర్దేశించియున్నారు. పదార్థములయందలి
అయథార్థబుద్ధియే భ్రాంతి; యథార్థబుద్ధి విద్య యనంబడును. వికల్పర
హితం బగుబ్రహతత్త్వము పరంబగుచున్నది—కొందఱుపండితు ల
మ్మహాదేవుని సదసద్రూపుఁడనియు, సదసత్పతియనియుఁ గీర్తించి యు
న్నారు. సచ్ఛబ్దము, సత్యము, సాధువు ననువానియందును, అసచ్ఛ
బ్దము, అసాధువు, అసత్యము ననువానియందును వర్తించుచున్నది.
సదసన్మయంబగు నీవిశ్వమంతయు శివరూపం బనియు, దీనికిఁ బతియ
గుటచే శివుండు సదసత్పతి యనియుఁ గీర్తితుం డయ్యెను. నిఖిలభూ
తంబులు క్షరంబులును, కూటస్థుం డగుచిదాత్మ యక్షరంబును నగు
టం జేసి యేతదుభయాత్మకుండుగావున నీశ్వరుఁడు క్షరాక్షరాత్మకుం
డని కొందఱు చెప్పుచున్నారు. కొందఱు పరమకారణుం డగుపరమా
త్ముని సమష్టివ్యష్టిస్వరూపుఁడనియుఁ, దత్కారణుఁ డనియు, కొందఱు
జాతివ్యక్తి స్వరూపుం డనియు, కొందఱుప్రధానపురుషస్వరూపుఁ డని
యు, కొందఱుకాలస్వరూపుఁ డనియు, కొందఱు విరాణ్మూర్తియు,
హిరణ్యగర్భస్వరూపుఁ డనియు, కొందఱంతర్యామి యనియు, కొంద
ఱు ప్రాజ్ఞతైజస విశ్వనామకుం డనియుఁ జెప్పుదురు. మాతయు, మా
నంబును, మేయుండును, గర్తయు, కారణంబును, క్రియయు నాతఁడే

యని కొందఱు చెప్పుచుందురు. జాగ్రత్స్వప్నసుషుప్తు లాతనిస్వరూపంబు లని కొందఱు చెప్పుదురు. కొందఱు ప్రాజ్ఞాదిత్రయంబునకును, జాగ్రదాదిత్రయంబునకు నతీతంబగుతురీయం బాతనిస్వరూపం బని చెప్పుదురు. కొందఱాతని నిర్గుణుం డనియు, కొందఱు సగుణుం డనియుఁ జెప్పుదురు.

ఇట్లే యనేకులనేకవిధంబులుగా నాపరమేశ్వరుని సంసారి యనియు, స్వతంత్రుఁ డనియు, అస్వతంత్రుఁ డనియు, క్రూరుఁడనియు, అక్రూరుఁడనియు, క్రియావంతుఁ డనియు, నిష్క్రియుఁ డనియు, నిరింద్రియుఁ డనియు, నిస్పృహుఁ డనియు, సేంద్రియుఁ డనియు, రూపవంతుఁ డనియు, చంచలుఁడనియు, నిశ్చలుఁడనియు, రూపవంతుఁ డనియు, నీరూపుఁడనియు, గోచరుఁడనియు, అగోచరుఁడనియు, వాచ్యుఁడనియు, వచనాతీతుఁ డనియు, శబ్దస్వరూపుఁ డనియు, శబ్దాతీతుఁ డనియు, చింతామయుఁడనియు, అచింత్యుఁ డనియు, జ్ఞానగోచరుఁ డనియు, జ్ఞానాతీతుఁ డనియు, అద్వితీయుఁ డనియు, అనేకమూర్తియనియుఁ జెప్పుచుందురు. నానారూపదర్శననిబంధితులగు మునివరులిట్లే యథార్థస్వరూపమును నిర్ణయించుట కసమర్థులైపోయిరి. సర్వభావంబులచే నాతనినాశ్రయించినవారుమాత్రమే సత్స్వరూపజ్ఞానకలితులై యనంతానందవిలీనులు గాఁగలరు. సర్వనియంతయగు నీశ్వరునియథార్థస్వరూపమును దర్శించునంతవఱకును పశుపాశవిమోచనము గాఁజాలదు. పాశబద్ధులగుజీవులు సంసారచక్రంబునఁ బరిభ్రమించుచు నపారదుఃఖంబుల ననుభవించుచుందురు. హిరణ్యవర్ణుండును, వేదస్రష్టయు, సర్వసాక్షియు, విధాతయు, నగుసాక్షాత్పురుషునిదివ్యసందర్శమాత్రంబున ననిర్వచనీయం బగుజ్ఞాన ముదయించి యందువలనఁ బాపమోచనంబును, అపారానందభోగంబును,శివసాయుజ్యంబును లభింపఁగలదు—

శ్రీకృష్ణా ! భూతపతి యగుమహేశ్వరునకు జీవకృతంబులును, కర్మకృతంబులును, మాయాకృతంబులును, బుద్ధికృతంబులును, అహంకారాత్మకంబులును, ప్రాకృతంబులు నగుబంధంబు లేవియును లేవు. ఆతఁడు మనస్సుచేఁ గాని, చిత్తముచేఁగాని, ఇంద్రియంబులచేఁగాని, తన్మాత్రలచేఁగాని, పంచభూతంబులచేఁ గాని బద్ధుండు గాఁడు. ఆతనికి కాలము, కళ, అవిద్య, నియతి, రాగము, ద్వేషము,అభినివేశము, కుశలాకుశలములు, కర్మము, జాత్యాదులు, సుఖదుఃఖములు ననునవి లేనేలేవు. జాత్యాదిసంస్కారము, కర్మసంస్కారము, భోగసంస్కారము, భోగము, భూతభవిష్యద్వర్తమానకాలములు మొదలగువానితో నాతనికి సంబంధము లేదు. ఆతనికిఁ గారణుఁడుగాని, కర్తగాని యెవ్వరును లేరు. కర్మకరణంబులును, గార్యాకార్యంబులు నాతనికి లేవు. ఆతనికి బంధుఁడు, శత్రుఁడు, నియంత, ప్రేరకుఁడు, పతి, గురువు, అధికుఁడు, సముఁడు నెవ్వరును లేరు. జననమరణంబులును, కాంక్షితాకాంక్షితంబులును, విధినిషేధంబులును, మృత్యుబంధనంబులును, శుభాశుభంబులును లేవు. ఆతఁడు విశ్వమంతట నధిష్ఠించి యాత్మశక్తి ప్రభావముచే నిశ్చలభావంబున విరాజిల్లుచుండును. అందుచేతనే యాతనికి స్థాణునామంబు గలిగెను. శాశ్వతుఁడు, పరుఁడు, మహత్తు, పురుషుఁడు ననుశబ్దము లెవ్వనివాచ్యములో, రుద్రుఁడు, హిరణ్యబాహుఁడు, భగవానుఁడు, హిరణ్యపతి, ఈశ్వరుఁడు, అంబికాపతి, పినాకి, వృషవాహనుఁడు మొదలగునామంబులచే నెవ్వఁడు సంకీర్తితుం డగుచుండునో యట్టిపరమపురుషునకు నమస్కారము—

పరబ్రహ్మయు, కృష్ణపింగళవర్ణుండు నగురుద్రునే హృదయమధ్యంబునఁ గేశాగ్రతుల్యసూక్ష్మభావంబుతో నున్నట్లు భావించి ధ్యానింపవలయును. హిరణ్యకేశుండును పద్మలోచనుండును, అరుణవర్ణుం

డును, విశ్వవ్యాపియు, నీలగ్రీవుండును, హిరణ్మయుండును, సౌమ్యుం డును, ఘోరుండును, అక్షరుండును, అమృతుండును, అవ్యయుండును, పరమపురుషుండును, అంతకాంతకుండును, చేతనాచేతనాతీతుండును, ప్రపంచాతీతులకతీతుండును నగు నమ్మహాదేవుని బండితులు భావించి సేవించుచుందురు. జ్ఞానైశ్వర్యములకు సీమ యున్నది గాని, శివజ్ఞానైశ్వర్యములుమాత్ర మపారములైనవి. కాలపరిచ్ఛిన్నులును, ప్రతిసర్గప్రసూతులు నగుబ్రహ్మాదుల కాతఁడే జ్ఞానోపదేశము చేయుచుండును. కాలపరిచ్ఛిన్ను లగుగురువులకందఱకు నాతఁడే గురుఁడు. ఆతనిసిద్ధి స్వాభావికమైనది. ఆతనిశక్తి సర్వాతిశయమైనది. ఆతనిజ్ఞానము నిత్యమైనది. ఆతని యనుపమానాకారము నిర్మలమైనది. అద్వితీయంబగు నాతనియైశ్వర్యంబును,సుఖమును, బలమును, తేజమును, ప్రభావమును, వీర్యమును, క్షమయు, కారుణ్యమును అనంతములైనవి. పూర్ణుం డగునాతనిసృష్ట్యాదికార్యంబులకు స్వప్రయోజనం బేమియును లేదు. ఆతనిసకలకర్మంబులును బరానుగ్రహంబుకొఱకే—ప్రణవమే యాపరమాత్మునకు వాచకమైనది. శివరుద్రాదినామంబులకంటెఁ బ్రణవమే శ్రేష్ఠమైనది. ప్రణవవాచ్యుం డగుశివునిఁభావించుటయు, ప్రణవమును జపించుటయుఁ బరమసిద్ధికి సాధనములు. ఇందుచేతనే వాచ్యవాచకంబుల కభేదము నంగీకరించిన వేదపారగు లగుపండితులు దేవదేవు నేకాక్షరస్వరూపునిగా నిర్దేశించి యున్నారు.

వేదశిరం బగుప్రణవము అకారము, ఉకారము,మకారము, నాదము ననునాలుగుమాత్రలు గలది. ఇందకారము ఋగ్వేదము; ఉకారము యజుర్వేదము; మకారము సామవేదము; నాదము అధర్వవేదము. అకార మను మహాబీజము రజోగుణుండును, సృష్టియు నగుచతుర్ముఖునిస్వరూపము. ఉకార మను ప్రకృతిబీజము సత్వగుణుండును, పా

లకుండు నగువిష్ణునిస్వరూపము. మకార మనుపురుషబీజము తమోగుణుండును, సంహారకారియు నగురుద్రుని స్వరూపము. ఇఁక నాదము నిర్గుణుండును, నిష్క్రియుండును, బరమపురుషుండును, ఈశ్వరుండు నగుశివునిస్వరూపము. ప్రణవమీవిధముగా త్రిమాత్రలచే నిఖిలజగంబునకును వాచకమై అర్ధమాత్ర యగునాదముచే శివస్వరూపం బగుపరమాత్మకును బోధక మగుచున్నది. ఎవ్వనికిఁ బరాపరంబులు లేవో, ఎవ్వనికంటె నణువును, మహత్తునుగూడ లేకుండునో, ఎవ్వఁడు విశాలాకాశంబున వృక్షముంబోలి నిశ్చలుండై యధిష్ఠించి యుండునో యట్టి మహాపురుషుఁడే విశ్వవ్యాప్తుండై యున్నాఁడు—

ఓవనమాలీ! ఆపరమపురుషునివిశ్వవిలక్షణంబగుస్వాభావికవిద్యాస్వరూపశక్తి యొక్కటియే యయ్యును సూర్యప్రభలంబోలి యనేకరూపంబులఁ బ్రకాశించుచుండును. ఆవిద్యాశక్తియందు వహ్నియందు స్ఫులింగంబులంబోలి ఇచ్ఛాజ్ఞానక్రియామాయాద్యనంతశక్తులు నిలిచియున్నవి. ఆశక్తినుండియే సదాశివేశ్వరవిద్యేశ్వరాదిపురుషులును, పరాత్పరం బగుప్రకృతియు నుత్పన్నంబు లయ్యెను. మహదాదివిశేషపర్యంతముం గలబ్రహ్మాదిమూర్తులును, తదితరంబులునుగూడ శక్తికార్యములే. ఆశక్తి సర్వగత మైనది. అది చిన్మయం బనియు, ఆనందస్వరూపం బనియు, సూక్ష్మం బనియుఁ గీర్తింపఁబడుచున్నది. దానిమూలంబుననే శశిభూషణుం డగుశివుండు శక్తిమంతుం డయ్యెను. శివుఁడు వేద్యుండు; శక్తి వేద్య—ప్రజ్ఞలన్నియును శక్తికి భిన్నంబులు గావు. ధృతి, స్థితి, నిష్ఠ, జ్ఞానము, ఇచ్ఛ, క్రియ మొదలగునవన్నియు శక్తియే—పరబ్రహ్మస్వరూపం బగునాజ్ఞయు, పరాపరవిద్యాద్వయమును, శుద్ధవిద్యయు, శుద్ధకళయు, మాయయు, ప్రకృతియు, జీవసముదాయంబును, వికారంబులును, వికృతులును, సదసద్రూపం బగు

సర్వంబును శక్తిచేతనే విస్తరింపఁబడుచున్నవి. ఆశక్తియే మాయాబలంబున సకలజగంబును మోహింపఁజేయుచుండును; మరల నవలీలగా మోహమోచనంబు సేయుచుండును. సర్వేశ్వరుం డగుభగవానుండు సప్తవింశతితత్త్వస్వరూపం బగు ప్రకృతిసహితంబుగా విశ్వ మంతటను వ్యాపించి యుండుటంజేసి శివసేవవలన ముక్తిలాభం బగును—

వాసుదేవా! పూర్వము వేదపారగు లగుకొందఱు మహర్షులు మోక్షాభిలాషులై కొన్నిసంశయంబులు దోఁచుటంజేసి యథార్థవిచారంబు సేయుచు « మనకుఁ గారణం బెవ్వఁడు? మన మెచ్చటినుండి యుద్భవించితిమి? మన మెచ్చట నుంటిమి? మన మెవ్వనిచే నధిష్ఠితుల మైతిమి? ఎవ్వనివలన మనకు నిత్యసుఖదుఃఖములు గలుగుచున్నవి? అలంఘనీయం బగు నీవిశ్వవ్యవస్థం గాంచినవాఁ డెవ్వఁడు? కాలము, స్వభావము, నియతి, యదృచ్ఛ, పంచభూతములు, ప్రకృతి, పురుషుఁడు మొదలగువాని కెట్టికర్తృత్వము నగపడుటలేదు. ఏమనిన—కాలాదు లచేతనంబులు గావున వానికిఁ గర్తృత్వ మెక్కడిది? ఇఁకఁ బురుషుండు సచేతనుం డైనను, సుఖదుఃఖాభిభూతుండు గావున నాతని కీశ్వరత్వంబు లేదు" అని వితర్కించుకొని వారందఱును, పాశవిచ్ఛేదికయు, స్వగుణగూఢయు, నీశ్వరియు, నగుశక్తిని ధ్యానయోగంబున దర్శించి యాశక్తిప్రభావముచేఁ బాశముక్తులై సర్వకారణకారణుండును, శక్తిమంతుండు నగుదేవదేవుని దివ్యదృష్టిచే దర్శింపఁజాలిరి. అద్వితీయుండును, అప్రమేయుండు నగుదేవుఁడు శక్తిసాహాయ్యంబుచేతనే కాలాద్యశేషకారణములయందు నధిష్ఠించియున్నట్లు వారు గ్రహింపఁగలిగిరి. పిమ్మట నమ్మునివరు లందఱును దృఢభక్తియోగంబునను, బరమయోగబలంబునను, నీశ్వరానుగ్రహముం గాంచి దివ్య

గలిప్రాప్తులైరి. కావున శక్తిసహితుం డగుశివుని హృదయకుహరం బున దర్శింపఁగలుగువారు శాశ్వతశాంతిలాభముం గాంచఁగలరు. ఇతరుల కది దుర్లభ మైనది. శక్తిమంతుం డగుపరమేశ్వరున కెప్పుడును శక్తితో విచ్ఛేదంబు లేదు. శక్తిమంతుండును, శక్తియునుగూడ ననుగ్రహించినచో మోక్షవిషయంబున జ్ఞానకర్మవివక్షయే లేదు. శక్తిశక్తిమంతుల ప్రసాదముచే ముక్తి కరతలామలకం బగును. దేవదానవ, పశుపక్షికీటపతంగాదులు శివశక్తిప్రసాదముచేతనే ముక్తిం గాంచుచుండును. శక్తిమంతుం డగుశివుండు తనభక్తుం డయోగ్యుం డైనను గరుణించి యాతనిపాపంబుల నశింపఁజేయు ననుట కెట్టిసందేహమును లేదు. తత్ప్రసాదము భక్తికిని, భక్తి తత్ప్రసాదంబునకును గారణంబులు. శివశక్తిప్రసాదకారణం బగుభక్తి మానవుల కేకజన్మంబున లభించునది గాదు. అనేకజన్మకర్మంబులచేఁ జిత్తశుద్ధియు, విషయవైరాగ్యంబును, శ్రుతిస్మృత్యనువర్తనంబును, బ్రబోధంబును గలమానవుల యెడలనే మహేశ్వరుండు ప్రసన్నుం డగుచుండును. అతఁడు ప్రసన్నుం డైనచోఁ బశువుల కీశ్వరునియెడల ఆస్తికబుద్ధియు, అల్పమాత్రం బగుభక్తియు నుత్పన్నంబు లగును. తపోవివశుం డగునరుండు శైవధర్మసంయుక్తుం డగును. అందువలనఁ బరమభక్తియు అందువలన శివప్రసాదమును గలిగి యాప్రసాదబలంబున పాశముక్తియు, భక్తియు లభించును. అల్పమాత్రభక్తియుక్తుం డగుమానవుఁడు మూఁడు జన్మంబుల గర్భవాసపీడానంతరమున నిశ్చయముగా ముక్తుం డగును.

బాహ్యంబగు నుపచారాదిసేవయు, మానసికం బగుసేవయు భక్తియని పండితులు నిర్దేశించి యున్నారు. ఆభక్తి మరల వాక్కు, మనస్సు, కాయము ననుసాధనత్రయభేదంబుచే మూఁడువిధంబులై యుండును. శివరూపాదిచింతనము మానసభక్తి. శివమంత్రజపాదిక

ము వాచకభక్తి. పూజాదికము కాయికభక్తి. ఈమూఁడువిధంబులగు భక్తియే శివధర్మము. పరమాత్ముం డగుశివుండు, శివధర్మమును తపము, కర్మము, జపము, ధ్యానము, జ్ఞానము నని యైదువిధంబులుగా నిరూపించి యుండెను. అందుఁ జాంద్రాయణాదులు తపంబులు; లింగార్చనాదులు కర్మములు; మూఁడువిధంబులగుశివాభ్యాసమే జపము; శివచింతనమే ధ్యానము; శివాగమోక్తజ్ఞానమే జ్ఞానము—శ్రేయంబులకుఁ బరమసాధనం బగుశివాగమమును భక్తవత్సలుం డగుశ్రీకంఠుఁడు భక్తకల్యాణముకొఱకుఁ బార్వతికి బోధించి యున్నాఁడు. కావున మతిమంతులగువారు విషయాసక్తులను బరిత్యజించి అనాదినిధనుండును, భక్తవత్సలుండును నగు శివునియందు దినదినంబును భక్తి వర్ధిల్లునట్లు చేసికొనవలయును.

—♦ శివోక్తం బగుశైవతత్త్వము. ♦—

ఉపమన్యుం డిట్లుపదేశించుటయు శ్రీకృష్ణుం డిట్లనియెను. మహాత్మా! అభక్తులు, అప్రబుద్ధులు, అయుక్తులు నగువారి కగోచరంబును, పంచసర్గాద్యర్థసంయుతంబును, వర్ణాశ్రమకృతకర్మంబుల కజ్ఞేయంబును, గూఢం బని యపాజ్ఞులచే నిందితంబును, స్వాశ్రితముక్తికారణంబును, భక్తినిలయంబును, పరమేశ్వరకథితంబును, వేదవేదాంగసాంఖ్యయోగ సముద్ధృతంబును, వేదసారంబు నగుశివజ్ఞానమును వినఁగోరుచున్నాను. అది సమగ్రముగాఁ దెలిపి నన్ను నిస్పృహునిగాఁ జేయుము. మఱియు పూజయన నెట్టిదియో, పూజాదుల కధికారు లెట్టివారో, జ్ఞానయోగాదు లేవియో సర్వంబును సవిస్తరంబుగఁ జెప్పి నన్ను సంశయవిరహితుం గావింపుము. అని కోరుటయు నుపమన్యుం డిట్లనియెను. త్రివిక్రమా! విశ్వాసజనకంబును, స్తుతినిందావిరహితం

టిను, గురుప్రసాదలబ్ధంబును, సులభముక్తిప్రదంబును, వేదాంతంబును, దివ్యంబును, శివభావితంబును నగు శైవజ్ఞానమును సంక్షేపముగ విన్నించెద నాకర్ణింపుము. పూర్వకాలము భగవానుం డగుమహేశ్వరుండు స్వేచ్ఛముగ సృష్టికాముండై కారణరూపంబున నుండి కార్యసంబంధియై యవ్యక్తమునుండి యావిర్భూతుండై యప్పుడే సకలదేవతాప్రధానుం డగుబ్రహ్మదేవుని సృష్టించెను. పుట్టినంతనే బ్రహ్మదేవుండు విశ్వనాథు నన్వేషింపఁ బ్రయత్నించుటయు లోకేశ్వరుండు పరమానుగ్రహంబునఁ బుత్రునివంకఁ గటాక్షావలోకనంబులఁ బరగించెను. అంత బ్రహ్మదేవుండు విశ్వసృష్టి నారంభించి వర్ణాశ్రమవ్యవస్థం గావించెను. ఆసోమతేజమునుండి స్వర్గంబును, భూమియు, వహ్నియు, సూర్యుండును, యజ్ఞంబును, విష్ణుండును, శచీనాథుం డగునింద్రుండును జనించిరి. అప్పుడాసకలదేవతలును "నమస్తే రుద్ర" ఇత్యాదిరుద్రాధ్యాయముచే స్తవంబు గావించుటయుఁ బ్రభుం డగుపరమేశ్వరుండు ప్రసన్నుండై వారియెదుట సాక్షాత్కరించి లీలార్థమై వారిజ్ఞానంబు హరించుటయు దేవతలు జ్ఞానశూన్యులై మోహావశంబున మహాదేవునిం గూర్చి నీవెవ్వరని ప్రశ్నించుటయు మహాదేవుం డిట్లనియెను. ఓదేవతలారా! ఈజగంబున నేనే పురాతనుండను, అద్వితీయుండనునై యున్నాను. మొట్టమొదట నీజగంబునం దున్నవాఁడను నేనే—త్రిప్వముగూడ నున్నాఁడను; ఇఁక నెన్నఁటికినిగూడ నుండఁగలను. ఈవిశ్వంబున నాకంటె భిన్ను లెవ్వరును లేరు. నేను నాతేజముచే సకలజగంబులకును సంతృప్తిం గూర్చుచుందును. నాకంటె నధికుఁడుగాని నాతో సమానుఁడుగాని మఱియెవ్వఁడును లేఁడు. నన్ను గ్రహింపఁగలవాఁడు ముక్తిమార్గగామి యగుచున్నాఁడు. అని దేవతల కుపదేశించి మహాదేవుం డంతర్హితుం డయ్యెను. తరువాత విష్ణుప్రభృతు

లగు దేవతలెల్ల నాతని గనుంగొనఁజాలక యూర్ధ్వబాహులై యథర్వశిరోమంత్రంబులచేతను, త్వరితాఖ్యరుద్రమంత్రంబులచేతను, సామాన్యరుద్రమంత్రంబులచేతను, శివనామంబులచేతను ననేకవిధంబుల స్తవంబు సేయుచు భస్మలిప్తసర్వాంగులై పాశుపతవ్రతంబును గావింప నారంభించిరి. అప్పుడు పశుపతి ప్రసన్నుండై సపరివారంబుగా దేవీసహితుండై వారియెదుట సాక్షాత్కరించెను. పాపరహితు లగుయోగులు జితశ్వాసులును, నిర్నిద్రులు నై యనిర్వచనీయానందముతోఁ దమహృదయంబులం గాంచఁగలుగుచున్నయాశివమూర్తిని, ఆతనివామాంగమున శోభిల్లుచు నాతనియిచ్ఛానువర్తినియై యున్నవామలోచన యగుదేవిని గన్నులపండువుగా నప్పుడు దేవతలందఱును సందర్శించి పరమానందభరితులైరి. మఱియు నాదేవతలు సంసారపరిత్యక్తులును, శైవపదప్రాప్తులును, నిత్యసిద్ధులు నగుగణపతులం గాంచి యానందించుచు శివశక్తులం గూర్చి యనేకవిధంబుల స్తోత్రము గావింప రంభించిరి. పరమాత్ముం డగుశివుండును వారిస్తవంబునకుఁ బ్రసన్నుండై దయాదృష్టితో వారి నవలోకించుచు స్వభావమధురవచనంబులతో " నేను సంతుష్టుండ నైతిని " అని యానతిచ్చి దేవతాగణంబుల నానందసాగరనిమగ్నులం గావించెను. అప్పుడు దేవతలు సంతోషముతో వృషభధ్వజునకుఁ బ్రణామంబులు గావించి " మహాత్మా! నిన్నేవిధముగాఁ బూజింపవలయును? నిన్నుఁ బూజించుట కధికారు లెవ్వరు?—" ఈవిషయంబులంగూర్చి సవిస్తరంబుగా మా కుపదేశింపవలయు నని ప్రార్థించిరి.

అప్పుడు శూలపాణి మందహాసవదనారవిందుండై దేవివంకఁ గటాక్షపాతంబు సేయుచు ఆశ్చర్యగుణయుతంబును, సర్వతేజోమయంబును, శివశక్తిసమన్వితంబును, గ్రహపరివృతంబును, అష్టబాహువిశి

సితంబును, ఘోరంబును, సూర్యాత్మకంబును, పరమంబును, అద్భుతంబును నగు తనయర్ధనారీశ్వరస్వరూపమును దేవతలకు సాక్షాత్కరింపఁజేసెను. విష్ణుప్రభృతు లగుసకలదేవతలు నయ్యద్భుతస్వరూపము నిరీక్షించి భగవానుని దివాకరునిగను, దేవిని నిశాకరునిగను, పంచభూతాత్మకంబగు చరాచరప్రపంచమునంతను దన్మూర్తిగను భావించి నమస్కారంబు సేయుచు “ఓసిందూరవర్ణసుమండలా! సువర్ణవజ్రాభరణా! కమలనయనా! పరమేశ్వరా! బ్రహ్మవిష్ణుసురేంద్రులకుఁ గారణుండవు, నలినభూషణుండవు నగునీకు సువర్ణపాత్రస్థితంబును, సురత్నపూర్ణంబును, సువర్ణంబును, కుంకుమకలితంబును, కుశపుష్పయుతంబును, ప్రశస్తంబు నగునర్ఘ్యము నర్పించుచున్నారము. ఒకసారి మాయెడలఁ గరుణాకటాక్షనిక్షేపంబు గావించి ప్రసన్నుండవగుము! ఓసాంబశివా! నీవు రుద్రుండవు, విష్ణుండవు, బ్రహ్మవు, సూర్యస్వరూపుఁడవు, గణపరివృతుండవు, ఆదికారణుండవగునీకు నమస్కారము. ఈశరణార్థులకు శరణంబ వగుము.” అని ప్రార్థించిరి. ఎవ్వండైన నీవిధముగాఁ దదేకచిత్తముతో శివపూజం గావించి త్రిసంధ్యలయందును సూర్యదేవునుద్దేశించి ప్రశస్తంబగునర్ఘ్యప్రదానమ్ము గావించినను, ప్రణామంబైనఁ గావించినను, శతస్తోత్రంబులకంటె నుత్తమం బగునీస్తోత్రమును బఠించుటయైనఁ గావించినను దుర్లభాభీష్టసంసిద్ధుండు గాఁగలఁడు. భక్తుండైనచో నిశ్చయముగా ముక్తిపదారూఢుం డగును. కావున ‘ధర్మార్థకామమోక్షార్థు లగుజీవులు, ఆదిత్యస్వరూపుఁ డగునాతన శివమూర్తిని మనోవాక్కాయంబులచే నారాధింపవలయును.

అనంతరము మహాదేవుండు దేవగణంబులయెడల ననుగ్రహించి వారికి యథోచితశాస్త్రజ్ఞానోపదేశంబు గావించి యంతర్హితుం డయ్యెను. అప్పు డమరగణంబులు బ్రహ్మక్షత్రియవైశ్యులు పూర్వాధి

కారు లనిగ్రహించి దేవదేవునకు ప్రణామంబులు గావించి యథాస్థానంబులకుం బోయిరి. తరువాతఁ జాలకాలంబున కాశాస్త్రచర్చ తిరోహితం బగుటయు నప్పుడు శివాంకస్థాయిని యగుదేవదేవి భూతనాథుండగుచంద్రశేఖరునిం గూర్చి ప్రశ్నించుటయు వేదశాస్త్రసారం బగ్నినీవిషయంబును మరల సంక్షేపముగా నమ్మహాదేవుం డుపదేశించెను. ఆపిమ్మట నాపరమపురుషునియాజ్ఞానుసారముగా, అగస్త్యుఁడును, దధీచి, నేనును లోకమునం దీశాస్త్రమును బ్రచారము గావించితిమి. స్వయముగా శంకరుండుగూడఁ బ్రతియుగంబునందును భక్తానుగ్రహార్థమై యవతరించి జ్ఞానోపదేశము గావించుచుండును. ఋభుఁడు, సత్యుఁడు, భార్గవుఁడు, అంగిరుఁడు, సవిత, మృత్యువు, ఇంద్రుఁడు, ధర్ముఁడు, వసిష్ఠుఁడు, సారస్వతుఁడు, త్రిధాముఁడు, త్రివృతుఁడు, శతతేజుఁడు, నారాయణుఁడు, స్వరక్షుఁడు, ఆరుణికృతంజయుఁడు, దీర్ఘతముఁడు, భరద్వాజుఁడు, గౌతముఁడు, వాచశ్రవుఁడు, సూక్ష్మాయణి, శుచి, తృణబిందుఁడు, కృష్ణశక్తి, పరాశరుఁడు, జాతుకర్ణ్యుఁడు, సాక్షాన్నారాయణుం డగువేదవ్యాసుఁడు అను నీయిరువదియెనమండ్రును వ్యాసులు. వీరు కల్పకల్పంబునందును యోగేశ్వరులై యుందు రని లింగపురాణంబునఁ జెప్పం బడియెను. ద్వాపరశేషంబున వ్యాసావతారంబును, కలియుగంబున శివుని యోగాచార్యావతారంబును నై యుండును. వారికి బ్రత్యేకముగ మహాతేజు లగునలుగురుశిష్యులును, శతసహస్రాధిక శిష్యప్రశిష్యులును విరాజిల్లుచుందురు. లోకులు వారితో భాషించుచు, వారిని సేవించుచు, వారియాజ్ఞల ననుసరించుచు ధన్యులై భక్తియుక్తులై ముక్తిప్రాప్తు లగుచుందురు.

—◆ శర్వావతారము ◆—

వాసుదేవా! వైవస్వతమన్వంతరంబున వరాహకల్పంబున శ్వేత, సుతార, మదన, సుహోత్రాదు * లిరువదియెనమండ్రు యథాక్రమంబుగ యుగయుగంబునను యుగాచార్యు లయ్యెదరు. వారికిఁ బ్రత్యేకముగా నలుగురేసిచొప్పున శిష్యులుందురు. వారును బాశుపతసిద్ధులే. సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞులును, వేదవేదాంగపారగులును, శివజ్ఞానపరాయణులును, భస్మభూషితులు నగువారు శివాశ్రమనిరతులును, నిరపేక్షులును, శివార్పితచిత్తులును, పరమానందనిమగ్నులు నై యుందురు. వారు ధీరులును, ఋజుస్వభావులును, మృదుప్రకృతులును, స్థిరులును, రుద్రాక్షమాలికాభరణులును, సర్వభూతహితులును, శివాభిమానసంపన్నులును, ఫలమూలాశనప్రియులును, ప్రాణాయామపరాయణులును, శివధ్యానతత్పరులును, ముండితులును, జటాధర్లును, జటాశూన్యులును, సంసారవిషవృక్షోన్మూలనకారులును, శివపురగమనసన్నద్ధులు నై యుందురు. ఇట్టివారి నెఱింగి యాచార్యభావంబున నర్చించువారు శివార్చనంబు గావించినఫలంబును గాంచి యవలీలగా శివసాయుజ్యముం గాంచఁగలరు.

—◆ శైవధర్మము. ◆—

జనార్దనా! ఒకానొకప్పుడు దేవదేవుం డగునిందుశేఖరుఁడు దేవీసహితుఁడై మందరాచలోద్యానంబున విహరించుచుండ శోభావతి యను దేవీప్రియసఖి వికసితంబులును మనోజ్ఞంబులు నగుకుసుమములం గొని తెచ్చి యర్పించుటయు శివుండు భవాని నంకతలంబునఁ గూర్చుండఁజేసి యాపుష్పంబులచే నామె నలంకరింపఁదొడంగెను. అప్పు

---

* వారినామంబులును, వారిశిష్యులనామంబులును పాఠకులకు విసుఁగు జనించునేమో యనుభీతిచే నుదాహరింపలేదు.

డంతఃపురసంచారిణి యగు శోభావతి యుమామహేశ్వరసంసేవనంబు సేయుచు లోకానుగ్రహార్థమై ప్రియవచనంబులతో నమ్మహాదేవు ననేకవిషయంబులంగూర్చి ప్రశ్నించుచుండెను. అయ్యవసరంబున మహేశ్వరి త్రిపురారియగుమహేశ్వరుం గాంచి లోకనాథా! లోకమునం దల్పశక్తులును, మందబుద్ధులును, బుద్ధిహీనులును, అల్పసత్త్వులును, నగుదీనులకు భూతపతి వగునీవెట్లు వశుండ వయ్యెద వనిప్రశ్నించుటయు దేవదేవుం డిట్లనియెను—దేవీ! శ్రద్ధారహితంబులగు నెట్టి జపతపస్సమాధిజ్ఞానాద్యుపాయంబులచేనైనను నేను వశ్యుండనుగాఁజాలను. వట్టిమానవుండైనను నాయెడల శ్రద్ధాన్వితుం డయ్యెనేని నేనాతనియెడలఁ బ్రసన్నుండ నగుదును. అతఁడు శ్రద్ధాబలంబుచే మత్సందర్శన, సంస్పర్శన, సంభాషణ, సంపూజనాది సకలకార్యంబుల నాచరింపఁగలఁడు. కావున నన్ను వశపఱుచుకొనఁదలంచువారు నాయెడల శ్రద్ధాన్వితులు గావలయును. స్వధర్మరక్షణమే శ్రద్ధాహేతువు. వర్ణాశ్రమధర్మంబులు త్యజింపనివారికి నాయందు శ్రద్ధగలుగును. తద్భిన్నులకుఁ గలుగనేరదు. ఆశ్రమవాసులకు వేదసిద్ధంబులగు యాగాది ధర్మములు నాయాజ్ఞచే బ్రహ్మమూలమునఁ గల్పింపఁబడియెను. అవి యన్నియును బహుధనక్రియాన్వితంబులును, కష్టసాధ్యంబులు నైనవి. శివవ్యతిరిక్తం బగునన్యాశ్రయంబు లేదని భావించి శివధర్మము నవలంబించువారు శ్రద్ధాబలంబున మత్సాయుజ్యముం గాంచఁగలుగుదురు. నేనువారి క్లేశకరంబులగు వర్ణాశ్రమాచారంబులనుగల్పించి యుంటిని. నాయందును, ఆధర్మమునందును భక్తిగలవారే వాని కధికారులై యుందురు. వర్ణాశ్రయించువారు మదాజ్ఞప్తంబగుమార్గము ననుసరించి మత్ప్రసాదంబుచే మలమాయాదిపాశవిముక్తులై పునరావృత్తిరహితం బగుమోక్షమును గాంచఁగలుగుదురు. అనంతరము పరము

బహుమతాన్యధర్మ్యమ్ముం గాంచి యనిర్వచనీయనిర్వృతిఁ గాంతురు. కావున నాచేఁజెప్పంబడిన వర్ణధర్మంబుల ననుసరించినదైనను, అనుసరింపకయైనను నాయందలిభక్తిమాత్రముచేతనే భక్తులు నన్నుఁ బొందఁగలరు. నేను స్వయముగా వారి నుద్ధరింతును.

ఓకల్యాణీ! నేను సకలమన్వంతరంబులయందును యోగాచార్యచ్ఛలంబున ననేకావతారంబుల నెత్తుచుందును. యోగవర్జితులును, అప్రబుద్ధులును, అభక్తులు నగువా రయ్యవతారమూర్తుల నెఱుంగఁజాలరు. వేదమార్గమును విడిచి యన్యమార్గము నాశ్రయించి శ్రమపడుట హానియేగాని యందేమియును లాభము లేదు. దేవీ! సనాతనశివధర్మము జ్ఞానము, క్రియ, చర్య, యోగము నని నాలుగువిధముల విరాజిల్లుచున్నది. అందుఁ బశుపాశపతిజ్ఞానము జ్ఞానము. గురూపదిష్టంబగు షడధ్వశుద్ధివిధానము క్రియ. వర్ణాశ్రమానుసారంబుగా మద్విరచితంబగు శివార్చనాదిధర్మానుష్ఠానమే చర్య. భక్తానుగ్రహార్థమై నాచేఁ జెప్పంబడిన మార్గముచే నన్యవృత్తినిరోధంబు గావించుటయే యోగము—శతాశ్వమేధంబులకంటె నుత్తమంబును, ముక్తిప్రదంబును, చిత్తప్రసాధనంబు నగునీవ్రతము విషయలంపటుల కసాధ్యమైనది. యమనియమాదులచే జితేంద్రియు లగువిరాగులే యీయోగంబునకధికారులు. వైరాగ్యమువలన జ్ఞానంబును, దానివలన యోగంబును లభించును. పతితుండైనను యోగజ్ఞానం డగువాఁడు ముక్తుం డగును. నిత్యదయాశీలుండై యహింసాజ్ఞానసంగ్రహంబు సేయవలయును. నిరంతరమును సత్యము నాశ్రయింపవలయును. మఱియు అస్తేయము, ఆస్తిక్యము, శ్రద్ధ, ఇంద్రియనిగ్రహము, అధ్యాపనము, అధ్యయనము, యజనము, యాజనము, ధ్యానము, ఈశ్వరభక్తి, జ్ఞానశీలత మొదలగువాని నవలంబింపవలయును. జ్ఞానయోగసిద్ధి నభిలషించి యిట్లు గా

ఱించు సాధకుఁ డచిరకాలంబుననే విజ్ఞానవంతుఁడై యోగలాభంబు నం
దును. యోగజ్ఞులు జ్ఞానానలంబున భూతమయంబగు దేహమును
దగ్ధము గావించి మత్ప్రసాదంబునఁ గర్మబంధవిముక్తు లగుదురు. పు
ణ్యపాపాత్మకం బగుకర్మము ముక్తిప్రతిబంధకము గావున నాయాజ్ఞచే
యోగజ్ఞులు పుణ్యపాపకర్మపరిత్యాగంబు సేయవలయును. ఫలాపేక్ష
తోఁ గర్మం బాచరించుట జ్ఞానయోగులకుఁ బ్రతిబంధకము.

దేవీ! మొట్టమొదటఁ గర్మయజ్ఞంబుచే నన్నుఁ బూజించి పిదప
జ్ఞానయజ్ఞరతుండై యోగాభ్యాసంబు సేయవలయును. నిత్యయోగా
శ్రయుండును, మద్భక్తుండును, జ్ఞానయోగసమాహితచిత్తుండు నగు
యోగి మత్సాయుజ్యముం గాంచుటకు సమర్థుం డగును. బాహ్యా
భ్యంతరభజనంబులయం దాభ్యంతరికభజనమే యుత్తమమైనది. భజ
నము వాఙ్మనఃకాయభేదంబులచేఁ ద్రివిధంబైనది. మఱియు నది జప
ము, కర్మము, తపము, ధ్యానము, జ్ఞానము నని పంచప్రకారంబుల
నొప్పుచుండును. ఇతరులకు గోచరంబు లగుపూజార్చనాదులు బా
హ్యంబు లనియు, స్వగోచరంబు లగునవి యాభ్యంతరికభజనంబు లని
యు, నెఱుంగవలయును. నాయందనురక్తంబైనదియే మనంబుగాని
తక్కినది గానేరదు. మన్నామమయం బగునదియే వాక్యము. మదు
పదిష్టంబు లగుత్రిపుండ్రాదిభూషణంబులచే నలంకృతంబగునదియే కా
యము. తక్కినది శరీరంబని చెప్పంబడదు. నాపూజయే కర్మము.
తక్కినకర్మంబులు కర్మంబులు గావు. నాకొఱకు దేహశోషణంబు గా
వించుటయే తపము. తక్కిన కృచ్ఛ్రాదులు తపంబులు గావు. పంచా
క్షరాభ్యాసము, ప్రణవాభ్యాసము, రుద్రాధ్యాయాదికాభ్యాసముమా
త్రమే జపముగాని తక్కినవేదాధ్యయనము జపంబు గానేరదు. మ
ద్రూపచింతనమే ధ్యానముగాని తద్భిన్నంబు లగునాత్మసమాధిముప

లగునవి ధ్యానంబులు గావు. మత్సంబంధములగు నాగమార్థంబుల విజ్ఞానమే జ్ఞానము గాని కేవలార్థజ్ఞానము జ్ఞానము గాదు. పూర్వవాసనావశంబున బాహ్యాభ్యంతరభజనంబులలో దేనియందాసక్తి యుదయించునో దానినే యనుష్ఠింపవలయును. ఆభ్యంతరికభజనము సులభంబును, దోషదృష్టుల కగోచరంబు నగుటంజేసి బాహ్యభజనంబుకంటె శతగుణంబులు శ్రేష్ఠమైనది. ఆభ్యంతరికభజన మంతరంగమును బరిశుద్ధంబు గావించుటంజేసి శుచియని విఖ్యాతం బగుచున్నది. ఈబాహ్యాభ్యంతరికభజనంబులు రెండును అనురాగపూర్వకంబులైనప్పుడే సార్థకంబు లగుచున్నవి. దంభముచే ననుష్ఠించునవి యెంతమాత్రమును భజనంబులు గాఁజాలవు. కృతకృత్యుండను, బరితృప్తుండను నగునాకు మానవు లెట్టియిష్టసాధనమును గావింపఁగలరు? కావున నేను వారిబాహ్యాభ్యంతరభజనంబులయందలి యనురాగమునే గ్రహించుచుందును. ఫలనిరపేక్షంబుగా మనోవాక్కాయంబులచే ననుష్ఠితం బగు కేవలానురాగమయక్రియయే మదీయం బగుసనాతనధర్మము. ఫలాపేక్షగలవారిభక్తి సకామంబగుటచే నాకంతప్రియంబు గాదు. అట్టిభక్తిగలవారు ఫలాభావంబైనచో నన్నుఁ ద్యజింపఁగలరు. ఫలార్థులైనను నాయం దనురక్తులై యున్నచో నేను వారికి భక్త్యనురూపంబులగుఫలంబులను బ్రసాదించుచుందును. మొదట నిరపేక్షులయ్యనంతరము సాపేక్షులగుభక్తులుగూడ నాకుఁ బ్రియులే. ఫలాఫలవివేచనంబు సేయక పూర్వసంస్కారవశంబున వివశులై నన్నాశ్రయించి యారాధించువారుమాత్రము నాకుఁ బ్రియతములై యుందురు. నాయనుగ్రహంబుం బడయుటకంటె నాభక్తుల కుత్తమలాభంబును, వారికి లాభప్రదానంబుకంటె నాకుత్తమప్రయోజనంబును లేవు. నాయనుగ్రహముచే వారికి నాయం దనురాగము బలపడి పరమనిర్వాణఫలం

బును బ్రసాదింతును. మదేకశరణ్యులును, మదర్పితచిత్తులును, మద్ధర్మాధికారులు నగుమహాత్ములు నాభక్తులయందు వాత్సల్యము, నా పూజయం దామోదము, నాయర్చనమునందుఁ బ్రయత్నమును, నానిమిత్తమై చేష్టితంబును, మత్కథాశ్రవణమునం దనురాగమును, స్వరనేత్రాంగవిక్రియలును, నాస్మరణంబు గావించుటయు, నిత్యము నన్నాశ్రయించియుండుటయు నను నెనిమిదిలక్షణంబులు గలవారై యుందురు. ఈయష్టవిధలక్షణంబులును గలవాఁడు మ్లేచ్ఛుండైనను నాకునే విప్రేంద్రుఁడును, మునియు, శ్రీమంతుఁడును, యతియు, పండితుఁడు నగుచున్నాఁడు. అభక్తుండు చతుర్వేదవేత్తయైనను నాకుఁ బ్రియుండు గాఁడు. చండాలుండైనను భక్తుఁడైనచో నాకుఁ బ్రియతముం డగును. అట్టిచండాలునకు జ్ఞానదానంబు సేయందగును. అతనియొద్ద జ్ఞానోపదేశముం బడయవచ్చును. అతఁడు నావలెనే పూజనీయుం డగును. నిశ్చలభక్తితో నాకు పత్రపుష్పఫలజలంబుల నర్పించువారి నెన్నఁటికిని నేనెడఁ బాయకుందును. అట్టివారు శాశ్వతముగా నాసన్నిధిని నిలిచియుందురు

దేవీ ! నాభక్తులవర్ణధర్మములంగూర్చి సంక్షేపముగఁ జెప్పుచున్నాను వినుము. త్రికాలస్నానము, అగ్నికార్యము, లింగార్చనము, దానము, ఈశ్వరభక్తి, భూతదయ, సత్యము, సంతోషము, ఆస్తిక్యము, అహింస, లజ్జ, శ్రద్ధ, అధ్యాపనము, యోగము, నిత్యాధ్యయనము, వ్యా· ఖ్యానశ్రవణము, బ్రహ్మచర్యము, తపము, క్షమ, శౌచము, శిఖా, యజ్ఞోపవీతధారణము, ఉష్ణీషోత్తరీయధారణము, నిషిద్ధవస్తుత్యాగము, భస్మలేపనము, రుద్రాక్షధారణము, ప్రతిపర్వమునందును, విశేషించి చతుర్దశులయందు నభ్యర్చనము, ప్రతిమాసంబునను బ్రహ్మకూర్చవిధిచే సంస్కృతం బగుపంచగవ్యమును యథావిధిగ సే

వించుట, పంచగవ్యముచే నన్నభిషేకించుట, విశేషించి నన్నుఁ బూజించుట, ఈక్రియలయందుపవసించుట, శ్రాద్ధపర్యుషితయావకాన్నవిసర్జనము ననునివి బ్రాహ్మణధర్మములు. మద్యము, మద్యగంధము, మన్నివేదితాన్నము మొదలగువానియం దపరిగ్రహత్వంబును, క్షమ, శాంతి, సంతోషము, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, శివజ్ఞానము, వైరాగ్యము, భస్మసేవనము, జితేంద్రియత్వము అనునివి సాధారణవర్ణంబులకంటె బ్రాహ్మణునియందలివిశేషధర్మములు—యోగిచిహ్నధారణము, పగలు భిక్షాశనము, రాత్రి భోజనపరిత్యాగము, అనునివి వానప్రస్థు లగుబ్రహ్మచారులధర్మములు:—అధ్యాపనము, యజనము అప్రతిగ్రహము ననునివి క్షత్రియధర్మములు:—వైశ్యులకు విశేషవిధానం బేమియును లేదు. సకలవర్ణరక్షణపరాయణత, శత్రువధ, దుష్టశిక్షణము, అభక్తులయం దవిశ్వాసము, భక్తులయందు విశ్వాసము, ఉచితసమయంబుల స్త్రీసంసర్గము, సేనారక్షణము, చారులచే లోకవృత్తాంతముల నెఱుంగుట, నిరంతరము నస్త్రధారణము, భస్మలేపనము, కంచుకధారణము, అనునివి క్షత్రియులకుఁ బ్రధానధర్మములు:—గోరక్షణము, వాణిజ్యము, కృషి యనునివి వైశ్యధర్మములు:-ఉద్యానకరణము, దివ్యక్షేత్రాశ్రయము, ఇతరవర్ణశుశ్రూష యనునివి శూద్రధర్మములు—గృహస్థులకు ధర్మపత్నీగమనమును, వనస్థయతిబ్రహ్మచారులకు బ్రహ్మచర్యంబును ధర్మములు—స్త్రీలకు భర్తృసేవకంటె నితరధర్మం బేదియును లేదు. పతియాజ్ఞ ననుసరించి నన్నారాధించుటయే వారికిఁ బరమధర్మము. స్వామిసేవావ్యతిరిక్తంబు లగువ్రతంబుల ననుష్ఠించుసతులు నరకపతిత లగుదురు:—వ్రతదానతపశ్శౌచంబులును, భూశయనంబును, నక్తభోజనంబును, బ్రహ్మచర్యంబును, భస్మజలస్నానంబులును, శాంతంబును, మౌనవ్రతంబును, క్ష

మఱియు, అసత్సంగపరిత్యాగంబును, పర్వంబులయం దుపవాసంబును, శివార్చనంబును శివధర్మములు:—

ఓ దేవీ! నేను నీకుఁగూడ ధ్యేయుండనే. షడక్షరమంత్రంబును, వేదోక్తంబు లగు సకలధర్మంబులును నీకనుష్ఠేయంబులు. మఱియు నీజగంబునం దిచ్ఛాక్రమంబున దేహపరిగ్రహంబు గావించియుఁ బూర్వసంస్కారవశంబున భక్తియుక్తులై స్త్రీజనాదివిషయంబుల ననురక్తులైనను విరక్తులైనను పద్మపత్రంబులందలి జలంబులంబోలి యంటియునంటకుండఁ బ్రవర్తించువారు పాపపంకనిమగ్నులుగానేరరు. సదసద్వివేకులు, విశుద్ధహృదయులు నగునట్టివారికి మత్స్వరూపజ్ఞానంబు గలుగును. అట్టివారికి నావలెనే వర్ణాశ్రమాదులును, కార్యాకార్యంబులును, విధినిషేధంబులును లేవు. పరిపూర్ణు లగుటం జేసి వారికీజగంబునఁ బ్రాప్యవస్తువేదియును లేదు. వారు భక్తానుగ్రహార్థులై మానవరూపముం దాల్చిన రుద్రమూర్తు లనియే భావింపవలయును. బ్రహ్మాదులవలెనే వారును మదాజ్ఞాపరిపాలకులగు రుద్రమూర్తు లని తెలియుఁడు. అట్టిభక్తులదర్శనమాత్రంబునఁ బాపక్షయంబుగాఁగలదు. అగ్నిసంసర్గముచే లోహము కేవలలోహముగా వ్యవహరింపఁబడనట్లు మత్సాన్నిధ్యవశంబున భక్తులగుమానవులు మానవులుగాఁ బరిగణింపఁబడరు. మానవరూపులగు నట్టిరుద్రగణంబులను బండితు లెన్నఁటికి నవమానింపఁజాలరు. మూఢులు వారిని నిందించి తమసర్వశ్రేయంబులను నాశనంబులుగాఁ జేసికొని తుదకు నరకపతితు లగుచుందురు. నాకంటె నన్యాపేక్షలేని ముక్తులగుమహాత్ములకు బ్రహ్మత్వంబును, విష్ణుత్వమునుగూడఁ దుచ్ఛములుగాఁ దోఁచుచుండును. ప్రాకృతంబులును, పౌరుషంబులు నగునైశ్వర్యములు గుణసంగశూన్యంబులుగావు గావున గుణాతీతపదాభిలాషులగువారి కవి పరిత్యాజ్యంబులు. వేదో

ల ? ఏవిధముచేనైనను నాయందుఁ జిత్తం బాసక్తమై యుండుటయే సర్వశ్రేయంబులకు నేకసాధన మైనది.

అని శివుండు పార్వతికి బోధించినవిషయమును సంక్షేపముగ వర్ణించి యుపమన్యుండు మఱియు నిట్లనియెను. ఓవనమాలీ ! పరమేశ్వరునిచే లోకానుగ్రహముకొఱ కీవిధముగా జ్ఞానసారము సంగ్రహముగా బోధితం బయ్యెను. ఇదియే విజ్ఞానసంగ్రహము. సకలవేదశాస్త్రంబులును, వేదవ్యాఖ్యానములు నిదియే—ఇతిహాసపురాణంబు లిదియే. జ్ఞానము, జ్ఞేయము, అనుష్ఠేయము, అధికారము, సాధ్యము, సాధనము అనునీషడర్థసంగ్రహమే యీజ్ఞానసంగ్రహము. గురుకరుణచే నధిగతం బగునది జ్ఞానము; పశుపాశపతి యగునీశ్వరుఁడే జ్ఞేయుఁడు; లింగార్చనాదు లనుష్ఠేయములు; భక్తులే యధికారులు; శివమంత్రాదులే సాధనములు; శివసాయుజ్యమే సాధ్య మని వేదప్రసిద్ధము-ఈషడర్థజ్ఞానసంగ్రహముచేతనే సర్వజ్ఞత్వము లభించుచున్నది. మొట్టమొదట విధ్యానుసారంబుగా యాగాదికర్మంబులచే శివార్చనంబు సేయుచు, క్రమముగా ఆభ్యంతరికయాగకర్మరతుండు గావలయును. అంతరంగమునం దనురాగము గలిగినచోఁ బుణ్యబలంబుచే నట్టిమహాత్మునకు బాహ్యకర్మంబులతో నిఁక నెంతమాత్రమును బ్రయోజనంబు లేదు. జ్ఞానామృతాస్వాదనముచే భక్తిపరితృప్తుండగు శివస్వరూపమానవునకు బాహ్యాంతరికకర్మంబు లేవియును లేవు. కావున మానవులు క్రమముగా బాహ్యాంతరికకృత్యంబులఁ బరిత్యజించుచు జ్ఞానతేజమునందు జ్ఞేయతత్త్వమును సందర్శించి పరిశేషంబునఁ గ్రమముగా జ్ఞానమునుగూడఁ ద్యజింపవలయును. పరమపురుషునియం దేకాగ్రచిత్తము గలవారికిఁ గార్యాకార్యంబులతోఁ బ్రయోజనం బేమియును లేదు. కావున నెల్లయెడల మానవులు పశుపతియందు చిత్తసమర్పణంబు గా

వింపవలయును. శివనిష్ఠచిత్తు లగుసాధు లిహపరలోకంబులయందు సర్వదా నిర్వృతిభాజను లగుదురు. " ఓంనమశ్శివాయ " అనునీమం త్రముచే సర్వసిద్ధులును లభించును గావున నిహపరలోకవిభూతి నభిల షించువా రిమ్మంత్రము నాశ్రయింపవలయును.

—♦ పంచాక్షరమంత్రతత్త్వము. ♦—

శ్రీకృష్ణా! పంచాక్షరమంత్రమాహాత్మ్యమును సమగ్రముగా వర్ణించుటకు శతకోటియుగంబులైనను జాలవు. కావున సంక్షేపము గాఁ జెప్పెదను వినుము. వేదంబులయందును, శైవాగమంబులయం దును పంచాక్షరమంత్రము షడక్షరయుతంబుగనే యుండి లోకమునం దు పంచాక్షరరూపంబునఁ బ్రకటీకృతం బయ్యెను. ఓంకారాదిషడ క్షరసంపన్నం బగునీమంత్రము సకలమంత్రంబులకును శ్రేష్ఠంబైన దగుటయే కాక సర్వకార్యంబులకు నుత్తమసాధనం బగుచున్నది. సర్వ జ్ఞుం డగుశంకరుఁడు జీవులసకలార్థంబులను సిద్ధింపఁజేయుటకై అల్పా క్షరం బయ్యును నర్థబహుళంబును, ముక్తిప్రదంబును, సిద్ధిభూషితం బును, లోకహృదయరంజకంబును, వినిశ్చితార్థంబును, సుఖోచ్చార్యం బును, వేదసారంబు నగు " ఓంనమఃశివాయ " యనునీయాజ్ఞాసాధకం బును, అసందిగ్ధంబునగుమంత్రము నుపదేశించియుండెను. సర్వశ్రేష్ఠం బగునియ్యాదిమంత్రము నిఖిలవిద్యాబీజము. ఇది వటబీజమువలె సూ క్ష్మం బయ్యును మహదర్థసాధకంబైనది. త్రిగుణాతీతుం డగుభగవా నుఁడు ప్రణవంబగునేకాక్షరమంత్రము నధిష్ఠించియుండును. ఈశానాది పంచబ్రహ్మలును బంచాక్షరమంత్రాధిష్ఠితులై యుందురు. పంచమం త్రమయుం డగుశివుండు షడక్షరమంత్రంబున వాచ్యవాచకభావము తోడ నధిష్ఠించి యుండును. ప్రమేయుం డగుశివుండు వాచ్యుండును,

మంత్రము వాచకంబు నగును. అనాదియగునీవాచ్యవాచకభావము శివునియందును, మంత్రమునందును నిలిచియున్నది. ఘోరం బగునీ సంసారసాగర మనాది యైనట్లే, సంసారముక్తిప్రదుం డగుశివుండును అనాదియై జగంబు నధిష్ఠించి యున్నాఁడు. ఆభగవానుండు వ్యాధి కౌషధమువలెనే సంసారదోషమునకు శత్రువు. సూర్యవిరహితం బగు జగంబంతయు నంధకారబంధురమైనట్లే, జగత్పతివిహీనం బగుజగంబు తమోమయంబై పోవును. ప్రకృతి యచేతనంబును, పురుషుఁ డజ్ఞుండు నై యుండఁగా నిఁక జగత్స్రష్ట యగుశివుండు లేకున్న సృష్టించువా రెవ్వరు? అచేతనంబు లగుప్రకృతిపరమాణ్వాదు లకారణంబుగ నచేతనంబులగుటకు సమర్థములు గాఁజాలవు. ప్రథమసర్గంబున బురుషునకు ధర్మాధర్మోపదేశమును, బంధమోక్షవివేచనమును శివుండు లేక సిద్ధించుట కవకాశము లేదు. వైద్యవిహీనులగురోగులు నిరానందులై దుఃఖముల ననుభవించునట్లే యానందమయుం డగుశంకరుండు లేకున్నచో జగంబంతయునానందశూన్యమై క్లేశాశ్రయంబు గాఁగలదు. కావున సర్వజ్ఞుండును, బరిపూర్ణుండును, అనాదియు నగుజగన్నాథుండు సకలజీవులకును సంసారసాగరోద్ధారకుఁడై యుండును.

ఆభగవానుం డాదిమధ్యాంతశూన్యుండును, స్వభావవిమలుండును, పరిపూర్ణుండును, సర్వజ్ఞుండును, ప్రభువును, శ్రేయుండు నని శివాగమములు కీర్తించుచున్నవి. ఈమంత్రము శివున కభిధానము. ఈమంత్రమునకు శివుం డభిధేయుఁడు. ఈమంత్రమును శివుఁడు స్వయముగా వచించెనుగావున నీషడక్షరమంత్రమే శివజ్ఞానంబును, బరమపదంబు నగుచున్నది. శివాత్మకంబగునీమంత్రము విధివాక్యమే గాని స్తుతివాక్యము గాదు. సర్వజ్ఞుఁడును, లోకానుగ్రహకర్తయు పరిపూర్ణుండు నగు శివునివచనము మిథ్య గానేరదు. సర్వజ్ఞుం డగువాఁడు గుణదోషముల

ను యథార్థరీతిని సత్యముగనే బోధించుచుండును. అజ్ఞానాదిదోషగ్రస్తులగువా రనృతులని చెప్పంబడుచున్నారు. ఈశ్వరున కట్టిదోషంబు లేవియును లేవు. అట్టివాఁడు దోషమయంబులగు నసత్యోక్తు లేలవచించును? శివప్రణీతం బగునిర్మలవచనము ప్రమాణం బనుట కెట్టి సంశయంబును లేదు. కావునఁ బుణ్యపాపవిషయంబున స్ఫుటసత్యం బగు నీశ్వరవాక్యమునే పండితులు ప్రమాణముగాఁ గైకొందురు. స్వర్గాపవర్గాభిలాషులగుమునులు శుభవాక్యముగా గ్రహించునదియే సుభాషిత మగుచున్నది. రాగద్వేషమిథ్యాకామతృష్ణాదులతోఁ గూడినవాక్యము నిరయహేతుకంబును దుర్భాషితంబు నగుచున్నది. ఎంతకోమలంబైనను, మధురాక్షరవిరచితంబైనను, శ్రుతిమధురంబైనను అవిద్యారాగాదిపూర్ణం బగువాక్యమువలనఁ బ్రయోజన మేమున్నది? కావున శ్రేయోనిధానంబును, రాగద్వేషాదివినాశకంబును నగువాక్యము పరుషాక్షరదూషితంబైనను శుభకరంబైనది. ఈజగంబున ననేకమంత్రము లున్నను సర్వజ్ఞుండగు శివునిచేఁ జెప్పంబడిన యీమంత్రముతోఁ దుల్యం బగునది యెక్కడ నున్నది? సాంగంబు లగువేదంబులును, సకలశాస్త్రములును ఈమంత్రరాజమునం దున్నవి. ఈషడక్షరమంత్రముతో సమానంబగుమంత్రము లేదు. ఇది సప్తకోటిమహామంత్రములకును భిన్నమైనది. సకలశివజ్ఞానంబులును, విద్యాస్థానంబులును దీనికి సంక్షిప్తభాష్యమాత్రములై యుండును. అంతరంగమునం దీమంత్రము గలవాని కితరమంత్రములతోడను, శాస్త్రాదులతోడను నిమిత్తంబు లేదు. ఈమంత్రాభ్యాసముం గావించినచో సకలవేదశాస్త్రాధ్యయనమును గావించినట్లే యగును. "నమఃశివాయ" అనునీమంత్రము జిహ్వాగ్రమున విరాజిల్లువానిజీవితము ధన్యమైనది. పండితులమాటయేల — నీచజాతియైనను, మూర్ఖుఁడైనను నీమంత్రజపంబుచేఁ బాపవిముక్తుం డగును.

ఒకప్పుడు పార్వతీదేవి నాథుం గాంచి మహాత్మా! పాపతిమిరావృతంబును, దుర్జయంబును, దురతిక్రమణీయంబు నగు కలికాలమునందు లోకులు ధర్మవిముఖులై వర్ణాశ్రమధర్మములు నశించుటచే సంకరులై అధికారవిపర్యయంబున సందిగ్ధావస్థయందుండి యుపదేశంబులులేక గురుశిష్యక్రమంబు నశించిపోయినప్పుడు నీభక్తులకు ముక్తికుపాయం బేమున్నది? అని దేవి ప్రశ్నించుటయు మహాదేవుం డిట్లనియెను. ప్రియా! కలికాలమునందు భక్తిభావముతో మనోహరంబగు నాపంచాక్షరమంత్రమును జపించువారు ముక్తు లగుదురు. దోషదూషితులును, నిర్దయులును, కృతఘ్నులును, ఖలులును, కుటిలచిత్తులును, లుబ్ధులును, చండాలురు నైనను నామంత్రాభ్యాసమువలన సంసారబంధవిముక్తులు గాఁగలరు. మద్భక్తుం డగువాఁడు పతితుండైనను ఈవిద్యాపరిభావముచే ముక్తుండగునని ఘంటాపథముగాఁ జెప్పుచున్నాను. అని బోధించుటయుఁ బార్వతీదేవి నాథా! పతితునకుఁ గర్మాధికారము లేదుగదా! ఆతనికి నరకమే నిశ్చయ మైనది. అట్టివాఁ బతితుఁ డేవిధముగా నీవిద్య నాశ్రయించి ముక్తుఁడు గాఁగలుగును? అని ప్రశ్నించుటయు దేవదేవుం డిట్లనియెను. త్రిపురసుందరీ! నీవు మంచిప్రశ్నయే చేసితివి. గోపనీయం బగుటచే నీవిషయ మింకను నీకు బోధింపలేదు. పతితులు సమంత్రకముగా నన్నుఁ బూజించిరేని నరకగాములయ్యెదరు. కాని యీపంచాక్షరమంత్రమున కట్టినియమము లేదు. వాతాంబుపర్ణాశనాదివ్రతులుగూడ నాలోకమును జేరుటకు సమర్థులుగారు. భక్తిపూర్వకముగా నొక్కసారి పంచాక్షరమంత్రము నర్చించువారికి మత్పదంబు సిద్ధించును. కావునఁ దపోవ్రతయజ్ఞనియమాదులు పంచాక్షరమంత్రమునఁ గోటితమాంశమునైనను బోలఁజాలవు. పాశబద్ధుఁడైనను, పాశముక్తుఁడైనను పంచాక్షరమంత్రముతో నన్నర్చించు

వాఁడు ముక్తుం డగుననుటకు సంశయము లేదు. ఎట్టివాఁడైనను మం త్రప్రభావముచే ముక్తుం డగును. సాధకుఁడు పంచాక్షరమంత్రమును గాని, షడక్షరమంత్రమును గాని జపించుచుఁ బూజింపవలయును. ఎవ్వరికైనను ఈమంత్రముతోఁ బూజించుట కధికారము గలదు. కాని దీక్షితునికంటె నదీక్షితుఁడు కోటిగుణంబులు తక్కువవాఁ డగు చున్నాఁడు. కావున గురూపదేశముం గాంచి దీక్షితుఁడై నన్నారా ధించుట యవశ్యకర్తవ్యము. సాత్త్వికగుణసంపన్నులగువా రీమంత్రము నాశ్రయించి బ్రహ్మచర్యవ్రతంబుచే నన్నారాధించి మత్స్వరూపు లగు దురు. భక్తిగలవారందఱు నీపంచాక్షరమంత్రమున కధికారులే. అం దుచేతనే యీమంత్రము సర్వోత్కృష్ట మైనది. ఈమంత్రప్రభావము నందే మహర్షులును, వేదములును, సనాతనధర్మములును, దేవతలును, నిఖిలజగంబులును నిలిచి యున్నవి. ప్రళయకాలంబున నీవిశ్వంబంత యు నీమంత్రమునందే లయంబు గాంచును. నేనొక్కండనుగాక మఱి తరం బేమియును లేనియట్టిసమయమున నాశక్తిచేఁ బాలితంబులగు వేదశాస్త్రంబు లన్నియు నీమంత్రము నాశ్రయించి యుండెను. అనం తరము మరల నావలనఁ బ్రకృతిపురుషభేదంబున సృష్టి యారంభ మ గును. అప్పుడు నారాయణుండు మాయామయతనుధారియై జలమ ధ్యంబున శేషతల్పంబున శయనించి యుండ నాతనినాభిపద్మమునుండి పంచవక్త్రుం డగుబ్రహ్మ యుదయించి సృష్టికాముండై స్వయముగ నశక్తుండును, అసహాయుండును గావున దనసహాయముకొఱకుఁ దేజో మయులగు పదిమంది మానసపుత్రులను బుట్టించెను. తరువాత నా తఁడు తనశక్తివృద్ధికొఱకు నన్నుద్దేశించి «మహేశ్వరా! నాపుత్రుల కమితశక్తిం బ్రసాదింపుము” అని ప్రార్థించుటయు నేనప్పుడు పంచవ క్త్రుండనై సాక్షాత్కరించి పంచముఖోద్భూతం బగుపంచాక్షరమంత్ర

ము నావద్మాసనున కుపదేశించితిని. బ్రహ్మయుఁ దనపంచముఖంబుల తో నీమంత్రము నభ్యసించి వాచ్యవాచకభావంబున నన్నవగతునిగాఁ జేసికొనియెను. క్రమముగా నాతఁడు మంత్రప్రయోగమును, మంత్రార్థముర గ్రహించి సర్వంబును దనపుత్రుల కుపదేశించుటకు వారమ్మంత్రమును సమర్మకంబుగాఁదెలిసికొని నన్నారాధించుచు మేరుపర్వతశిఖరస్థంబగు ముంజవంతంబను పర్వతసమీపంబున లోకసృష్టియం దాసక్తి గలవారై వాయుభక్షణంబుసేయుచు సహస్రదివ్యవర్షంబులు తీవ్రతపంబు సేయం దొడంగిరి. అప్పుడు నేను వారితపంబునకుఁ బ్రీతుండనై జగత్సృష్టివర్ధనంబుకొఱకు ఋషి, ఛందము, కీలకము, బీజము, శక్తి, దేవత, న్యాసము, షడంగములు, దిగ్బంధనము, వినియోగము మొదలగువానితోఁ బంచాక్షరమంత్రము నుపదేశించుటయు వారామంత్రప్రభావముచే దేవాసురమానవాదిసృష్టిం గావింప నారంభించిరి. ఈపరమవిద్యారహస్యమునుపదేశించెద నాకర్ణింపుము—

మొదట నమఃపదమును, దరువాత "శివాయ"అనుపదమును బ్రయోగింపవలయును. సకలశాస్త్రప్రధానం బగునీమంత్రమునుండియే శబ్దజాలం బంతయు నుత్పన్నం బయ్యెను. మొట్టమొదట నావదనమునుండి యుదయించిన యీపంచాక్షరీవిద్య చతుర్భుజయు, త్రినయనయు, శశికళావతంసయు, తప్తకాంచనవర్ణయు, పద్మోత్పలవరాభయహస్తయు, సర్వలక్షణసంపన్నయు, సర్వాభరణభూషితయు, శ్వేతపద్మాసనాసీనయు, నీలకుంచితకేశపాశయు, నతిమనోహారిణియు నైనది. ఈపంచవర్ణంబులును, పీతకృష్ణధూమ్ర వర్ణంబులుగలిగి నాదబిందుయుతంబు లైనవి. అందు బిందు వర్ధచంద్రాకృతియు, నాదము దీపశిఖాకృతియు నైనది. ఈపంచాక్షరమంత్రంబున ద్వితీయవర్ణమే బీజము. చతుర్థవర్ణము శక్తి. ఈమంత్రమునకు వామదేవుఁడు ఋషి;

పంక్తిఛామకము ఛందము; నేనే దేవతను; ఈమంత్రబీజంబులకుఁ గ్ర మముగా గౌత, మాత్రి, విశ్వామి, త్రాంగిరో, భరద్వాజులుఋషులు. గాయత్రి, అనుష్టుప్పు, త్రిష్టుప్పు, బృహతి, బ్రహ్మ, స్కందులు దేవత లు; పూర్వదక్షిణాద్యూర్ధ్వపర్యంతమును గలపంచముఖంబులును దా నికి స్థానములు. అందు ప్రథమద్వితీయవర్ణము లుదాత్తములు; తృతీ యవర్ణములు స్వరితములు; పంచవర్ణము అనుదాత్తము. మూలవిద్య యగునీపంచాక్షరమంత్రము మంగళకరమైనది. మహాఫలప్రదమైనది. అందు నకారము శిరమును, మకారము శిఖయు, శికారము కవచము, వాకారము నేత్రము, యకారము అస్త్రము నని చెప్పంబడుచున్నవి. ఈసర్వవర్ణాంతంబులయందును అప్పుడప్పుడు "స్వాహా, వషట్, హుం, వౌషట్, ఫట్," అనునవి చేర్పంబడుచు సంగత్వముం గాంచుచుండు ను. దేవీ! నిన్నుపాసించుటకుఁగూడ నీమంత్రమే మూలమంత్ర మని యెఱుంగుము. అప్పుడీషద్భేదమాత్రమే యుండును. పంచమవర్ణంబున ద్వాదశస్వరం బగు "ఐ" కారమును జేర్చుటమాత్రమే "నమఃశి వాయై" అని కావున నెల్లవారును త్రికరణశుద్ధిగా నీమంత్రముచేతనే నిన్నును నన్ను నారాధించుచు జపహోమాదులం గావింపవలయును. యథోచితంబుగా ప్రజ్ఞయు, శ్రద్ధయు, కాలంబును, మతియు, శక్తి యు, సంపత్తియు, అనురాగంబును గలిగి యథాసంభవం బగునెచ్చో టనైనను, ఎట్టివేళనైనను ఏవిధముగానైనను బూజించువారికి ముక్తి కరతలామలకం బగును. క్రమంబుగనైనను, అక్రమంబుగనైనను ఎ ట్లయిననేమి —భక్తితోనమరక్తులై మనలంగూర్చి కావించిన యెట్టికర్మంబైనను గల్యాణదాయకంబు గాఁగలదు. సంపూర్ణముగ నిశ్చల హృదయులును, మదధీనులును గాఁజాలని మద్భక్తులకై శాస్త్రసిద్ధం బులగుకొన్నినియమంబులు నాచేఁ గల్పింపఁబడినవి. అందు ముఖ్యము

గా నేదిలేక మంత్రజపంబు విఫలంబగునో దేనిమూలమున నది సఫలం బగునో చెప్పెదను. ఉపదేశ, క్రియా, శ్రద్ధావిహీనంబును, ఉపదేశాగ్రమై దక్షిణావిహీనంబు నగుజపంబు నిష్ఫలమైనది. తత్త్వసమన్వితంబగుజపము సఫలమైనది. ధ్యానయోగపరాయణుఁడును, జపానుష్ఠానతత్పరుఁడు నగుబ్రాహ్మణుని గురుపదమునం దభిషేకించి భక్తిశౌచసమన్వితు లగువారు మనోవాక్కాయంబులచేతను, ధనముచేతను నాతని దృప్తుం జేసి నిత్యమును బూజించుచు శిష్యుండు ధనవంతుండైనచో నాచార్యునకు రథగజతురగరత్నక్షేత్రమందిర భూషణవస్త్ర ధనధాన్యాదుల నర్పించి యారాధింపవలయును. జపసిద్ధిం గోరువాఁడు విత్తశాఠ్యము సేయం జనదు. ఇట్లు గురు నారాధించి సపరిచ్ఛదంబుగాఁ దన్నుగూడ నాతని కర్పించుకొని క్రమముగా నాచార్యునివలన మంత్రంబును, జ్ఞానంబును బడయవలయును.

ప్రసన్నుం డగుగురుండు సకలశుభసంపన్నం బగునుత్తమదినంబున శుభముహూర్తమునందు ఏకవత్సరనియతశివశుశ్రూషాపరుండును, ఉపవాసతత్పరుండు, శౌచసంపన్నుండును, అహంకారశూన్యుండు నగుశిష్యుని ఘృతాదిపుణ్యద్రవ్యసంయుతంబులును మంత్రపూతంబులు నగుజలంబులచే శుద్ధిస్నానంబు సేయించి పుణ్యాహవాచనంబును, బ్రాహ్మణపూజయుఁ జేయించి సముద్రతీరమునఁగాని, నదియొడ్డునఁగాని, గోష్ఠదేవాలయాది పవిత్రప్రదేశములందుగాని,స్వగృహంబునఁగాని వతమానుగ్రహముతో శిష్యునకు యథావిధిగ జ్ఞానోపదేశముచేయవలయును. మఱియు మనయిరువురిసంబంధంబులగు మంత్రములను స్వరసహితముగా నుపదేశింపవలయును. పిమ్మట శిష్యుండు సమాహితచిత్తముతో దృఢసంకల్పుఁడై మంత్రపురశ్చరణంబు సేయుచు యావజ్జీవమును ప్రతిదినమును అష్టోత్తరసహస్రపరిమితం బగుజపంబు గావించుచుం

డవలయును. నక్తభోజననియమం బవలంబించి యీమంత్రమును అక్షరలక్షలకుఁ జతుర్గుణంబుగా జపించువాఁడు పౌరశ్చరణికుం డగును. ఇట్లు పురశ్చరణంబు సేయుచు నిత్యజపపరాయణుం డగువానితో సమాను లీజగంబునం దెవ్వరును లేరు. అట్టివాఁడు స్వయముగ సిద్ధుం డగుటయే కాక యితరులకుఁగూడ సిద్ధిలాభముం గూర్పఁగలఁడు.

ఉపాసకుఁడు స్నానము చేసి నిర్మలప్రదేశమునం దుచితాసనాసీనుండై నిన్నును, నన్నును గురుని ధ్యానించి యేకాగ్రచిత్తముతో పూర్వంబుగఁగాని, యుత్తరంబుగఁగాని యభిముఖుండై దహనప్లావనాదులచేఁ బంచతత్త్వంబులను శుద్ధంబులుగాఁ జేసి అంగన్యాసమంత్రన్యాసంబుల గావించి మనయుభయమూర్తులను ధ్యానించుచు ప్రాణాదివాయునిరోధంబు చేసి విద్యాస్థానము, స్వస్వరూపము, ఋషి, ఛందము, అధిదైవతము, బీజము, శక్తి మొదలగు వానిని స్మరించుచు పంచాక్షరమంత్రజపంబు చేయవలయును. మానసజప ముత్తమమనియు, ఉపాంశుజపము మధ్యమమనియు, వాచికజప మధమంబనియు నాగమవేత్తలు చెప్పుదురు. అందు రుద్ర, విష్ణు, బ్రహ్మదైవతంబులగుజపంబులు యథాక్రమంబుగా నుత్తమ, మధ్య, మాధమంబులు. ఉదాత్తానుదాత్తస్వరితస్వరంబులచేఁ బంచాక్షరంబులను స్పష్టముగా నుచ్చరించునదియే వాచిక జపము. జిహ్వాస్పందనమాత్రంబున నుచ్చరింపఁబడుచున్నను నితరులకు వినఁబడకుండునట్లు జపించునది ఉపాంశు జపము. మనస్సునందే వర్ణమునుండి వర్ణంబును, పదంబునుండి పదంబునుగూర్చి శబ్దార్థచింతనంబు చేయుచు భావించునదియే మానసికజపము. అందు వాచికజపముకంటె నుపాంశుమానసికజపంబులు క్రమముగా శత, సహస్రగుణాధికంబులు. సగర్భజపము వీనికంటెను శతగుణాధికమైనది. ప్రాణాయామయుక్తంబగుజపంబునకు సగర్భంబని

దు. ఆద్యంతములయం దగర్భమైనను ప్రాణాయామము ప్రశస్తమైనది. మంత్రార్థవిదుం డగుసాధకుఁడు వాయునిరోధంబుచేసి యిరువదినాలుగుసారులు మంత్రస్మరణంబు గావింపవలయును. అశక్తుఁడైనచో శక్తికొలఁది నాచరింపవచ్చును. అయిదుసారులు, మూఁడుసారులు, ఒక్కసారియైనను ప్రాణాయామంబు చేయవలయును. ఈజపంబునకు సగర్భంబనిగాని, అగర్భం బనిగాని యెట్టినియమంబును లేదు. కాని యందు సగర్భజపంబు ప్రశస్తంబైనది. ధ్యానయుక్తం బగునది దానికంటెను సహస్రగుణాధికమైనది. ఈపంచవిధజపంబులలోనను సాధకుఁడు యథాశక్తిని జపాచరణంబు గావించుట కర్తవ్యము. అంగుళిరేఖలచే లెక్కించుచు జపించుట యష్టగుణఫలంబును, పుత్రజీవఖండంబులచే దశగుణఫలంబును, శంఖమణులచే శతగుణఫలంబును, ప్రవాళంబులచే సహస్రగుణఫలంబును, స్ఫటికంబులచే దశసహస్రఫలంబును, మౌక్తికంబులచే లక్షగుణఫలంబును లభించును. మఱియు పద్మాక్షంబులచే దశలక్షగుణఫలంబును, స్వర్ణమాలికచేఁ గోటిగుణఫలంబును, కుశగ్రంథులచేఁగాని, రుద్రాక్షలచేఁగాని జపించినచో ననంతగుణఫలంబును సిద్ధింపఁగలదు. జపంబునకు ముప్పదిరుద్రాక్షలమాలిక ధనప్రదంబును, ఇరువదియేడురుద్రాక్షలమాలిక పుష్టిప్రదంబును, ఇరువదియైదురుద్రాక్షలమాలిక మోక్షప్రదంబును, పదునేను రుద్రాక్షలమాలిక అభిచారఫలప్రదంబునైనది. అంగుష్ఠాంగుళిచే జపించుటవలన మోక్షలాభంబును, తర్జనిచే శత్రుక్షయంబును, మధ్యమచే ధనలాభంబును, అనామికచే శాంతిలాభంబును, కనిష్ఠికచే దుఃఖనాశంబు నగును. అన్యాంగుళులతోఁ గలిపి యంగుష్ఠముచేతనే జపింపవలయును. అంగుష్ఠంబుతోఁగూడనిజపంబు నిష్ఫలం బగును. గృహంబునఁ గావించుజపంబుకంటె గోష్ఠ, పుణ్యావ, నోపవన,పర్వత,నదీ, దేవాలయం

బులయందు గావించు జపంబు క్రమముగా శతసహస్ర దశసహస్ర, లక్ష, దశలక్ష, కోటిగుణంబు లధికఫలప్రదమైనది. మత్సన్నిధానంబునఁ గావించుజపం బనంతగుణఫలప్రదమైనది. ఉపాసకుఁడు పూర్వ, దక్షిణ, పశ్చిమోత్తరంబుల కభిముఖుండై కావించు జపము క్రమముగా వశీకర, ణాభిచార, ధనలాభ, శాంతిప్రదంబై యుండును. సూర్యాగ్నివిప్రదేవతాగురువిముఖుండై మంత్రజపంబు సేయంజనదు. ఉష్ణీషకవచపరిధానుండును, నగ్నుండును, ముక్తకేశుండును, గళావృతుండును, అశుచియునై గాని, విలపించుచుఁగాని జపంబు సేయుట యుచితము గాదు. జపసమయంబునఁ గ్రోధమదక్షుతంబులును, నిష్ఠీవనవిజృంభణంబులును గారాదు. అధమసందర్శనంబుగూడ వర్జింపవలయును. కాలవశంబున నట్టివి తటస్థించినచో నుమామహేశ్వరులను స్మరించుచు సూర్యాదిజ్యోతిష్పదార్థములం గాంచి ప్రాణాయామం బాచరింపవలయును.

ఆసనశూన్యంబుగను, శయనించియు, నడచుచును, నిలిచియు అమంగళకరంబగుతిమిరప్రదేశమునను జపము సేయంజనదు. మఱియుఁ గాళ్లు సాచియు, కుక్కుటాసనంబునను, చింతచే వ్యాకులపడుచును, వాహనము నారోహించియు శక్తిమంతులగువారు జపము చేయరాదు. అశక్తులగువారు తమశక్తికొలఁది నాచరింపవలయును. సదాచారముతో ధ్యానజపాదులం గావించుట శుభకరము. ఆచారమే పరమధర్మంబును, పరమధనంబును, పరమవిద్యయు, పరమగతియు నగుచున్నది. ఆచారవిహీనుం డిహలోకమున నిందితుఁడై పరంబున దుఃఖభోగి యగుంగావున నవశ్యముగ సదాచారసంపన్నుండు గావలయును. వేదవిహితంబులగుసదాచారముల నతిక్రమించుటయే యనాచారము. ఆచారమున కాస్తిక్యమే సహాయకారణము. ప్రమాదవశం

బుచు సదాచారమునకు భంగము గలిగినంతమాత్రమున దోషము లేదు. ఆస్తిక్యముమాత్రి మవశ్యముగ నాశ్రయింపఁదగినది. ఇహామం దువలెనే పరమందును సుఖదుఃఖములు గలవనువిశ్వాసమే ఆస్తిక్యము. దేవీ! మఱియొకవిశేషము చెప్పెదను. ఇది నాస్తికులగు పశువులకుప దేశింపరాదు. కలియుగంబున నాచారశూన్యులును, పతితులు నగు నీచులకుఁ బంచాక్షరమంత్రముకంటెఁ దరఁణోపాయం బేదియును లేదు. శుచియైనను, గాకపోయినను, విధివిహితంబుగనైనను, స్వేచ్ఛగనైనను నీమంత్రమును జపించుట నిష్ఫలంబు గానేరదు. గురూపదిష్టంబు గాకున్నను నిమ్మంత్రింబు సఫలం బగును. నాభక్తుల కెల్లవేళలయందు నీమంత్రము సిద్ధంబై యున్నది. ఈమంత్రోపదేశంబునకు శుభతిథివారనక్షత్రాదులతోఁ గూడ నిమిత్తంబు లేదు. ఇది నిత్యబుద్ధంబైనది గాని యెన్నఁడును సుప్తంబైనది గాదు. ఈమంత్రి మందఱకును, సిద్ధము, సాధ్యము, సుసాధ్యము నగునదియే గాని యెవ్వరికి నరిమంత్రంబు గాదు. (సిద్ధము, సాధ్యము, సుసిద్ధము, అరి యనిమంత్రము చతుర్విధంబులుగలది) ఈమంత్రము సిద్ధగురూపదిష్టంబైనచో సుసిద్ధంబును, అసిద్ధగురూపదిష్టంబైనచో సిద్ధంబును, స్వీయముగ నభ్యసించినదైనచో సాధ్యంబు నగుచున్నది. నాయందును, మంత్రమునందును, గురువునందును, శ్రద్ధాన్వితుడై యుండువారికి మంత్రము సాధితంబైనను, గాకున్నను సిద్ధంబై యుండును. అధికారవిశిష్టంబులును, ఆశ్రియసంపన్నంబులు నగునితరమంత్రములఁ బరిత్యజించి పండితు లీమంత్రమునే యాశ్రియించుచుందురు. అన్యమంత్రములు సిద్ధించినంతమాత్రమున నిదిసిద్ధింపదు. ఇది సిద్ధించినచో సకలమంత్రములును సిద్ధింపఁగలవు. ఇతరదేవతలు లభించినను నేను లభ్యుండను గాను. నేను లభించినచో నితరదేవతలందఱును లభ్యు లగుదురు. ఇతరమంత్రం

బులయందుఁ గలదోషము లీమంత్రమునందు లేవు. ఈమంత్రమునకు జాతిభేదముతోఁ బ్రయోజనము లేదు. మహాఫలప్రదంబగునీమంత్రమును క్షుద్రఫలంబుకొఱకుఁగాని, శత్రునాశనంబుకొఱకుఁగాని ప్రయోగింపఁదగదు. ఇది పంచాక్షరమంత్రప్రభావము. దీనిని భక్తితోఁ గీర్తించువారు పాపవిముక్తులై పరమగతిలాభంబు నందఁగలరు.—

—• శైవమంత్రదీక్షావిధి •—

ఉపమన్యుండు మరల నిట్లు చెప్పందొడంగెను. దేవకీనందనా! సర్వపాపహరం బగుశివసంస్కారముంగూర్చి చెప్పెద నాకర్ణింపుము. సంస్కారము విజ్ఞానప్రదంబును, పాశబంధమోచకంబు నగుటంజేసి దీక్షానామంబునఁ బ్రశంసితం బగుచున్నది. శైవాగమంబులయం దాదీక్ష శాంభవి, శాక్తి, మాంత్రి యనునామంబులచేఁ బరగుచున్నది. గురుసందర్శన, సంస్పర్శన, సంభాషణంబులవలన జ్ఞానలాభముం గూర్చి పాశమోచనంబు గావించునది శాంభవీదీక్ష యని చెప్పంబడుచున్నది. అది మరలఁ బాపక్షయభేదంబుచేఁ దీవ్రంబనియు, దీవ్రతరంబనియు రెండువిధములు. అందు బాపమోచకంబగుదీక్ష తీవ్రంబనియు, సద్యస్సమయమందే నిర్వృతిలాభముం గూర్చునది తీవ్రతరంబనియు నెఱుంగవలయును.—జ్ఞానమయుం డగుగురుఁడు యోగమార్గమున శిష్యదేహంబునఁ బ్రవేశించి జ్ఞానోదేశంబు గావించుట శాక్తీదీక్ష యగుచున్నది. ఇఁక మాంత్రీదీక్ష క్రియాబహుళంబైనది. కుండమండలాదిరచనాపూర్వకంబుగ నీదీక్షననుష్ఠింపవలయును. శక్తిప్రాప్తియే శివధర్మాచరణంబునకు మూలంబు గావున శిష్యుండు శక్త్యనుసారంబుగా ననుగ్రహలాభముం గాంచుచుండును. శక్తి లేకున్నచో శుద్ధియు, విద్యయు, శుద్ధాచారంబును, ముక్తియు, సిద్ధియు నేమియులే

కుండఁబోవును. కావున గురుండు శిష్యునిశక్తిప్రాప్తచిహ్నముల నెఱింగి జ్ఞానక్రియలచే నాతనిఁ బరిశుద్ధుం గావింపవలయును. దీనికి వ్యతిరేకంబు సేయుదుర్మతి వినాశంబు నందును. ఎల్లవిషయంబులందును గురుఁడు శిష్యుని బరీక్షించుచుండవలయును. పరాశక్తి ప్రబోధానందస్వరూపిణి గావున ప్రబోధానందసంభవమే శక్తిప్రాప్తికి చిహ్నము. స్వరనేత్రాదివికారంబులును, కంపస్వేదరోమాంచాదులును గలిగించు నంతరంగిస్ఫురణమే ఆనందబోధమునకు లక్షణము. పూజాధ్యానాదిసమయములందు శిష్యునియీలక్షణములను గురుఁడు పరీక్షింపవలయును. శిక్షణీయుం డగుశిష్యుండును గురుగౌరవవర్ధనంబుకొఱ కెల్లవిధములఁ బ్రియత్నింపవలయును. శివుఁడే గురుండనియు, నీయిరువురును విద్యాస్వరూపులనియు, శివుఁడు, గురుఁడు, విద్య ఈమూఁటికి నెట్టిభేదమును లేదనియు, వీరియారాధనము సమానఫలదంబనియు శిష్యుండు విశ్వసించి గురుండు సర్వవేదాత్మకుండును, సర్వమంత్రాత్మకుండు నని భావించి సర్వదా గురునియాజ్ఞను బాలించుచుండవలయును. ఎన్నఁడును గుర్వాజ్ఞ నుల్లంఘింపరాదు. గమనావస్థానశయన భోజనాదికర్మంబులుగూడ గురునాజ్ఞ ననుసరించి కావించుటయే శ్రేయోదాయకము. గురువే దేవుండును గురుగృహమే దేవమందిరంబును గావున నాతనియెదుటను, నాతనిగృహంబునను యథేచ్ఛగ నుపవేశనంబు సేయుంజనదు. పాపసంగముచే జనులు పాపులైనట్లే గురుసంసర్గముచే శిష్యులు గురుధర్మఫలభాగు లగుదురు. అగ్నిసంసర్గముచే సువర్ణము విమలం బగునట్లు గురుసంయోగముచే శిష్యుఁడు పాపవిముక్తుం డగును. గురుండు సంతుష్టుం డైనచోఁ బ్రజ్వలితాగ్ని శుష్కకాష్ఠములంబోలి పాపములను దహించివైచును. గురునకెప్పుడును క్రోధంబు గల్పింపం జనదు. గురుండు కోపించినచో నాయువును, జ్ఞానమును, సంపత్తియు,

సకలంబును నశింపఁజేయఁగలఁడు. గురుక్రోధజనకంబు లగుయజ్ఞయాగాదినియమంబు లన్నియు నిష్ఫలంబులు. గురువిరుద్ధసంభాషణంబు గూడదు. బుద్ధిమంతుండును, శుభాకాంక్షియు నగుశిష్యుండు గురుని కడ మిథ్యావాది కాఁగూడదు. ఆజ్ఞాపించినను లేకున్నను గురుసకుఁ బ్రియంబులును, హితంబులు నగుకార్యములనే గావింపవలయును. ఎదుటనైనను, వెనుకనైనను నాతనికార్యములందే యాసక్తుఁడై యుండవలయును. ఇట్టి సద్గుణసంపన్నుండును, భక్తుండు నగుశిష్యుండు శైవధర్మాచరణంబునకు యోగ్యుం డగును.

గురుండు గుణవంతుండును, ప్రాజ్ఞుండును, బరమానందదర్శకుండును, తత్త్వజ్ఞుండును, శివభక్తుండు నైనచో ముక్తిప్రదుం డగును. పరమానందసంభవంబును, బ్రహ్మజ్ఞానజనకంబు నగుతత్త్వము నెఱింగినవాఁడే యానందదర్శకుఁడు. గురుశిష్యు లిట్టివారైనచోఁ బరస్పరము ముక్తిప్రదులు గాఁగలరు. కాని బ్రహ్మజ్ఞానరహితుండై కేవలనామోచ్చారణంబుమాత్రము గావించుగురుండు ముక్తిప్రదుండు గానేరఁడు. ఱాయి ఱాతిని దహింపఁజేయఁగలదా? జ్ఞానరహితుం డగుగురునిచే నుపదిష్టం బగునామమాత్రముచే శిష్యులు నామమాత్రముక్తులే యగుదురు. కాని తత్త్వజ్ఞులగువారు తాము ముక్తులై పరులకు ముక్తిం జేయుదురు. తత్త్వజ్ఞానశూన్యులగుమానవులెక్కడ—బోధయెక్కడ?-ఆత్మజ్ఞాన మెక్కడ? ఆత్మజ్ఞానశూన్యులు పశువులు. పశువులచే నుపదేశింపఁబడుటచే బశుత్వం బెట్లు నశించును? కావున నీజగంబునందు దత్త్వజ్ఞుం డగువాఁడుమాత్రమే ముక్తుండును మోచకుండు నగుచున్నాఁడు. సర్వలక్షణసంపన్నుండును, సకలశాస్త్రవేత్తయు, సకలోపాయాదివిధిజ్ఞుండు నైనను దత్త్వజ్ఞుండు గానిచో నిష్ఫలుం డగుచున్నాఁడు. శివతత్త్వానుభవంబు గలవారిని దర్శించినంతమాత్రమే యా

నందోదయ మగుచుండును. ఎవ్వరిసందర్శనముచే నానందము గలుగునో యట్టివాఁడే గురువులుగా గ్రహింపవలయును. వినీతాచారచతురులును, మోక్షార్థులు నగుశిష్యులు గురునిస్వభావమును గ్రహించునంతవఱకును నాతని సేవించుచు ననంతరమే యాతనివలన మంత్రోపదేశముం గాంచవలయును. బాగుగ గురుస్వభావము విజ్ఞాతంబైనచో నాతనియందు దృఢవిశ్వాసము గలుగును. ఉపేక్షయెన్నఁటికిని గలుగదు. ఒకసంవత్సరము సేవించినను ఏగురునియొద్ద నించుకంతయైనను నానందలాభముగలుగదో యాగురుని బరిత్యజించి యన్యగురు నాశ్రయింపవలయును. అప్పుడైనను త్యజించినగురుని దిరస్కరింపఁజనదు.

గురుపుత్రునిగాని, బోధకునిగాని, ప్రేరకునిగాని, గురుబంధులనుగాని, గురునిగాని యెన్నఁడును నిందింపఁగూడదు. శ్రేయఃకాంక్షియగువాఁడు ముందుగా ప్రియదర్శనుండును, సర్వాభయప్రదాతయు, కరుణార్ద్రహృదయుండును, వేదపారగుండును, బ్రాహ్మణుండు నగుగురునిసన్నిధిం జేరి త్రికరణశుద్ధిగా నాతనికి సంతుష్టిం గూర్పవలయును. గురుప్రసాదముచే సకలపాపంబులును నశించుఁగావున శిష్యుండు గురుని బ్రసన్నుం గావించుకొనుట కెల్లప్రయత్నములను గావింపవలయును. అందుచేతనే శిష్యుండు తనసర్వస్వమును, దన్నునుగూడ గురునకు నివేదించుకొనవలయును. జననీజనకులును, సోదరులును, బంధువులును, ధనధాన్యాదులును, సర్వసుఖంబులునుగూడ గురుఁడేయని భావింపవలయును. ఆచార్యమూర్తి యగుశివునియం దాత్మసమర్పణంబు గావింపఁజాలినధన్యుఁడు శైవధర్మతత్పరుండై జన్మరహితుండు గాఁగలఁడు. మహాదేవుండగుశివుండు గురుస్వరూపంబున ననుగ్రహించి సకలపశుపాశవిమోచనంబు గావించుచుండునని వేదములు చెప్పుచున్నవి. గురుండు బ్రాహ్మణుం డగుశిష్యు నొకవత్సరంబును, క్షత్రి

యుని రెండువత్సరంబులును, వైశ్యుని మూఁడువత్సరంబులును ననేక విధంబులఁ బరీక్షింపవలయును.

అకృష్టులును, తాడితులు నయ్యును విషణ్ణులుగాక నియతులును, విశుద్ధాచారసంపన్నులునై సేవించు శిష్యులే శివమంత్రదీక్షితు లగుటకు యోగ్యులు. అహింసాపరులుదయాళురు, అహంకారశూన్యులు, ప్రియంవదులు, బుద్ధిమంతులు, స్పర్ధాశూన్యులు, సరళహృదయులు, మృదుస్వభావులు, స్థిరచిత్తులు, వినీతులు, విశుద్ధులు, సదాచారులు, శివభక్తులు నగువారే శిష్యత్వమునకు యోగ్యులు గురుం డిట్టిశిష్యులకుఁ ద్రికరణశుద్ధిగా యథోచితప్రబోధంబు సేయుచు వారిని బరిశుద్ధులం గావింపవలయును. స్త్రీలకు స్వయముగా శివమంత్రదీక్ష కధికారము లేదు. వారు కేవల మీశ్వరభక్తి గలిగి పతియాజ్ఞగలిగియున్నచో దీక్షాధికారిణు లగుదురు. అట్లే విధవలు పుత్రాదులయనుజ్ఞను, కన్యలు తండ్రియనుజ్ఞను బొంది దీక్షితలు గావచ్చును. నీచజాతులకును, బతితులకును అధ్వశుద్ధివిధింపఁబడలేదు. కాని యట్టివారు పరమకారణుం డగునీశ్వరునియం దకృత్రిమభక్తిగలవారైన తదనుగ్రహంబున ముక్తులు గాఁగలరు. బ్రాహ్మణులయం దనులోమజాతులవారికి అధ్వశుద్ధిమొదలగునవి మాతృకులోచితంబుగఁ గావింపవలయును. తండ్రియాజ్ఞచే శివధర్మము నవలంబించినకన్యను శివభక్తునకే ప్రదానము చేయవలయును. దైవవశంబున నట్టివాఁ డభక్తుండైనచోఁ గన్యయతిప్రయత్నముతో నాతనికి బోధించి భక్తి గల్పింపవలయును. అంతకు నాతఁడు భక్తుండు గానిచో గన్యయాతని ద్యజించి స్వధర్మమును నెఱవేర్చుకొనవలయును. పూర్వము పతివ్రతయగు ననసూయ పతియగునత్రిమునిందుప్రని బరిత్యజించి శంకరారాధనంబు చేసి కృతకృత్యయయ్యెను. ద్రౌపది గురుజనంబులయాజ్ఞ నుల్లంఘించి నారాయణా

రాధనంబు చేసి పాండవులకుఁ బత్నియయ్యెను. ఈజగంబునందు శివ
శాసనబలంబుచే శివధర్మపరాయణు లగువారు శివధర్మంబు పాలించు
కొఱకుఁ గైకొనుస్వాతంత్ర్యమునందు దోష మించుకంతయును లేదు.
ఈసంస్కారము గుర్వధీనం బగుటచే ననేకవిధంబులైనది. సంజ్ఞారూ
పం బగునాజ్ఞామాత్రముచేతనే గురుకార్యనిర్వహణంబు చేయుటకంటె
శ్రేష్ఠధర్మం బేదియును లేదు. ఈసంస్కారము యోగనిధిననుసరించి
మనస్సుచే నాచరింపఁదగినదియు, కేవలగురుముఖగోచరంబు నగుటం
జేసి యతిగుహ్యంబైనది. కావున వర్ణించుట కసాధ్యము. క్రియావం
తంబును, కుండమండపపూర్వకంబు నగుసంస్కారముంగూర్చి సంక్షేప
ముగా వర్ణించెదను. అదియును సవిస్తరంబుగా వర్ణించుట కసాధ్య
మైనది.

శ్రీకృష్ణా! పవిత్రదినంబున దోషరహితం బగుశుచిస్థానమునం
దు గురుండు మొదట సమయసంస్కారంబు సేయవలయును. యథా
విధిగ భూమిని బరీక్షించి రసవర్ణగంధాదులనెఱింగి శిల్పశాస్త్రానుసారం
బుగా నందు మండపమ్మును నిర్మించి దానినడుమ వేదికను గల్పించి యె
ష్టదిక్కులందుగాని, చతుర్దశలందుగాని కుండంబులు నిర్మింపవలయు
ను. ఈశాన్యభాగమునందుఁగాని, పశ్చిమభాగంబునందుఁగాని ప్రధా
నకుండము సేర్పఱచి వివిధవితానధ్వజమాలికలచే నలంకరించి వేదిమ
ధ్యంబున రత్నహేమాదిచూర్ణంబులచే నీశ్వరావాహనంబుకొఱకు మం
డలరచనంబు చేయవలయును. నిర్ధనులగువారు సిందూర, శాలిధాన్య
నీవారాదిచూర్ణంబులచే మండలరచనంబు చేయవచ్చును. అది ఏక
హస్తపరిమితంబైనను, ద్విహస్తపరిమితంబైనను, శ్వేతవర్ణంబైనను,
రక్తవర్ణంబైనను గావచ్చును. ఏకహస్తపరిమితమండలంబున నెనిమి
దంగుళములకర్ణికయు, నాలుగంగుళములు కేసరంబులును, శేషభాగ

మునం దష్టదళంబులును నిర్మింపవలయును. ద్విహస్తపరిమితంబగుదానికిట్లే ద్విగుణితంబుగాఁ గల్పింపవలయును. ఇట్లామండలము నలంకరించి దానికీశానకోణంబున వేదియందు మరల నర్ధహస్తపరిమితంబగు మండలరచనంబు చేసి శ్వేతసర్షపములు, తిలలు, పుష్పములు, కుశలు మొదలగువానిచే విస్తీర్ణంబును, గంధపుష్పాక్షతకుశదూర్వాంకురాదియుక్తంబును, శ్వేతసూత్రసమన్వితంబును, కంఠంబున నూతనవస్త్రద్వయావృతంబును, శుద్ధజలపూర్ణంబును, సుగంధద్రవ్యవిశిష్టంబును, ఆచ్ఛాదనసంకలితంబు నగుశివకుంభమును స్థాపింపవలయును. అసమర్థుండగువాఁడు కుంభాభావంబున భృంగార, శరావ, శంఖ, చక్ర, పద్మంబులలో దేనినైనను స్థాపింపవచ్చును. అట్టివానికి సూత్రాదులతోఁ బ్రయోజనంబు లేదు. అయ్యాసనపద్మంబున కుత్తరదళంబునఁ జందనజలంబుచే శరావాకృతి యగుమండలంబు నిర్మించి మండలపూర్వభాగంబునఁ బూర్వోక్తవిధానంబున మంత్రికుంభస్థాపనంబు చేసి యథావిధిగ మహాపూజ గావింపవలయును. నదీసముద్రతీరంబులయందైనను, గోష్ఠంబునందైనను, పర్వతంబునందైనను, దేవాలయంబునందైనను, గృహమందైనను, మఱియే పవిత్రమనోహరప్రదేశమునందైనను బూర్వోక్తవిధానంబున సకలంబును నిర్మించి—మండపాదులు లేకున్నను బూర్వోక్తరీతిని మండలరచనంబును, అగ్నిస్థాపనంబునకుఁ దగు స్థండిలనిర్మాణంబును జేయవలయును.

పిమ్మటఁ బ్రహ్మాష్టహృదయుండును, ప్రసన్నవదనుండు నగు గురుండు నిత్యకృత్యంబులం దీర్చి పూజామందిరంబుఁ బ్రవేశించి మండలమధ్యంబున మహేశ్వరుని మహాపూజ నిర్వర్తించి శివకుంభంబునందు శివునావాహనంబు చేసి మఱలఁ బూజించి యస్త్రరాజం బగుశరావమండలంబునఁ బశ్చిమాభిముఖుండై యజ్ఞదీక్షితుం డగునీశ్వరుని స్వా

నించుచుఁ బూజించి దానికి దక్షిణంబున నస్త్రరాజముం బూజించి మంత్రికుంభంబున మంత్రివిన్యాసంబు గావించి ముద్రాప్రదర్శనంబు చేసి మంత్రియోగానుష్ఠాన మాచరింపవలయును. పిమ్మట నాచార్యుండు శివకుండమునందలి యగ్నియందు హోమముచేయుచుండ నితరబ్రాహ్మణు లితరదేవతలంగూర్చి చతుర్దిశలయందును హోమము చేయవలయును. ఆద్విజుల హోమము గురునిహోమమునందుఁ జతుర్థాంశముగాని, యర్థాంశముగాని యుండవలయు ను. ఇ తరు ల గు శివభక్తులందఱును రుద్రసూక్తాదిపాఠంబులను, మంగళవాచనంబులను స్తోత్రములను గావించుచుండ నప్పుడు నృత్తగీతవాద్యాది మంగళాచరణంబులాచరింపవలయును. పిమ్మట సదస్యులను బూజించి గురుండు పుణ్యాహవాచనంబుసేయుచు శంకరుని బూజించి శిష్యానుగ్రహంబును గోరి యీశ్వరసన్నిధిని ‹‹ ఓదేవదేవా! విశ్వేశ్వరా! కృపానిధీ! నీవు నాయెడలఁ బ్రసన్నుండవై నాయందుఁ బ్రవేశించి యీశిష్యుని నవలీలగాఁ బాశముక్తునిం గావింపుము.” అని ప్రార్థించి యాతనియ యనుజ్ఞం గాంచి గురుఁడుపవాసియు, హవిష్యభోజియు, ఏకాహారియు, నిష్కాముండును, స్నాతుండును, నిత్యక్రియానుష్ఠాయియు, ప్రణవజపతత్పరుండును, శివధ్యాననిరతుండును, మంగళాచారుండును, నగు శిష్యుని బశ్చిమద్వారంబునఁగాని, దక్షిణద్వారంబునఁగాని యున్న మండలసమీపంబున దర్భాసనంబునంబున నుత్తరాభిముఖంబుగాఁ గూర్చుండఁజేసి తాను పూర్వాభిముఖుండై అంజలిబద్ధం బగు శిష్యుని యూర్ధ్వకాయమును అస్త్రముద్రిచేఁ బ్రోక్షణీజలంబుల నభిషేకించుచు మఱియుఁ బుష్పక్షేపణంబునఁ దాడితునింజేయుచు నభిమంత్రితం బగు నూతనదుకూలవసనంబుచే శిష్యలోచనంబులను బంధించి యాతని మండలంబునఁ బ్రవేశింపఁజేసి యీశ్వరునకుము మ్మాఱు ప్రదక్షి

ణంబు నేయించి పుష్పాంజలిదానంబును పూర్వోత్తరాభిముఖంబులుగా నొప్పైన దండప్రణామంబును గావించునట్లు చేసి గురుండు మునుపటివలెనే యస్త్రముద్రతో శిష్యుని మూలమంత్రోచ్చారణపూర్వకంబుగాఁ బ్రోక్షించుచుఁ దాడనంబు చేసి లోచనబంధమోచనంబు గావింపవలయును.

శిష్యుండును ముక్తలోచనుండై మండలదర్శనంబుచేసి మరల శంకరునకు దండప్రణామం బాచరింపవలయును. అప్పుడు శివాచార్యుండగుగురుండు మండలంబునకు దక్షిణంబునను, దనకు వామభాగంబునను దర్భాసనమునందు శిష్యుని గూర్చుండఁజేసి మహాదేవు నారాధించి శివహస్తవిన్యాసంబు గావించి శివమంత్రమును జపించుచు శివతేజోమయంబగు హస్తమును శిష్యమస్తకంబున నిక్షేపించి యాహస్తముచే శిష్యుని సర్వాంగావలంబనము గావింపవలయును. శిష్యుండును శివస్వరూపుం డగు నాచార్యునకుఁ దండప్రణామంబు చేయవలయును. అప్పుడు గురుండు శివకుండానలంబునందు యథావిధిగ హోమంబు గావించి ముమ్మాఱు ఆహుతి యొసంగి కూర్చుండియున్న శిష్యుని దర్భలను స్పృశింపవలయునని బోధించి శివునకు నమస్కారంబును, నాడీసంధానంబును జేయించి శివశాస్త్రానుసారంబుగాఁ బ్రాణము బహిర్గతమై శిష్యదేహంబునఁ బ్రవేశించినట్లు స్మరించుచు మూలమంత్రముతో మంత్రతర్పణంబు చేయుచు దశవారంబు లాహుతిదానంబు చేసి యంగమంత్రంబుతో నంగదేవతలకు ముమ్మాఱాహుతి నొసంగవలయును. పిమ్మట మంత్రజ్ఞుం డగు గురుండు పూర్ణాహుతియు, ప్రాయశ్చిత్తంబును నిర్వర్తించి మరల మూలమంత్రముతో దశవారము లాహుతి నర్పించి మరల మహాదేవుని బూజించి ప్రణామాచమనాదుల నిర్వర్తించి యథావిధిగ శిష్యుని నైశ్యజాతినుండి క్షత్రి

యత్వమునకును, క్షత్రియజాతినుండి దిజత్వమునకును, బ్రాహ్మణజాతినుండి రుద్రత్వమునకును నుద్ధరించి శిష్యునియాత్మయందుఁ దనయాత్మను బ్రోక్షణతాడనంబులం గావించి యయ్యాత్మను స్ఫులింగసదృశంబును, దీప్యమానంబు నగు శివమూర్తిగా స్మరించుచు యథోక్తంబుగా సుషుమ్నానాడీమూలంబున మంత్రోచ్చారణంబు సేయుచు రేచనంబు గావించి నాడీమూలంబుననే శిష్యహృదయమునుండి బహిర్గతుండై మరల నందుఁ బ్రవేశించి యప్పుడు శిష్యచైతన్యము నీలబిందునిభంబును, జాజ్వల్యమానంబును, నిర్మలంబునైనట్లు భావింపవలయును. పిమ్మట గురుండు సంహారముద్రచే నాడీపథంబున వాయుగ్రహణంబు నేసి మైక్యాభిలాషతోఁ బూరకంబున నాత్మయందుఁ బ్రవేశింపఁజేయవలయును. మరలఁ గుంభకంబున వాయువును గ్రహించి రేచకంబుచే శిష్యహృదయంబునఁ బ్రవేశింపఁ జేయవలయును. తరువాత శిష్యుని స్పృశించుచు శివసన్నిధి నాతని దానంబు చేసి మూఁడు సారులు హోమంబాచరించి పూర్ణాహుతి నర్పించి కుశపుష్పశోభితంబగు స్వస్తికాసనంబున నుత్తరాభిముఖంబుగా శిష్యుని గూర్చుండఁజేసి గురుండు వరాసనంబున బూర్వాభిముఖుండై కూర్చుండి పూర్వస్థాపితం బగు ఘటంబును గ్రహించి మంగళకరంబులగు స్వరంబులతో మంత్రోచ్చారణంబు సేయుచు శిష్యు నభిషేకింపవలయును.

ఇట్లభిషిక్తుం డగుశిష్యుండు స్నానజలంబులఁ దుడుచుకొని శ్వేతవస్త్రాలంకారంబులం దాల్చి యాచమనంబు చేసి యంజలిబద్ధుండై మండపంబునఁ బ్రవేశింపవలయును. అప్పుడు గురుండు శిష్యునిదర్భాసనాసీనుం జేసి మండపంబున దేవపూజయు, గరన్యాసంబును గావించి శివుని ధ్యానించుచు శివనామోచ్చారణంబు చేయుచు శిష్యదేహమున భస్మలేపనంబు గావించి మాతృకాన్యాసవిధిచే దహనప్లావనాదు

లను సకలీకరణంబును జేసి శిష్యమస్తకంబున శివాసనమును ధ్యానించుచు నందు శివు నావాహించి మానసపూజ నిర్వర్తించి ప్రాంజలియై దేవునింగూర్చి నిత్యము నిట్లే దయచేయవలయు నని ప్రార్థించి శిష్యుని శివతేజమునందుఁ దేజరిల్లుచున్నవానిగా భావింపవలయును. పిమ్మట గురుండు మరలఁ శివబూజం గావించి శివాత్మిక యగుదేవి యనుజ్ఞం గాంచి శిష్యుని కర్ణమునందు మెల్లమెల్లఁగా శివమంత్రము నుచ్చరింపవలయును. శిష్యుండును బ్రాంజలియుఁ దన్మయచిత్తుండునై గుర్వనుజ్ఞచే మెల్లమెల్లఁగ నమ్మంత్రమును బఠింపవలయును. ఇట్లు శివమంత్రదీక్ష యైనంతనే మంత్రజ్ఞుం డగుగురుండు శాక్తమంత్రమునుగూడ మెల్లమెల్లఁగా శిష్యుని కుపదేశించి మంగళాశీర్వాదంబు చేయవలయును. తరువాత గురుండు వాచ్యవాచకయోగమునుండి మంత్రార్థమును సంక్షేపముగ నుపదేశించి యీశ్వరరూపము, యోగము, ఆసనము మొదలగు వానింగూర్చి బోధింపవలయును. అప్పుడు శిష్యుండు శివాగ్ని గురుసన్నిధానంబునఁ బ్రాంజలియై "ప్రాణత్యాగమైనను సరియే గాని భగవానుం డగుమహేశ్వరునిపూజను మాత్ర మెన్నఁటికిని విడుచువాఁడను గాను. శివపూజ యగువఱకు నెన్నఁడును భుజించువాఁడను గాను" అని దీక్షంబూని ప్రతిజ్ఞచేసి శివనిష్ఠాసంపన్నుండును, శివపరాయణుండును, నియతచిత్తుండును, నై భగవదారాధనంబు చేయుచుండవలయును. అట్టిశిష్యుఁడు శివాశ్రమంబునందు సమయనామంబునఁ బ్రసిద్ధుం డగును.

అధికారి యగునట్టిశిష్యుఁడు సర్వదా గురునాజ్ఞను బాలించుచుండవలయును. అనంతరము గురుండు కరన్యాసంబు చేసి స్వహస్తంబులచే భస్మముం గైకొని మూలమంత్రము నుచ్చరించుచు శిష్యునకు దానము చేయవలయును. మఱియు రుద్రాక్షను, దేవప్రతిమను, లిం

గ దేహమును, పూజాహోమాది సకలసాధనంబులనుగూడ దానము చేయవలయును. ఇట్లు గురునిచే లబ్ధంబగుసకలంబును గ్రహించి భక్తిపూర్వకముగా రక్షింపవలయును. మఠమునందుఁగాని, గృహమందుఁగాని నిత్యమును శివపూజచేయుచుండవలయును. క్రమముగా గురుండు శిష్యునిభక్తిశ్రద్ధల ననుసరించి శైవాచారంబుల నుపదేశించుచుండ శిష్యుండు గురునాజ్ఞ జవదాఁటక తదనుగ్రహంబు గాంచి శివారాధనంబు సేయుచుండవలయును. స్వేచ్ఛగఁగాని, పరోపదేశముచేఁగాని శివపూజావిషయంబున గురువ్యతిరిక్తముగా నెట్టికార్యంబును జేయంజనదు. ఇది మానవులకుఁ బరమపదలాభసాధనం బగుసమయసంస్కారము—

—♦ షడధ్వశుద్ధ్యాదికథనము ♦—

శ్రీకృష్ణా! గురుండు శిష్యునియోగ్యత ననుసరించి సర్వబంధవిముక్తికొఱకు షడధ్వశుద్ధిం గావింపవలయును. కళా, తత్త్వ, భువన, వర్ణ, పద, మంత్రములు షడధ్వములని చెప్పంబడుచున్నవి. అందు నివృత్త్యాదు లైదును కళాధ్వములు. ఈపంచకళాధ్వములయందును దక్కినతత్త్వాదిపంచాధ్వములును వ్యాప్తములై యుండును. శివాది భూపర్యంతమును గల యిరువదియాఱుతత్త్వములును తత్త్వాధ్వములు. అవి శుద్ధాశుద్ధభేదముచే నుభయాత్మకములైనవి. ఆధారముమొదలుగా,ఉన్మనాంతంబువఱకును గలభువనాధ్వములు. అవియఱువదివిధంబులైనవి. రుద్రరూపంబులగు పంచాశద్వర్ణంబులును వర్ణాధ్వములు. పదాధ్వ మనేకభేదంబులు గలది. సప్తకోటిమహామంత్రంబులును మంత్రాధ్వములని చెప్పంబడుచున్నవి. ప్రధానభూతంబులగు నీశానాదిమంత్రంబుల కవయవాత్మకంబు లగునీమంత్రాధ్వములు పంచపదా

త్మకంబులై నిఖిలమంత్రంబులచేతను, పంచాక్షరమంత్రిరూపం బగు పరమవిద్యచేతను బరివ్యాప్తము లై యుండును. కలాధ్వంబులకు వ్యాపకత్వముచు తదితరాధ్వములకు వ్యాప్యత్వంబును యథార్థరూపంబున నెఱుంగఁజాలనివాఁడు షడధ్వశుద్ధిం గావించుటకు సమర్థుండు గానేరఁడు. కావున నధ్వస్వరూపమును, వ్యాప్యవ్యాపకత్వములను బాగుగ నెఱింగియే యధ్వశోధనంబు చేయవలయును.

పూర్వాధ్యాయమునందుఁ జెప్పంబడిన యుచితస్థలమునందు గురుండు కుండమండలాదిరచనంబు యథోచితంబుగఁ జేసి పూర్వభాగంబున ద్విహస్తపరిమితం బగుకుండమండలంబు రచించి నిత్యక్రియానుష్ఠానంబు గావించియున్నశిష్యు నందుఁ బ్రవేశింపఁజేసి పూర్వమువలెనే బూజించి నాలుగుప్రస్థంబులకుమించినతండులములచేఁ బచనము సేయంబడినపాయసమునం దర్ధభాగమును నివేదించి శేషమును హోమార్థమై యుంపవలయును. పిమ్మట పురోభాగంబున వర్ణచిత్రితం బగుమండలమునందు నలుదెసలను, నడుమను నాలుగుకలశములను నెలకొల్పి వానియందు బిందునాదసహితంబులును, నకారాదియకారాంతంబులు నగు మూలమంత్రాక్షరంబులతో బ్రహ్మకల్పనంబు చేసి మధ్యకలశంబున నీశానుని, పూర్వకలశంబునఁ దత్పురుషుని, దక్షిణకలశంబున నఘోరుని, ఉత్తరకలశంబున వామదేవుని, పశ్చిమకలశంబున సద్యోజాతుని ఆవాహనంబు చేయవలయును. పిమ్మట రక్షావిధి నిర్వర్తించి ముద్రాప్రదర్శనంబు చేసి యభిమంత్రించి శివకుండానలంబున శేషార్ధం బగుపాయసముచే హోమంబాచరించి హుతశేషమును శిష్యునకుఁ బ్రసాదించి గురుండు పూర్వమువలెనే తర్పణాంతంబువఱకును సకలక్రియల నిర్వర్తించి పూర్ణాహుతి చేసి ప్రదీపనంబు గావింపవలయును. ఓంకారిహుంకారములకుఁ దరువాత మూల

మంత్రమును, దానివెనుక ఫట్, స్వాహాయును దవ. కర్మంబున కంగ ములుగా నిర్దేశింపఁబడియెను. అంగదీపనకర్మంబునం దీమంత్రము ను చ్చరించుచు దేదీప్యమానంబగుమూర్తిని ధ్యానించుచు మున్మూఱు హోమంబు చేసి ద్విజకన్యానిర్మితంబును, త్రిగుణంబును.నగు శ్వేతసూ త్రము నభిమంత్రితంబుగావించి దానిచే శిష్యశిఖాగ్రమును బంధించి యాసూత్రమును శిష్యునిపాదాంగుష్ఠంబువఱకును వ్రేలునట్లు గావించి దానియందు తాలుమధ్యగతం బగుసుషుమ్నానాడిని సంయోజనంబు చేయవలయును. పిమ్మట మంత్రవిదుం డగుగురుండు మూలమంత్ర ములో శాంతముద్రను బ్రదర్శించి యాసూత్రముం గైకొని మున్మూ ఱు హోమంబు సేయుచు సూత్రమునందు ముద్రాసాన్నిధ్యమును గల్పించి మునుపటివలెనే బుష్పంబులచే శిష్యహృదయమును సంతాడి తముగాఁ జేసి యాతనికిఁ జైతన్యముం గూర్చుచు దాని నేకాదశత త్త్వంబులకు నాధానుం డగుశివునియందు లీనంబు గావించి యాసూ త్రమును మఱియొకసూత్రముతో సంయోజనంబుచేసి యస్త్రమంత్ర ముచే (ఫట్) సంరక్షించి, వర్మమంత్రముచే (హుం) వేష్టనంబు చేసి యాసూత్రమే శిష్యదేహముగా భావనంబు గావించుచు తత్సంబంధ మును, భోగభోగ్యభోక్తృత్వలక్షణంబును, విషయేంద్రియదేహాదిజన కంబు నగుమలత్రయమును భావింపవలయును. పిమ్మట నాసూత్ర మునందు పంచభూతస్వరూపంబు లగుశాంత్యతీతాదికళలను తత్తన్నా మంబులచే సంయోజనంబుచేసి నమస్సహితంబుగా వానినామంబుల నుచ్చరించుచుఁ బూజించి యాతత్త్వంబులయందు మలాదివ్యాప్తిని భావింపవలయును. పిమ్మట మరలహోమంబు చేసి కళాప్రదీపనం బాచరింపవలయును. శిష్యశిరంబున మునుపటివలెనే పుష్పతాడనంబు సేయుచుఁ గ్రమక్రమముగా దేహమంతటను సూత్రానుసారంబుగా

శాంత్యతీతపదంబుమొదలు నివృత్త్యంతంబువఱకును జిహ్వాంబుల నే ర్పఱుపవలయును.

పిమ్మట మువ్మూఁటు హోమంబు చేసి మండలంబున మరల శివుని బూజించి శిష్యుని దేవుని దక్షిణభాగంబున నుత్తరాభిముఖంబుగఁ గూర్చుండఁజేసి దర్భమండలంబున హోమశిష్టం బగు చరువును శిష్యునకుఁ బ్రసాదింపవలయును. శిష్యుండు దానిని సంస్కరించి భుజించి రెండుసారు లాచమనంబుచేసి శివనామోచ్చారణంబుసేయుచుండ గురుం డింకొకమండలంబునఁ బంచగవ్యమును శిష్యున కొసంగవలయును. శిష్యుం డాపంచగవ్యమును యథాశక్తిని సేవించి రెండుసారులాచమించిశివస్మరణంబు సేయుచుండ గురుండుమరలఁ దృతీయమండలంబున శిష్యుని బూర్వోక్తవిధి నుపవేశింపఁజేసి విధివిధానంబున దంతకాష్ఠము నాతని కీయవలయును. శిష్యుండు దానింగైకొని పూర్వోత్తరముఖంబులుగా నెట్లయినఁగూర్చుండి మౌనియై మృద్వగ్రం బగు దానితో దంతశోధనంబు గావించుకొని యనంతర మాదంతకాష్ఠమును గడిగి విసర్జించి యాచమనంబును శివస్మరణంబును గావించి కృతాంజలియై గురుననుజ్ఞచే శివమండలమునఁ బ్రవేశింపవలయును. శిష్యునిచే ద్యక్తంబైన దంతకాష్ఠము పూర్వపశ్చిమోత్తరాగ్రంబుగాఁ బడినచో శుభము. తద్వ్యతిరిక్తంబైనచో నశుభం బగును. కావున నట్టిదోషంబు గలిగినచో గురుండు శతంబుగాని, తదర్ధంబుగాని, అర్ధార్ధంబుగాని శాంతికొఱకు హోమంబు చేయవలయును. పిమ్మట గురుండు శిష్యుని స్పృశించుచు నాతనికర్ణమున శివమంత్రమును జపించి దేవుని దక్షిణభాగంబున నఖండాస్తరణయుతం బగు దర్భశయ్యయందు శిష్యుని శయనింపఁ జేయవలయును. శిష్యుండును శివధ్యానంబు సేయుచుఁ బూర్వశిరంబుగా శయనింపవలయును. అప్పుడు గురుండు శి

ఖాబద్ధసూత్రముచే శిష్యునిశిఖను వేష్టనంబు గావించి వర్మమంత్రము
నుచ్చరించుచు అఖండవస్త్రముచే నాతని నాచ్ఛాదితునిం గావించి చ
తుర్దిశలను రేఖాత్రయంబు గావించి యస్త్రమంత్రజపంబు చేసి భస్మ
తిలసర్షపంబులతో దిక్పతులకు బలి నర్పింపవలయును. శిష్యుం డిట్లు
పవాసియై శయనించి మఱునాఁడు లేచి స్వప్నమును గురునకు నివేదిం
చి గురునాజ్ఞచే స్నానాదికృత్యంబులం దీర్చికొని కృతాంజలియై శివ
మండలమునఁ బ్రవేశించుటయు, గురుపూజగాక పూర్వదినంబునందు
వలెనే నేత్రబంధనపర్యంతమును నన్నికర్మంబులను గురుండు శిష్యునిచేఁ
జేయించి మండలదర్శనంబు చేయింపవలయును. బద్ధనేత్రుండగు శి
ష్యుండు పుష్పక్షేపణముం గావించునప్పు డవి యెందుఁ బడునో యా
నామమును శిష్యునకుఁ బ్రసాదింపవలయును. అనంతరము నిర్మాల్య
మును నిక్షేపించి పూర్వమువలెనే యీశానపూజయు, హోమమును
జేయవలయును. శిష్యునకు దుస్వప్నము గలిగినచో నట్టి దోషము
శాంతించుకొఱకు మూలమంత్రముతో శతముగాని, అర్ధశతముగాని
పాదశతముగాని హోమముచేయవలయును. తరువాత శిఖాబద్ధసూత్ర
మును లంబమానముగాఁ జేసి నివృత్తికళాశ్రయం బగు సాధారపూజా
దికమును, వాగీశ్వరీపూజయు హోమపూర్వకంబుగఁ గావింపవలయు
ను. పిమ్మట నివృత్తివ్యాపికయు, వాగీశ్వరియు నగు పతిదేవికిఁ బ్రణ
మిల్లి మండలంబున దేవార్చనంబును ఆహుతిత్రయంబును దీర్చిచతు
ర్దిశయోనులయందు నొక్కసారిగా జన్మించునట్లు శిష్యునిచేఁ బ్రోక్ష
ణంబుఁ జేయించి శిష్యుని సూత్రదేహములందు తాడనప్రోక్షణాదులం
గావించి యాతనియాత్మ నేకాదశతత్త్వాధారుండగు నీశ్వరునియందుఁ
బ్రవేశింపఁజేసి మూలమంత్రముచే శాస్త్రదృష్టంబు లగుముద్రలేఁ
బ్రదర్శించుచు నయ్యాత్మ నొక్కసారిగాఁ జతుర్దశయోనులందును

బ్రవేశింపఁజేయుటకై వాగీశ్వరియందు విలీనంబుగాఁ జేయవలయును. మఱియు గర్భనిష్పత్తికొఱకు పూజాప్రకాశమహోమంబు లొనరించి గర్భనిష్పన్నం బైనట్లు భావింపవలయును. పిమ్మట శిష్యనిష్కృతికొఱకు జాత్యాయుర్భోగములను శోధించు నాహుతిత్రయంబును దీర్చి దేవదేవుని బ్రార్థింపవలయును. ఇట్లు గురుండు శిష్యుని పాశత్రయచ్ఛేదనంబు గావించినచో శిష్యచైతన్యము కేవలమును స్వచ్ఛం బగును.

అప్పుడు గురుండు పూర్ణాహుతినర్పించి బ్రహ్మను బూజించి యాతని నుద్దేశించి హోమం బాచరించి "ఓపితామహా! పరమశైవపదంబు ననుగమింపఁబోవు నీశిష్యునకు నీవు ప్రతిబంధకంబు గాఁగూడదు. ఇది శివుని యాజ్ఞ!" అని యెఱింగించి పునఃపూజ చేసి యథావిధిగ విసర్జనంబు చేసి పిమ్మట మహాదేవుని బూజించి యాహుతిత్రయంబు గావింపవలయును. పిమ్మట నివృత్తికళనుండి విశుద్ధంబగు శిష్యాత్మనుద్ధరించి మునుపటివలెనే యాత్మయందును,సూత్రమునందును నివేశితంబు గావించి వాగీశ్వరిని బూజించి యామెకాహుతిత్రయంబు నర్పించి ప్రణామంబు చేసి విసర్జింపవలయును. మఱియు నివృత్తిప్రతిష్ఠాకళలకు సంధానంబు గావించి యాసమయంబున నొక్కసారిగా వానిని బూజించి యాహుతిత్రయదానంబు చేసి శిష్యాత్మ ప్రతిష్ఠాకళయందుఁ బ్రవేశించినట్లు భావించి ప్రతిష్ఠాకళావ్యాప్తిని, తద్వ్యాపికయగు వాగీశ్వరిని పూర్ణచంద్రమండల సదృశంబుగా భావింపవలయును. పిమ్మట విష్ణుదేవునకుఁ బరమాత్ముండగు శివుని యాజ్ఞ నెఱింగించి విష్ణుపూజనంబును విసర్జనంబును జేయవలయును. తరువాతఁ బ్రతిష్ఠావిద్యాకళలకు సంధానంబుచేసి మునుపటివలెనే యాన్నియుం గావించి నీలరుద్రు నావాహనంబు చేసి పూజించి శివాజ్ఞ నెఱింగించి విసర్జనంబు చేయవలయును. పిమ్మట శాంతివిద్యాకళలకు

సంయోగంబుగూర్చి మునుపటియట్లే గావించి బాలార్కసదృశయు, దశదిగ్విభాసితయు నగు వాగీశ్వరిని ధ్యానించుచు మహేశ్వరు నావాహనంబు చేసి పూజాహోమంబు లాచరించి మనసులోనే శివాజ్ఞను నివేదించి మహేశ్వరుని విసర్జింపవలయును. తరువాత శాంతికళయందు శాంత్యతీతకళను గూర్చి తద్వ్యాప్తిని, వ్యాపికయుపూర్ణనభోమండల సదృశయునగు వాగీశ్వరిని ధ్యానించుచు సర్వకార్యంబులునునిర్వర్తించి సదాశివు నావాహనంబు చేసి పూజించి శివాజ్ఞ యాతనికి నివేదించి పూర్వోక్తవిధానంబున విసర్జింపవలయును.

తరువాత గురుండు పూర్వమువలెనే శిష్యమస్తకమును బ్రహ్మాళితంబు గావించి శివసహితంబుగా శాంత్యతీతకళ శక్తితత్త్వంబున విలీనం బగుచున్నట్లు భావించి గురుండు షడధ్వపరిస్థితయు, సర్వాధ్వవ్యాపినియు, కోటి సూర్యసమప్రభయు నగు శివశక్తిని ధ్యానము చేయుచు శుద్ధస్ఫటికసంకాశుండగు శిష్యుని సమ్ముఖమునకుం దెచ్చి ప్రోక్షాళితంబైన కర్తరితో శివశాస్త్రానుసారముగా సూత్రముతోఁగూడ శిష్యశిఖను భేదించి యాకర్తరిని గోమయంబున నిక్షేపించి వౌషడంతంబగు మూలమంత్రముతో శివాగ్నియందాశిఖను ఆహుతి చేసి కర్తరిని హస్తంబులను మరలఁ గడిగికొని శిష్యదేహంబున శిష్యచైతన్యమును ప్రవేశింపఁజేయవలయును. తరువాతఁ గృతస్నానాచమనుండును, కృతస్వస్త్యయనుండు నగు శిష్యుని మండలసమీపమునకుఁ జేర్చి ప్రణామంబు గావించి కర్మలోపాదిశుద్ధికాముండై యథావిధిగఁ బూజచేసి యుపాంశూచ్చారణంబుగా నాహుతిత్రయంబు చేసి మంత్రిలోపశుద్ధి కొఱకు మనంబున మంత్రము నుచ్చరించుచు ముమ్మాఱు వ్రేల్చిమండలస్థుండగుశివుని, మాతయగుశర్వాణీసహితంగాఁబూజించి యాహుతి యొసంగి కృతాంజలియై " దేవా! నీయనుగ్రహంబుచే షడధ్వశుద్ధి యథ

సుస్థితం బైనది. ఇఁక నీశిష్యునకుఁ బరమపదగమనార్హమై సామర్థ్యముం బ్రసాదింపుము" అని ప్రార్థించి నాడీసంధానపూర్వకంబుగాఁ బూర్ణాహుతిపర్యంతమును బూర్వమువలెనే సకలకర్మంబులును నిర్వర్తించి భూతశుద్ధి గావింపవలయును. మొట్టమొదట భూతశుద్ధి గావించుటకై స్థావరజంగమంబులును, శీతోష్ణంబులును బరస్పరవ్యాప్తములై యేకములైనట్లు భావింపవలయును. తరువాత భూతగణంబులపరస్పరసంబంధవిచ్ఛేదంబు గావించి తదధిపతులతోఁ గూడ వానిని త్యజించి స్థితియోగంబుచేఁ బరమాత్మం డగుశివునియందు సంయోజనంబు గావింపవలయును. పిమ్మట శిష్యతనుశోధనంబు చేసి దగ్ధంబొనరించినట్లును, సుధావర్షణంబుచే నయ్యాత్మ యభిషిక్తంబై విశుద్ధాధ్వమయశరీరం బైనట్లును భావించి తన్మధ్యంబునందు ప్రథమంబున స్వపథవ్యాపికయు విశుద్ధయు నగుశాంత్యతీతకళను శిష్యమస్తకంబున న్యస్తంబు చేసి శాంతికళను ముఖంబునను, విద్యాకళను గళాదినాభిపర్యంతమును, ప్రతిష్ఠాకళను గ్రమముగాఁ దదధోదేశమునుండి జానుపర్యంతమును, దాని కధోదేశంబున నివృత్తికళను బీజాంగసూత్రమంత్రంబులతో న్యాసంబు చేసి శివాత్మకంబుగా భావించి హృదయపద్మంబున మహాదేవు నావాహనంబు చేసి పూజించి శిష్యునియందుఁ బరమాత్మసాన్నిధ్యమును భావించి శివతేజోమయుం డగుశిష్యునియందణిమాదిగుణోత్పాదనంబు చేయుచు "ప్రసీద" అని యుచ్చరించుచు నాహుతిత్రయంబు చేసి మునుపటివలెనే మరల శిష్యునకు సర్వజ్ఞత, తృప్తి, నిత్యబోధము, అవినశ్వరశక్తి, స్వాతంత్ర్యము మొదలగు గుణంబుల నాపాదింపవలయును. అనంతరము శిష్యుని దేవసన్నిధిని నివేదించి యనుజ్ఞం గాంచి క్రమముగా సద్యోజాతాదికలశంబులచే నభిషిక్తుం జేసి పూర్వవిధంబున దేవపూజ గావించి యజ్ఞాలాభంబుఁ

బడసి శివసన్నిధానంబున నోంకారపూర్వికయు, నోంకారసంపుటయు,
నమోంతయు, శివశక్తిసమన్వితయు నగునీవిద్య నుపదేశించి ఋషి,
ఛందము, దైవము, శివతత్త్వము, శివశక్తితత్త్వము, శివావరణపూజ, ఆసన
భేదములు మొదలగువాని నుపదేశింపవలయును. పిమ్మటఁ బునఃపూజ
గావించి " ఓదేవదేవా! నాచే ననుష్ఠితంబులగు సకలకర్మంబులను
సుకృతంబులుగాఁ జేసి యనుగ్రహింపుము " అని గురుండు శిష్యస
హితంబుగా దండప్రణామం బొనరించి మండలమునుండియుఁ, బావ
కునుండియు శివు నుద్వాసితుం గావింపవలయును. తదనంతరము దీక్షి
తుండగువాఁడు సదస్యులను గ్రమంబుగఁ బూజించి సేవించి ఋత్వి
క్కులనుగూడ సంతృప్తులం గావింపవలయును. మంగళాభిలాషియగు
వాఁ డివ్విషయంబున విత్తశాఠ్యంబు సేయంజనదు.

మంత్రసాధనవిధి.

శ్రీకృష్ణా! ఆచార్యుండు పూర్వోక్తవిధానంబున మండలము
నందు శివపూజం గావించి కుంభమును స్థాపించి యుష్ణీషశోభాన్వితుం
డగుశిష్యుని మండలంబునఁ బ్రవేశింపఁజేసి పూర్వమువలెనే పూర్ణాహుతి
పర్యంతము నాచరించి శతవారంబులు హోమంబును, మూలదే
వతాతర్పణంబును నిర్వహించి యందు దశభాగముగా నంగదేవతాత
ర్పణంబు చేసి మునుపటివలెనే సందీపనాదిసకలకర్మంబులను యథాక్ర
మంబుగఁ దీర్చి శిష్యు నభిషేకించి మంత్రము నుపదేశించి విద్యోపదే
శపర్యంతమునుగల సకలకర్మంబులను మునుపటివలెనే నిర్వర్తించి శిష్య
హస్తంబునఁ బుష్పాంజలంబులతో శివమంత్రదానంబు గావించి " ఈ
మహామంత్రము పరమేశ్వరుం డగుపరబ్రహ్మప్రసాదంబుచే నిహాపర
లోకంబులయందు నీకు సర్వసిద్ధిప్రదం బగుఁగాక !" అని యాశీర్వ

డించి శివార్చనం బొనరించి తదనుజ్ఞం గాంచి శిష్యునకు సాధనంబులు, వినియోగము నుపదేశింపవలయును.

శిష్యుండు గురువచనంబుల నాకర్ణించి వినియోగపూర్వకంబుగ మంత్రసాధనంబు గావింపవలయును. ముముక్షువులకు మంత్రసాధనము ప్రధానంబు గాదు గాని వారికిఁగూడ మంత్రసాధన మిహపరసుఖదాయక మగుచున్నది. శుభదినంబున, శుభముహూర్తమునందు శుభ్రదంతనఖుండును, స్నాతుండునై, పూర్వాహ్ణికంబులం దీర్చి గంధమాల్యవిభూషితుండై, శ్వేతోష్ణీషోత్తరీయధారియై దేవమందిరంబునఁగాని, గృహంబునఁగాని, మనోహరప్రదేశంబునఁగాని యభ్యస్తపూర్వకం బగుసుఖాసనమునం దుపవసించి శివశాస్త్రానుసారంబుగా శైవమూర్తిం గల్పించుకొని మహాదేవుని బూజించి పాయసమును నివేదించి ప్రణామంబు గావించి యనుజ్ఞం గాంచి, కోటిగాని, యేఁబదిలక్షలుగాని, యిరువదియైదులక్షలుగాని, పదిలక్షలుగాని, శివనామజపంబు సేయుచు సర్వదా హింసాశూన్యుండును, శాంతుండును, దాంతుండును, క్షమావంతుండు నై పాయసాక్షారపదార్థంబులచే మితభోజనుండును, అభావంబునఁ బాయసమాత్రభోజియు, ఫలమూలాశనుండునై క్రమంబుగా భక్ష్యద్రవ్యంబులను ద్యజించి చరువు, సక్తువు, యావకము, శాకములు, దుగ్ధము, దధి, ఘృతము, ఫలము, మూలములుమాత్రమే యారగించుచుఁ దుదకు జలమాత్రప్రాశనుండై యుండవలయును. సాధకుఁడగువాఁడు భక్ష్యభోజ్యాదిద్రవ్యములను బంచాక్షరమంత్రముచే నభిమంత్రించి మౌనవ్రతంబుతో భుజించుట నభ్యసింపవలయును. అష్టోత్తరశతమంత్రపూతంబులగు నదీనదజలంబులయందు స్నానంబైనను, అశక్తుండైనచోఁ బ్రోక్షణంబైనను గావించుకొని తర్పణం బొనరించి, చరుబిల్వతిలాదిసద్ద్రవ్యంబులచేఁగా

ని, పంచద్రవ్యంబులచేఁగాని, ద్రవ్యత్రయంబుచేఁగాని, కేవలఘృతంబుచేఁగాని శివకుండంబున హోమంబు గావింపవలయును. సాధకుండగుభక్తుం డిట్లు శివసాధనంబు గావించి దుర్లభం బగుపరమపదముం గాంచఁగలఁడు. యథావిధిగ మంత్రసాధనంబు గావింపఁజాలకున్నను, ఉపవాసియై ప్రతిదినము నేకాగ్రచిత్తంబున సహస్రమంత్రజపంబు గావించినచో నట్టివానికి దుర్లభం బేదియు నుండదు. అట్టివాని కెందు నమంగళంబు లేక యిహలోకంబున విద్యాధనసుఖలాభంబును పరంబున ముక్తిలాభంబును సిద్ధించును. సాధనమునందును, వినియోగమునందును, నిత్యనైమిత్తికకర్మంబులయందును సాధకుఁడు జలంబునఁగాని, భస్మంబునఁగాని స్నానముచేసి పిమ్మట మంత్రజపంబు చేయవలయును. ఈపంచాక్షరమంత్రజపంబునందు శుచియు, బద్ధశిఖుండును, పవిత్రహస్తుండును, యజ్ఞోపవీత, రుద్రాక్ష, త్రిపుండ్రకాదిధారియు నై యుండవలయును.అట్లు గాకున్నచో జపం బంతయు నిష్ఫలంబు గాఁగలదు.

అభిషేకాదిసంస్కారము.

ఇట్లు సంస్కృతుండై యనుష్ఠితపాశుపతవ్రతుండై యున్నశిష్యున కాచార్యాధికారము గలిగినవిషయమును బరీక్షించి గురుం డాతని నాచార్యపదంబున నభిషిక్తుం గావింపవలయును. గురుండు పూర్వమువలెనే మండలమును రచించి శివపూజ చేసి చతుర్దిశలను, మధ్యంబునను బంచకలశంబులను స్థాపించి పూర్వకలశంబున నివృత్తికళను, పశ్చిమకలశంబునఁ బ్రతిష్ఠాకళను, దక్షిణకలశంబునవిద్యాకళను, ఉత్తరకళలంబున శాంతికళను, మధ్యకలశంబున శాంత్యతీతకళను విన్యాసంబు గావించి దీక్షాదికృత్యంబులం దీర్చి ధేనుముద్రను బ్రదర్శిం

చికలశంబుల నభిమంత్రించి పూర్ణాహోమపర్యంతమును బూర్వమువలె నే నిర్వర్తించి యుష్ణీషశూన్యం డగుశిష్యుని మండలసమీపంబునం జేర్చి తర్పణాది పూర్ణాహోమపర్యంతము గలకర్మంబుల నెఱవేర్చి శివపూజచేసి శిష్యాభిషేకంబునకై శివానుజ్ఞం బడసి శిష్యు నాసీనుం గావించి సకలీకరణంబును, శిష్యదేహంబున మంత్రన్యాసంబును జేసి కళాపంచకస్వరూపిణియగు శివమంత్రమును శిష్యునియందు సమర్పింపవలయును. తరువాత నివృత్తికలశంబు మొదలుగా, మధ్యకలశంబు వఱకును గ్రమంబుగం గైకొని శివమంత్రోచ్చారణంబు చేయుచు నందలిజలంబులచే శిష్యు నభిషేకించి గురుండు శివభావపాత్రుండై శిష్యు మస్తకంబున శివహస్తమునుంచి యాతని శివాచార్యుం గావించి శివమండలంబునం బరమేశ్వరు నలంకృతుం జేసి యారాధించి యష్టోత్తరశతహోమంబును, బూర్ణాహుతియుం గావించి పునఃపూజ చేసి దండప్రణామం బాచరించి ప్రాంజలియై "మహాదేవా! నీప్రసాదముచే నేనీశిష్యు నాచార్యపదంబున నభిషేకించితిని. నీవీతనియెడల ననుగ్రహము జూపి దివ్యం బగునీయాజ్ఞను బ్రసాదింపుము" అని నివేదించి శిష్యసహితంబుగా మరలం బ్రణామంబు చేసి శివమయం బగుశివాగమమును శివునివలెనే పూజించి శివానుగ్రహంబు వడసి యాశైవాగమగ్రంథమును హస్తద్వయముతో శిష్యున కర్పింపవలయును.

శిష్యుండును గురుదత్తంబగుగ్రంథమును గ్రహించి మస్తకంబునం దాల్చి విద్యాసనంబున స్థాపించి యథావిధిగం బూజింపవలయును. అనంతరము గురుండు శిష్యునకు రాజోపకరణాదులనుగూడ ననుగ్రహింపవలయును. తరువాతం బ్రాచీనులచే ననుష్ఠితంబులును, శైవాగమోక్తంబులును,లోకపూజితంబులునగు నాచారములను శిష్యున కుపదేశించి "వత్సా! నీవింతటినుండి నీశిష్యులను శాస్త్రోక్తవిధిని బరీ

క్షించి పిమ్మట వారిని సంస్కరించి శివజ్ఞానోపదేశంబు సేయుము. విధ్యుక్తముగ దేవప్రతిష్ఠం గావించుటకును, పరోపకారార్థమై దేవదేవునిపూజాహోమంబుల నిర్వర్తించుటకును నీవర్హుఁడవై తివి. అకార్పణ్యము, అనాయాసము, నిత్యశౌచము, క్షాంతి, దయ, అస్పృహ మొదలగుసుగుణంబులను నిత్యమును గలిగియుండుము. ప్రయత్నపూర్వకముగా నసూయను బరిత్యజింపుము." అని బోధించి మండలమునుండి మహాదేవుని, శివకుంభానలాదులను విసర్జించి సదస్యులను యథావిధిగఁ బూజింపవలయును. అకార్పణ్యాదిగుణాలంకృతుం డగుశిష్యుని గురుం డేకకాలమునందే సకలవిధసంస్కారములకు నధికారిం గావింపవచ్చును. ఆవిషయంబునఁ బ్రయోగత్రయంబును, బ్రయోగద్వయంబును నిర్దిష్టంబులయ్యెను. అందుఁ బ్రయోగత్రయపక్షంబున మొట్టమొదట నధ్వశుద్ధియందువలెనే కలశస్థాపనంబు చేసి యభిషేకంబు దక్కఁ దక్కినసమయసంస్కారంబు లన్నియుం దీర్చి మరల శివపూజ చేసి యధ్వశుద్ధిం గావించి మరల శివపూజచేసి హోమంబును, మంత్రతర్పణంబును, సందీపనకర్మంబును గావించి యీశ్వరసాన్నిధ్యమునందు మునుపటివలెనే ప్రార్థించి శిష్యహస్తంబున మంత్రసమర్పణంబు చేసి శేషకర్మంబుల ముగింపవలయును. —ఇఁకఁ బ్రయోగద్వయపక్షంబున మొదట నఖిలమంత్రసంస్కారమును భావించి పిమ్మట నభిషేకపర్యంతము నధ్వశుద్ధిం గావింపవలయును. ఈషడధ్వశుద్ధివిషయంబున శాంత్యతీతాదికళలయందు విహితంబైన విధిననుసరించియే యనంతరకర్తవ్యం బగుతత్త్వత్రయశుద్ధియందుగూడ సకలకర్మంబులను గావింపవలయును.

శివతత్త్వము, విద్యాతత్త్వము, ఆత్మతత్త్వము ననునివియే తత్త్వత్రయము. అందు శక్తినుండిశివుండును, శివునినుండి విద్యయు,

విద్యనుండి యాత్మయు నావిర్భూతంబు లయ్యెను. శాంత్యతీతాధ్వము శివునిచేతను, దక్కినయధ్వములు విద్యచేతను, నిఖిలాధ్వములును గూడ నాత్మచేతను బరివ్యాప్తములై యుండును. శివశాస్త్రపారగు లగుమనీషులు శాంభవం బగుమూలమంత్రము దుర్లభం బని భావించి శాక్తసంస్కారమును బ్రచారమునకుఁ దెచ్చిరి. శ్రీకృష్ణా! ఈ నాలుగువిధములగుసంస్కారములను సంక్షేపముగఁ దెలిపితిని. ఇఁక నేమి విన దలఁచితివో యడుగుము.

—• దీక్షావిధానము. •—

అని యుపమన్యుండు చెప్పుటయు శ్రీకృష్ణుండు మహాత్మా! శివశాస్త్రోక్తంబులును, శైవాశ్రమసేవితంబులు నగునిత్యనైమిత్తిక కర్మంబులం గూర్చి యెఱింగింపవలయు నని ప్రార్థించెను. ఉపమన్యుం డిట్లనియెను. శ్రీకృష్ణా! ఉపాసకుం డగువాఁడు ప్రాతఃకాలంబున లేచి జగత్పితరు లగుశర్వాణీశంకరులను స్మరించి కార్యవిచారంబు సేయుచు నరుణోదయసమయంబున బహిర్గతుండై నిరుపద్రవంబగువిజనప్రదేశంబునఁ గాల్యకృత్యంబులం దీర్చి శౌచాదులను నిర్వర్తించి దంతధావనంబు చేయవలయును. దంతకాష్ఠంబు లేకున్నచోఁ బండ్రెండుసారులు గండూషంబు చేసి ముఖశోధనంబు గావించుకొనవలయును. అష్టమ్యాదితిథులయందు దంతకాష్ఠము నుపయోగింపక పూర్వోక్తవిధిని గండూషమునే గావింపవలయును. తరువాత నాచమనంబు చేసి నదియందుఁగాని, దేవఖాతమునందుఁగాని, హ్రదంబునఁగాని గృహంబునఁగాని వారుణస్నానం బాచరింపవలయును. నద్యాదితీరంబులయందు స్నానద్రవ్యంబుల నన్నిటిని స్థాపించి బహిర్మలంబును విసర్జించి మృత్తికాలేపనంబు గావించుకొని స్నానము చేసి మహిలోమయానుపి

ప్తుండై పునస్స్నానంబు చేసి వస్త్రంబును ద్యజించి ప్రక్షాళనాదుల చే శుద్ధుండై సుస్నాతుండై నృపులింబోలి మరల శుద్ధవస్త్రముం దాల్పవలయును—మలస్నానము, సుగంధస్నానము, దంతశోధనము న నునివి బ్రహ్మచారులును, తపస్వులును, విధవలునుగావింపఁగూడదు- తరువాత నుపవీతుండై శిఖాబంధనంబు గావించి జలావతీర్ణుండై యవగాహనంబు చేసి యాచమనం బాచరించి సౌమ్యజలంబునఁ ద్రికోణాకారంబుగా మండలమును రచించి మునిఁగి శివస్మరణంబును మంత్రజపంబును గావించుచు జలంబులనుండి యుద్ధితుండై యామంత్రముతో గోశృంగముచేఁగాని, దర్భసహితం బగుపలాశపత్రముచేఁగాని, పద్మపత్రముచేఁగాని, స్వహస్తముచేఁగాని మైదుసారులైనను, మువ్మారులైనను దన్నభిషేకించుకొనవలయును. ఉద్యానమునఁ గాని, గృహంబునఁగాని స్నానము చేయునప్పుడు శరావకలశాదులయందలిజలంబును బూర్వరీతి నభిమంత్రించి తన్నభిషేకించుకొనవలయును. ఇదియే వారుణస్నానము. వారుణస్నానంబున కశక్తుం డగువాఁడు విశుద్ధం బగునార్ద్రవస్త్రముచే మస్తకమునుండి పాదములవఱకును విశుద్ధంబు గావించుకొని భస్మంబుచే నాగ్నేయస్నానంబైనను శివమంత్రముచే మంత్రస్నానంబైనను గావింపవలయును. యోగులగువారు శివచింతనమే యాత్మహితకరం బగుస్నానమని చెప్పుదురు.

అనంతరము మంత్రాచమనపూర్వకంబుగా స్వసూత్రవిధానంబున దేవతర్పణంబును, బ్రహ్మయజ్ఞపర్యంతము సకలకర్మంబులను దీర్చి మండలస్థుం డగుమహాదేవుని ధ్యానించుచు యథావిధిగఁ బూజించి యాదిత్యస్వరూపుఁ డగుశివున కర్ఘ్యప్రదానంబు చేయవలయును. అట్లు కాదేని స్వసూత్రానుసారంబుగఁ గర్మాచరణంబు సేయవలయును. పిమ్మట హస్తశుద్ధిగావించుకొని యంగన్యాసకరన్యాసంబుల

గావించి వామహస్తవినిర్గతంబులును, గంధస్నపనసమన్వితంబులు నగు జలంబులను మూలమంత్రసహితంబగు ఆపోహిష్ఠాదిమంత్రపూర్వకంబుగా గుశపుష్పాదులచే నభ్యుక్షణంబు గావించి శేషజలంబును వామనాసాపుటంబున నాఘ్రాణించి స్వదేహశుద్ధిని భావింపవలయును. పిమ్మటఁ గృష్ణవర్ణం బగు సవ్యనాసాపుటంబుచే దేహస్థపాపంబును గ్రహించి యది బహిర్భాగంబున శిలాస్థితం బై యున్నట్లు భావించి దేవర్షిపితృతర్పణాదు లాచరించి సకలభూతంబులకును యథావిధిగ నర్ఘ్యదానంబు చేసి రక్తచందనముచే భూమియందు వృత్తమండలమును రచించి రత్నచూర్ణాదులచే నలంకరించి యందు ఆవరణాంగదేవతాసహితంబుగా సుఖసిద్ధికొఱకు భానుదేవుని బూజించి మరల మండలని ర్మాణంబు చేసి యంగదేవతాసహితముగా సూర్యుని బూజింపవలయును. మఱియు రక్తచందనగంధజలమును, రక్తపుష్పములు, తిలలు, కుశలు, అక్షితలు, దూర్వలు, గవ్యము మొదలగువానితోఁగూడ ప్రస్థమాత్రంబ స్వర్ణమయపాత్రంబున నిండించి జానువులచే భూమిని స్పృశించుచు మండలస్థం డగుమహాదేవునకు నమస్కరించి యాపాత్రంబును శిరంబునఁ దాల్చి యాదిత్యమూర్తి యగుశివున కర్ఘ్యం బియ్యవలయును. కాదేని ప్రాంజలియై మూలమంత్రముతో దర్భసహితంబగుజలంబును గగనస్థం డగునాదిత్యు నుద్దేశించి యర్పింపవలయును. తరువాత మరలఁ గరశోధనంబు చేసికొని కరన్యాసం బాచరించి మహాదేవునియీశానాది పంచబ్రహ్మమయస్వరూపమును ధ్యానించుచు భస్మలేపనంబు గావించుకొని యంగస్పర్శనంబు సేయవలయును. యకారాదిసకారాంతముగా విపరీతక్రమంబున మంత్రాక్షరముల నుచ్చరించుచు ముఖము, హృదయము, గుహ్యము చరణములు వీనియందుఁ గ్రమంబుగ భస్మలేపనంబుచేసి మూలమంత్రముతో సర్వాంగములం

దును భస్మలేపనంబు చేయవలయును. పిమ్మట మఱియొకవిశుద్ధవస నమును ధరించి రెండుసారు లాచమించి పదునొకండుసారులు మంత్రి జలంబుతోఁ బ్రోక్షించి మఱియొకయుత్తరీయముచే శరీరము నాచ్ఛా దితము గావించి మరల రెండుసారు లాచమించి శివస్మరణంబు చేయవ లయును. పిమ్మట మరలఁ గరన్యాసంబును, భస్మముచేఁ ద్రిపుండ్ర ధారణంబును గావింపవలయును. లలాటంబున గంధజలంబుచే అవ క్రంబును, ఆయతంబును, విస్పష్టము నగుత్రిపుండ్రముం దీర్చుకొన వలయును. త్రిపుండ్రము వృత్తాకృతిగఁగాని, చతుష్కోణాకృతిగఁగా ని, బిందుసదృశంబుగఁగాని, అర్ధచంద్రాకృతిగఁగాని యంకితంబు గా వింపవచ్చును. లలాటమునం దాల్చినత్రిపుండ్రమువలెనే హస్తద్వయ మునందును, మస్తకమునందును, వక్షమునందును దాల్పవలయును. సర్వాంగభస్మలేపనము త్రిపుండ్రముతో సమానమైనది గాదు. కా వున భస్మోద్ధూళనంబు గావింపకుండ లలాటాదులయందు ద్రిపుండ్ర ధారణముం గావింపవలయును. మస్తకంబునను, కంఠమునను, కర్ణం బులను, కరంబులను రుద్రాక్షధారణముం గావింపవలయును. అట్టిరు ద్రాక్షస్వర్ణవర్ణంబును, అచ్ఛిన్నంబునైనచో శుభకరం బగును.ఇతరం బులశుభకరంబులు. బ్రాహ్మణాదిజాతులు క్రమంబుగా శ్వేత, పీత, రక్త, కృష్ణవర్ణంబుల రుద్రాక్షలను దాల్పవలయును. అభావంబున వి పరీతవర్ణంబులైనను దోషంబు లేదు. కాని యుత్తమజాతులు ధరింపఁ దగినవానిని నీచజాతులు ధరించుట దోషము. పూజాసమయంబుల యందే గాని యశుచినై రుద్రాక్షలను ధరింపఁగూడదు.

ఈరీతిగాఁ ద్రిసంధ్యలయందైనను దినమున కొక్కసారియైనను స్నానంబు గావించి యథాశక్తిం బరమేశ్వరుని బూజింపవలయును. పూజాస్థానంబున రుచిరాసనంబుపైఁ బూర్వోత్తరాభిముఖంబులుగా

నెట్టియిన నాసీనుండై శివశక్తులను ధ్యానంబు చేసి శ్వేతాదినకులీశ్వర పర్యంతముంగల సశిష్యులగు గురుగణంబులకును, స్వగురునకును, దేవదేవునకును బ్రణమిల్లి శివ, మహేశ్వర, రుద్ర, విష్ణు, పితామహ, సంసారవైద్య, సర్వజ్ఞ, పరమాత్మాది నామాష్టకంబును గాని, కేవలము శివనామమునుగాని జపింపవలయును. వ్యాధిశాంతికొఱకు జిహ్వాగ్రమునందుఁ దేజోరాశిని ధ్యానింపవలయును. తరువాతఁ గరద్వయమును జందనచర్చితంబుగఁ జేసి కరశోధనంబును, గరన్యాసంబును గావింపవలయును. ఉత్పత్తిస్థితిసంహృతిభేదంబులచే న్యాసము మూఁడువిధంబులు. అందు గృహస్థులకు స్థితిన్యాసమును, బ్రహ్మచారుల కుత్పత్తిన్యాసమును, యతివానప్రస్థులకు సంహృతిన్యాసంబును గర్తవ్యంబులు. విధవకుఁగూడ సంహృతిన్యాసమే విహితంబైనది. అట్లే కుటుంబినులకు స్థితిన్యాసంమును, కన్యల కుత్పత్తిన్యాసమును గర్తవ్యములు. అంగుష్ఠాదికనిష్ఠాంతమువఱకును గావించునది స్థితిన్యాసము. దక్షిణాంగుష్ఠముమొదలు వామాంగుష్ఠపర్యంతముం గావించునది యుత్పత్తిన్యాసము. వామాంగుష్ఠముమొదలు దక్షిణాంగుష్ఠపర్యంతముం గావించునది సంహృతిన్యాసము. ఈసకలాంగుళులయందును సబిందుకంబులగు నకారాదివర్ణంబులనున్యాసంబుచేసి యనామికాంగుళితలంబున శివన్యాసంబు గావించి దశదిశల నస్త్రమంత్రముచే న్యసించి హృదయ, కంఠ, తాలు, భ్రూమధ్యంబులయందు పంచభూతస్వరూపంబులగు పంచకళలను దదధీశ్వరులతోఁగూడ ధ్యానించి పంచకళాబీజంబులకును భూతబీజంబులకును సంయోగమును భావించి తత్కళాశుద్ధికొఱకు వాక్ప్రాణవాయునిరోధంబుచేసి ముమ్మాఱు పంచాక్షరమంత్రమును జపించి యస్త్రముద్రారూపంబగు నస్త్రముతో భూతగ్రంథిని ఛేదింపవలయును. పిమ్మట సుషుమ్నాపథంబునఁ బ్రాణవా

యువుచేఁ బ్రేరితంబును, బ్రహ్మరంధ్రవినిర్గతంబు నగునాత్మను శివతేజముతో సంయోజనంబు గావించి ప్రాణవాయువుచే దేహమును విశుద్ధంబుగఁ జేసి కాలాగ్నియందు దహించి శక్త్యానుసారంబుగా కలాపంచకంబును బ్రతిలోమక్రమంబున సంహారంబు గావింపవలయును. కళాసంహారంబు సేయక మానినను మానవచ్చును. అనంతరము మరలఁ గళాసృష్టిం గావించి తదధీశ్వరసహితంబుగా వాని నమృతప్లావితంబులుగాఁ జేసి దేహమునందు యథాస్థానంబుల స్థాపింపవలయును. కళాసంహారంబు సేయకున్నచోఁ గళాసృష్టి సేయనక్కఱలేదు. భస్మీభూతం బగుదేహమునుమాత్రమే యమృతప్లావితంబుగాఁ జేయవలయును. అనంతరము విద్యామయం బగుదేహమునందు శివసన్నిధినుండి దీపశిఖంబోలి వెలువడిన యాత్మను బ్రహ్మరంధ్రమునుండి సంయోజనంబు గావింపవలయును. పిమ్మట హృత్కమలమునందలి శివుండు దేహాభ్యంతరంబునఁ బ్రవేశించినట్లు ధ్యానించి మరల నమృతవర్షముచే విద్యామయదేహము నభిషేకించి కరశోధనంబును, గరన్యాసంబును జేసి మహతీముద్రచే నంగన్యాసంబు చేయవలయును. శివోక్తవిధానంబున నంగన్యాసంబును, కరపదాదిసంధులయందు వర్ణన్యాసంబును, స్వజాతియుతంబుగా షడంగన్యాసంబును గావించి యాగ్నేయాదిగా దిగ్బంధనంబు చేయవలయును. అట్లు గాదేని మూర్ధాది పంచాంగన్యాసంబును, భూతశుద్ధ్యాదివిరహితంబుగా షడంగన్యాసమును జేయవచ్చును. ఇట్లు సంక్షేపముగా దేహాత్మశుద్ధిం గావించి శివభావప్రాప్తుండై శివపూజ గావింపవలయును.

ఆవశ్యకంబైనన్యాసమును, మతిభ్రమణంబు లేనన్యాసమును, గల్పోక్తంబులగు సకలన్యాసంబులను గావింపవలయును. అందు వరుసగా మాతృకాన్యాసమును, బ్రహ్మన్యాసమును, ప్రణవన్యాసమును, హం

సన్యాసమును, తుదకుఁ బంచాక్షరన్యాసమును గావింపవలయును. పూజాదికర్మంబులయం దివియన్నియైనను, నిందొకటియైనను నాచరింపవచ్చును. మస్తకమునందు అకారమును, లలాటమునందు ఆకారమును, నేత్రద్వయమునందు ఇకార, ఈకారములను, కర్ణములందు ఉకార, ఊకారములను, కపోలములయందు ఋకార, ౠకారములను నాసాపుటంబులయందు ఌకార, ౡకారములను, ఓష్ఠాధరంబులయందు ఏకార, ఐకారములను, దంతపంక్తులయందు ఓకార, ఔకారములను, జిహ్వయందు అం, తాలుదేశంబున అః, యనువర్ణంబులను, దక్షిణహస్తంబున బంచసంధులయందును కవర్గాక్షరంబులను, అట్లే వామహస్తసంధులయందు చవర్గాక్షరంబులను, దక్షిణపాదసంధులయందు టవర్గాక్షరంబులను, వామపాదసంధులయందు తవర్గాక్షరంబులను, పార్శ్వద్వయంబున, ప, ఫ, వర్ణంబులను, పృష్ఠంబున బవర్ణంబును, నాభియందు భవర్ణమును, హృదయమునందు మవర్ణమును, సప్తధాతువులందును యథాక్రమంబుగ యకారాది సకారాంతసప్తవర్ణంబులను న్యసించి హృదయమున హకారమును, భ్రూమధ్యమున క్షకారమును ఈవిధముగా రుద్రపద్ధతి ననుసరించి వర్ణన్యాసంబు చేయవలయును. పిమ్మట అంగవక్త్రకళాభేదంబుతో పంచబ్రహ్మవిన్యాసంబుచేసి కరన్యాసం బొనరించి వదనము, హృదయము, గుహ్యము, పాదములు వీనియందు కళాబీజంబుల విన్యసించి యూర్ధ్వాదిపశ్చిమాంతపర్యంతరమును పంచముఖంబులఁ గల్పించి క్రమంబుగ వానియం దీశానునిపంచకళలను యోజింపవలయును. మఱియుఁ బూర్వాదివ్యస్తరాంతంబును గలపురుషముఖచతుష్టయమునందు కలాచతుష్టయన్యాసమును భావింపవలయును. అఘోరునిహృదయకంఠములు, స్కంధద్వయము, నాభి, ఉదరము, పృష్ఠము, వక్షము వీనియం దష్టకళలను, వామదేవుని [illegible]

ఘ్రీములు, ఊరు, జాను, జంఘా, స్ఫి, క్కటి, పార్శ్వములు వీనియందు చతుర్దశకళలను, సద్యోజాతుని హస్తపదద్వయము. నాసిక, మస్తకము. బాహుద్వయము వీనియం దష్టకళలను, విన్యాసంబు చేసి పిమ్మటం బ్రణవవేత్త యగుబుద్ధిమంతుండు బాహుద్వయము, కూర్పరద్వయము, మణిబంధద్వయము, పార్శ్వద్వయము, ఉదరము, ఊరుద్వయము, జంఘాద్వయము, పాదద్వయము, పృష్ఠము వీనియందుం బ్రణవన్యాసము గావించి హంసబీజమును విభజించి నేత్రఘ్రాణద్వయంబునను, మరల విభజించి బాహునేత్రద్వయము, ముఖము లలాటము, నాసికా, కక్ష, స్కంధ, పార్శ్వ, స్తన, కటి, పాణి, గుల్ఫద్వయము వీనియందును, హంసన్యాసంబుగావించి పూర్వోక్తవిధానంబునం బంచాక్షరన్యాసంబు సేయవలయును. శివరూపసిద్ధియే యీన్యాసంబులకు ఫలము. శివస్వరూపి గాకుండ నెట్టిశివారాధనంబును జేయంజనదు. కావున స్వశరీరమును శివమూర్తిగాం జేసికొని, జీవభావనంబును విడిచి శివోహమ్మని భావించుచు శైవకర్మానుష్ఠానంబు గావింపవలయును.

కర్మ, తపో, జప, ధ్యాన, జ్ఞానభేదంబులచే యజ్ఞంబులు పంచవిధంబులు. యథాక్రమంబుగ నీయజ్ఞంబులం బాసక్తులగువా రుత్తరోత్తరశ్రేష్ఠులై యుందురు. అందుం గర్మయజ్ఞము సకామం బనియు, అకామం బనియు రెండువిధములు. కాముకులై కర్మయజ్ఞము ననుష్ఠించువారు రుద్రభవనంబున నభిలషితభోగంబుల ననుభవించి యంతంబునం బదచ్యుతులై కామాసక్తులై జనింతురు. నిష్కాములై కర్మయజ్ఞముం గావించువారు రుద్రభవనంబున బహుభోగంబు లనుభవించి యంతంబున దపోయజ్ఞనిరతులై జన్మింతురు. తపోయజ్ఞకర్మ లట్లే రుద్రభవనంబున భోగంబులం గాంచి యంతంబున జపధ్యానపరాయణులై జన్మింతురు. జపధ్యానపరాయణులు రుద్రభవనంబున బహు

భోగపరిత్యక్తులై జపధ్యానంబులకంటె నుత్తమంబగు జ్ఞానలాభముం గాంచి యచిరకాలంబున శివసాయుజ్యముం గాంతురు. మానవుల కకామకర్మయజ్ఞము ముక్తిదాయకం బని శివుం డుపదేశించి యుండెను. సకామకర్మయజ్ఞము కేవలబంధనిమిత్తంబైనది. కావున మానవులీపంచయజ్ఞంబులయందును, ధ్యానజ్ఞానయజ్ఞంబులయం దాసక్తులై యుండవలయును. ధ్యానజ్ఞానంబులు గలవారు భవసాగరమును దరింపఁగలుగుదురు. హింసాదిదోషవిరహితంబును, విశుద్ధంబును, చిత్తసాధనంబును, అపవర్గఫలప్రదంబు నగుధ్యానయజ్ఞమే సర్వోత్తమమైనది. రాజభవనంబున బాహ్యకర్మచారు లతిశయఫలభాగులు గానట్లే జగంబునఁ గర్మయజ్ఞనిరతులు మహాఫలసిద్ధులు గాఁజాలరు. ధ్యానపరాయణుల కీశ్వరమూర్తి బ్రత్యక్షగోచరంబును, సూక్ష్మంబు నై యుండును. కాని కర్మయజ్ఞనిరతుల కీశ్వరమూర్తి స్థూలంబును, మృత్కాష్ఠాదికల్పితంబునై యుండును. ధ్యానయజ్ఞనిరతులు శివతత్త్వమును బాగుగ నెఱింగినవారు గావునఁ బాషాణమయంబులును, మృణ్మయంబులు నగు నీశ్వరునిస్థూలమూర్తులయందు వారికి విశ్వాసము గలుగదు.

హృదయగతుం డగునీశ్వరుని విడిచి బాహ్యప్రదేశంబున శివపూజాదికముం గావించుట యరచేతిలోని యమృతమును ద్యజించి మోచేతిని నాకినట్లగుచున్నది. ధ్యానమునుండి జ్ఞానంబును, జ్ఞానమునుండి ధ్యానంబును నుత్పన్నము లగుచుండును గావున నీరెంటిమూలమునను ముక్తిలాభంబు గాఁగలదు. కావున ధ్యానయజ్ఞం బెన్నఁటికిని బరిత్యజనీయంబు గాను. బ్రహ్మరంధ్రము, మస్తకము, లలాటము, భ్రూమధ్యము, నాసిక, ముఖము, కంధరము, హృదయము, నాభి యనునీస్థానంబులయం దెందైనను శివశక్తులను భావించి ధ్యానించుచు శ్రద్ధాన్వితవిశుద్ధచిత్తుండై బాహ్యయోగోపచారంబులచేఁ బూజిం

పవలయును. అట్లు గాదేని స్వవిత్తానుసారంబుగాఁ గృతిమలింగము నందుఁగాని, వహ్నియందుఁగాని, స్థండిలంబునఁగాని, బాహ్యాంతరో భయస్థలంబులయందుఁగాని పరమేశ్వరుని బూజింపవచ్చును. అంత ర్యాగపరాయణు లగువారు బాహ్యారాధనము చేసినను, జేయకున్నను, అంతర్యాగమునుమాత్రము పరిత్యజింపఁగూడదు.

పూజావిధానము.

శ్రీకృష్ణా! శివశాస్త్రంబున శివుండు పార్వతికుపదేశించినపూజావిధానమును జెప్పెద నాకర్ణింపుము. మొట్టమొదట నగ్నికార్యాంతమువఱకుంగల యభ్యంతరయాగక్రియలందీర్చి పిమ్మట బహిర్యాగంబు గావింపవలయును. మొదట నంతర్యాగంబు గావింపకుండ బహిర్యాగమును గావింపవచ్చును. అందు మొదట మనస్సునందుఁ బూజాద్రవ్యముల నన్నిటిని గల్పించుకొని, వానిని బరిశుద్ధంబులుగాఁ జేసి వినాయకుని ధ్యానించి విధివిధానంబున నాతని బూజించి, దక్షిణంబున నందీశ్వరుని, ఉత్తరంబున నందిపత్నియగుసుయశను బూజింపవలయును. పిమ్మట సింహాసనయోగాసనాదులనుగాని, తత్త్వత్రయసమన్వితం బగువిమలపద్మాసనంబునుగాని మనసునందే కల్పించుకొని తదాసనంబున నంబికాసహితుండును, సర్వమనోహరుండును, సర్వలక్షణసంపన్నుండును, సర్వాంగసుందరుండును, సర్వాతిశాయియు, సర్వాభరణభూషితుండును, రక్తవదనుండును, రక్తహస్తుండును, రక్తపాదుండును, కుందమందస్మితాననుండును, శుద్ధస్ఫటికసంకాశుండును, వికచారవిందలోచనుండును, చతుర్భుజుండును, ఉదారాంగుండును, చారుచంద్రకళాధరుండును, వరదాభయకరుండును, ధకామృగధరుండును, భుజంగహారవలయుండును, నీలకంఠుండును, అనుపమానుండును, సపరివా

రుండును, సపరిచ్ఛదుండునగుశివమూర్తి యాసీనుండై యున్నట్లు భావించి యాదేవునివామభాగంబున మహేశ్వరియు, వికచోత్పలప్రభయు, విశాలలోచనయు, పూర్ణచంద్రవదనయు, నీలకుంచితకుంతలయు, నీలేందీవరసదృశయు, అతివృత్తఘనోత్తుంగస్నిగ్ధపీనపయోధరయు, తనుమధ్యయు, పృథుశ్రోణియు, పీతాంబరధారిణియు, సర్వాలంకారభూషితయు, లలాటతిలకోజ్జ్వలయు, చిత్రకుసుమాలంకృతకబరికాశోభితయు, సర్వాంగసుందరియు, కించిల్లజ్జాయితాననయు, హేమారవిందదక్షిణపాణియు, దండసదృశవామహస్తయు, పాశవిచ్ఛేదికయు, సచ్చిదానందస్వరూపిణియు నగు దేవీమూర్తి యాసీనయై యున్నట్లును భావించి ధ్యానించి సకలోపచారయుక్తంబుగా భక్తిభావకుసుమంబులచే నర్చింపవలయును.

అట్లు గాదేని దేవదేవుం డగుశివమూర్తినైనను, సదాశివమూర్తినైననుఁ శ్రీకంఠమూర్తినైనను గల్పించుకొని స్వశరీరమునందువలెనే, కల్పితమూర్తివిగ్రహమునందును మంత్రన్యాసంబు చేసి యామూర్తియందు మూర్తిమంతుండును, సదసత్పరుండు నగుశివునిధ్యానావాహనంబుల గావించి యథావిధిగ మానసోపచారంబులచేఁ బూజించి నాభియందు సమిదాజ్యాదులచే హోమము చేయుచున్నట్లు భావించి భ్రూమధ్యంబున విశుద్ధదీపశిఖాకృతియగు శివమూర్తిని జింతింపవలయును. ఈవిధముగా మూర్తియందుఁగాని, ధ్యానమయయోగమూర్తియందుఁగాని శివారాధనంబు చేసి పూజాంతంబున నగ్నికార్యంబు నిర్వర్తింపవలయును. బాహ్యాంతర్భేదముమాత్రమే గాని యారాధనమునందుఁ గ్రమభేదం బేమియును లేదు. ఇట్లు మానసారాధనంబు చేసి పిమ్మట లింగమునందుఁగాని, స్థండిలమునందు గాని, యనలంబునందుగాని దేవుం డగుభూతపతిని బూజింపవలయును.

—♦ శివపూజావిధి. ♦—

వాసుదేవా ! సుగంధచందనజలంబున మూలమంత్రముచేఁ బూజాస్థానమును బ్రోక్షించి పుష్పనిక్షేపణంబు చేసి యస్త్రమంత్రముచే విఘ్నోత్సారణంబును, వర్మమంత్రముచే నవగుంఠనంబును, దిశలయం దస్త్రవిన్యాసంబును జేసి పూజాస్థలమును గల్పించి యందు దర్భలను బఱచి ప్రోక్షణాదులచేఁ బ్రక్షాళనంబు గావించి పాత్రశోధనంబు చేసి ద్రవ్యశుద్ధి యొనరింపవలయును. ప్రోక్షణీపాత్ర, అర్ఘ్యపాత్ర, పాద్యపాత్ర, ఆచమనీయపాత్ర యని పాత్రలు నాలుగువిధములు. వీనినన్నిటిని బ్రక్షాళనప్రోక్షణంబులు గావించి వీక్షించి యందుశుద్ధజయథాసంభవంబు లగు రత్నస్వర్ణరజతగంధపుష్పాక్షతాదులను, ఫలపల్లవదర్భాదిపుణ్యద్రవ్యంబులను జేర్చి స్నానజలంబున సుగంధాదులను, పానీయజలంబున శీతలమనోజ్ఞకుంకుమాదిద్రవ్యంబులను, పాద్యజలంబున నుశీరచందనాదులను, ఆచమనీయజలంబున జాతీతమాలతక్కోలబహుమూలాదిచూర్ణంబులను నిక్షేపింపవలయును. సకలపాత్రంబులయందును, ఏలాకర్పూరచందనంబులఁ జేర్పవలయును. కుశాగ్రములు, అక్షతలు, యవలు, ధాన్యము, తిలలు, శ్వేతసర్షపములు, ఘృతము, భస్మము మొదలగువాని నర్ఘ్యపాత్రంబునను, కుశపుష్పయవధాన్యబహుమూలతమాలకభస్మంబులను ప్రోక్షణీపాత్రయందును నిక్షేపింపవలయును. పిమ్మట సకలపాత్రంబులయందును మంత్రవిన్యాసంబు చేసి వర్మమంత్రముచే బహిర్భాగమును వేష్టించి, అస్త్రమంత్రంబుచే రక్షణంబు గావించి ధేనుముద్రను బ్రదర్శించి పూజాద్రవ్యములను బ్రోక్షణీజలంబులచేఁ బ్రోక్షింపవలయును. చతుష్పాత్రాభావంబున నొక్కప్రోక్షణీపాత్రయందలిజలముచేతనే సామాన్యార్ఘ్యమునర్పింపవలయును. పిమ్మట గణపతిని భక్ష్యభోజ్యాదినివేదనంబులచే యథావిధిగఁ

బూజించి దక్షిణద్వారపార్శ్వంబున బాలేందుశేఖరుండును, త్రినయనుండును, చతుర్బాహుండును, శూలపాణియు, మృగియు, వేత్రధరుండును, చంద్రవదనుండును, అంతఃపురాధీశ్వరుండు నగునందీశ్వరుని ధ్యానించి పూజించి యుత్తరద్వారపార్శ్వంబున దేవీపాదప్రసాధనపరాయణయు, వాయునందినియు, సువ్రతయు, నందిపత్నియు నగుసుయశను బూజించి పరమేష్ఠియంతర్భవనంబునఁ బ్రవేశించి లింగార్చనంబు గావించి నిర్మాల్యాపనోదనంబు చేసి నిర్మాల్యకుసుమప్రక్షాళనంబు గావించి శుద్ధికొఱకు శిరంబున ధరింపవలయును. అనంతరము మంత్రిశుద్ధికొఱకు పుష్పహస్తుండై యథాశక్తిని మంత్రమును జపించి ఈశానకోణంబునఁ జండునర్చించి నిర్మాల్యప్రదానంబు చేయవలయును.

తరువాత భూతలంబున శ్యామవర్ణయు, కళ్యాణియు నగునాధారశక్తిని ధ్యానించి దానియెదుట శ్వేతకాయుం డగునసంతుం డుత్కంఠుండై పంచఫణంబులచేతను నాకాశము నొరయుచున్నట్లుగా భావించి ధ్యానించి తదుపరిభాగంబున నొకయుత్తమాసనం బున్నట్లును దానిచతుష్కోణంబులయందును ధర్మజ్ఞానవైరాగ్యైశ్వర్యంబులను శ్వేతరక్తపీతశ్యామవర్ణంబు లగు నాల్గుపాదములు సింహపాదంబులం బోలి యున్నట్లును, అధర్మము, అజ్ఞానము, అవైరాగ్యము, అనైశ్వర్యము ననునీనాల్గును పాదరూపముం దాల్చి పూర్వాదిచతుర్దిశలను వ్యాపించియున్నట్లును, అయ్యాసనము రాజావర్తమణింబోలి తేజరిల్లుచున్నట్లును భావించి దానిపై భాగమునందు శ్వేతపద్మాసనంబును భావించి అణిమాద్యష్టగుణంబులును దాని రేకులుగను, వామాదిశక్తులును, శక్తియుతరుద్రగణంబులును దానికేసరంబులుగను, ఆశక్తులే బీజంబులుగను, మనోన్మనియే దానియభ్యంతరకోశముగను, వైరాగ్యమే దానికర్ణికగను, శివజ్ఞానమే దానినాళముగను, శివధర్మమే దాని

మూలకందముగను జింతించుచు దానికగ్రకాంతంబునఁ దిగ్మమండలరచనంబు గావించి దానిపై నాత్మాదితత్త్వత్రియమయంబగు నాసనంబును గల్పింపవలయును. ఈసకలాసనంబులకును మీఁద విచిత్రాస్తరణశోభితంబును, శుద్ధవిద్యాసముజ్జ్వలంబును, సుఖకరంబునగునాసనమును గల్పించి వేఱువేఱుగ నావాహనాదిముద్రలను బ్రదర్శించుచు భవానీభవులయావాహనంబును, స్థాపనంబును, సన్నిరోధంబును, నమస్కారంబును గావించి వారి నుద్దేశించి అర్ఘ్యము, పాద్యము, ఆచమనీయము, గంధపుష్పదీపధూపాదులు, తాంబూలమును సమర్పించి వారి నభిషేకింపవలయును. అట్లుగాదేని యట్టియుత్తమాసనమును మూర్తిని నిర్మించుకొని మూలమంత్రవేదమంత్రాదులతో సకలీకరణంబు గావించి దేవిని, మహాదేవుని నావాహనంబు చేసి పూజింపవలయును. ఆతఁడు సర్వకారణుండును, అణువులకంటెను నణుస్వరూపుండును, మహత్తులకంటె మహత్స్వరూపుండును, జగత్కళ్యాణసంధాయకుండును, బహిరంతస్థితుండును, శుద్ధస్ఫటికసంకాశుండును, త్రిమూర్తులకుఁగూడ నగోచరుండు నైనను భక్తులకు సులభగోచరుండు నై యుండును. లింగమే పరమేశ్వరుని మూర్తి యని భావించి పంచోపచారంబులచేతను లింగమును బూజింపవలయును. స్నానసమయంబున జయశబ్దాది మంగళాచరణంబులఁ గావింపవలయును. పంచగవ్యము, ఘృతము, క్షీరము, దధి, మధువు, ఫలములు, ఫలరసము, తిలలు, సర్షపములు, సక్తువు, బీజములు మొదలగువానిచే లింగమునుగాని, మూర్తినిగాని యభిషేకించి పిష్టాదులచే నుద్వర్తనంబును,ఉష్ణోదకంబుచేస్నానంబును ఉద్వర్తనాపనోదనంబునకై బిల్వపత్రవర్షణంబును, మరల రాజోపచారంబులచే స్నానంబును, ఆమలకహరిద్రాదులచే సమాలంభనంబును, మరల సలిలంబులచే స్నానమును గావింపవలయును. ఈసకలద్రవ్య

ములతో భక్తిపూర్వకంబుగాఁ గేవల మంత్రజలంబుచేతనే యభిషేకింపవలయును. కలశముచేఁగాని, శంఖముచేఁగాని, వర్ధనిచేఁ గాని, హస్తముచేఁ గాని కుశపుష్పసహితంబుగా మంత్రోచ్చారణముచేయుచుఁ బవమానరుద్రనీలాదిమంత్రంబులచేతను, లింగసూక్తాదులచేతను, అథర్వశిరోమంత్రంబులచేతను, ఋక్సామమంత్రంబులచేతను, సద్యోజాతాదిపంచమంత్రంబులచేతను, శివమంత్రముచేతను, ప్రణవముచేతను దేవదేవు నభిషేకింపవలయును. పార్వతీపరమేశ్వరుల కణుమాత్రంబైనను భేదము లేదుగావున నయ్యిరువురకు నొక్కరీతినే యభిషేకంబు గావింపవలయును. అందు మొదట మహాదేవుని, పిమ్మట దేవిని నభిషేకింపవలయును.

మొట్టమొదట సుగంధజలంబులచే నభిషిక్తుండగులింగమూర్తిని వస్త్రముచే సమార్జితునింగావించి వస్త్రోపవీతంబుల నివేదించి అర్ఘ్యపాద్యాచమనీయంబు లర్పించి గంధపుష్పధూపదీపాలంకారనైవేద్యంబులు, పానీయంబును సమర్పించి ముఖశోధనంబు చేసి, పునరాచమనీయంబును, కర్పూరాదిముఖవాసంబును, రత్నాలంకృతకిరీటమును, వివిధమాల్యంబులను, అంజన, చామర, తాలవృంతదర్పణాదులను నివేదించి మంగళధ్వానంబులతో నృత్తగీతవాద్యంబులతో నీరాజనంబర్పింపవలయును. అష్టదిశలయందు నెనిమిదిదీపములను వెలిఁగించి మధ్యమున నొకదీపము నుంచి యానవదీపతేజములందును వామాదినవశక్తులను ధ్యానించి పూజించి పిమ్మట గవచముచే నాచ్ఛాదనంబును, అస్త్రముచే రక్షణంబును గావించి ధేనుముద్రను బ్రదర్శించి పాత్రమును గరద్వయంబుచే గ్రహించి యాపాత్రోపరిభాగంబున విదిక్కులయందును, నడుమనుగల పంచదీపములనుగాని, యొక్కదీపమునుగాని స్థాపించి మూలమంత్రమును జపించుచు ముమ్మాఱు ప్రదక్షిణంబు గా

వించి లింగమస్తకంబున నర్ఘ్యప్రదానమును, భస్మసుగంధద్రవ్యలేపనం బును గావించి పుష్పాంజలి యొసంగి, యుపహారమును, పానీయము ను, ఆచమనీయమును, తాంబూలమును నివేదించి ప్రోక్షణీయద్రవ్యం బులచేఁ బ్రోక్షించి నృత్యగీతాదివినోదంబు లాచరింపవలయును.

పిమ్మట లింగాదిమూర్తులయందు శర్వాణీశంకరులను ధ్యానిం చుచు శివనామమును జపించి ప్రదక్షిణప్రణామస్తవంబులను, ఆత్మస మర్పణంబును గావించి వినయముతో ననుష్ఠితకార్యనివేదనంబు చేసి మరల నర్ఘ్యంబును, బుష్పాంజలియు నర్పించి యథావిధిగ ముద్రాప్ర దర్శనంబుచేసి, క్షమాప్రార్థనం బొనరించి విసర్జించి యాత్మయందుఁ బరతత్త్వచింతనంబు గావింపవలయును. అతికష్టసమయంబులయందు పాద్యాదిముఖవాసాంతంబువఱకును గలయుపచారంబులఁ గావింపఁజా లకున్నచో భక్తిపూర్వకంబుగఁబుష్పమాత్రప్రదానంబును గావింపవల యును. ఉపాసకుఁడు జీవించియున్నంతవఱకును శివపూజ చేయకుండ నేమియును భుజింపరాదు. స్వేచ్ఛాక్రమంబున నట్లు భక్షించుపాపా త్మునకు నిష్కృతి లేదు. ప్రమాదవశంబున భుజించినచోఁ బ్రయత్న పూర్వకంబుగ నుద్గీర్ణంబు గావించుకొని స్నానోపవాసంబులు చేసి ద్వి గుణంబుగా శివశక్తులను బూజించి బ్రహ్మచర్యం బవలంబించి శివమం త్రంబు నయుతజపంబు చేసి పరదినంబున శక్త్యనుసారంబుగా మహా దేవునకు స్వర్ణనివేదనంబు చేసి దానిని శివభక్తునకు దానము చేసి మ హాపూజగావించి పరిశుద్ధుండు గావలయును. హవిర్నివేదనంబునకుఁ బూర్వంబునను, ధూపదీపదానానంతరంబునను, నీరాజనసమయంబు నను ఆవరణపూజ చేయవలయును.

మహాదేవునికి, మహాదేవికిని బ్రథమావరణంబునం బూజింప వలయును. ఈశాన్యంబుచు జతుర్దిశలును, ఆగ్నేయాదికోణంబులుచు,

మరలనీశాన్యంబును, చతుర్దిశలును బ్రిథమావరణంబగును. అట్లు గాదేని హృదయాద్యస్త్రపర్యంతమునైనను బూజింపవలయును. దానికి బహిర్భాగమునందు పూర్వదిక్కున శక్రుని, దక్షిణంబున యముని, పశ్చిమంబున వరుణుని, ఉత్తరమునఁ గుబేరుని, ఈశానకోణమం దీశానుని, అగ్నికోణమం దగ్నిని, నైరృతికోణమందు నిరృతిని, వాయుకోణమందు వాయువును, మరలనైరృతికోణంబున విష్ణుని, ఈశానకోణంబున బ్రిహ్మను, బూజించి పద్మబహిర్భాగంబున వజ్రాదిశంఖపర్యంతముం గలయస్త్రములను బూజించి క్రిమముగా దిక్కులను, దిక్పాలకులను పూజించి దేవదేవులనవలోకించుచు ఆవరణదేవతలందఱును కృతాంజలిపుటులై యాసీనులై యున్నట్లు ధ్యానించి వారివారి నామంబులను నమోంతంబులుగా నుచ్చరించుచు నమస్కారంబును, స్మరణంబును, బూజయు గావింపవలయును. పిమ్మట స్వావరణసహితంబుగా గర్భావరణపూజ చేయవలయును. బాహ్యాభ్యంతర యోగధ్యానజపహోమసమయములందు హవిస్సు, ముద్గాన్నము, దధియుక్త పాయసము, మధుయుతంబగుగుడద్రివ్యమును సమర్పింపవలయును. ఇవియన్నియైనను, నిందొక్కటియైననుగుడఖండయుతంబుగా నర్పించి మథితంబగుదధి, పిష్టకాదిభక్ష్యద్రివ్యములును, స్వాదుఫలంబులును, ఏలాచందనపుష్పసంకలితంబగుశీతలజలంబును, కర్పూరతాంబూలమును, సుగంధపుష్పంబును సమర్పింపవలయును. నిర్గంధములును, ఉగ్రిగంధములును, దూషితంబులును, పర్యుషితంబులును, విశీర్ణంబులు నగుపుష్పములను శివపూజ కుపయోగింపరాదు. తరువాత శుభ్రిదుకూలంబును, రత్నభూషణంబులను సమర్పించి అగురుచందనపుష్పవాసితంబగు ధూపమును నివేదించి, పంచగవ్యంబును, కపిలధేనుసంభవంబులగుదధిదుగ్ధఘృతంబులను స్నానపానంబుల కర్పింపవలయును. తరు

వాత శివప్రియంబునకై నవరత్నఖచితంబగు గజదంతాసనంబును దా నియందు వినిర్మలంబును, సుందరంబును, సుఖకరంబు నగుపర్యంకము ను, నదీనదసమాహృతంబులును, పానయోగ్యంబులు నగుశీతలజలం బులను, సుధాకరసుందరంబును, మౌక్తికమాలాలంకృతంబును, రమ ణీయంబునగు ఛత్రమును, సువర్ణరజతదండకలితంబులును, హంససదృ శంబులును నగు శ్వేతచామరంబులను, హంసకుందచందనసదృశంబును, సుందరంబును, స్వర్ణరత్నవృష్టసముజ్జ్వలంబును, గంభీరనినదంబు నగు శంఖమును, వివిధశబ్దవిచిత్రితంబును, ముక్తామాలికాలంకృతంబును, సువర్ణనిర్మితంబగుకాహళంబును, గంభీరనినదయుతంబు లగు భేరీమృ దంగాదులను గల్పింపవలయును. పాత్రములు, భాండములుమొదలగు నవి సువర్ణమయంబుగాఁ జేయవలయును.

పరమాత్ముం డగుశివుని ఆలయమును శివశాస్త్రోక్తంబు లగు లక్షణంబులతో రాజసౌధమువలె నిర్మింపవలయును. ఆయాలయం బున కున్నతప్రాకారమును, పర్వతసదృశంబగుగోపురమును, రత్నఖచి తంబులగు హేమద్వారకవాటములును, స్వర్ణమయంబులగురత్నస్తంభ ములును,ముక్తాదిమ్రిమశోభితంబులగుతోరణంబులును,శిరోభాగంబున అస్త్రరాజచిహ్నితంబును, స్వర్ణకుంభరూపంబు నగుకిరీటమును నిర్మిం పవలయును. దానికిఁ జతుర్దిశలయందునుగల రాజవీథులయందు సము న్నతశిఖరంబులును, రాజనివాసయోగ్యంబులు నగుప్రాసాదములను గల్పింపవలయును. ఆలయప్రాంతమున దిగ్విదిక్కులయందు అంతరా వరణసదృశంబగునాస్థానమండపం బుండవలయును. ఆలయమునందు స్త్రీసహాయులును, నృత్తగీతవిశారదులును, వేణువీణావాదనవిదగ్ధులు నగువారు మంగళాచరణంబునకై నియమితులై యుండవలయును. రథగజతురగాదిసైన్యంబులు గలయాదేవాలయమును సైనికులు ర

ష్ఠించుచుండవలయును. ఆలయమునకు నలుదెసలను, బుష్పవాటిక
లు, సరోవరదీర్ఘికాదిజలాశయములును విరాజిల్లుచుండవలయును. వే
దవేదాంతతత్త్వజ్ఞులును, శివాగమపరాయణులును, శాస్త్రోక్తలక్షణసం
పన్నులును, శివాశ్రమనిరతులును, భక్తులును, శాంతులును, మంద
హాసవదనులును, సదాచారులును, శ్రీమంతులును శైవులు నగుద్విజ
గణంబు లందు సర్వదా పూజానిరతులై యుండవలయును.

ఈరీతిగా బహిరంతరంబుల యథాశక్తిని శిలాకాష్ఠాదులచే ని
ర్మితంబగునాలయంబునఁగాని, పుణ్యారణ్యంబునఁగాని, పర్వతంబునఁ
గాని, నదీతీరంబునఁగాని, గృహంబునఁగాని, మఱియేపవిత్రస్థానము
నందైనను గాని ధనవంతుఁడైనను, దరిద్రుఁడైనను, శక్తివంచనంబు
లేకుండ న్యాయార్జితద్రవ్యముతో భక్తిపూర్వకంబుగ శివార్చనంబు
గావింపవలయును. అన్యాయార్జితద్రవ్యంబుచేనైనను భక్తిపూర్వకం
బుగా శివార్చనంబు గావించినచోఁ బ్రత్యవాయం బేమియును లేదు.
భక్తిమాత్రముచేతనే ప్రభుం డగునీశ్వరుఁడు వశుం డగుచున్నాఁడు.
భక్తిలేకున్నచో న్యాయార్జితద్రవ్యముచేఁ బూజించినను లాభములేదు.
ఫలలాభమునకు భక్తియే కారణము. యథాశక్తిని భక్తిపూర్వకంబు
గఁ గావించినది యల్పంబైనను మహాఫలసంధాయకం బగును. భ
క్తితోఁ బూజించినచో దరిద్రుఁడైనను ధనవంతునితో సమానఫలం
బును గాంచఁగలఁడు గావున దరిద్రుండు యథాశక్తిని శివార్చనంబు
గావింపవలయును. ఎంతభాగ్యవంతుఁడైనను భక్తిలేనివాఁ డీకార్య
ము ననుష్ఠింపరాదు. అభక్తులగువారు సర్వస్వము దానముచేసినైన
ను ఫలంబు నందఁజాలరు. వేయివిధంబులగునుగ్రతపంబులును, మహా
యజ్ఞంబులును గావించినను శివభక్తివిహీనుండగువాఁడు శివపురగమ
నంబున కెన్నఁటికిని సమర్థుండు గాఁజాలఁడు. శివభక్తి పరమగుహ్యం

మైనది. భక్తులగువారే ముక్తికర్తులై యుందురు. శివమంత్రజపము, ధ్యానము, హోమము, యజ్ఞము, తపస్సు, శాస్త్రము, దానము, అధ్యయనము ననునివి యన్నియు చిత్తశుద్ధికొఱకుమాత్రమే—అభక్తులయనుష్ఠానములు ఫలవంతములు గాఁజాలవు. భక్తులగువారు భక్తిసాధనకార్యంబుల ననుష్ఠింపకున్నను ముక్తు లగుదురు. కావున నీశ్వరభక్తులగువారికి చాంద్రాయణములు, ప్రాజాపత్యములు, మాసోపవాసములు మొదలగునియమంబులతోఁ బ్రయోజనము లేదు. గిరిగుహాంతరంబులయందు భక్తిలేకుండ దపంబు చేయుటకంటె భక్తుఁడై గృహంబున శివారాధనంబుచేయుట ముక్తిప్రదము. సాత్వికకర్మము ముక్తిదాయకము గావున యోగులు దాని ననుష్ఠింతురు. సిద్ధిప్రదంబగు రాజసకర్మమును రజోగుణసంకలితులగువా రనుష్ఠించుచుందురు. ఐహికభోగప్రదంబగుతామసకర్మమును తమోగుణావృతులగునసురులును, తత్సమానులగుమానవులు నాచరించుచుందురు. భక్తులగువారికర్మత్రయమునందు దేనిమూలంబుచేనైనను నీశ్వరారాధనంబు గావించి కల్యాణభాజను లగుదురు. పాపార్ణవమును దరింపఁజేయుటకు భక్తియే నావ గావున భక్తులగువారికి రజస్సత్వాదిగుణంబులవలన లాభముగాని నష్టముగాని యేమియును లేదు.

ఎట్టినీచజాతియైనను, మూర్ఖుఁడైనను, పతితుఁడైనను శివశరణంబు గాంచి సకలసురాసురపూజితుండు గాఁగలఁడు. కావున నతిప్రయత్నముతో భక్తిపూర్వకంబుగ శివార్చనము చేయవలయును. ఈజగంబునం దభక్తుల కెందును ఫలంబు లేదు. పంచమహాపాతకులును, మాతృపితృఘాతుకులును, భ్రూణహులునుగూడ భక్తిపూర్వకంబుగా నమంత్రకంబుగానైన శివార్చనంబు చేసి ద్వాదశవర్షంబులలోఁ బాపవిముక్త లగుదురు. కావునఁ బతితుండైనను భక్తితో శివపూజ గా

వింపవలయును. అభక్తుఁడు సదాచారియైనను బూజాధికారి గానేరఁ
డు. అతిపాపాత్ముఁ డగువాఁడు భిక్షాశనుండును, జితేంద్రియుండునై
భక్తిపూర్వకంబుగాఁ బంచాక్షరమంత్రముతో శివార్చనంబు గావించి
నచోఁ బాపవిముక్తుం డగును. శివభక్తిలేని వ్రతంబులును, ఉపవాసం
బులును, గఠోరతపంబులును నిష్ఫలంబులు. వారికి శివలోకంబు లభిం
పదు. పంచాక్షరమంత్రముతో నొక్కసారిమాత్రము భక్తియుక్తము
గా శివార్చనంబు సేయువారికి మంత్రగౌరవంబువలన శివపదంబు ల
భింపఁగలదు. కావున సకలతపంబులును, సర్వస్వదక్షిణాన్వితంబు లగు
సకలయజ్ఞంబులును శివపూజయందలి కోటితమాంశమునైనను బోలఁ
జాలవు. బద్ధుండైనను, ముక్తుండైనను భక్తితోఁ బంచాక్షరమంత్రం
బున శివుని బూజించి పాశవిముక్తుం డగును. అరుద్రుండైగాని, స
రుద్రుండైగాని సూక్తమంత్రవిధిచే శివార్చనంబు సేయువాఁడు, పతి
తుఁడైనను, మూర్ఖుఁడైనను ముక్తుం డగును. నియమియై షడక్షరమం
త్రంబునఁగాని, పంచాక్షరమంత్రంబునఁగాని, బ్రహ్మాంగమంత్రముల
చేఁగాని, పూర్వోక్తంబగుహంసమంత్రముచేఁగాని, సూక్తమంత్రము
లచేఁగాని శివార్చనంబు గావించువాఁడు ముక్తుం డగును. కేవలము
భక్తులగువారు సర్వదా సూక్తమంత్రములచే శివపూజ చేయవలయు
ను. జితక్రోధు లగుశివభక్తులు దీక్షితులైనను, గాకున్నను నియమ
ముతో శివపూజ నాచరింపవలయును. దీక్షితులైనచోఁ బ్రశస్తము.
కావున గురుసన్నిధిని దీక్షితుండై సూక్తమంత్రంబులచే నేకకాలంబు
నఁగాని, ద్విసంధ్యలయందుఁగాని, త్రిసంధ్యలయందుఁగాని మహాదే
వుని బూజించువారు గణేశ్వరు లగుదురు. ఆత్మజ్ఞానముతో శివారా
ధనంబు గావింపఁజాలనివారు చిరకాలంబునకును దుఃఖసాగరం బగు
సంసారమున మునిఁగి తేలుచుందురు. దుర్లభం బగుమానవజన్మం

చెత్రియు శివపూజ గావింపనివానిజీవితము నిష్ఫలమైనది. అట్టివాని యుత్తమమానవజన్మము మోక్షహేతుకము గానేరదు. శివపూజ గావించువాని జన్మమే సఫలమైనది. అనరోత్తముఁడే కృతార్థుఁడు. ఈజగంబున భవభక్తిపరాయణులును, భవప్రీతచేతస్కులును, నిరంతర భవసంస్మరణోద్యుక్తులు నగువారు భవార్ణవంబున దుఃఖభాగులు గానేరరు. మనోజ్ఞభవనంబులును, విలాసభూషితలగుయువతులును, తృప్తికిమించినధనసంపత్తియు శివపూజాఫలంబులని యెఱుంగవలయును. మహాభోగవాంఛితులును, స్వర్గభోగకాములును సర్వదా శంకరచరణకమలాశ్రితులై యుండవలయును. శివసేవకులగువారు, శౌర్యము, బలము, ఖ్యాతి, సౌందర్యము, లోకానందకరస్వభావము, దయ, మొదలగుసద్గుణంబులకాశ్రయులై యుందురు. కావున మంగళాకాంక్షులగువారెల్లరును శివార్చనానిరతులు గావలయును. ఈజీవిత మచిరకాలములోనే నశించును; ప్రమోదోన్మత్తం బగునీయాపన మెంతయోకాలముండదు; వ్యాధులాశ్రయగ్రహణంబునకై సర్వదా యున్ముఖంబు లగుచుండును—కావున నివి యన్నియు నెఱింగి యతిశీఘ్రముగా శివపూజారతుండు గావలయును. మరణకాలము సమీపింపనంతవఱకును, శరీరము జరాదూషితము గానంతవఱకును, ఇంద్రియములు వైకల్యముం గాంచనంతవఱకు నెన్నఁడును శివపూజయం దలసుఁడు గాఁగూడదు. శివారాధనముతో సమానధర్మం బీత్రిభువనములయం దెందును లేదు.

ప్రాసాదపూజగావింపవలసినప్పుడు, వసంబున ద్వారయాగంబును పరివారబలిక్రియను నిత్యోత్సవంబును గావింపవలయును. హవిస్సును నివేదించినతరువాత స్వయముగఁగాని, యనుచరమూలముగాఁగాని, ప్రాసాదపరివారంబునకు బలినమర్పణంబు చేయవలయును.

వివిధవాద్యసహితముగాఁ దరుమండమునకై పునకుఁ బోయి పుష్పజలం బును, ధూపదీపాన్నములను నివేదించి యుత్తరాభిముఖుండై మహాపీ ఠంబున బలిదానంబు చేసి దేవదేవునకునై వేద్యము నర్పించి తదవశి ష్టభాగమును చండునకు నివేదింపవలయును. తరువాత యథావిధిగ హోమంబును, శేషపూజయుఁ గావించి మంత్రజపపర్యంతమును యథావిధిగ సకలకర్మంబులను నిర్వర్తించి శివశాస్త్రోక్తప్రకార ముత్స వంబు గావింపవలయును. రత్నపద్మశోభితంబును, విపులంబు నగునై జనపాత్రయందు పాశుపతాస్త్రము నావాహనము చేసి పూజించి య లంకృతుండును, అస్త్రన్యస్తదేహుండును, దీప్తయష్టిధరుండు నగుద్వి జనిమస్తకమునందు ఆపాత్రను స్థాపించి నృత్యగతవాద్యంబులతో ధ్వ జదీపాదిసహితంబుగా స్వరంబును, విలంబంబును గానిగమనంబున మ హాపీఠమును వేష్టించి ప్రాసాదపరిహారము నుద్దేశించి ముమ్మాఱుప్రద క్షిణంబు చేయవలయును. పిమ్మట యజమానుండు కృతాంజలియై మరల లోపలఁ బ్రవేశించి ద్వారదేశంబున నిలిచి పాశుపతాస్త్రమును లోనికిఁ దీసికొని యావాహనాదిపూర్వోక్తపూజాప్రదక్షిణాదులు య థావిధిగఁ దీర్చి యుద్వాసనంబు గావించి, పూర్వోక్తవిధానంబున అ ష్టపుష్పదానంబును గావించి పూజాకర్మమును ముగింపవలయును—

—• హోమాదివిధి. •—

వాసుదేవా! ఇఁక నగ్నికార్యంబునుగూర్చి చెప్పెద నాకర్ణిం పుము. కుండంబునఁగాని, వేదియందేఁగాని, లోహపాత్రంబునఁగాని, మృణ్మయపాత్రంబునఁగాని యగ్నిస్థాపనంబు చేసి యథావిధిగ సంస్క రించి యయ్యగ్నియందు మహాదేవు నారాధించి హోమము చేయవల యును. కుండ మేకహస్తపరిమితముగాని, ద్విహస్తపరిమితముగాని

వృత్తాకృతిగఁగాని, చతుష్కోణాకృతిగఁగాని యుండవలయును. కుండము విశాలమై లోతై యుండవలయును. దానినడుమ రెండంగుళములుగాని, నాలుగంగుళములుగాని యున్నతం బగుఅష్టదళపద్మంబును నిర్మింపవలయును. కుండాంతర్భాగమున నాభినిర్మాణంబు చేయవలయును. మధ్యమాంగుళియందలిమధ్యమపర్వాంతస్థలమే యంగుళము. అట్టియంగుళములిరువదినాలుగైన నొకహస్తప్రమాణమగుచున్నది. ఆహోమకుండమున కలంకారముగా మృత్తికతో నొకటిగాని, రెండుగాని, మూఁడుగాని, మేఖలలను నిర్మించి మేఖలామధ్యంబునఁ బశ్చిమంబునఁగాని, దక్షిణంబునఁగాని యశ్వత్థపత్రసదృశముగనైనను, గజాధరనిభంబుగనైనను శోభమానంబగుయోనిరచనంబు చేయవలయును. వేదియున్నతికిని పాత్రంబులకును బరిమాణంబు విధింపఁబడలేదు. వేది మృణ్మయంబుగాని, సికతామయంబుగాని గావచ్చును. వేదికయందు గోమయజలంబులతో మండలరచనంబు చేసి కుండమును, వేదిని గోమయజలంబుచే విలేపనంబు గావింపవలయును. పాత్రంబులను బ్రక్షాళితంబులుగను, తాపితంబులుగను జేసి యన్యపాత్రజలంబులచేఁ గాని, పుష్పంబులచేఁగాని ప్రోక్షితంబులుగాఁ జేయవలయును. దర్భలను బ్రోక్షితంబులుగాఁ జేసి వహ్నిస్థానంబునకు వానిచే నాసననిర్మాణంబు గావింపవలయును. పూజాహోమద్రవ్యంబుల నన్నిటిని బ్రక్షాళితంబులుగను, బ్రోక్షితంబులుగను జేసి పరిశుద్ధంబులుగాఁ జేయవలయును. సూర్యకాంతమణిసంభవంబుగాని, కాష్ఠసంభవంబుగాని, శ్రోత్రియగేహసంభవంబుగాని యగుపవిత్రాగ్నిం గొనితెచ్చి కుండాదులపై ముమ్మాఱు ప్రదక్షిణంబుగఁజేసి వహ్నిబీజము నుచ్చరించుచు యోనిమార్గమునుండి యాసనోపరిభాగంబున నాత్మసమ్ముఖంబుగా స్థాపింపవలయును. యజమానుండు యోనిసమీపంబుననుండి కుండంబున సకల

కర్మంబులం దీర్పవలయును. తననాభియందలివహ్ని నాభిరంధ్రము నుండి విస్ఫులింగమువలె బింబాకృతిని వెలువడి యయ్యగ్నియందు విలీనంబైనట్లు భావించి ఆజ్యసంస్కారపర్యంతము నన్వాధానంబు చేయుచు మూలమంత్రముతో సకలకర్మంబులం దీర్పవలయును. తరువాత దక్షిణపార్శ్వంబున శివమూర్తి నర్చించి ఘృతంబున మంత్రన్యాసంబు చేసి ధేనుముద్రను బ్రదర్శించి, కాంస్య. లోహ, సీసవ్యతిరిక్తంబులగు స్రుక్స్రువంబులను నిర్మింపవలయును. కాదేని స్మృతిసమ్మతంబులును, శిల్పశాస్త్రోక్తంబులు నగుయజ్ఞదారువులచే నిర్మింపవలయును. పాలాశపత్రద్వయమునుండి యుత్థితంబులగుదర్భలచే వానిని నమార్జితంబులుగఁ జేసి వహ్నియందు తాపితంబులుగాఁ జేసి మరలఁ బ్రోక్షితంబులుగాఁ జేయవలయును. తరువాత విధివిధానంబున సేచనంబును జేసి శివమంత్రపూర్వకంబుగా అష్టబీజంబులచే నగ్నిసంస్కారసిద్ధినిమిత్తమై హోమము గావింపవలయును. భ్రూం, స్తూం, రుం, శ్నూం, ఫుం, డ్రుం, దృం, అనునీయేడును సప్తజిహ్వాబీజములు. అందు మధ్యమజిహ్వ త్రిశిఖయు బహురూపాభిధానయు నై యుండును. ఈశాన్యంబున హిరణ్యయనుజిహ్వయు, పూర్వంబునఁ గనకయనునదియు, ఆగ్నేయంబున రక్తయు, నైరృత్యంబునఁగృష్ణయు, సుప్రభయు, వాయవ్యంబున వాయుజిహ్వయు విరాజిల్లుచుండును. వాయుజిహ్వ నిరంతరమును జలించుచుండును. జిహ్వాబీజంబులపై స్వాహాంతంబులగుజిహ్వానామములం గూర్చినచో జిహ్వామంత్రములగును. ఈమంత్రంబులతో వ్రతిజిహ్వయందు నొక్కొక్క హోమము చేయవలయును. "రుంరక్తాయైస్వాహా" అను మంత్రముతో మధ్యజిహ్వయందాహుతిత్రయంబు గావించి ఘృతంబుచేఁ గాని, సమిధలచేఁ గాని పరిషేచనంబు గావింపవలయును. ఇట్లు గావించినచో నది శివాగ్ని యౌ

గును. తన్మధ్యంబున శివాసనమును ధ్యానించి యర్ధనారీశ్వరదేవు నం దావాహనంబు చేసి సమిధలచే హోమము చేయవలయును. సమిధలు పాలాశంబులైనను, యజ్ఞీయంబు లగుమఱియేవృక్షములనైనను గావచ్చును. అవి స్వయంశుష్కంబులు గాక సత్వచంబులును, ప్రణశూన్యంబులు నై కనిష్ఠాంగుళిపరిమితంబులుగాని, ద్వాదశాంగుళిపరిమితంబులుగాని, ప్రాదేశపరిమితంబులుగాని యైయుండవలయును. పిమ్మట నాజ్యాహుతి గావింపవలయును. ఆహవనీయం బగునాజ్యధార దూర్వాదళసదృశంబును చతురంగుళవిస్తీర్ణంబు నై యుండవలయును. తరువాత అక్షపరిమాణం బగునన్నము లాజలు, సర్షపములు, యవలు, తిలలు, మొదలగువానితో హోమము చేయవలయును. సంభవం బైనచో భక్ష్యచోష్యలేహ్యాదిద్రవ్యంబులనుగూడ ఘృతాక్తంబులుగాఁ జేసి హోమము చేయవలయును. తదనంతరము శక్త్యనుసారముగా దశాహుతులనైనను,పంచాహుతులనైనను,ఆహుతిత్రయంబునైనను, ఏకాహుతినైనను గావింపవలయును. స్రువపాత్రచే నాజ్యమును, హస్తముచే సమిధలను, స్రుక్పాత్రచేఁగాని, హస్తముచేఁగానితదితరద్రవ్యములను హోమము చేయవలయును. ద్రవ్యాభావంబున నేకద్రవ్యము చేతనే హోమము చేయవలయును. పిమ్మటఁ బ్రాయశ్చిత్తంబునకై మంత్రపూర్వకంబుగ నాహుతిత్రయంబు గావింపవలయును. తరువాత హోమశిష్టం బగుఘృతమును స్రుక్పాత్రయందు నిండించి తదగ్రంబునఁ బుష్పనిక్షేపంబు గావించి దర్భయుతంబును, అధోముఖంబును నగుస్రువపాత్రచే దాని నాచ్ఛాదించి లేచి కృతాంజలియై పాత్రగ్రహణంబు గావించి వౌషడంతంబుగా మూలమంత్రము నుచ్చరించుచు యవమిశ్రితంబుగాఁ పూర్ణాహుతిధారాప్రదానంబు చేయవలయును. అనంతరము మునుపటివలెనే పరిషేచనంబును గావించి

దేవదేవు నుద్వాసితుం గావించి యగ్నిరక్షణంబు గావింపవలయును. ఆయగ్నిగూడ విసర్జించి నాభియందు సంధానంబు చేసి పూజింపవలయును.

అట్లు గాదేని వాగీశ్వరీగర్భసంభూతం బగునగ్నిని సంగ్రహించి శాస్త్రోక్తవిధానంబున సంస్కరించి విధివిహితముగాఁ బూజింపవలయును. మొదట నన్వాధానంబు చేసి పరిధివిధానంబు గావించి సకలపాత్రిలను రెండేసిగా స్థాపించి శివార్చనంబు చేసి ప్రోక్షిణీపాత్రిశోధనం బాచరించి యందలిజలంబులచే నన్యపాత్రల నన్నిటిని బ్రోక్షితంబులుగాఁ జేసి యీశానకోణంబున జలపూర్ణం బగుప్రణీతాపాత్రిను స్థాపించి స్రుక్కును, స్రువంబును శోధించి గర్భాధాన, పుంసవన, సీమంతోన్నయనకార్యంబులం దీర్చి వేఱువేఱుగ హోమంబుచేసి త్రిపదుండును, సప్తబాహుండును, చతుశ్శృంగుండును, ద్విశీర్షుండును, మధుపింగళత్రినయనుండును, జటాధరుండును, ఇందుశేఖరుండును, రక్తవర్ణుండును, రక్తమాల్యాంబరభూషితుండును, సోపవీతుండును, సర్వలక్షణసంపన్నుండును, త్రిమేఖలుండును నైనట్టియు, శక్తిని, అన్నమును, స్రుక్కును, స్రువపాత్రిను దక్షిణకరంబునఁ దాల్చినట్టియు, తోమరము, తాళవృంతము, ఘృతపాత్రమును వామకరంబున ధరించినట్టియు నగ్నిదేవుని యాకారమును భావించుచు జాతకర్మంబు చేయవలయును. పిమ్మట లాలాపనయనంబును, సూతకశోధనంబు చేసి శివాగ్నికి రుచినామంబు గల్పించి హోమంబు చేసి వాగీశ్వరీశంకరులను విసర్జించి చూడోపనయనాదికార్యంబులు మొదలుగ ఆప్తోర్యామాంతంబువఱకును సంస్కారంబు లొనరించి ఇధ్మాధారారిహోమంబును, స్విష్టకృతంబును గావించి రుం అనుబీజముతోఁ బరిషేచనంబు గావింపవలయును. పిమ్మట బ్రహ్మవిష్ణుమహేశ్వరులను, లోకపాలకగణంబులను

ఆయుధసహితంబుగాఁ జతుర్దిశలను బూజించి ధూపదీపాదిసిద్ధికొఱకు వహ్ని నుద్ధరించి ఆజ్యాదిపాత్రలను సంగ్రహించి అగ్నియం దాసనం బును గల్పించుకొని యందుఁ బూర్వోక్తవిధానంబున దేవదేవులను బూజించి పూర్ణాహుతిపర్యంతము సకలకర్మంబుల దీర్పవలయును. అట్లు గాకున్నను శివధర్మనిరతుం డగువాఁడు కర్మఫలంబును శివార్ప ణంబు గావించి స్వాశ్రమోక్తవిధానంబున నగ్నికార్యముం దీర్పవచ్చు ను. దాని కెట్టివిధానంబును లేదు.

శివాగ్నియందుఁగాని, అగ్నిహోత్రమునందుఁగాని, వైవాహి కాగ్నియందుఁగాని శుచిపక్వసుగంధిభస్మమును గ్రహింపవలయును. కపిలగోమయము భూపతితంబు గాకుండ సంగ్రహింపవలయును. అది భస్మమునకుఁ బ్రశస్తమైనది. క్లిన్నంబును, శుష్కంబును, దుర్గంధక లితంబు నగుగోమయ మగ్రాహ్యమైనది. గోమయము భూపతితం బైనచో దానియూర్ధ్వాధోభాగంబులను ద్యజించి మధ్యభాగమును గ్రహించి మూలమంత్రముతో శివాగ్నియందు నిక్షేపింపవలయును. అపక్వంబును, అతిపక్వంబు నగుదానిని ద్యజించి శ్వేతభస్మమునుగా ని, ఆలోడితంబగుభస్మమును గాని గ్రహించి పాత్రయందు సంరక్షిం పవలయును. భస్మపాత్ర ప్రశస్తంబును, సుందరంబును, ప్రక్షాళితం బును, ప్రోక్షితంబును, అభిమంత్రితమునై యుండవలయును. భస్మ పాత్ర తైజసంబై గాని, కాష్ఠనిర్మితంబై గాని, మృణ్మయంబై గాని, ప్ర స్తరవిరచితంబై గాని యుండవలయును. భస్మమును బరిశుద్ధంబును గా వించి అవిషమంబును, భద్రంబు నగుప్రదేశమునందు ధనముంబోలె దాచియుంచుకొనవలయును. ఎక్కడకైనఁ బోవునప్పుడు దానిని వెంటఁ దీసికొనిపోవలయును. అనుచరులచేనైనఁ దెప్పించుకొనవల యును. అయోగ్యులహస్తంబులయందును, అశుచిస్థలంబులయందు

ను భస్మము నుంపరాదు. దానికి నీచాంగస్పర్శనము గానీయఁగూడ దు. భస్మము నెన్నఁడు నుల్లంఘింపరాదు. యుక్తకాలంబున భస్మ గ్రహణంబు చేసి మంత్రపూర్వకంబుగ నుపయోగింపవలయును. దేవ తోద్వాసనంబునకుఁ బూర్వమునందే భస్మసంగ్రహము సేయవలయు ను. ఉద్వాసనానంతరంబున నది చండభస్మ మైపోవును:—తరువాత విధ్యుక్తముగా నగ్నికార్యంబు ముగించి స్వసూత్రవిధానంబున బరిస మర్పణంబు గావింపవలయును. బాగుగ నలికి యలంకరించినమండల మునందు విద్యాసనమును విన్యసించి విద్యాకోశము నందుఁ బ్రతి ష్ఠించి పుష్పాదులతోఁ బూజింపవలయును. ఆవిద్యామండలంబున కెదురుగా గురుమండలమును రచించి ఆసనవిన్యాసంబు చేసి యందుఁ బుష్పాదులచే గురు నర్చింపవలయును. తరువాతఁ బూజనీయగణంబు నర్చించి క్షుధార్తులను సంతర్పితులం గావింపవలయును. పిమ్మట దేవ నివేదితం బగు నవశిష్టశుద్ధాన్నమును ఆత్మశుద్ధికొఱకు కడుంగడు శ్ర ద్ధతో యథాసుఖంబుగ భుజింపవలయును. లోభముచేగాని, చంచున కర్పింపకుండఁగాని యెన్నఁడును భుజింపరాదు. గంధమాల్యాదిసేవనం బునందుఁగూడ నిష్ఠే నియతుండై యుండవలయును. ఎప్పుడును శివో హమ్మనుధ్యానమును గలిగియుండవలయును.

ఇట్లు భోజనంబుచేసి యాచమనంబు గావించి శివునిధ్యానించు చు హృదయమునందు మూలమంత్రమును జపించుకొనుచు యథా యోగ్యముగ శివకథాలాపంబులతోఁ గాలక్షేపము చేయవలయును. రాత్రిమొదటిజాము గడచినతరువాత దేవదేవులమనోహరపూజం గా వించి మనోజ్ఞంబగుపర్యంకమును గల్పించి భక్ష్యభోజ్యవస్త్రలేపనపు ష్పమాల్యాది బహూపకరణంబుల సంపన్నములు గావించినట్లు సంక ల్పించుకొని యనియస్నియు గౌరీశంకరులను సమర్పించినట్లు భావించు

కొని యాదేవదేవులపాదసన్నిధిని తాను శయనించినట్లు తలంచుకొని గృహస్థుండైనచో భార్యాసహితంబును, ఇతరుండైనచో నొంటిగను శయనింపవలయును. తరువాతఁ బ్రాతఃకాలంబున లేచి ముందుగ మంత్రోచ్చారణంబు చేసి ఉమాసహితుండును, గణపరివృతుండు నవ్యయుండు నగుమహాదేవునకు నమస్కరించి దేశకాలోచితంబుగ యథాశక్తిని శౌచాదికార్యంబులం దీర్చి శంఖాదిమంగళధ్వనులతో, దేవదేవులను బ్రబోధితులఁ గావింపవలయును. తరువాత వికచకుసుమంబులతో నుమామహేశ్వరులను బూజించి యనంతరానుష్ఠేయంబు లగు సకలకర్మంబులను యథావిధిగ నాచరింపవలయును.

—♦ నైమిత్తికవిధి. ♦—

వాసుదేవా! సకలమాసంబులయందు నుభయపక్షాష్టములయందును, చతుర్దశులందును, పర్వంబులందును, అయనంబులందు విషువంబులందును మహాపూజ గావింపవలయును. ప్రతిమాసమునందు నుపవాసియై యథావిధిగ సంస్కృతం బగు పంచగవ్యముచే శివాభిషేకంబు గావించి శిష్టమును భుజింపవలయును. పంచగవ్యసేవనము వలన బ్రహ్మహత్యాది మహాపాతకములు నశింపఁగలవు. పౌషమాసంబునఁ బుష్యమీనక్షత్రమునందు మహాదేవునకు నీరాజనంబును, మాఘమాసమున మఘానక్షత్రమునందు కంబళదానంబును, ఫాల్గునమాసంబున నుత్తరఫల్గునీనక్షత్రమునందు మహోత్సవంబును, చైత్రమాసంబునఁ జిత్తానక్షత్రమునందు డోలోత్సవంబును, వైశాఖమాసంబున విశాఖానక్షత్రమునందు దేవదేవునకు పుష్పమందిరనిర్మాణంబును, జ్యేష్ఠమాసంబున మూలానక్షత్రమునందుశీతకుంభదానంబును, ఆషాఢమాసంబున నుత్తరాషాఢానక్షత్రమునందు పవిత్రారోపణంబు

ను, శ్రావణమాసంబున శ్రవణానక్షత్రమునందును, ధనిష్ఠానక్షత్ర మునందును బ్రాక్ష్యతాదిమండలరచనంబును, భాద్రపదమాసంబునఁ బూర్వాభాద్రానక్షత్రంబునఁ బ్రోక్షణంబును, పూర్వాషాఢానక్షత్రం బున జలక్రీడయు, ఆశ్వయుజమాసంబున నశ్వినీనక్షత్రంబునఁ బాయ స, నవోదన నివేదనంబును, శతభిషానక్షత్రంబునఁ బాయసహోమం బును, కార్త్తికమాసంబునఁ గృత్తికానక్షత్రంబున సహస్రదీపదానంబు ను, మార్గశీర్షమాసంబున మృగశిరానక్షత్రంబునను, ఆర్ద్రానక్షత్రంబు నను మహాదేవునకు ఘృతాభిషేకంబును గావింపవలయును. ఈసకల కార్యంబులకు నశక్తుఁ డగువాఁడు ఆయాకాలంబులయం దుత్సవంబు లుగాని, మహాపూజలుగాని, విశేషపూజలుగాని చేయవలయును. కల్యాణకరంబులగు నుత్తమకర్మంబులయందుఁ బ్రవృత్తుం డై నప్పుడు దురాచారము, దుశ్చింత, దుస్స్వప్నము, దుష్టదర్శనము, ఉత్పాతము, ప్రబలరోగము మొదలగునశుభంబులు తటస్థించినచో నిమిత్తానుసారం బుగాఁ బురశ్చరణపూర్వకంబగుస్నానము, పూజ, జపము, ధ్యానము, హోమము, దానము మొదలగు కార్యంబులఁ గావింపవలయును. శివాగ్ని నష్టం బయ్యెనేని మరల నగ్నిసంధానంబు గావింపవలయును. శివవ్రతుం డగువాఁడిట్టికార్యంబులయం దుత్సాహియై యుండవలయు ను. అట్టివానికి శివానుగ్రహంబున నొకజన్మమునందే ముక్తి లభించు ను. నిత్యనైమిత్తికాదికర్మంబులు యథావిధిగ నెఱవేర్చువాఁడు పరమ పదగమనంబునకు సమర్థుండై శివధామంబున శతకోటిదివ్యవర్షంబులు మహాభోగంబుల ననుభవించి కాలాంతరంబున నుమాకుమారరూపుం డై జన్మించి బ్రహ్మవిష్ణులోకంబుల కూర్ధ్వమునందున్నరుద్రలోకంబుఁ జేరి యందు యథేష్టభోగంబుల ననుభవించుచు మరల నాలోకంబున కూర్ధ్వంబునఁ బంచస్థానంబు లతిక్రమించి శ్రీకంఠసాన్నిధ్యంబున

సలాభమును గాంచి శివపురనివాసుం డగును. ఏతత్కార్యంబులయం, దర్ధంబు గావించినవాఁడు జన్మద్వయంబునకు శివసాయుజ్యము నందఁ గలుగును. పాదమాత్రము నాచరించినవాఁడు దేహక్షయానంతరంబున బుద్ధితోఁగూడ బ్రహ్మాండపర్యంతమును గలభువనద్వయము నతిక్రమించి రుద్రస్థానంబును జేరుటకు సమర్థుండై యందు సహస్రయుగంబులు బహువిధభోగంబు లనుభవించి పుణ్యక్షయంబున మరల నీభూలోకమున సద్వంశమునం దుదయించి ద్యుతిమంతుండును, పూర్వసంస్కారవశంబున శివధర్మరతుండునై శివధ్యానంబు సేయుచుఁ గ్రమమ్ముగా శివపురగమనసామర్థ్యమును, విద్యేశ్వరపదలాభంబును, శివజ్ఞానలాభంబును, శివసాధర్మ్యసిద్ధియుఁ బడయఁగలుగును. మఱియు విషయాసక్తునివలెనే, శివాసక్తుండై నిత్యమును శివధ్యాననిరతుం డగువాఁడు శివధర్మము ననుష్ఠించినను, అనుష్ఠింపకున్నను ముక్తిలాభంబు సందఁగలుగును. శివధర్మాధికారి యగువాఁ డొకటి, రెండు, మూఁడు జన్మంబులలో ముక్తుఁడగును. అంతేగాని యాతని కితరులవలె మరల మరల నీసంసారమునందు గమనాగమనంబులు చేయవలసినపని లేదు. కావున నేవిధముచేనైనను శివాశ్రితుండై శుభలాభంబుకొఱకుత్సాహపూర్వకంబుగా శివధర్మమునం దాసక్తుఁడై యుండవలయును. పుణ్యసంస్కారగౌరవముచేతనే యిట్టిభావంబు గలుగవలయును గాని నిర్బంధమువలనఁ గలుగఁబోదు. కావున మంగళాకాంక్షు లగువారు విశేషించి శివధర్మాసక్తులు గావలయును.

— పూజావ్రతవిధానము. —

వాసుదేవా ! శివధర్మాధికారులకుఁగూడ ఇహఫలదాయకంబును, పరఫలదాయకంబును, ఇహపరఫలదాయకంబు నగుకామ్యకర్మం

బు గలదు. అది క్రియామయంబును, తపోమయంబును, జపమయం బును, ధ్యానమయంబును, సర్వమయంబు నని యైదువిధములు. అం దుఁ గ్రియామయకర్మము హోమదానార్చనాదులచే భిన్నరూపమైన ది. ఈసకలకర్మంబులును శక్తిమంతుం డగువానికే సఫలంబు లగును గాని యితరులకుఁ గానేరవు. మహేశ్వరునియాజ్ఞయే శక్తి గావున నెల్లవారును శివశాసనంబు ననుసరించియే కామ్యకర్మంబు లాచరింపవ లయును. శివునకును, మహేశ్వరునకును భేదము లేనట్లే శైవులకును, మాహేశ్వరులకును నెట్టిభేదంబునులేదు. కాని జ్ఞానయజ్ఞరతులగువారు శైవు లనియు, కర్మయజ్ఞనిరతు లగువారు మాహేశ్వరులనియుఁ బ్ర శంసింపఁబడుచుండురు. కావున శైవుల కాభ్యంతరకర్మంబులును, మాహేశ్వరులకు బాహ్యకర్మంబులును గర్తవ్యములుగా విధింపఁబడి యెను. ఈయుభయకర్మంబులయందును భేదమంతగాలేదు. విధివిహి తంబుగా భూపరీక్షచేసి దానిని గంధవర్ణరసాదులచే మనోజ్ఞంబు గా వించి వితానాచ్ఛాదితంబును, విలేపనాదిపరిష్కృతంబును జేసి దర్ప ణంబునుంబోలి నిర్మలంబుగా నొనరింపవలయును. అందుఁ బూర్వ భాగంబున నేకహస్తపరిమితంబైనను, ద్విహస్తపరిమితంబైనను నొక మండలమును రచించి దానియందు శక్త్యనుసారముగా స్వర్ణరత్నచూ ర్ణంబులచేఁ బంచావరణసంయుతంబును, శోభామయంబును, కర్ణికాస మంచితంబును, అష్టదళసంకలితంబును, విపులంబు నగు పద్మమును రచించి దళంబులయందు సిద్ధులను, కేసరంబులయందు సశక్తులగురు ద్రులను, పూర్వాద్యష్టదళంబులయందును, వామాద్యష్టశక్తులను, కర్ణి కయందు వైరాగ్యమును, బీజమునందు నవశక్తిని, కందమునందు శివ ధర్మమును, నాళంబున శైవజ్ఞానమును, కర్ణికోపరిభాగంబున సూర్య చంద్రమండలంబులను, తదుపరిభాగంబున దౌర్త్రేయంబును గోర్చి

చి సర్వోపరిభాగంబునఁ బార్వతీసహితుండును, సుఖాసీనుండును, విచి త్రకుసుమాలంకృతుండును, పంచావరణసంయుతుండును, శుద్ధస్ఫటిక సంకాశుండును, జటాకిరీటధారియు, శార్దూలచర్మాంబరుండును, మంద హాసముఖారవిందుండును నగుమహాదేవుని భావించి యాతనిపూర్వా దిపంచముఖంబులును, జంద్రశేఖరంబులును, త్రినయనశోభితంబులు ను, మనోజ్ఞంబులు నై యున్నట్లును, అమ్మహాదేవునిదక్షిణకరంబు లై దును, శూల, పరశు, వజ్ర, ఖడ్గానలంబులచే శోభిల్లుచున్నట్లును వా మకరంబు లైదును సర్ప, నారాచ, ఘంటా, పాశాంకుశకలితంబు లై యున్నట్లును, నివృత్తికళ యాతనిజానుద్వయపర్యంతంబును, ప్రతిష్ఠా కళ నాభిపర్యంతమును, విద్యాకళ గళపర్యంతమును, శాంతకళ లలా టపర్యంతమును, శాంత్యతీతకళ తదూర్ధ్వపర్యంతమును ఆవరించి యు న్నట్లును, పంచకళామూర్తియగు నాతని కీశానుండు కిరీటమును, పురు షుం డాననంబును, అఘోరుండు హృదయమును, వామదేవుండు గు హ్యంబును, సద్యోజాతుండు మూర్తియు నై యున్నట్లును, ఇచ్ఛాశక్తి యాతనిక్రోడంబునను, జ్ఞానశక్తి దక్షిణభాగంబునను, క్రియాశక్తి వా మభాగంబునను నధిష్ఠించి యున్నట్లును ఈవిధముగా సర్వేశ్వరుండగు మహాదేవుని ధ్యానంబు జేయుచు మూలమంత్రముచే మూర్తికల్పనం బును, సకలీకరణంబును గావించి శక్తిసహితుండగునాశివమూర్తిని అ ర్ఘ్యాంతంబువఱకును యథావిధిగ నర్చించి పూజించి యాకల్పితమూ ర్తియందు సదసద్వ్యక్తివర్జితుండగుపరమేశ్వరు నావాహనంబు చేసి పం చోపకరణంబులచేఁ బూజింపవలయును. బ్రహ్మమంత్రములు, షడం గమంత్రములు, మాతృకామంత్రములు, ప్రణవపూర్వకశివమంత్ర ము మొదలగువానిచేఁ గాని, కేవలశివమంత్రముచేఁ గాని యమ్మహా దేవుని బూజింపవలయును. అభిషేకంబుగాక పాద్యాదిముఖవాసపర్యం

తముగల సకలక్రియలచేతను గంధాదులచేతను యథాక్రమంబుగఁ బంచావరణపూజ గావింపవలయును. అందుఁ బార్వతీపరమేశ్వరుల దక్షిణవామభాగంబులయందు గణేశకార్తికేయులను బూజించి చుట్టును సశక్తులగు నీశానాదిపంచబ్రహ్మలను బ్రహ్మమంత్రములతోడను బూజింపవలయును. ఆగ్నేయాదికోణంబులయందు దేవదేవులహృదయాది షడంగములను, మరలఁ బూర్వాదిదిశలయందు వామాదిశక్తిసహితులగు అష్టరుద్రగణంబులను బూజింపవలయును. ఇది ప్రథమావణపూజ:—ద్వితీయావరణంబునఁ బూర్వదళంబునం దనంతుని, తద్వామభాగంబున నాతని శక్తిని, దక్షిణదళంబున శక్తిసహితంబుగా సూక్ష్ముని, పశ్చిమదళంబున సశక్తుం డగుశివుని, ఉత్తరదళంబునం దేకనేత్రుని, ఈశానదళంబున నేకరుద్రుని, శక్తిని, ఆగ్నేయదళంబునఁ ద్రినేత్రుని, శక్తిని, నైరృతిదళంబున శ్రీకంఠుని, శక్తిని, వాయవ్యదళంబున శిఖండీశ్వరుని చతుర్దిశలయందును జక్రవర్తిగణంబులను బూజింపవలయును:—తృతీయావరణమునందు పూర్వాద్యష్టదళంబులయందును శక్తిసహితులగు అష్టమూర్తులను బూజింపవలయును. భవుఁడు, శర్వుఁడు, ఈశానుఁడు, రుద్రుఁడు, పశుపతి, ఉగ్రుఁడు, భీముఁడు, మహాదేవుఁడు ననువీరే యష్టమూర్తులు.

తరువాత వీరియేకాదశమూర్తులను శక్తులతోఁగూడఁ బూజింపవలయును. మహాదేవుఁడు, శివుఁడు, రుద్రుఁడు, శంకరుఁడు, నీలలోహితుఁడు, ఈశానుఁడు, విజయుఁడు, భీముఁడు, దేవదేవుఁడు, భవోద్భవుఁడు, కపాలీశుఁడు ననువీరు ఏకాదశమూర్తులు. ఈతృతీయావరణమధ్యంబున నగ్రభాగంబున వృషేంద్రుని, తద్దక్షిణంబున నందిని, ఉత్తరంబున మహాకాలుని అగ్నిదళంబున శాస్తను, దక్షిణదళంబున మాతృగణంబును, నైరృతిదళంబున గజాననుని, పశ్చిమదళంబునఁ గార్తికే

యుని, వాయవ్యదళంబున జ్యేష్ఠను, ఉత్తరదళంబున గౌరిని, ఈశాన కోణంబునఁ జండుని, శాస్త్రానందీశ్వరులమధ్యభాగంబున మునీంద్రుఁ డగువృషభుని, మహాకాలున కుత్తరంబున పింగళుని, శాస్త్రకును మాతృగణంబునకును నడుమ భృంగీశ్వరుని, మాతృగణగణేశ్వరమధ్యంబున వీరభద్రుని, గణేశకార్తికేయులనడుమ దేవి యగుసరస్వతిని, కార్తికేయజ్యేష్ఠలనడుమ లక్ష్మీదేవిని, జ్యేష్ఠాగణాంబామధ్యమున మహామోటిని, గణాంబాచండమధ్యంబున దేవియగుదుర్గను బూజింపవలయును. ఈతృతీయావరణమునందు శక్తిసహితులగురుద్రులను, ప్రమథులను, భూతగణాదిశివానుచరసమూహంబులను, దేవీసఖులను ధ్యానించుచు సమాహితచిత్తముతోఁ బూజింపవలయును—అనంతరము చతుర్థావరణంబునఁ బూర్వదళంబునం దాదిత్యుని, దక్షిణదళంబున బ్రహ్మను, పశ్చిమదళంబున రుద్రుని, ఉత్తరదళంబున విష్ణుని బూజించి యీచతుర్దేవతావరణంబులయందును షడంగపూజయు, దీప్తాది శక్తిపూజయుఁ గావింపవలయును. దీప్త, సూక్ష్మ, జయ, భద్ర, విభూతి, విమల, అమోఘ, విద్యుత యనునివి శక్తులు. ఇవి పూర్వాద్యష్టదిశలయందును యథాక్రమంబుగ సుస్థితంబులై యుండును—ద్వితీయావరణమునందుఁ బూర్వాదిచతుర్దిశలను బూర్వోక్తమూర్తిచతుష్టయంబును శక్తిసహితముగాఁ బూజింపవలయును. ఆదిత్యుఁడు, భానుఁడు, భాస్కరుఁడు, రవి, అర్కుఁడు, బ్రహ్మ, రుద్రుఁడు, విష్ణుఁడు, అనువీరు సూర్యునిశక్తులు. పూర్వదిశను విస్తారను, దక్షిణంబున సుతారను, పశ్చిమంబున బోధనిని, ఉత్తరంబున ఆప్యాయనిని, ఈశానాది కోణంబులయందు ఉషాపరిభాపరిజ్ఞానసంధ్యలను యథాక్రమంబుగ ద్వితీయావరణంబునఁ బూజింపవలయును. సోమమంగళబుధగురుశుక్రశనిరాహుకేతువులను తృతీయావరణంబునఁ బూజింపవలయును. అట్లు

గాఁ దేని ద్వితీయావరణంబున ద్వాదశాదిత్యులను బూజింపవలయును. తృతీయావరణమధ్యంబున ద్వాదశరాసులను, దాని బహిర్భాగంబున సప్తసప్తగణంబులను, ఋషులను, దేవతలను, గంధర్వులను, పన్నగులను, అప్సరోగణంబులను, గ్రామణులను, ధంపములను, వాలఖిల్యగణంబులను బూజింపవలయును. ఇట్లు తృతీయావరణమధ్యంబున దివాకరుని, బ్రహ్మను ఆవరణత్రయసహితముగాఁ బూజించి పూర్వదిశను హిరణ్యగర్భుం డగుబ్రహ్మను, దక్షిణంబున విరాట్టును, పశ్చిమంబునఁ గాలుని, ఉత్తరంబునఁ బురుషుని నర్చింపవలయును. అందు బ్రహ్మ పద్మసన్నిభుం డనియు, కాలుఁ డంజనసదృశుం డనియు, పురుషుండు స్ఫటికసంకాశుఁ డనియు భావింపవలయును. ఈనలువురను గ్రమముగాఁ ద్రిగుణ, రజోగుణ, తమోగుణ, సత్త్వగుణసంపన్నులని యెఱుంగవలయును. వీరిని బ్రథమావరణంబునఁ బూజించి ద్వితీయావరణమధ్యంబునఁ బూర్వాది చతుర్దిశలను సనత్కుమార, సనక, సనంద, సనాతనులను బూజింపవలయును. తృతీయావరణమధ్యంబున దక్షాదిక్రతుపర్యంతముంగల అష్టప్రజాపతులను బూర్వాదిదిశలయందు బూజింపవలయును. దక్షుఁడు, రుచి, భృగుఁడు, మరీచి, అంగిరుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, అత్రి, కశ్యపుఁడు, వసిష్ఠుఁడు, ననువారు ప్రజాపతులు. ఈప్రజాపతులను బత్నీసహితముగా నర్చింపవలయును. ప్రసూతి, ఆకూతి, ఖ్యాతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ, సన్నతి, అనసూయ, అదితి, అరుంధతి యనుసీపతివ్రతలు యథాక్రమంబుగఁ బ్రజాపతులభార్యలని యెఱుంగవలయును. ప్రథమావరణమధ్యంబున వేదచతుష్టయంబును, ద్వితీయావరణమధ్యంబున నితిహాసపురాణములను, తృతీయావరణమధ్యంబున ధర్మశాస్త్రాది సకలవైదికవిద్యలను బూజింపవలయును. ఈవిధముగా

ఆవరణత్రియసహితుం డగుబ్రహ్మను దక్షిణదిశయందుఁ బూజించి, పశ్చిమదిశను సావరణంబుగా రుద్రపూజ గావింపవలయును. పంచబ్రహ్మలును, షడంగములును, రుద్రుని ప్రథమావరణం బనియు, విద్యేశ్వరమయంబు ద్వితీయావరణం బనియు నెఱుంగవలయును. తృతీయావరణంబునఁ బూర్వదిశయందు త్రిగుణాత్మకుండును గళాయుతుండు నగుశివుని, దక్షిణంబున రజోగుణమయుండును, సృష్టయు, భవుండు నగుబ్రహ్మను, పశ్చిమంబునఁ దమోగుణమయుండును సంహర్త్తయు నగుహరుని, ఉత్తరంబున సత్వమయుండును, సుఖకర్త్తయు, విశ్వపతియు, మృడుండు నగువిష్ణుని, ఈరీతిగా శంభుని పశ్చిమపార్శ్వమునందు షడ్వింశకుం డగుశివుని, ఉత్తరంబున వైకుంఠుని, పూర్వపార్శ్వంబున వాసుదేవుని బూజింపవలయును. ఇది ప్రథమావరణపూజ. అందు ద్వితీయావరణంబున మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, రామత్రియ, కృష్ణ, హయగ్రీవులను, తృతీయావరణమధ్యంబునఁ బూర్వదిశయందు చక్రమును, దక్షిణంబున నారాయణాస్త్రమును, పశ్చిమంబున పాంచజన్యమును, ఉత్తరంబున శార్ఙ్గమును బూజించి యావరణత్రియయుతుం డగు మహావిష్ణుని మూర్తికల్పనంబు చేసి పూజింపవలయును. ఈవిధముగా విష్ణుదేవుని చతుర్వ్యూహమూర్తిచతుష్టయమును బూజించి, అగ్నికోణంబున ప్రభను, నైరృతికోణంబున సరస్వతిని, వాయుకోణంబున గణాంబికను, ఈశానకోణంబున లక్ష్మిని బూజింపవలయును. తరువాత శక్తిసహితంబుగా భానుప్రభృతిమూర్తులను బూజించి యాతృతీయావరణమధ్యంబునం దష్టదిక్పాలకులను బూజింపవలయును. ఈరీతిగా చతుర్థావరణపూజచేసి, తద్బహిర్భాగంబున మహేశ్వరుని యాయుధంబులను బూజింపవలయును—అందు ఈశానకోణంబునఁద్రిశూలమును, పూర్వదిశయందు వజ్రమును, అగ్ని

కోణంబున పరశువును, దక్షిణంబున సాయకమును, నిరృతికోణంబున ఖడ్గమును, పశ్చిమంబున పాశమును, వాయుకోణంబున అంకుశమును, ఉత్తరంబున పినాకమును బూజించి పశ్చిమాభిముఖంబుగా రుద్రక్షేత్రపాలకపూజం గావింపవలయును. పిమ్మట పంచమావరణపూజ గావింపవలయును. అందు మధ్యభాగంబున నెదుట మాతృగణసహితంబుగా మహోక్షంబును బూజించి చుట్టును సకలదేవయోనులను, సురలను, ఋషులను, సిద్ధదైత్యయక్షరాక్షసులను, అనంతాదినాగగణంబులను, భూతబేతాళాదులను, గిరికందరసముద్రకాననంబులను, సరోవరంబులను, వృక్షంబులను, పశుపక్ష్యాదిక్షుద్రజీవగణంబులను, మానవగణంబులను, వివిధంబులగు మృగంబులను, అంతర్బ్రహ్మాండస్థితంబులగుభువనంబులను, బ్రహ్మాండకోటులను, బహిర్బ్రహ్మాండస్థితంబులగుభువనంబులను, తదధిపతులను, బ్రహ్మాండధరులై దశదిశలయందున్న రుద్రగణంబులను, చిదచిదాత్మకం బగుసర్వంబును పార్వతీపరమేశ్వరులపార్శ్వమునందు భావించి ధ్యానించుచుఁ బూజింపవలయును. ఇట్లు పూజితులగు సకలదేవతాగణంబులును మందహాసవదనములతోఁ గృతాంజలిపుటులై పరమానందంబున నుమామహేశ్వరులను సర్వదా నిరీక్షించుచున్నట్లు భావింపవలయును.

సర్వవిఘ్నశాంతికొఱకీవిధముగా ఆవరణపూజ నిర్వర్తించి మరల దేవదేవుల నర్చించి పంచాక్షరమంత్రమును జపింపవలయును. పిమ్మట నమృతోపమానంబును, ఉత్తమాన్నంబు సహితంబగు మహాచరువును దేవదేవులకు నివేదింపవలయును. ఆచరువు ప్రస్థత్రింశద్భాధకపరిమితంబైనచోఁ బ్రశస్తము ; పంచాశత్కుడుబంబున కన్యూనమైనచో నధమము నని చెప్పంబడియెను. కావున శక్తికొలఁది భక్తిపూర్వకంబుగా చరునివేదనంబు గావింపవలయును. చరుపాత్రఁ [illegible]

బును, సర్వోపకరణసహితముగా తాంబూలమును, అర్పించి నీరాజ నాదుల నొసంగి శేషపూజ గావింపవలయును. శక్తి కొలఁది నుత్తమం బులగుపూజాద్రవ్యములను సేకరింపవలయును గాని యెంతమాత్రము ను విత్తశాఠ్యము గావింపరాదు. శఠులు, ఉపేక్షకులు, డంభులు నగు వారు గావించు కామ్యకర్మంబులుత్తమానుష్ఠితంబులయ్యును సఫలం బులు గాఁజాలవు. కావున సిద్ధికాములగువారు, శాఠ్యంబును, ఉపే క్షాదులను బరిత్యజించి నిఖిలకర్మాంగసమన్వితంబుగాఁ గామ్యకర్మం బులం దీర్పవలయును. ఈవిధముగాఁ బూజించినతరువాత దేవదేవుల కుఁ బ్రిణామంబును, భక్తిపూర్వకంబుగా స్తోత్రపాఠంబును గావింప వలయును. అనంతరము పంచాక్షరమంత్రమును జపించి విద్యాపూజ యు, గురుపూజయుఁ గావించి యథోచితప్రదానంబులతో సదస్యుల నర్చింపవలయును. తరువాత సకలావరణసహితంబుగా దేవదేవు ను ద్వాసనంబుగావించి గురునకు మండలనివేదనంబొనరింపవలయును. అట్లుగా దేని యాద్రివ్యంబుల నన్నిటి నొకశివభక్తునకు దానము చేయ వలయును.

ఇట్లు యథావిధిగ నావరణపూజ ముగించి శివాగ్నియందు హోమద్రవ్యంబులచే శివునిగూర్చి హోమంబుగావించి సకలావరణ దేవతలనుద్దేశించి సక్తువుమొదలగువానిచే హోమముచేసి యర్పింపవల యును. ఇది సకలయాగంబులకంటెను త్రిభువనంబులఁ బ్రశస్తంబై నది. దీనితోసమానంబగుయాగ మీజగంబునం దెందును లేదు. దీని మూలమునఁ బడయరానియుత్తమఫలం బేదియును లేదు. ఇది నిఖిల శుభసాధనంబని యెఱుంగవలయును. ఇది మానవులయభిమతఫలదా నవిషయంబునఁ జింతామణివంటిది. కావునఁ దుచ్ఛఫలంబు నాసించి దీనిని బ్రయోగింపఁగూడదు. లఘుప్రార్థనంబు గావించినచో నీయు

త్తమయాగంబు లఘుతరమై పోవును. ఏట్టి ఫలంబైనను దీనిమూలమున సిద్ధించుననుట కెంతమాత్రమును సంశయము లేదు. కర్మఫలము మహాదేవున కర్పింపవలయును. విచక్షణులగువారు అనన్యలభ్యంబులగు శత్రు, మృత్యుంజయాదులకొఱకును, మహాపాపమహారోగభయఘోరాదివిముక్తులకొఱకును, దుర్భిక్షాదిశాంతులకొఱకును, ఇమ్మహాయాగమును వినియోగించుచుందురు. ఇది శైవగణంబులకు మహావిపన్నివారకమైనదనియు, మదీయంబగు నస్త్రరాజంబనియు మహాదేవుం డుపదేశించియున్నాఁడు. కావున నీజగంబునందు దీనినిమించిన పరిత్రాణసాధనం బేదియును లేదు. కేవలమహేశ్వరస్తోత్రపాఠమువలననే మానవుండు తనయభిమతఫలమునందపాంశమును బడయఁగలుగును. అర్థగ్రహణంబుచేసి భక్తిపూర్వకంబుగా స్తోత్రమును బఠించువాఁడు చతుర్థభాగఫలలాభంబు నందును. అష్టమి, చతుర్దశి, పర్వదినములు మొదలగువానియం దుపవసించి యర్థానుసంధానంబు చేయుచు స్తోత్రంబు గావించువాఁ డర్ధభాగఫలలాభంబు గాంచును. పర్వదినంబున నీవ్రతము ననుష్ఠించి యొకమాసమువఱకు నియతుండై స్తోత్రపాఠంబు చేయువాఁడు సంపూర్ణఫలలాభంబు నందఁగలఁడు.

ఉమామహేశ్వరస్తోత్రము.

ఉపమన్యుం డిట్లనియెను. శ్రీకృష్ణా! ఏస్తోత్రముచేఁ బూర్వోక్తంబగునుత్తమకర్మంబు సంపన్నంబగునో యట్టి పవిత్రస్తోత్రమును బంచావరణపద్ధతి ననుసరించి చెప్పెద నాకర్ణింపుము:— “జగదేకనాథా! స్వభావసుందరా! చిత్స్వభావా! కలుషప్రపంచరహితా! అవాఙ్మనసగోచరా! స్వభావనిర్మలా! భోగవిహీనా! సుందరచేష్టితా! స్వాత్మతుల్యమహాశక్తీ! శుద్ధగుణసముద్రా! అనంతకాంతిసం

పన్నా ! అనుపమవిగ్రహా ! నీకు జయమగుఁగాక ! అతర్క్యమహిమా ధారుండవు, స్థిరమంగళుండవు, నిరంజనుఁడవు, నిరాధారుఁడవు, నిష్కారణోదయుండవు, నిరంతరపరమానందమయుండవు, నివృత్తికారణుండవు, సర్వోన్నతపరమైశ్వర్యవంతుండవు, కరుణాస్పదుండవు, స్వతంత్రుఁడవు నగునీకు విజయంబగుఁగాక ! సర్వసువ్యుండును, అసదృశవైభవుండును, విశ్వావృతుండును, అనావృతుండును, అతిశ్రేష్ఠుండును, అద్భుతుండును, అక్షుద్రుండును, అక్షతుండును, అవ్యయుండును, అమేయుండును, నిర్మాయుండును, అభవుండును, అమలుండును, మహాభుజుండును, మహాసారుండును, మహారథుండును, మహాబలుండును, మహారథుండు నగునిన్నుఁగూర్చి మాటిమాటికిని జయసంకీర్తనము గావించుచుండెదను ఓపరమాత్మా నీకునమస్కారము. పరమకారణా ! శివా ! శాంతమూర్తీ ! శివతరా ! నీకు వందనములు. దేవా ! సురాసురసమగ్రంబగు నీ జగం బంతయు నీయధీనమైనది. నీయాజ్ఞ నతిక్రమింపఁగలవా రెవ్వరు ? పరమేశ్వరా ! నిరంతరము నిన్నాశ్రయించియున్న యీభక్తుని యం దనుగ్రహించి సఫలమనోరథునిం గావింపుము—ఓజగన్మాతా ! అంబికా ! సర్వజగన్మయీ ! అపారైశ్వర్యస్వరూపిణీ ! అనుపమానసుందరమూర్తీ ! అవాఙ్మానసగోచరీ ! నీకు జయమగుఁగాక ! తల్లీ ! నీ వజ్ఞానాంధకారమును నశింపఁజేయఁగలదానవు. నీకు జన్మజరామరణంబులు లేవు. నీయవస్థ లనేకవిధములైనవి. నీవనేకరూపాత్మికవు, అనేకమహాశక్తిసంపన్నవు, అనేకగుణవిభూషితవు, అనేకగుణాత్మికవు.

ఓలోకేశ్వరీ ! విశ్వాధికారిణీ ! విశ్వేశ్వరప్రియా ! విశ్వసురారాధ్యా ! విశ్వవిజృంభిణీ ! సర్వమంగళస్వరూపిణీ ! మంగళదీపికా ! మంగళచరిత్రా ! మంగళదాయినీ ! పరమకల్యాణీ ! నీకు విజయంబగుఁగాక ! ఓవిశ్వపరా ! దేవీ ! గుణమయవిగ్రహా ! శివశక్తీ ! శివా ! నీకు

నమస్కారము. దేవీ! నీనుండియే యీజగంబంతయు నుత్పన్నంబైనది. నీయందే విలీనంబు గాఁగలదు. కావుననో పరమేశ్వరీ! నీసహాయంబు లేకుండఁ బరమేశ్వరుండైన నిష్టఫలంబును బ్రసాదింపఁజాలఁడు. దేవదేవీ! భక్తుండనగు నేను ఆజన్మాంతము నిన్నాశ్రయించి యుంటిని. నీకృపాకటాక్షంబుల నాపైఁబఱపి నామనోరథంబుల సఫలంబులుగాఁ జేయుము:—పంచవక్త్రుండును, దశభుజుండును, శుద్ధస్ఫటికసన్నిభుండును, వర్ణబ్రహ్మకళాదేహుండును, (పంచవర్ణములు, పంచకళలు పంచబ్రహ్మలు) సకలుండును, నిష్కళుండును, దేవుండును, శివమూర్తిధరుండును, శాంత్యతీతుండు నగుసదాశివుండు భక్తిపూర్వకంబుగా నాచే నర్చితుండై నాకోరికలం దీర్చుఁగాక! మఱియు, సర్వలోకమాతయు, సదాశివాంకవిహారిణియు, శివాభిలాషయు, నగు నిచ్ఛాశక్తి మన్మనోరథసిద్ధిం జేకూర్చుఁగాత:—బ్రహ్మాదిదేవతలచే నారాధితులును, భార్యలును, సర్వలోకరక్షణోద్యుక్తులును స్వాంశభేదంబులచే ననేకావతారంబులం దాల్చువారును, ఉమామహేశ్వరులకుఁ బుత్రులునగు గణేశకార్తికేయులు నాచే నభ్యర్చితులై దేవదేవులయాజ్ఞానుసారంబుగా మదపేక్షితంబుల సిద్ధింపఁజేయుదురుగాత!—పరమాత్ముండగుశివునిపూర్వాంగంబున విరాజితుండును, పంచమవదనమూర్తిధారియు, శుద్ధస్ఫటికాకృతియు, శివారాధనరతుండును, పంచాక్షరమంత్రమునందలి పంచమబీజాత్మకుండును, పంచకళాయుతుండును, ప్రథమావరణంబున శక్తిసహితముగా నాచే నర్చితుండును, బరమపవిత్రుండు నగుపంచమబ్రహ్మ మత్ప్రార్థితమును బ్రసాదించుఁగాక—బాలసూర్యప్రతీకాశుండును, శివునకుఁ బూర్వవదనస్వరూపుండును, శివపాదార్చనారతుండును, శాంత్యాత్మకుండును, పంచాక్షరమంత్రంబునందలి చతుర్థబీజాత్మకుండును, చతుష్కళానుపన్నుండును శక్తిసహితముగాఁ

బూర్వదిగ్భాగంబున నాచే నర్చితుండు నగుతత్పురుషనామకచతుర్థబ్రహ్మ యనుగ్రహంబుచే నాయభిలషితంబు సిద్ధింపఁజేయుఁగాక — దేవదేవుని దక్షిణవక్త్రస్వరూపుఁడును, విద్యాకళాధిష్ఠితుండును, వహ్నిమండలమధ్యస్థుండును, శివబీజంబులయందు తృతీయబీజాత్మకుండును, అష్టకళాత్మకుండును, అంజనాచలప్రభుండును, దేవదేవునిదక్షిణభాగంబున నాచే నర్చితుండును, ఘోరవిగ్రహుండు నగు అఘోరనామక తృతీయబ్రహ్మ నాయభీప్సితంబు నెఱవేర్చుంగాక! పరమేశ్వరుని యుత్తరవదనస్వరూపుఁడును, ప్రతిష్ఠాకళాధిష్ఠితుండును శివబీజంబులలో ద్వితీయబీజస్వరూపుఁడును, త్రయోదశకళాసమన్వితుండును, కుంకుమప్రభుండును, వారిమండలమధ్యస్థుండును, శక్తిసహితంబుగా శివునియుత్తరభాగంబున నాచే నభ్యర్చితుండును, శివార్చనాపరాయణుండును, వామాభిధానుండును నగుద్వితీయబ్రహ్మకరుణచేనాయభిమతార్థసిద్ధియగుఁగాక! — శివునిపశ్చిమముఖస్వరూపుఁడును, శివబీజంబులలోఁ బ్రథమబీజమూర్తియు, అష్టకళాలంకృతుండును, శివారాధనతత్పరుండును, నివృత్తిపదస్థుండును, పృథ్వీస్థితుండును, దేవునిపశ్చిమభాగంబున శక్తిసహితముగా నాచేఁ బూజితుండును, పవిత్రుండును, సద్యోజాతాభిధానుండును, కుందేందుధవళాకారుండును నగుప్రథమబ్రహ్మకరుణచే మదభిలషితంబు సంపన్నంబగుఁగాక! శివభావాన్వితలగు శివశక్తులహ్మాన్మూర్తులు దేవదేవుల యాజ్ఞంగొంచి నన్ను కృతార్థుంజేయుదురుగాక —

మఱియు నుమామహేశ్వరులశిరోమూర్తిద్వయంబును, నయనమూర్తిద్వయంబును, వర్మమూర్తిద్వయంబును, అస్త్రమూర్తిద్వయంబును దేవదేవులయాజ్ఞానుసారంబుగా నన్నుద్ధరించెదరుగాక - మఱియు వాముండును, జ్యేష్ఠుండును, కాలుండును, వికరణుండును, బలుండును,

బలవికరణుండును, బలప్రమథనుండును, సర్వభూతదమనుండును దమ
యష్టశక్తులతోఁగూడ నాచే నర్చితులై పరమేశ్వరాజ్ఞచే నన్ను రక్షిం
తురుగాక—ద్వితీయావరణంబున నాచేఁ బూజితులైన అనంతుండు
ను, సూక్ష్ముండును, శివుండును, ఏకనేత్రుండును. ఏకరుద్రుండును,
త్రిమూర్తియు, శ్రీకంఠుండును, శిఖండీశ్వరుండును దమయష్టశక్తుల
తో దేవదేవులయాజ్ఞం గాంచి నన్నుఁ గటాక్షించెదరుగాక!—తృతీ
యావరణపూజితులగు భవాద్యష్టమూర్తులును, వారియష్టశక్తులును,
శక్తిసహితులగు మహాదేవాద్యేకాదశమూర్తులును నన్నాదరించెదరుగా
క- మహాదేవసదృశగంభీరనిఃస్వనయుతంబును, మేరుమందరకైలాసహి
మాచలసదృశంబును, సితాభ్రశిఖరాకృతియు, ద్యుతిమంతంబును, ర
క్తవదనంబును,రక్తచరణంబును, పీవరోన్నతాంగంబును, చారుగమనం
బును,శుభలక్షణోపేతంబును, మణివిభూషితంబును, రక్తలోచనంబును,
శ్రీమంతంబును, శూలధరంబును, దేవదేవులచరణకమలవిన్యాసంబుచేఁ
బవిత్రీకృతాంగంబును, శివప్రియంబును, శివాసక్తంబును, శివధ్వజం
బును, శివవాహనంబును, గోరాజంబును, మహాతేజంబు నగువృషేం
ద్రము దేవదేవులయాజ్ఞచే నన్నాదరించుఁగాక—సర్వదానారాయణా
ది నిఖిలదేవతలచే నభ్యర్చితుండును, దేవదేవుల యంతఃపురపాలకుం
డును, సర్వేశ్వరసమానుండును, సర్వాసురమర్దనుండును, శివధర్మాధ్య
క్షుండును, శివప్రియుండును, శివాసక్తుండును, శ్రీమంతుండును, శూ
లాయుధధరుండును, శివాశ్రితసంసక్తుండును, తదనురక్తుండును, నగేం
ద్రతనయాత్మజుండు నగుచండీశ్వరుఁడు దేవదేవీశాసనంబున నన్ననుగ్ర
హించుఁగాక! మహాదేవాశ్రితగణాధ్యక్షుండును, మహాదేవసదృశుండు
ను, శివప్రియప్రియుండును, శివాసక్తుండును, శివార్చనపరాయణుండు
ను, మహాబాహుండు నగుమహాకాలుండు నన్నుఁ గటాక్షించుఁగాక-

గవ్రప్రియుండును, శివాసక్తచిత్తుండును, సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞుండును, పరామూర్తియు, మహామోహితనయుండును, మధుమాంసాసవప్రియుండు నగుశాస్త శివాజ్ఞచే నన్నుఁ గాపాడుఁగాక—బ్రహ్మాణి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, మాహేంద్రి, చండవిక్రమ, చాముండ యనునీమాతృగణంబులు పరమేశ్వరాజ్ఞచే నన్నుఁ బాలింతురుగాక—ఐరావతాది గజేంద్రసేవితుండును, ఆకాశదేహుండును, దిగ్బాహుండును, చంద్రసూర్యాగ్నినేత్రుండును, దేవతాగణవిఘ్ననాశకుండును, అసురగణవిఘ్నకారియు, ఉమాతనయుండును, శంకరాత్మజుండు నగువిఘ్నేశ్వరుండు నాకనుకూలుండగుఁగాక—అగ్ని, పార్వతి, గంగ, కృత్తికలు, గణాంబిక యనువారికిఁ దనయుండును, తేజోమయుండును, శాఖోపశాఖంబులగు నైగమేయంబులచే నావృతుండును, ఇంద్రవిజయుండును, ఇంద్రసేనానియు, తారకారియు, కమలలోచనుండును, సుకుమారాకారుండును, శివచరణారాధనపరాయణుండునగు కార్తికేయుండు శివశాసనంబున నన్నుఁ గాపాడుఁగాక—శివార్చనారతయు, శ్రేష్ఠయు, వరదయు, నగుజ్యేష్ఠాదేవి మహాదేవాజ్ఞచే నన్నుఁ గృతార్థునిం గావించుఁగాక!

దేవతాప్రార్థనంబుచే భవానీమూర్తినుండి విభక్తలై మహేశ్వరునిభ్రూమధ్యమునుండి యుద్భవించి త్రిలోకవందితలును, ఉల్కాకృతులు నగు దాక్షాయణి, సతి, హైమవతి, ఉమ, కౌశికజనని, భద్రకాళీజనని, పాటలాజనని, రుద్రవల్లభ, రుద్రాణి యనునీగణాంబికలు శివాజ్ఞచే నన్నను గ్రహింతురుగాక—శంభువదనసంభూతుండును, గణేశ్వరుండు నగుచండుండు నన్ను రక్షించుఁగాక—శివపాదార్చనరతుండును, గణేశ్వరుండు నగువృషభుండును, శివాసక్తుండును, శ్రీమంతుండు నగుపింగళుండును, శివప్రియుండగు భృంగీశ్వరుండును, దక్ష

యజ్ఞధ్వంసకుండును, దక్షశిరఃకర్తనుండును, దిక్పాలగర్వమోచకుండును, శివానుచరుండును, శివాజ్ఞాప్రతిపాలకుండును, శ్రీమంతుండును, భద్రకాళీప్రియుండును, మాతృగణరక్షకుండును, హిమకుందేందుసంకాశుండును, మహాతేజుండునగు వీరభద్రుండును, మహేశ్వరముఖకమలవినిర్గతయు, విష్ణువక్షస్స్థలాలయయు, ఉమామహేశ్వరపూజానిరతయు నగులక్ష్మీదేవియు, శివార్చనానిరత యగుమహామోటియు, దేవదేవుల యాజ్ఞానుసారంబుగా నన్నుఁ బరిపాలింతురుగాక — పార్వతీనందినియు, సింహాసీనయు, మహిషమర్దనియు, విష్ణువిద్రియు, శుంభనిశుంభసంహారిణియు, మధుమాంసాసవప్రియయు నగుకౌశికీదేవియు, రుద్రసమానులగురుద్రులును, తేజోమయులగుప్రమథులును, మహావీర్యులును, మహాదేవసదృశులును, నిత్యముక్తులును, నిరుపమానులును, నిర్ద్వంద్వులును, నిరుపప్లవులును, సర్వలోకనమస్కృతులును, సానుచరులును, పరస్పరాసక్తులును నగుభూతగణంబులును సశక్తులై నన్ను సర్వశక్తిసంపన్నుం గావింతురుగాక — తృతీయావరణార్చితలును, దేవీలక్షణసంపన్నలునగురుద్రకన్యలు నాకు మంగళాపాదనంబు గావింతురుగాక — సృష్టిస్థితిలయకారణుండును, సగుణుండయ్యు నిర్గుణుండును, గుణమాత్రుండును, అవికారుండయ్యును జగత్ప్రకాశరూపవికారయుతుండును, అవరణభేదంబుచే మూఁడు, నాలు, గైదుభాగంబులుగా విభక్తుండును, చతుర్థావరణంబున సానుచరంబుగా నాచేఁ బూజితుండును, మహేశ్వరునిభిన్నమూర్తియు, మండలాకారుండును, శివప్రియుండును, [illegible]ర్తుండును నగుభాస్కరుండు నన్ను స్థిరమనోరథుం జేయుంగాక — మరియు దివాకరుని వ్యూహమూదిపసంగములును, ఆదిత్యుఁడు, భాస్కరుఁడు, భానుఁడు, రవి, అర్కుఁడు, బ్రహ్మ, విష్ణుఁడు, రుద్రుఁ... యనాదిత్యమూర్తులును, విస్తారి, సుతారా, బోధిని, అప్యాయని, ఉమా,

ప్రభ, ప్రజ్ఞ, సంధ్య యనునీసకలశక్తులును ఈశ్వరాజ్ఞచే నాకు స్వస్థత్వముం బ్రసాదించుఁగాత!—శివభావసంపన్నులగు నవగ్రహగణంబులును, ద్వాదశాదిత్యులును నాకు మంగళసంపాదకులయ్యెదరుగాక—దేవర్షిగంధర్వపన్నగాప్సరోగణంబులును, గ్రామణులును, యక్షరాక్షసగణంబులును, సప్తసప్తగణంబులును, వాలఖిల్యాదిమునిగణంబులును నన్ననుగ్రహింతురుగాక—సగుణుండయ్యు నిర్గుణుండును, అసాధారణంబులగుసృష్టిస్థితిలయాదికర్మంబుల కనుష్ఠాతయు, పంచావరణంబులచేఁ బంచధావిభక్తుండును, సానుచరంబుగాఁ జతుర్థావరణంబునందుఁ బూజితుండును, అవికారుండును, బుద్ధితత్త్వస్థితుండును, చతుష్షష్టిగుణైశ్వర్యసంపన్నుండును, భూమండలాధిపతియు, దేవదేవప్రియవాసమూర్తియు, శివప్రియుండును, శివపాదార్చనరతుండు నగుబ్రహ్మదేవుండు నాయెడలఁ బ్రసన్నుండగుఁగాక!—హిరణ్యగర్భుఁడు, లోకేశుఁడు, విరాట్టు, కాలుఁడు, పురుషుఁడు, సనత్కుమారుఁడు, సనకుఁడు, సనందుఁడు, సనాతనుఁడు, సపత్నీకులగుదక్షాదిప్రజాపతులును, ధర్ముండును, సంకల్పుఁడును, నాకు భద్రంబాదించెదరుగాక—పరస్పరావిరుద్ధార్థంబులును, శివైకప్రతిపాదకంబులు, శాస్త్రపురాణేతిహాససమన్వితంబులు నగువేదములు నాకు శుభంబు గూర్తురుగాక! ఈవిశ్వమునందు బహిరంతర్వర్తమానుండును, బ్రహ్మాదికర్తృకారియు, బ్రహ్మవిష్ణువులకు జనకుండును, వారికిఁ బుత్రుండును, దన్నియంతయు, బోధకుండును, అనుగ్రహదాయకుండును, నిర్గుణుండును, త్రిగుణమయుండును, సృష్టిస్థితిలయకారణుండును లోకద్వయాధీశ్వరుండు నగురుద్రుండు నన్నుఁ గరుణించుఁగాక—ఆరుద్రునిహృదయాదిషడంగములును, విద్యేశ్వరాష్టకంబును, శివ, భవ, హర, మృడాదిమూర్తిచతుష్టయంబును నాకు శుభకరంబులగుఁగాక—[illegible]

ను ముగ్ధమై యుండునో, ఎవ్వఁడు భూభారహరణంబునకై భృగుశాపంబుచే దశావతారంబు లెత్తెనో, వైష్ణవగణంబులు మూర్తిత్రయం బగువాసనంబున మహావిష్ణు, సదాశివమూర్తులం గల్పించుకొని యెవ్వనిఁ బూజించుచుందురో, ఎవ్వఁడు బ్రహ్మకు స్రష్ట యయ్యె నాతనిచే సృజింపఁబడియెనో, ఎవ్వఁడు బహిరంతరంబుల విరాజిల్లుచు విశ్వమంతటను వ్యాపించియుండునో, యట్టి సర్వగుణమయుండును, సూర్యాదివికారుండును, వారితత్త్వాధీశ్వరుండును, అనంతరూపుండును, అవ్యక్తుండును, మాయావియు, అపారబలుండును, ఉపేంద్రుండును, శివమూర్తియు, చక్రపాణియు నగువిష్ణుదేవుండు నాకు రక్షకుండగుఁగాక! వాసుదేవానిరుద్ధప్రద్యుమ్న సంకర్షణ నామంబులచే నొప్పు విష్ణుదేవుని మూర్తిచతుష్టయంబును, మత్స్యకూర్మాద్యవతారంబులును, సుదర్శన చక్రంబును, శార్ఙ్గంబును, పాంచజన్యంబును నన్నుఁ గాపాడుఁగాక! బ్రాహ్మీసరస్వతీగౌరీలక్ష్మీప్రభృతిదేవీగణంబులు నన్నుఁ గృపఁ జూతురుగాక—అష్టదిక్పాలకులు నన్ననుగ్రహింతురుగాక—త్రిశూలవజ్రాంకుశ సాయకఖడ్గపాశాంకుశంబులును, పినాకంబును నాకుం గరదీపకంబులగునుగాక—మఱియు దేవదేవులను వహించుమహాబలుండును, వృషభరూపధరుండు నగుధరుండును, నందాది ప్రమథగణంబులును, యోగినీగణపతివృతుం డగుక్షేత్రపాలుండును నన్ను [illegible] జేయుఁగాక—ప్రమథావరణపూజితులగు క్షేత్రపాలుని యనుచరులును, వటనిరుటుపంకిల నిలిచియుండు భైరవాదిగణంబులును, దేవపూజితులగు నారదాదిమునులును, సాధ్యగణంబులును, [illegible]లగుదేవతలును, సర్వకర్మపరిత్యాగులగు మహాత్మకమహాత్ములును శివాజ్ఞం గాంచి నన్నుఁ బరిపాలింతురుగాక—గంధర్వాది [illegible] ముల గలదేవయోనిపరంపరయంబును, [illegible] గణంబు

ను, పాతాళగతాసురగణంబులును, అనంతాది నాగేంద్రులును, గ్రిహభూతగణంబులును, డాకినీయోగినీశాకినీగణంబులును, గరుడాదిపక్షిగణంబులును, క్షేత్రోపవనగృహాదితీర్థంబులును, ద్వీపసముద్రనదీనదసరోవరంబులును, సుమేరుప్రభృతిపర్వతంబులును, కాననంబులును, పశుపక్షిక్రిమికీటకాదులును, మృగంబులును, సకలభువనంబులును, భువనాధీశ్వరులును, సావరణంబు లగుబ్రహ్మాండంబులును, దిక్కులును, దిగ్గజంబులును, వర్ణపదమంత్రంబులును, మంత్రాధిపతులును, మహదాదితత్త్వసమూహంబులును, రుద్రులును, వేయేల ?—ఈవిశ్వంబునందు దృశ్యంబులును, శ్రావ్యంబులు నగు సకలపదార్థంబులును నాకనుకూలంబు లగుంగాక—పశుపాపవిమోచనియు, పంచార్థసంజ్ఞితయు నగుశైవవిద్యయు, ధర్మప్రకాశకంబులగు శివధర్మశాస్త్రంబులును, శ్రుతితుల్యంబులగుశైవపురాణములును, కామికాదిచతుర్విధశైవాగమంబులును మదనుష్ఠితంబగునీయుత్తమకర్మంబు సఫలం బయ్యెనని యామోదించుగాక— జ్ఞానపరాయణులగు శైవులును, మాహేశ్వరులునుకూడ నన్నాశీర్వదింతురుగాక—వేదవేదాంతతత్త్వజ్ఞులును, సర్వశాస్త్రవిశారదులును, లౌకికులగుబ్రాహ్మణులును, క్షత్రియులును, వైశ్యులును, సాంఖ్యులును, వైశేషికులును, యోగులును, నైయాయికులును, సౌరబ్రాహ్మరౌద్రవైష్ణవగణంబులును, శిష్టులగునితరమానవులును, నాసత్కర్మంబు సంపన్నంబు గావింతురుగాక—సిద్ధాంతులును, శైవులును, పాశుపతులును, మహావ్రతులును, కాపాలికులును, శివాజ్ఞాపాలకు లగునందఱును మత్కర్మంబు సఫలంబగునట్లను గ్రహింతురుగాక—నాస్తికులు, శఠులు, కృతఘ్నులు, పాషండులు, పాపులు, తమోగుణులు నగువారెల్లరును నాకు హానం బయ్యెనదు గాక—ఇటగ౦బులం నాస్తికులగువారందఱును నాయెడలఁ గృపఁ

హృదయు లయ్యెదరుగాక—ఓయాదికారణా! ఉమాసహాయా! శివా! నీవు పంచావరణరూపంబగు ప్రపంచముచే జగమంతట నావసించియున్నావు. దేవా! సపుత్రకుండవగు నీకు నమస్కారము.

అని యీవిధముగా స్తోత్రము చేసి సాష్టాంగప్రణామం బాచరించి యష్టోత్తరశతావర్తకంబుగాఁ బంచాక్షరమంత్రజపంబును, శక్తిమంత్రమును జపించి జపసమర్పణంబును, "క్షమస్వ" అనుచు క్షమాప్రార్థనంబును గావించి పూజావశేషమును దీర్చవలయును. ఈస్తవంబు పుణ్యతమంబును, సర్వాభీష్టప్రదంబును, శివశివులకు హృదయంగమంబును నైనది. సమాహితచిత్తులై యీస్తోత్రమును బఠించువారును, వినువారును, సర్వపాపవిముక్తులై శివసాయుజ్యముం గాంచఁగలరు. గోహంతకులు, పితృహంతకులు, మాతృహంతకులు, వీరహంతకులు, కృతఘ్నులు, భ్రూణహంతలు, శరణాగతఘాతకులు, మిత్రవిశ్వాసఘాతుకులు, దుష్టులు, పాపరతులు నగువారలయినను వ్యాయము లీస్తోత్రమును బఠించినచోఁ బాపవిముక్తు లగుదురు. దుస్స్వప్నసమయములందును, మహోపద్రవసమయంబులందును, సర్వభయంబులయందును నీస్తోత్రమును బఠించినచో సర్వభయంబులు తొలఁగును. ఈస్తోత్రపాఠంబువలన ఆయురారోగ్యభాగ్యంబులును, మానవులకు వాంఛితంబులగు సకలఫలంబులును సిద్ధించఁగలవు. శివపూజ చేయకుండ నీస్తోత్రమును బఠించుటచేతనే యిట్టిఫలం బబ్బుచుండఁగా శివపూజనముతోఁ గావించినచో నెట్టిఫలంబు లభించునో దానివర్ణింపఁగలఁడు? భక్తితో నీస్తోత్రమును బఠించునప్పుడు పార్వతీపరమేశ్వరులంతరిక్షగతులై యానందముతో నాలకించుచుందురు గావున దేవదేవుల నాకాశంబుననే పూజించి కృతాంజలిపుటులై పిదప యీస్తోత్రమును బఠింపవలయును.

——◆ కామ్య పూజ. ◆——

వాసుదేవా! శైవగణంబుల కిహలోకమునందు ఫలప్రదంబును, పూజాహోమజపధ్యానతపోమయంబునగు మహత్కర్మముం గూర్చి చెప్పెదను. అందుఁ బ్రథమంబున ఫలసిద్ధికరం బగుమంత్రమును సాధింపవలయును. అదృష్టప్రతిబంధకంబు లగు కార్యంబులఁ గావింపఁ గూడదు. శకునాదులచేఁ బరీక్షించి వానికి నిష్కృతులం గావింపవలయును. మోహవశంబున నన్యథాచరణంబు గావించువాఁడు నిష్ఫలుం డగుటయేగాక పరిహాసాస్పదుండును గూడ నగును. విశ్వాసములేనివాఁ డెన్నండును దృష్టఫలప్రదం బగుకర్మను నాచరింపరాదు. అవిశ్వాసి కశ్రద్ధగలుగును గావున నాతఁడు ఫలలాభంబున కసమర్థుండగును. అట్టివానికర్మము నిష్ఫలంబైనచో నందు దైవలోపం బేమియును లేదు. యథావిధిగఁ గర్మాచరణంబు చేసినచో నిహలోకమునందే ఫలసిద్ధి గాఁగలదు. కావున సాధకుఁడు సిద్ధమంత్రుండును, నిరస్తప్రతిబంధకుండును, విశ్వాసియు, శ్రద్ధాకలితుండును నై కార్యాచరణంబు గావించి ఫలసిద్ధుం డగును.

అట్లుగాదేని, అట్టిఫలప్రాప్తికి బ్రహ్మచర్యవ్రతంబు నవలంబించి నియమయుక్తుఁడై రాత్రులయందు హవిష్యమును గుడుచుచు, పాయసఫలభక్షణంబులైనఁ గావించుచు హింసాదినిషిద్ధకర్మంబుల నుజ్జగించి, భస్మోద్ధూళితగాత్రుండును, సువేషుండును, శుచియునై యుండవలయును. అట్లాచారవంతుండగు బ్రాహ్మణోత్తముఁడు శుభదినంబునఁ బుష్పమాల్యాద్యలంకృతస్థానంబున నేకహస్తప్రమాణంబగుభూమిని గోమయలిప్తంగాఁ జేసి, సకేసరంబులును, పుష్పదళకర్ణికాయుతంబును, అనాహతనాదసంకలితంబును, శ్వేతకాంచనమయంబును, నానారత్నాలంకార [illegible]

నిర్మించి యందణిమాదులను బ్రతిష్ఠించినట్లు భావించుకొని, రత్నసువర్ణస్ఫటికాదులచే వేదికాసహితంబుగా లింగమూర్తిని స్థాపింపవలయును. ఆలింగమూర్తియందు దేవీసహితుండును, గణపరివృతుండు నగు దేవదేవు నావాహనంబు చేసి పూజింపవలయును. ఆలింగమునందు సర్వాభరణభూషితుండును, చతుర్బాహుండును, చతుర్వదనుండును, శార్దూలచర్మవసనుండును, మందస్మితవదనారవిందుండు నగుమహేశ్వరమూర్తి చేమొదటిహస్తముల కభయదానంబు గావించుచున్నట్లును, రెండవచేతితో వరదానంబు చేయుచున్నట్లును, భావింపవలయును. భక్తినియభిరుచింబట్టి యాలింగమునం దీశ్వరమూర్తిని సంకల్పించుకొనవలయును. ఇట్లుమూర్తిని గల్పించుకొని, సకలీకరణంబు చేసి మూర్తిమంతుం డగుపరమకారణు నావాహనంబు గావించి పూజింపవలయును. అభిషేకంబుకొఱకుఁ బంచగవ్యంబును, బంచామృతంబులను, ధాన్యాదులను సిద్ధము చేయవలయును. అగ్రభాగంబున రత్నచూర్ణాలంకృతంబగు మండలమును రచించి కర్ణికయందు శివకలశమును, అష్టదళాలయందును, విద్యేశ్వరాదిగణంబుల కష్టకలశంబులను స్థాపించి యందు తీర్థజలంబును, బుణ్యద్రవ్యంబులును నిక్షేపించి సూత్రవేష్టితంబులుగాఁ జేసి యథావిధిగ మంత్రపూతంబులును, దుకూలాచ్ఛాదితంబులు నగునట్లు చేయవలయును. తరువాత నీశానాదిమంత్రపూర్వకంబుగా మంత్రవిన్యాసంబు చేసి మంగళవాద్యపూర్వకంబుగా పంచగవ్యాదులచే మహాదేవు నభిషేకింపవలయును. మఱియు, కుశోదకము, స్వర్ణరత్నోదకము, గంధపుష్పసిద్ధోదకము, మంత్రసిద్ధోదకము మొదలగువానితో మంత్రోచ్చారణంబు చేయుచు మహాదేవునభిషేకించి, గంధపుష్పాదులచేఁ బూజింపవలయును. దేవదేవునియుద్వాసనంబున కుపయోగించుపవిత్రం బేకఫలంబులకు న్యాసంబును, ఏకాదశస్థలం

బుల. కధికంబును గాదు. పూజకు సువర్ణరత్ననిర్మితంబులైనను, శుభ్ర సురభిళంబులైనను నగుపుష్పముల నుపయోగింపవలయును. లభించి నచో నీలోత్పలకమల రక్తకమలంబుల నర్పింపవలయును. కర్పూర ఘృతాదిధూపంబును, దీపదానంబును గావించి పంచబ్రహ్మపూజ యు, షడంగపూజయుఁ గావించి యావరణపూజ ముగింపవలయును. తరువాత దుగ్ధసిద్ధంబును, గుడఘృతయుక్తంబును నగు మహాచరువును నివేదించి, పాటలోత్పలపత్రాదులచే సుగంధపానీయం బొసంగి, సుగంధద్రవ్యపంచకయుతంబును, సుసంస్కృతంబు నగు తాంబూలము నర్పించి, సువర్ణభూషణంబులను, విచిత్రసూక్ష్మనూతనవస్త్రంబులను, దివ్యదర్పణంను నృత్యగీతవాద్యంబులతో సమర్పించి మూలమంత్ర మును లక్షజపంబు గావింపవలయును. ఫలార్థియగువాఁడు ఒకసారికం టె నధికముగాను, మూఁడుసారులకంటెఁ దక్కువగను బూజింపవల యును. హోమమను పదింటికంటె నధికముగను నూటికంటె న్యూన ముగను జేయవలయును. మారణోచ్చాటనాదికార్యంబులయందు లింగమునందును, శివాగ్నియందును, మహాదేవునిఘోరరూపమును, శాంతికపౌష్టికాదిక్రియలయందు శివుని శాంతమూర్తిని భావింపవల యును. మారణాదికార్యంబులయందు స్రుక్కును, స్రువమును లోహ నిర్మితంబులుగను,తదితరకర్మంబులయందు స్వర్ణనిర్మితంబులు నైయుం డవలయును. మృత్యువిజయకాముండగువాఁడు ఘృతము, గోక్షీరమి శ్రితంబులగు దూర్వలు, ఘృతసహితంబగుచరువు, మధువు, కేవలక్షీర ములు వీనిచే హోమం బాచరింపవలయును. రోగశాంతికొఱకు తిలల చే హోమము జేయవలయును. సంపత్తికొఱకు ఘృతక్షీరంబులచేఁ గాని, పద్మంబులచేఁగాని హోమము జేయవలయును. వశ్యంబుకొఱ కు ఘృతసహితంబుగా జాతీకుసుమములను, ఆకర్షణంబుకొఱకు నన్న

తంబు లగుకరవీరకుసుమములను, స్తంభనంబుకొఱకు మధుసహితసర్ష పంబులను, పాతనముకొఱకు లశునంబులను, తాడనంబుకొఱకు గర్దభోష్ట్రరక్తంబును, మారణోచ్చాటనంబులకొఱకు తిలాన్వితంబులగు రోహిబీజంబులును, విద్వేషణంబుకొఱకు నారికేళతైలంబును, బంధన సేనాస్తంభనాదులకొఱకు పూర్వోక్తరోహిబీజంబులును, అభిచారక ర్మంబునందు రక్తసర్షపయుతంబులగు నాలహోమద్రవ్యములను హోమము చేయవలయును. క్షీరహోమంబున జ్వరశాంతియు, సౌభాగ్య ఫలంబును, దధిస్మృతమధుహోమంబులచే సర్వసమృద్ధియు నగును. శాంతికపౌష్టికాదిక్రియలందు క్షీరతండులంబులచే గాని, కేవలము చరువుచే గాని, సమిధాదిసప్తద్రవ్యంబులచే గాని హోమము చేయవల యును. ఈసకలద్రవ్యములచేతను హోమము చేసినచో ఆకర్షణంబు ను, వశీకరణంబును గూడ నగును. బిల్వపత్రిహోమము సర్వకామ సాధనం బగుచున్నది. శాంతికర్మంబులయందు పాలాశఖదిరాదిసమిధ లును, క్రూరకర్మంబులయం దర్కకరవీరాదిసమిధలును, నిగ్రహకర్మం బులయందు కంటకసమిధలును, విహితంబులై యుండును.

ప్రశాంతచిత్తుడై శాంతికపౌష్టికాదికర్మంబులను, నిర్దయుండు ను, క్రుద్ధుండునై యభిచారకర్మంబును గావింపవలయును. అతివిష మగుదురవస్థకుఁ బ్రతీకారం బన్యం బేదియు లేమి గాప్రన నాతతాయు లగుశత్రువుల నుద్దేశించి యభిచారకర్మం బాచరింపవలయును కాని రాజు, ధార్మికుఁడు, మహాత్ముఁడు, మనోవాక్కాయములచే శివ పరాయణుఁడు నగువాని నెన్నఁడు నాతతాయి యైనను నాతని నుద్దేశించి యభిచారకర్మంబు చేయంజనదు. మహారాజా, శివభక్తుని నుద్దేశిం చి యభిచారంబు గావించువాఁడు నిశ్చయపతితుం డగును. కావున నాత్మసుఖాభిలాషియగువాఁడు రవంతయుఁ, శివభక్తుని క్రూరకర్మం

బులచే హింసింపరాదు. అభిచారకర్మము తదితరులంగూర్చి కావించి నను తుద కనుతప్తుండై ప్రాయశ్చిత్తంబు చేసికొనవలయును.

బాణలింగము, ఆర్షలింగము, అనాదిలింగము, వైదికలింగము వీనియందు ధనవంతుండైనను, దరిద్రుండైనను నొక్కరీతిగాఁ బూజింపవలయును. సువర్ణరత్నాద్యభావంబునఁ దాదృశద్రవ్యములను సంపాదింపశక్తిలేనివాఁడు, తత్ప్రతిరూపకోపచారంబులచేఁ గాని, మానసోపచారంబులచేఁగాని యర్చింపవలయును. కొన్నిటిని సంపాదించి, మఱికొన్నిటిని సంపాదింపలేనివాఁడు శక్త్యనుసారముగాఁ బూజింపవచ్చును. కామ్యకర్మం బాచరించినను ఫలప్రాప్తి లేకున్నచో నూరల [illegible] సారులు, మూఁడుసారులు గావింపవలయును. అప్పుడు తప్పకుండ ఫలప్రాప్తి యగును. పూజోపయుక్తంబు లగుసువర్ణరత్నాద్యనేకద్రవ్యంబులన్నియు గురునకుఁగాని, శివభక్తులకుఁగాని శివునకుఁగాని యర్పింపవలయును. ఇతరుల కొసంగరాదు. గురుండు లేకుండ సకలకర్మంబులను స్వయముగఁ గావించుచున్నను నిష్ఠ చేయవలయును. అప్రోక్షితములనెన్నఁడును స్వయముగ గ్రహింపరాదు. లోభవశంబున వానిని దానే గ్రహించినచోఁ నిష్ఫలంబు సిద్ధింపదు. పూజావసానంబున లింగము నెవ్వరును బరిగ్రహింపకున్నచోఁ దానే గ్రహించి నిత్యము నర్చింపవలయును. నిరంతరాయముగఁ నిర్మాల్యస్వీకారంబు గావించువాఁడు ఫలం బవశ్యముగ సిద్ధింపఁగలదు. శత్రువులచే నాక్రమింపఁబడినవాఁడును, మృత్యుముఖంబునఁ బడినవాఁడును, ఈసత్కర్మానుష్ఠానమువలన విపద్విముక్తుం డగును. నృపజనుండు రాజతుల్యుండును, దరిద్రుఁడు కుబేరతుల్యుండును, కురూపి మన్మథతుల్యుండును, వృద్ధుఁ [illegible] తరుణతుల్యుండును గాఁగలఁడు. ఈసా [illegible] మఱియు [illegible]

ములన్నియును సుఖంబులు గాఁగలవు. అతనికి విద్యా జ్ఞానసంపత్తియు, కీర్తి గణికాసమానయు, మేధ బృహస్పతితుల్యయు, బుద్ధి సరస్వతీసన్నిభయు నగును. అతఁడు మహేశ్వరునివలె శక్తిమంతుఁడగును, మద గజముంబోలి బలవంతుఁడై యుండును. అతఁడు శతవర్షంబులు జీవన్ముక్తుఁడై యుండును. అతని కనారోగ్యము సుఖసౌఖ్యంబుగాఁ బరిణమించును. అపథ్యమైనను, రసాయనం బగును. భూతభవిష్య ద్వర్తమానంబు లాతనికిఁ గరతలామలకంబు లగును. అణిమాదు లా తని కవలీలఁగ సిద్ధించును. అనిత్యకర్మానుష్ఠానంబునఁ బడయరాని యభీష్టం బేదియు నుండదు. సర్వక్షేత్రప్రదానంబుల దీనిని మించిన దేది యును లేదు.

ఆముష్మికపూజాసిద్ధి.

శ్రీకృష్ణా! ఆముష్మికపూజతో సమానంబగునది త్రిభువనం బులయం దెందును లేదు. బ్రహ్మయు, విష్ణుండును, రుద్రుండును, దిక్పతులును, సూర్యాదినవగ్రహంబులును, వసిష్ఠవిశ్వామిత్రాదిబ్ర హ్మర్షులగు ఋషులును, అగస్త్యాదిమునిగణంబులును, నందీశ్వరమహా కాలాది గణాధిపులును, దైత్యగణంబులును, శేషాదినాగగణంబులు ను, సిద్ధగంధర్వయక్షరాక్షసాదులును, భూతపిశాచగణంబులును, తమ తమయాధిపత్యంబులఁ బడయుటకై పారలౌకికకర్మానుష్ఠానంబు గా వించి కృతార్థులైరి. దేవతలకు దేవత్వమును, బ్రహ్మకు బ్రహ్మత్వ మును, విష్ణునకు విష్ణుత్వమును, రుద్రునకు రుద్రత్వమును దీనివలననే లభించెను.

మొట్టమొదట శ్వేతచందనముచేఁ బరిమళించు పుష్పజలంబుచే శివలింగమును, శివప్రతిమను అభిషేకించి పవిత్రములగు కలశంబులచేఁ

పూజించి సాష్టాంగప్రణామంబు గావింపవలయును. ధనవంతుఁడైనచో సువర్ణరత్ననిర్మితంబును, రమణీయంబు నగుపద్మాసనంబునఁ గేసరమధ్యంబున దక్షిణభాగమునందు సుందరంబును, అంగుష్ఠపరిమితంబును, సుగంధద్రవ్యలిప్తంబు నగులింగమును స్థాపించి బిల్వపత్రములచేఁ బూజించి యాలింగమునకు దక్షిణపార్శ్వమునం దగురును, పశ్చిమపార్శ్వంబున మనశ్శిలను, ఉత్తరంబునఁ జందనంబును, పూర్వభాగంబున హరితాళమును సమర్పించి వివిధసురభికుసుమంబులచేఁ బూజించి ఘృతాక్తంబును, గుగ్గులుయుతంబును, కృష్ణాగురుకలితంబును, నగు ధూపం బొసంగి యతిసూక్ష్మంబును, శ్వేతంబును నగువస్త్రంబును సమర్పించి సఘృతం బగుపాయసమును, ఘృతదీపాదినానాద్రవ్యములను మంత్రపూర్వకంబుగా నివేదింపవలయును. పిమ్మట భక్తిపూర్వకంబుగాఁ బ్రదక్షిణనమస్కారంబు లర్పించి ప్రణతుండై స్తవపాఠంబును, క్షమాప్రార్థనంబును గావింపవలయును. తరువాత సాధకుండు దక్షిణామూర్తి నాశ్రయించి శివమంత్రోచ్చారణంబు చేయుచు ఆశివలింగమును శివునకు నివేదింపవలయును. ఈవిధముగాఁ బ్రతిదినంబును పంచగంధమయంబును, శుభకరంబు నగు శివలింగమును బూజించువాఁడు విగతకల్మషుండును, శివలోకపూజితుండు నై శివలోకంబున వసింపఁగలఁడు. పరమగుహ్యంబగు నీయుత్తమవ్రతమును గూర్చి శివభక్తుండవగు నీకెఱింగించితిని. ఇది శివభక్తిపరాయణులకుఁ దక్క నన్యుల కెఱింగింపరాదని మహాదేవుం డానతిచ్చి యున్నాఁడు.

—◆ లింగానిర్మాణము. ◆—

మహాభాగా! వాసుదేవా! ఈవిశ్వమునందు నిత్యనైమిత్తిక కామ్యకర్మంబులవలన లభించుఫలంబు లన్నియును, నేకమాత్రలింగ

మున్నైనను, బ్రతిమన్నైనను బ్రతిష్ఠించుటవలన లభింపగలదు. జగదీశ్వ మూర్తియు లింగమయ మైనది. త్రిభువనంబులు లింగమునే యాశ్రయించి యున్నవి. లింగప్రతిష్ఠచే విశ్వము ప్రతిష్ఠితమైనట్లగుచున్నది. బ్రహ్మవిష్ణురుద్రాదులైనను, మఱియెవ్వరైనను, లింగప్రతిష్ఠాపనంబు గావింపకుండ నాత్మసంవాప్తిని గాంచలేరు. మహాదేవుడే స్వయముగ విశ్వేశ్వరలింగమును బ్రతిష్ఠించి యుండెను. కావున నైహికాముష్మికసుఖార్థి యగుసాధకుండు పరమేశ్వరునిలింగమును గాని, ప్రతిమూర్తినిగాని ప్రతిష్ఠింపవలయును. అని యుపమన్యుండు చెప్పుటయు శ్రీకృష్ణుం డిట్లనియెను. మహాత్మా! లింగమనిన నేమో, మహేశ్వరుండు లింగి యెట్లయ్యెనో, అతనిని లింగభావముచే నేల యారాధింపవలయునో సవిస్తరంబుగ నానతీయవలయును.

అనుటయు నుపమన్యుం డిట్లనియెను. శ్రీకృష్ణా! త్రిగుణప్రభావం బయ్యు నవ్యక్తంబవికారం బగులింగ మవ్యక్తం బని పరిగణింపంబడుచున్నది. అది విశ్వమునకు మూలకారణ మైనది. గగనాత్మకము, మూలప్రకృతియు, సగుణమాయ కదియే యాశ్రయస్థానము. శుద్ధము, అశుద్ధము, శుద్ధాశుద్ధము ననుభేదంబులచే విభక్తంబగుచరాచరజగం బంతయు దానినుండియే యుత్పన్నమగుచున్నది. దేవుడు, మహేశ్వరుడు, రుద్రుడు, బ్రహ్మ, విష్ణు వనువారలందరికిని లింగమునకు నుత్పత్తిస్థాన మదియే- ఇంద్రియంబులు పంచభూతంబులతోఁ గూడ మహాదేవు నాజ్ఞచే నందే యుత్పన్నంబు లగుచున్నవి. లింగమునందు సాక్షి యధిష్ఠించువాఁడు గావున శివుండు లింగి యనఁబడును. ఆదేవుని యాజ్ఞ లేకుండ నేకార్యము జరుగ లేదు. లింగమునుండి యుద్భవించిన సకలజగంబును లింగమునందే విలీనం బగుచుండుట నాతనికి లింగత్వము సిద్ధం బయ్యెను. సాత్త్వికులకు లింగార్చనయే ము

మునకు గాఁపున లింగమే వారికి దేహస్వరూప మయ్యెను. కావున లింగ ముఖంబే మహాదేవుని బ్రీతిదినము నర్పింపవలయును. లింగవేదియే పార్వతియు, లింగమే శివుండును నగుచున్నారు. కావున నారెంటిని బూజించుటచే నుమామహేశ్వరులను బూజించినట్లగుచున్నది. పరమార్థముచే వారి కన్యం బగు లింగదేహం బెద్దియును లేదు. స్వభావముచే విశుద్ధమూర్తులగువారి కుపచారార్థమై లింగదేహము కల్పితం బయ్యెను. అదియే పరమాత్ముండగు శివుని పరమశక్తిస్వరూపిణి. ఆ శక్తియే ఆజ్ఞాస్వరూపిణి. తదాజ్ఞచే సకలచరాచరజగంబు సుప్రసన్నం బగుచుండును: ఆపరమేశ్వరునిమహిమ నాతేండ్లకైనను సంపూర్ణముగ వర్ణింపఁజాలము.

పూర్వము విశ్వప్రళయసమయంబున భగవానుం డగువిష్ణుండు జలంబులయందు నిరాకులచిత్తుండై శయనించియుండ యదృచ్ఛావశంబున బ్రహ్మదేవుం డచ్చటికి వచ్చి శయనించియున్న విష్ణుదేవుం గాంచి శివమాయామోహితుండై « నీ వెవ్వఁడవో శీఘ్రముగ వచింపుము!" అని ప్రశ్నించుచు నాతనిఁ బ్రహరింప నారంభించెను. అవ్విష్ణుఁడు నాఘాతంబులఁ దీవ్రముగఁ బ్రహతుండై లేచి యెదుటనున్న బ్రహ్మను గాంచి యంతరంగంబునఁ గుపితుండయ్యును, క్రోధమును బ్రకటింపక « వత్సా! నీ వెటనుండి వచ్చితివి? వ్యాకులచిత్తుండవునై యున్నట్లు తోఁచుచున్నది. కారణమేమి?" అని ప్రశ్నించుటయుఁ బ్రభుత్వసూచకంబులగు విష్ణుదేవుని వచనంబుల నాకర్ణించి కోపావిష్టచిత్తుండై « విష్ణూ! [illegible] నన్ను [illegible] బ్రభుండ నని [illegible] నావే [illegible] నీ వెఱుంగవా? నేనే [illegible]

నై యున్నాను! అవ్యయంబగు నాదేహమునందే నీవుసూక్ష్మ నుదయిం
చితివి! మఱియు నీవు నాయాజ్ఞచేతనే నన్ను మూఁడుభాగములుగా
విభజించుకొని సృష్టియు, పాలనంబును, బునస్సృష్టియుఁ గావించుచుం
దువుగాదా? అనాద్యనంతుండను, జగన్నాథుండ నగునాకారణంబుని మ
ఱచిపోయితివా? కావున నీకు నిజపుత్రుండ నగునన్ను నిషేధముగా నేలయ
వమానింతువు?—ఇది నీదోషముగాదు! నీవిప్పుడు నామాయచే వి
భ్రాంతుండవై యుంటివి? నాయనుగ్రహముచే నతిశీఘ్రముగ నీభ్రాం
తి దూరము గాఁగలదు.

అనుటయు విష్ణుదేవుం డిట్లనియెను. «ఓచతుర్ముఖా! నేనే
సర్వదేవగణంబులకును బ్రభుండను. ఈమాట సత్యము. నాకంటె స్ర
ష్టయుఁ, బాలకుండును, సంహారకారియు, నీశ్వరుండును మఱియెవ్వరు
న్నారు?" అని యీవిధముగా బ్రహ్మయు, విష్ణుండును, వాదోపవా
దంబులు గావించుకొనుచు నతిభయంకరమగుయుద్ధము చేయఁదొడం
గిరి. రజోగుణాశ్రయులును, గోపాగ్రాంతులు నగువారిరువురును పర
స్పరముష్టిఘాతంబులచే శ్రాంతులగుచుండిరి. అనంతరమునం దా
యిరువురియహంకారమును నశింపఁజేయుటకును, వారికి బ్రకృతిస్థులం
గావించుటకును వారినడుమ ననంతజ్యోతిస్స్వరూపంబును, అనుపమానం
బును, అవిజ్ఞేయంబును, క్షయవృద్ధివిహీనంబును, అవిమధ్యాంతరహి
త్యంబును, అద్భుతంబు నగునొక దివ్యలింగ మావిర్భూతంబయ్యెను.
సహస్రజ్వాలామయంబును, అప్రతర్క్యంబు నగు లింగసందర్శనంబు
చే బ్రహ్మవిష్ణు లాశ్చర్యాన్వితులై, వివశులై తమపోరాటమును
మాని యిదియేమని యాలోచింపఁదొడఁగిరి. అనంతరంబున వారి
యహంకారమును నశించి యూర్ధ్వాధములు బోధపడుటయు విశ్వమయం
బగునాలింగము కాద్యంతములను బరీక్షింపఁదలఁచి రని వారికిఁ గు

తూహలము గలిగెను. అప్పుడు బ్రహ్మదేవుం డనంతపక్షసంయుతం బగుహంసాకృతిం దాల్చి లింగోర్ధ్వభాగంబును గనుంగొనుటకై యతిప్రయత్నంబున మనోవేగముతోఁ బైకెగసిపోయెను. విశ్వరూపుండగు నారాయణుండును, నీలాంజనసన్నిభం బగు వరాహాకృతిం దాల్చి లింగాధోభాగమును బరీక్షించుటకై పాతాళంబునకుం బోయెను. ఇట్లు విష్ణుండు సహస్రవర్షంబులవఱకును పాతాళము ననుసరించిపోయి యాన్వేషించెనుగాని యాలింగమున కంతం బాతనికి గోచరింపదయ్యెను. బ్రహ్మదేవుఁడు కూడ నట్లే యూర్ధ్వలోకంబునకుం బోయి పరీక్షించెనుగాని యించుకంతయుఁ బ్రయోజనము లేకపోయెను. ఇంతేకాక యాయాసముచే నాతఁ డధఃపతితుఁడై పోయెను. విష్ణుండును శ్రాంతుండై యెప్పటిచోటికి వచ్చి నిమీలితనయనుండై కూర్చుండియుండెను. అప్పుడు వారిరువురును మరలఁ గలిసికొనిరిగాని శివమాయామోహితులై యేమియును జేయఁజాలక నూటినూటికిని లింగమునకుఁ బార్శ్వంబునను, సమ్ముఖంబునను, పృష్ఠంబునను ప్రణామంబులఁ జేయుచు నాశ్చర్యముతో గాఢచింతాక్రాంతులై యుండిరి.

ఆసమయంబున బ్రహ్మప్రతిపాదకంబును, నాదరూపకంబును నగు "ఓమ్" అను నేకాక్షరశబ్దబ్రహ్మము వారికి గోచరం బయ్యెను. కాని యప్పుడు వారియంతఃకరణములు రజస్తమోగుణమయంబులై యుండుటంజేసి బ్రహ్మవిష్ణువు లాశబ్దతత్త్వమును గ్రహింపఁజాలకపోయిరి. అప్పు డయ్యోంకారమును అ, ఉ, మ అను త్రిమాత్రలుగను, బిందునాదం బగునర్ధమాత్రగను విభక్తంబై యుండు అకారము లింగమునకు దక్షిణభాగమునను, ఉకార ముత్తరభాగంబునను, మకారము మధ్యభాగంబునను, అర్ధమాత్రాత్మకం బగుబిందునాదము మస్తకంబునను నధిష్ఠించి విరాజిల్లుచుండెను. ఇట్లు పరమాద్భుతం బగుప్రణవము

చతుర్విధంబుల నిశ్చయింపఁజైనను వారు దానియర్థము నెంతమాత్రము ను గ్రహింపఁజాలకపోయిరి. అప్పుడు వేదాత్మకుం డగుబ్రహ్మచే న వ్యక్తం బగుప్రణవము విస్తృతిం గాంచెను. అందు అకారమునుండి ఋగ్వేదంబును, ఉకారమునుండి యజుర్వేదంబును, మకారమునుండి సామవేదంబును, బిందువునుండి యథర్వవేదంబును సంభూతంబు లయ్యెను.

అందు ఋగ్వేదము సంక్షేపముగా గుణంబులయందు రజోగుణమును, ఆదిమూర్తులయందు బ్రహ్మను, క్రియలందు సృష్టిని, లోకంబులయందు పృథ్విని, తత్త్వంబులయం దవ్యయం బగునాత్మను, కళాత్వంబులయందు నివృత్తిని, పంచబ్రహ్మలయందు సద్యోజాతుని, లింగభాగంబులయం దధోభాగంబును, కారణత్రయంబునందు బీజమును, అణిమాదులయందు చతుష్షష్టిగుణాలి యగుశబ్దము గ్రహించుచు [illegible] లిగి యిరువదియొక విభాగంబులచేతను విశ్వమంతటను వ్యాపించి విరాజిల్లుచుం[illegible]

ఇట్లే యజుర్వేదంబుకూడ గుణంబులయందు సత్త్వమును, ఆదిమూర్తులయందు విష్ణుదేవుని, ఆదికార్యంబులయందు స్థితిని, లోకంబులయందు [illegible], తత్త్వంబులయందు విద్యను, కళాత్వంబులయందు ప్రతిష్ఠను, పంచబ్రహ్మలయందు వామదేవుని, లింగభాగంబులయందు మధ్యభాగమును, కారణత్రయమునందు యోనిని, [illegible] తంబగు నైశ్వర్యమును గ్రహించి [illegible] వ్యాపించి[illegible]:—

సామవేదము గుణంబులయందు తమోగుణంబును, ఆదిమూర్తులయందు రుద్రుని, క్రియలయందు సంహారమును, లోకములందు త్రిభువనంబులను, [illegible]బులయందు శివుని, కళాత్వంబులయందు ను, పంచబ్రహ్మలయం దఘోరుని, లింగభాగములయం దూర్ధ్వ

పీఠమును, కారణత్రియమునందు పౌరుషమును, అణిమాదులయందు ఐశ్వర్యమును గ్రహించి త్రిభువనంబులఁ బ్రకాశింపఁజేసెను.

అథర్వవేదము నిర్గుణత్వమును, ఆదిమూర్తులయందు సదాశివుం డగుమహేశ్వరుని, క్రియలయందు దేనిచే సకలభూతంబులకును ముక్తి లభించునో యట్టినిష్క్రియుం డగుపరమేశ్వరుని యనుగ్రహంబును, లోకంబులయందు వాఙ్మనంబుల కగోచరంబగునున్మనాలోకముకంటె నూర్ధ్వంబై యుమామహేశ్వరులచే నిత్యసేవితంబగు నలౌకికసోమలోకంబును, కళాధ్వంబులయందు శాంతి, శాంత్యతీతకళలను, బ్రహ్మపంచకంబునఁ దత్పురుషేశానులను, లింగభాగంబులయందు నిష్కలుం డగుశివుండారాధింపఁబడు లింగోపరిభాగంబును, తత్త్వంబులయందు పరమకారణంబును, నిష్కారణంబును, ధ్యేయంబును, అవ్యయంబును, పరమాకాశమధ్యస్థంబును, పరమాత్మపరిస్థితంబును, అపారంబును, అపరాధీనంబును, నిరుపమానంబును స్థిరంబునగుతత్త్వమును గ్రహించి లోకములందు వ్యాపింపఁజేసెను.

“ నేను జాగ్రదావస్థంగూర్చి ప్రశంసించుచున్నాను. నేను కేవలము నాత్మతత్త్వముంగూర్చియే సర్వదా కీర్తించుచుందును ” అని ఋగ్వేదమును, “ నేను స్వప్నావస్థంగూర్చి చెప్పుచున్నాను. నాయందు విద్య వేద్యమై పరిణమించుచున్నది ” అని యజుర్వేదంబును, “ నేను సుషుప్తింగూర్చియే చెప్పుచున్నాను. తమోగుణాశ్రియుం డగుపరమేశ్వరునివాక్యము లన్నియు నావాక్యములే ” అని సామవేదంబును “ తురీయంబును, తురీయాతీతంబును నాచేఁ జెప్పంబడుచున్నది. కావున నేనధ్వాతీతపదంబు నై యుంటిని. శివుఁడు, విద్య, ఆత్మ యనునీమూఁడును త్రిమలములు. ఇవి యధ్వాత్మకములు. ఈత్రిగుణ్యము త్రియాసాధ్యమైనది. తత్పదాభిజ్ఞానమును నిలిపి గ్రహింపవలయును.

ఈయధ్వంబుల కతీతం బగుపరమపదమే నిర్వాణము. అన్ననైర్గుణ్యం బులకు నాదమును, నాదాంతమును జ్ఞాపకంబులు. ప్రధానుఁడు పరమేశ్వరుఁడు. గుణప్రధానరూపముచే సకలప్రపంచము బ్రకాశించుచున్నది" అని యుపన్యాసంబును బోధించుచుండెను.

«ఓం» అనుప్రణవము బ్రహ్మవిష్ణుమహేశ్వరులను, సర్వాత్మ వాచకంబనియుఁ బండితులు వ్యాఖ్యానము చేయుచున్నారు. ప్రపంచమమునందు ముకారోదయంబైన మకారమునే విష్ణుస్వరూపముగాఁ బరిణమింపఁ జేయుటం జేసి, శివుని పరిణామంబును, పరిణామమే విష్ణువు నగుచున్నారు. ఈవాచ్యవాచకంబుల కెంతమాత్రంబును భేదము లేదు. రుద్రుం డవాఙ్మానసగోచరుండైనను, నేకాక్షరవాచ్యుం డగుచున్నాఁడు. ఓంకారమునందలి అకారముచే అణ్వస్వరూపుఁడగు బ్రహ్మయు, ఉకారముచే విద్యామూర్తి యగువిష్ణుండును, మకారముచే శివుం డగురుద్రుండును గీర్తితు లగుచున్నారు. మహాదేవుని దక్షిణాంగమునుండి యాత్మస్వరూపి యగుబ్రహ్మయు, వామాంగమునుండి విద్యాస్వరూపి యగువిష్ణుండును, హృదయమునుండి శివమూర్తి యగునీలకంఠరుద్రుండును సంభూతులైరి. అంత బ్రహ్మ సృష్టికర్తయును, విష్ణుండు పాలనకర్తయు, రుద్రుండు సంహారకర్తయు బ్రహ్మవిష్ణులకు గొప్తయు నైరి. ఈముప్పురే యీవిశ్వంబునకు మూలకారణంబు. పరమకారణం బగుమహాదేవుం డీకారణత్రయంబునకును గారణుండై యున్నాఁడు. «బ్రహ్మవిష్ణువులారా! మీరీయర్థంబు తెలియఁగోరినందులకే నాదానుసారంబుగాఁ గోత్రంబునకు వశీభూతులై పరస్పరము గలహించుచున్నారు. మీకు జ్ఞానము గల్గించుటకే నాయెదుట నీలింగస్వరూపము విరాజిల్లుచున్నది. "స్వయంప్రకాశంబులును, దివ్యంబులగు శోభన మహాబుద్ధులగు బ్రహ్మవిష్ణువులకు [illegible] గ్రహింపఁగ [illegible]

స్తవి." అనువాక్యంబులు శ్రుతిగోచరం బగుటయు బ్రహ్మవిష్ణువులు కలగనుచున్నవారుంబోలె నత్యము నెంతమాత్రమును స్థిరపఱచుకొనఁ జాలకపోయిరి [illegible] గ్రహింపఁజేయుటకును, జ్ఞానప్ర[illegible] సకలసత్యవాక్యంబులును లింగమునందు ముద్రింపఁబడి [illegible] కానంబడుటయు వారిరువురును జ్ఞానలాభంబు గాంచి లింగమునను, లింగికిని గలలింగభావమును, లింగమునందే సచరాచరం బగువిశ్వంబును, దానునుగూడ జనించి విలయంబు నందుటయును గ్రహింపఁగలిగిరి. మఱియు విహాపాప్మునగు నద్వైతుండు పరమధామమునందలి పరమపురుషుండును, కళాతీతుండును, పరాత్పరుండును, పశుపాశమయం బగువిశ్వంబున కేకాధీశ్వరుండును, క్షయవృద్ధిరహితుండును, అవ్యయుండును, అభయుండును, బాహ్యాభ్యంతరవ్యాపకుండును, బాహ్యాభ్యంతరశూన్యుండును, సర్వోన్నతుండును, అవాఙ్మనసగోచరుండును, నిత్యప్రసన్నుండును, స్వప్రకాశుండును, సర్వమంగళాస్పదుండును, సర్వమంగళాసహితుండు నని గ్రహించి బ్రహ్మవిష్ణు లిరువురును లింగంబున కభిముఖులై భీతావనతమస్తకులై కృతాంజలిపుటులై యిట్లని విజ్ఞాపనంబు సేయుండొడంగిరి.

అందు బ్రహ్మదేవుం డిట్లనియెను. మహాదేవా ! అనంతనో, అభిన్నంతనో యనునేను మొట్టమొదట నీచేతనే సృజింపఁబడితిని. మఱియు నీభ్రాంతిలో నీచేతనే త్రోయఁబడితిని. ఇందు నాయపరాధ మేమున్నది ? నాయజ్ఞానముమాట యటుండనిమ్ము ! విభూ ! నీమొట్టమొదట నిలువఁబడి యొప్పినాసైనను తమ్ముఁగూర్చిగాని, యితరులను గూర్చిగాని నిశ్చయముగా భాషింపఁగలవా రెవ్వరున్నారు ? [illegible]దేవా ! నీసమ్ముఖంబున జరగుటంజేసి మావాక్కలహముగూడ ధ[illegible]గాంచినది. ఓజగన్నాథా ! నీకుఁ బ్రణామంబుగావించుటయే యిదో[illegible]

పాదమునకుఁ జరమపరిణామఫలంబైనది:—

విష్ణుదేవుం డిట్లనియెను. దేవదేవా! నీయపారమహిమంబున కుచితంబుగా స్తోత్రము గావించుటకు నాకువాక్సామర్థ్యము లేదు. అయినను బ్రభుసన్నిధానంబున భృత్యునకు మౌనభావం బనుచితంబని శంకించి శక్తికొలఁది నించుక ప్రశంసించుచున్నాఁడను. మహాదేవా! ఈసందిగ్ధసమయమునం దజ్ఞానముచే నేమియు నెఱుంగంజాలక కావించినయుపచారంబులకును, ప్రలాపంబులకును గోపింపవలదని ప్రణామపూర్వకంబుగా క్షమాప్రార్థనమును గావించుచున్నాను—ప్రభూ! గారణత్వముం గాంచియు, నీమాయచే విస్మృతుండను, మోహితుండను, అహంకృతుండను నగునేను మరల నీమూలముననే శిక్షితుండనైతిని. నీవపరిమేయుండ వని యెఱింగియుండియు నీపరిమాణమును గ్రహింపవలయునని ప్రయత్నించినందులకు నేను చాల భయపడుచున్నాఁడను:—

ఈవిధముగాఁ గమలాసనకమలనాభులు విజ్ఞాపనంబు సేయుటయు మహాదేవుండు మిగులసంతుష్టుండై మందహాసవదనముతో వత్సలారా! మీరు నామాయచే మోహితులగుటవలననే మీమీప్రభుత్వములంగూర్చి యభిమానులై క్రోధోద్రేకంబున యుద్ధపర్యంతమును వివాదపడియును గలహమునుండి నివృత్తులు గాఁజాలకుంటిరి. మీరు జగత్కారణులైయుండియు, నజ్ఞానముచే నభిమానులై బుద్ధివిపర్యయంబునఁ గలహించుచు సృష్టినాశంబుగూడఁ గావించుట కుద్యుక్తులై యుండుటం గాంచి మీయహంకారమును, అజ్ఞానమును నాశము గావింపవలయు నను నుద్దేశముతో మీయెదుట లింగరూపమున సాక్షాత్కరించి మిమ్ములను బ్రశాంతులం గావించితిని. ఇంతటినుండి మీరు పరస్పరద్వేషశూన్యులై భయవిషాదాదులం బరిత్యజించి స్వకీయములగు కార్యంబులయందుఁ బ్రవృత్తులు గండు! పూర్వము నేను

మీకుఁ గారణశక్తిసిద్ధికొఱకు అజ్ఞానసహితంబుగ జ్ఞానసంహిత సర్వంబును ప్రసాదించి పంచాక్షరసూత్రసంజ్ఞకం బగుమంత్రరత్నమును నుపదేశించి యుంటిని. అది యంతయును మీచే విస్మృతంబై పోయినది. కావున నిప్పుడు మరల నుపదేశించెదను. ఈజ్ఞానంబు లేకున్నచో మీరు సృష్టి పరిపాలనంబులకు సమర్థులు గాఁజాలరు." అని చెప్పి మహాదేవుండు వారికి జ్ఞానసంహితయు, మంత్రరత్నంబును నుపదేశంబు గావించెను. అప్పుడు వారు దివ్యంబగుజ్ఞానము, దివ్యమంత్రమును, దివ్యమాహేశ్వరీకళను బడసి శివపాదమూలంబున దండప్రణామంబు గావించి పరమానందముతో, నిశ్చలులును, నిర్భీతులునై చూచుచుండ నాశ్చర్యమయం బగుశివలింగ మంతలో నింద్రజాలముంబోలి యంతర్హితమై పోయెను. ఆకస్మికముగ నిట్లగుటం గాంచి యయ్యిరువురును మహాదేవునకుఁ దమయెడలఁ బ్రణయభంగంబయ్యెనేమో యని భయపడి యార్తనాదంబు సేయుచు నంతలో విజ్ఞానంబుదయించుటయుఁ బరమేశ్వరుని యచింత్యప్రభావముంగూర్చి ప్రశంసించుకొనుచు బ్రహ్మవిష్ణువులును, సంతుష్టులై పరస్పరమైత్రిం బ్రకటించుచు నొండొరుల నాలింగనంబు గావించుకొని పవిత్రాంతఃకరణులై ప్రస్థానంబు గావించిరి. [illegible] నింద్రాదిదేవతలును, అసురగణంబులును, మహర్షులును, [illegible]గణంబులును, శాస్త్రవిధానానుసారంబుగా లింగప్రతిష్ఠ గావించి పరమేశ్వరుని బూజింప నారంభించిరి.

లింగప్రతిష్ఠాదివిధి.

[illegible] లింగమును, ప్రతిమను [illegible] క్షేత్రం దనుగుటయు [illegible] వాయుదేవా! [illegible]

చంద్రతారానుకూలం బగుదినంబున శివశాస్త్రవిధానంబున యథో క్తపరిమాణం బగులింగమును జేయించి సవిస్తారంబున భూపరీక్షగా వించి లక్షణోద్ధారపూర్వ[illegible] గావింపవలయును. ప్రథమంబున వినాయకుని బూజించి స్థాపస్థానమందుంచి లింగమును స్నానగృహంబునఁ జేర్చి కుంకుమాదిరసరంజిత సుకనకశలాకతో నంకితం బగులక్షణను శిల్పశాస్త్రానుసారంబుగా లిఖింపవలయును. అష్టకుంభపూరితం బగుజలము, పంచామృతజలము, పంచగవ్యము వీనిచే నాధారవేదిసహితంబుగా లింగమును పరిశుద్ధంబు గావించి పూజించి వేదికాయుతంబుగా లింగమును జలాశయమున నుంచి లింగస్థాపనంబునకు నిర్మింపఁబడిన రమణీయమందిరమును విచిత్రాలంకృతంబు గావించి యందష్టదిగ్గజంబులను, అష్టదిక్పాలకులప్రతిమూర్తులను, అష్టపూర్ణకుంభంబులను, అష్ట మంగళకలశంబులను నిలిపి గృహమధ్యభాగంబునఁ బద్మాసనచిహ్నితంబగుపీఠవేదిని ధాతుమయంబుగఁగాని, దారుమయంబుగఁగాని జేయింపవలయును. మొదట సుభద్రుఁడును, విభద్రుఁడు, సునందుఁడు, వినందుఁడు నను నలువురు ద్వారపాలకులను యథావిధిగఁ బూజించి వేదికాసహితంబుగా లింగము నభిషేకించి, వస్త్రయుగ్మముచేఁ బరివేష్టితంబు గావించి మెల్లగా జలసమీపంబునకుఁ జేర్చి పీఠకోపరిభాగంబునఁ బూర్వశిరంబుగా శయనింపఁజేయవలయును. దానికిఁ బశ్చిమమునఁ దిండికనుంచి యచ్చటనే సర్వమయంబగు లింగము నైదురాత్రులుగాని, మూఁడురాత్రులుగాని, ఏకరాత్రముగాని నివసింపఁజేసి యనంతరము శాస్త్రోక్తవిధానంబునఁ బూజితులగు దేవతల నచ్చటనే యుద్వాసితులం గావించి లింగమును పైకెత్తి పూజించుచు సర్వవాద్యములతో యాగగృహంబునకుఁ గొనిపోయి యందు మండలమధ్యంబున శయ్యను రచించి యచ్చట స

జలాభిషిక్తం బగులింగము నర్పింపవలయును. దానికీశానకోణంబున గోమయలిప్తం బగుపవిత్రస్థానమున శాస్త్రోక్తముగా స్థాపింపఁబడిన శివకుంభమునందు మహాదేవు నావాహనంబు గావించి పూజించి వేదిమధ్యమున యథావిధిగ స్థండిలమును లిఖించి దానికిఁ బశ్చిమంబునఁ బీఠపద్మమును గల్పించి మకూలపుష్పదర్భాదులచే శయ్యారచనంబు చేసి యం దొకసువర్ణకుంభమును నుంచి వివిధమంగళధ్వానంబులతో లింగము నటకుఁ దెచ్చి పీఠమును లింగమును నపూర్వంబగురక్తవస్త్రయుగ్మముతో వేష్టనంబు చేసి పూర్వమువలెనే శయనింపఁజేసి సమ్ముఖంబునం దష్టదళపద్మంబును లిఖించి ప్రతిదళంబునను యథాక్రమంబుగా బ్రహ్మకలశస్థాపనంబు చేసి మధ్యభాగంబున శక్తికలశము నుంచి ప్రదక్షిణంబును బ్రాహ్మణులచే హోమంబును గావింపవలయును. పూర్వాద్యష్టదిక్కులయందు గలబ్రాహ్మణుల నష్టమూర్తులుగా భావింపవలయును. కాదేని చతుర్దిశలయందును నలుగురుబ్రాహ్మణులను జాపకులుగను, అధ్యేతలుగను నిలుపవలయును. తరువాత యథాక్రమంబుగ సప్తద్రవ్యంబులచేత నాచార్యుఁడే హోమము చేయవలయును. ఇతరబ్రాహ్మణులు మంత్రముల నర్ధమాత్రముగఁగాని, పాదమాత్రముగఁగాని యుచ్చరించుచు హోమముచేయవలయును. కాదేని గురుఁడే ప్రధానహోమము చేయవలయును. పూర్ణాహుతికిఁ బూర్వము మూలమంత్రముతో అష్టోత్తరశతహోమంబు చేయుచు మాటిమాటికిని, లింగమును, వేదికను స్పృశించుచుండవలయును. తరువాతఁ బూర్ణాహుతి చేసి దక్షిణల నొసంగవలయును. ఆచార్యునకర్ధభాగంబును, హోతలకును, లింగనిర్మాతకును దదర్ధభాగంబును, శేషవస్తువులకు శక్త్యనుసారంబుగను దక్షిణల నర్పింపవలయును.

అనంతరము గర్తమధ్యంబున సువర్ణవృషభంబునుంచి పృథ్వ్యా

రి, పంచగవ్య, శుద్ధజలాభిషిక్తంబును, చందనచర్చితంబు నగు బ్రహ్మశిలను సంస్థాపించి నవశక్తినామంబులతోఁ గరన్యాసంబు చేసి బ్రహ్మశిలయందు శివశాస్త్రవిధానంబున హరితాళాదిధాతువులను, బీజములను, గంధౌషధాదులను నిక్షేపింపవలయును. ఈవిధముగా లింగమునకెదురుగ వానినుంచి లింగమును క్షీరవృక్షసముద్భవంబుగా భావించుచు మూలమంత్రోచ్చారణపూర్వకంబుగా శిలతోఁగూడ లింగమునించుక యుత్తరశిరంబుగాఁ జేసి స్థాపవలయును. మఱియు శక్తిబీజము నుచ్చరించుచు స్థానశోధనంబు గావించి బంధకద్రవ్యములతో దేవీపీఠమును బంధించి యర్ఘ్యపుష్పాదిపరిధానంబుచేసి యవనికాంతరాళంబున లింగసమ్ముఖంబునందు స్థాపించి శయనాగారమునందలికలశములం దెచ్చి యథాస్థానంబులయందు స్థాపించి కలశపూజచేసి మహాపూజ నారంభింపవలయును. మంత్రవిదుం డగు సాధకుఁడు అంగుష్ఠానామికాయోగంబుచే లింగమున కీశానభాగంబున శక్తికలశమును, బ్రహ్మకలశమును స్థాపించి యాజలంబుచే లింగమును, పీఠమును సకలోపచారద్రవ్యంబుల నభిషేకించి లింగమును బ్రజ్వలితంబుగా భావించి కళాన్యాసంబు చేసి, యూర్ధ్వాభిముఖుండును, కృతాంజలిపుటుండు నై దేవదేవుల నావాహనంబు చేయవలయును.

మహాదేవుఁడు వృషభవాహనారూఢుండై గాని, విమానారూఢుండై గాని సర్వాలంకారభూషితుండై దేవీసహితంబుగా గగనతలంబునుండి వచ్చుచున్నట్లును, బ్రహ్మయు, విష్ణుండును, ఇంద్రుండును, సూర్యాదిదేవతాగణంబులును నిటలతటఘటితాంజలిపుటులై స్తోత్రపాఠములు సేయుచు వెనుకనుండి సేవించుచున్నట్లును, అందుఁ గొందఱు ప్రణమిల్లుచున్నట్లును, కొందఱు నృత్యము సేయుచున్నట్లును, కొందఱు భేరీమృదంగాదిమంగళవాద్యముల మ్రోగించుచున్నట్లును

స్థాపించి యావాహనంబు చేసి పంచోపచారపూజ గావింపవలయును. పంచోపచారపూజకంటె శ్రేష్ఠవిధానం బేదియును లేదు. లింగమునకే ప్రతిమను బ్రతిష్ఠింపవలయును. కాని ప్రతిమాప్రతిష్ఠావిషయంబున లక్షణోద్ధారసమయంబున నయనమోచనంబు చేయవలయును. జలాధివాససమయంబున శయ్యోపరిభాగంబున నధోముఖముగ శయనింపఁజేయవలయును. కలశోదరగతంబు లగుమంత్రంబులను హృదయాంతరంబున నియోజింపవలయును. గృహశూన్యంబుగాఁ గేవలదేవప్రతిష్ఠ గావించుటకంటె దేవాలయసహితంబుగాఁ బ్రతిష్ఠించుట శ్రేష్ఠఫలదాయకము కావున సమర్థుండగువాఁడు ముందుగ దేవాలయమును నిర్మించి యందు శివప్రతిష్ఠ గావింపవలయును.

గృహపూజకొఱకు నుత్తమప్రతిష్ఠావిధానమును జెప్పెద నాకర్ణింపుము. రమణీయంబగు చిన్నప్రతిమను గాని, శివలింగమునుగాని సిద్ధము చేసికొని యుత్తరాయణంబున శుక్లపక్షమునందు, శుభదినంబునఁ బవిత్రస్థానంబునందు వేదికను నిర్మించి యందుఁ బూర్వోక్తవిధానంబునఁ బద్మంబును లిఖించి యందుఁ బత్రిపుష్పాదుల నుంచి పూర్ణకుంభమును స్థాపించి దానికి నలుదెసలను గలశంబులను స్థాపించి, యాపంచకలశంబులను బంచబ్రహ్మపూజ గావించి, ముద్రికలను బ్రదర్శించి యాబ్రహ్మకలశోదకంబులచే లింగమునుగాని, ప్రతిమనుగాని శోధించి యుత్తరభాగంబునందు శ్రేష్ఠం బగుపుష్పాసనంబున స్థాపించి మస్తకంబునఁ బుష్పంబు నుంచి ప్రోక్షణీజలంబులచేఁ బ్రోక్షించి జయశబ్దపూర్వకంబుగాఁ బుష్పంబులచేఁ బూజింపవలయును. తరువాతఁ బంచకళాన్యాసంబు చేసి పూర్వమువలెనే పూజింపవలయును. ఇట్లు సాధకుండగువాఁ డాస్థలమునందుఁ బ్రతిదినమును దేవీసహితముగా మహేశ్వరుని బూజింపవలయును. కాదేని—మహామంత్రసమన్వితం [illegible]

నొకకలశమును బ్రహ్మోపరిభాగంబున స్థాపించి పూర్వోక్తవిధానంబునఁ దక్కినకర్మంబుల నన్నిటిని దీర్చవలయును. లింగము అశుచిస్పృష్టంబును, కించిద్భగ్నంబు నైనప్పుడు దానిని పునశ్శోధనంబు గావించి మరల స్థాపింపవలయును. దగ్ధంబును, విశీర్ణంబును, అంగహీనంబు నగులింగమును జలాశయంబున నిక్షేపింపవలయును. సంధానయోగ్యం బగు లింగమునే ప్రతిష్ఠించి పూజింపవలయును. ప్రతిష్ఠితలింగముగాని, ప్రతిమగాని యొకదినము పూజింపఁబడకున్నచో మఱునాఁడు దానికి ద్విగుణితం బగుపూజ గావింపవలయును. రెండుదినములు పూజింపఁబడకున్న నొకమహాపూజ చేసి సంప్రోక్షణంబు చేయవలయును. ఒక నెలదినములుగాని యంతకెక్కుడుగఁగాని పూజింపఁబడకున్నచోఁ బునఃప్రతిష్ఠ గావింపవలయు నని కొందఱును, పునస్సంప్రోక్షణము చేయవలయు నని కొందఱును నిర్దేశించి యున్నారు. లింగాదులను సంప్రోక్షణంబులుగాఁ జేయవలసివచ్చినప్పుడు ముందుగా లింగమును బూర్వోక్తవిధిచే నధివసింపఁజేసి యష్టదిక్పాలకకలశోదకంబులచేతను, పంచబ్రహ్మకలశజలంబులచేతను, గోక్షీరములచేతను, శుద్ధోదకంబులచేతను నభిషేకించి మూలమంత్రము నుచ్చరించుచుఁ బ్రోక్షణీజలంబులచే అష్టోత్తరశతవారంబులు బ్రోక్షింపవలయును. మఱియుఁ గుశపుష్పసహితం బగుపాణితలమును లింగశిరోభాగమునందుంచి యష్టోత్తరశతపర్యాయములు మూలమంత్రమును జపించి మూలమంత్రోచ్చారణపూర్వకంబుగా మస్తకమునుండి పీఠపర్యంతముం గలసకలస్థానములను స్పృశించుచు దేవతావాహనంబు గావించి పూర్వమువలెనే మహాపూజ చేయవలయును. ప్రతిష్ఠితలింగ మపహృతంబై పోయినచో శివలింగస్థానంబునఁగాని, జలంబులయందుఁగాని, అగ్నియందుఁగాని, ఆకాశమునందుఁగాని భగవానుం డగుశివుని బూజింపవలయును.

— సాంగయోగనిరూపణము. —

శ్రీకృష్ణా! విధిబోధితంబును, సాంగంబును, సహేతుకంబును, పరమదుర్లభంబు నగు యోగముం గూర్చి చెప్పెద నేకాగ్రచిత్తుండవై యాకర్ణింపుము. చిత్తమును విషయవ్యాపారములనుండి నిరోధించి కేవలమును శివునియందు సంస్థాపించుటయే యోగమని మహాత్ములు సంక్షేపముగా నిర్దేశించి యున్నారు. అది మంత్రయోగము, స్పర్శయోగము, భావయోగము, అభావయోగము, మహాయోగము నని యైదువిధములు. మంత్రాభ్యాసబలంబున మంత్రతత్త్వమును గ్రహించుటకై మనోవృత్తిని నిశ్చలంబుగావించుటయే మంత్రయోగము. అట్టిమంత్రయోగము ప్రాణాయామసహితముగా ననుష్ఠితంబైనచో స్పర్శయోగమును, ప్రాణాయామవిరహితంబైనచో భావయోగంబు నగుచున్నది. ఈవిశ్వమునంతను నిరాకారముగా భావించుటయే అభావయోగము. మనోవృత్తియం దేకమాత్రమును, ఉపాధిశూన్యంబు నగు శివస్వరూపమును జింతించుచుండుటయే మహాయోగము. సాంసారికంబులగు సుఖదుఃఖములయందు, వేదోక్తంబులగు క్రియాకలాపములయందును విరక్తులగువారే యోగమున కధికారులు. ఐహికాముష్మిక కర్మంబులయందు దోషవిచారంబును, ఈశ్వరుని యస్తిత్వనివేచనంబును గలవారుగూడ యోగంబున కధికారులు. అష్టాంగయోగమైనను, షడంగయోగంబైనను అనుష్ఠింపవలయును. యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణ, సమాధి యను నీయెనిమిదియు యోగాంగములు. ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి యనునవి షడంగములు. వీనికి భిన్నభిన్నలక్షణములు శివశాస్త్రములందును, శివతంత్రములందును, కామికాదిగ్రంథములయందును, ఇతర

యోగశాస్త్రములందును, పురాణములందును, చెప్పంబడి యుండును. నేనిప్పు డీయోగాంగములలక్షణంబులను, సంక్షేపంబుగ నభివర్ణించెదను. అహింస, సత్యాచరణము, చౌర్యత్యాగము, బ్రహ్మచర్యము, అప్రతిగ్రహము నను వీని నభ్యసించుటయే యమము. శౌచము, సంతుష్టి, జపము, తపము, ఈశ్వరునియందుఁ గర్మసమర్పణము, అను నీ యైదును నియమలక్షణములు. స్వస్తికము, పద్మము, అర్ధచంద్రము వీరము, యోగము, ప్రసాధితము, పర్యంకము, యథేష్టము నను నీయెనిమిదియు నాసనలక్షణములు. దేహస్థం బగు వాయువు ప్రాణనామముగలదిగావున దానిని నిరోధించుటయే ప్రాణాయామము. అది రేచకపూరకకుంభకభేదంబున మూఁడువిధంబు లైనది. అంగుళిచే నొకనాసారంధ్రమును మూసి మఱియొకరంధ్రముచుండి యుదరమధ్యగతంబగు వాయువును నిస్సరణంబు గావించుట రేచకము. అట్లే బాహ్యమునందలివాయువు నుదంబున నిండించుట పూరకం బగుచున్నది. బహిరంతరంబులయందలివాయువును గ్రహించుటగాని, త్యజించుటగాని చేయక పూర్ణకుంభమువలె నిశ్చలంబుగ నుంచుటయే కుంభక మనంబడును. ఈరేచకాదిప్రాణాయామాంగములు శీఘ్రముగఁగాని, విలంబముగఁగాని చేయంజనదు. క్రమముగా నభ్యసింపవలయును. మొట్టమొదట నాడీశోధనంబుగావించి రేచకాదుల నభ్యసింపవలయునని యోగశాస్త్రవిదులు చెప్పుదురు. మాత్రాగుణవిభాగానుసారముగా కనీయాదినామంబులచే ప్రాణాయామము చతుర్విధమైనది. ఏకోద్ఘాతకంబును, ద్వాదశమాత్రికంబు నగునది కనీయంబనియు, ద్విరుద్ఘాతకంబును ద్వాత్రింశన్మాత్రకంబు నగునది మధ్యమంబనియు, త్రిరుద్ఘాతకంబునును, షట్త్రింశన్మాత్రికంబు నగునది యుత్తమంబనియు, స్వేదకంపాదిజనకంబగుప్రాణాయామంబు తదుత్తరం బనియు యోగు

లు నిర్దేశించియున్నారు. యోగులకు యోగచర్యయందు ఆనందజనితంబులగు నశ్రురోమాంచమూర్ఛాదులు గలుగుచుండును. అశీఘ్రంబుగను, అవిలంబంబుగను జానువును ప్రదక్షిణించి యంగుళిస్ఫోటనంబు గావించుటయే మాత్ర యనంబడును. ఉద్ఘాతక్రమానుసారంబుగా మాత్రాక్రమంబు నెఱుంగవలయును. ప్రాణాయామంబు చేయుటకు ముందుగనే నాడీశోధనంబు చేయవలయును. ప్రాణాయామము అగర్భంబనియు, సగర్భం బనియు రెండుభాగములుగా విభక్తంబైనది. అగర్భప్రాణాయామముకంటె సగర్భమే శతగుణంబులు శ్రేష్ఠమగుటచే యోగులు సగర్భప్రాణాయామమునే యభ్యసించుచుందురు. ఒక్క ప్రాణవాయువిజయంబువలన దశవాయువులను జయించినట్లగుచున్నది. ప్రాణా,పాన,సమా,నోదాన,వ్యానంబులును, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయంబులు ననునీ దశవాయువులును శరీరమునం దధివసించి యుండును. ప్రయాణంబు చేయునది కావున ప్రాణంబనియు, భుక్తపదార్థముల నధోభాగంబునకుఁ బంపునది కావున అపానంబనియు, సకలావయవములను వృద్ధినందించుచు వ్యాపించునది కావున వ్యానం బనియు, మర్మస్థానంబుల నుద్వేజితంబులుగాఁ జేయునదిగావున ఉదానం బనియు, సర్వాంగములకును సమత్వముం గూర్చునదిగావున సమానం బనియు నామవాయువులకు నామంబులయ్యెను. ఉద్గారసమయంబున నాగవాయువును,గాత్రవికసనంబునందు కూర్మవాయువును, కాసకరణంబున కృకరవాయువును, జృంభణంబున దేవదత్తవాయువును, వ్యాపించియుండును. ధనంజయవాయువు సర్వవ్యాపి యగుటచే మరణించినతరువాతఁ గూడ దేహమును బరిత్యజింపదు. ప్రాణాయామము శరీరమునందలి సకలదోషములను నశింపఁజేసి యారోగ్యమును వర్ధిల్లఁజేయునుగావున దేహరక్షణంబునకుఁ గ్రమముగా

దీని నభ్యసింపవలయును. విణ్మూత్ర శ్లేష్మంబు లల్పపరిమాణంబు లై యుండుట, బహుభోజనశక్తి, శ్వాసక్రియవిలంబంబుగఁ గావించుట, శరీరమునందు లాఘవము, శీఘ్రగమనము, ఉత్సాహము, సుస్వరత్వము, రోగము లేకుండుట, రూపము, తేజము, బలము, ధైర్యము, మేధ, దార్ఢ్యము గలిగియుండుట, ప్రసన్నత మొదలగు లక్షణములం బట్టి ప్రాణాయామము సిద్ధించెనని యెఱుంగవలయును. తపోయజ్ఞవ్రతదానాదులు ప్రాణాయామమునందు షోడశాంశము కైనను బోలఁజాలవు :—

స్వస్వవిషయంబులయందు చరించుచున్న యింద్రియంబులను సమాహరించి నిగ్రహించుటయే ప్రత్యాహారము. మనంబు మొదలుగాఁగలయింద్రియగణమే స్వర్గనరకంబులకు సాధకమగుటం జేసి యింద్రియనిగ్రహమే స్వర్గంబును, తదనిగ్రహమే నరకంబు నగుచున్నది. కావున సుఖార్థియగు బుద్ధిమంతుఁడు జ్ఞానవైరాగ్యముల నాశ్రయించి యింద్రియాశ్వములను నిగ్రహించి పతనభయమునుండి యాత్మరక్షణంబు గావించుకొనవలయును. చిత్తమును యథాస్థానమునందు స్థిరముగా నిలుపుట ధారణయగుచున్నది. ఇతరస్థానము లన్నియును దోషాశ్రయంబులు గావున కేవలము మహాదేవమూర్తియే చిత్తమునకనుకూలస్థానము. కొంతకాలము మితి యేర్పఱచుకొని చిత్తమును శివమూర్తియందు నిలిపి యుంచవలయును. అలక్ష్యము చెడకుండక నున్నచో ధారణాసిద్ధి యగును. ధారణవలననే చిత్తస్థైర్యము గలుగుచున్నది గావున ధారణాయోగాభ్యాసముచేతనే మనస్సును స్థిరముగాఁ జేసికొనవలయును. అచంచలచిత్తముతో శివుని ధ్యానించుచుండుటయే ధ్యానము. ధ్యేయుండగు శివునియందుఁ జిత్తసమర్పణంబు చేసి తదైక్యజ్ఞానంబుచే నితరచింతలను మఱచియుండుటచే ధ్యానసిద్ధి యగును.

ఈవిశ్వమునందు మంగళకరులగు దేవదేవులే ధ్యేయు లని యథర్వశ్రుతులు బోధించుచున్నవి. వారు సర్వలోకప్రభువులును, సర్వవ్యాపకులును, సర్వజ్ఞులును, వివిధరూపంబులచేఁ జింతనీయులు నై యున్నారు. ధ్యాత; ధ్యానము, ధ్యేయము, ధ్యానప్రయోజనము ననునీనాల్గింటిని గ్రహించి యోగాభ్యాసరతుండు గావలయును. జ్ఞానియు, విరాగియు, శ్రద్ధాయుక్తుండును, క్షమాశీలుండును, నిర్మముండును, ఉత్సాహియు నగువాఁడే ధ్యానయోగమునకుఁ బాత్రుఁడు. ధ్యానమునందు శ్రాంతుండై జపంబును, జపశ్రాంతుండై ధ్యానంబును గావించుచు యోగనిరతుం డగువాఁ డచిరకాలంబుననే సిద్ధుండు గాఁగలఁడు. ద్వాదశప్రాణాయామము లొక్కధారణ యగును. ద్వాదశధారణ లొకధ్యానం బగును. అట్టిద్వాదశధ్యానము లొకసమాధి యగుచున్నది. సమాధియే యోగమునకు శేషాంగముగాఁ గీర్తింపఁబడుచున్నది. ఈ సమాధివలననే యోగి యదృష్టంబులు,నశ్రుతంబులు నగువిషయములను గ్రహింపఁగలుగుచుండును. స్వరూపముచే ధ్యానమే సమాధి యగుచున్నది. సమాధిస్థుండగువాఁడు నిస్తరంగసముద్రముంబోలి ధ్యేయవస్తువునందు మనంబు నిలిపి సుస్థిరుండై యుండును. సమాధిగతుం డగుయోగి సుస్థిరదీపాకృతిని వెలుంగుచుండును. ఆతనికి శ్రవణ, ఘ్రాణాస్వాదనాదివిషయానుభవంబులుగాని, మానసికసంకల్పంబులుగాని యేమియు నుండవు. బాహ్యజ్ఞానమే లేక కేవలము పరమాత్ముం డగు శివునియందే యాత్మసంయోగంబు గావించి యుండుటయే సమాధి. నివాతస్థం బగుదీపముంబోలి సమాధిస్థుం డగుయోగి నిశ్చలుఁడై యుండును. ఈవిధముగా నొకసంవత్సర ముత్తమయోగము నభ్యసించువానికిఁ గ్రమముగా నంతరాయము లన్నియును దూరీభూతము లై పోవును. ఆలస్యము, దుస్సాధరోగము, ప్రమాదము, స్థానసంశయము,

చిత్తచాంచల్యము, అశ్రద్ధ, భ్రాంతిదర్శనము, దుఃఖానుభవము, దౌర్మనస్యము, విషయలోలత యనునీవదియును యోగానుష్ఠానమునకు విఘ్నము లని యెఱుంగవలయును. అందు యోగిమనశ్శరీరములయెడ నత్వమే యాలస్యమనియు, శరీరమునందు ధాతువైషమ్యమువలనం గలుగుదోషము రోగమనియు, యోగసాధనములంగూర్చినయభావనము ప్రమాదమనియు, ధ్యానింపఁదగినదిదియా యదియా యని గ్రహింపఁజాలక తర్కించుచుండుట స్థానసంశయమనియు, చిత్తమొక్క-చో నిలువకుండుట చిత్తచాంచల్యమనియు యోగమార్గమునందుపేక్షాభావ మశ్రద్ధ యనియు, బుద్ధికి తథ్యమిథ్యాబోధము లేకుండుట భ్రాంతి యనియు నెఱుంగవలయును. ఇఁక దుఃఖము మూఁడువిధములైనది. చిత్తమునందలి యజ్ఞానజనితంబగునది యాధ్యాత్మికదుఃఖమనియు, దైహికం బగునది యాధిభౌతికదుఃఖంబనియు, వజ్రాస్త్రాదుల వలనంగలుగునది యాధిదైవికదుఃఖంబనియు గ్రహింపవలయును. ఇచ్ఛావ్యాఘాతమువలనం గలిగినమనశ్చాంచల్యమే దౌర్మనస్యమగుచున్నది. విచిత్రవిషయంబులయందు చిత్తవిలాసమే విషయలోలత యగును. యోగి కీవిఘ్నంబులు పదియును దూరంబులైనచో యోగసిద్ధిచిహ్నంబులు గానంబడును. ప్రతిభ, శ్రవణము, వార్త, దర్శనము, ఆస్వాదము, వేదన యనునీయాఱును యోగసిద్ధిసూచకంబు లని యెఱుంగవలయును. దూరంబులును, సూక్ష్మంబులును, అతీతంబులు ననాగతంబులు నగువిషయములు యథాతథంబుగ దేనియందుఁబ్రతిభాసించునో యదియే ప్రతిభ—అనాయాసముగా సకలశబ్దములను గ్రహింపఁగలుగుటయే శ్రవణము;—సర్వజీవుల వృత్తాంతములను దెలిసికొనుటయే వార్త:—అవలీలగా దివ్యవస్తువులను సందర్శింపఁగలుటయే దర్శనము:-దివ్యరసాస్వాదనమే ఆస్వాదనము:--సర్వానుభవమే

వేసి:—యోగసిద్ధునకు స్వచ్ఛందంబగుమృత్యువాని సుఖము నలంకరించును. దివ్యరసాయనంబులును, సకలదివ్యౌషధంబులును గరతలామలకంబు లగును. సర్వైశ్వర్యములును లభించును. మోక్షజ్ఞానము నిత్యసిద్ధంబై యుండును.

సాధారణముగా జీవులశరీరములు భూజలతేజోవాయ్వాకాశంబులచే సంపాదకంబు లైనవగుటం జేసి కృశంబులును, స్థూలంబులును, బాల్యయౌవనాద్యవస్థాభేదంబులు గలవిగాను గానంబడుచుండును. కాని యోగసిద్ధుండుమాత్రము పార్థివాంశప్రభావముచేఁ బుష్పాదులు లేకుండఁగనే సర్వదా సుగంధము నాఘ్రాణింపఁగలుగుచుండును. జలమధ్యమున నివసించుటకును, భూమధ్యమునఁ బ్రవేశించుటకును సమర్థుండగును. అతఁడు తలంచినచో సముద్రమును పానముచేయుటకును, జగమంతను దహింపఁజేయుటకును జాలి యుండును. జలసంబంధములగు షోడశగుణంబులును, అనలసంబంధములగు చతుర్వింశతిగుణంబులును, వాయుసంబంధములగు ద్వాత్రింశద్గుణంబులును యోగికి సిద్ధించును. అతనికి సర్వైశ్వర్యంబులును హస్తంగతములై యుండును. ఈసకలసిద్ధులును గలిగియున్నను యోగి విరాగియై కేవలమోక్షపదాభిలాషియై యుండవలయును. ప్రతిభాదు లన్యర్థంబు లైనచోఁ జిత్తము గుణసక్తంబై యవ్యయైశ్వర్యసిద్ధికి భంగకరం బగును గావున యోగాభ్యాసి యగువాఁడు దేవాసురభోగంబులను, రాజభోగంబులను దృణంబులుగా భావించి పరిత్యజించి పరమయోగసిద్ధిం గాంచవలయును. అట్టియోగసిద్ధుఁడు లోకానుగ్రహంబునకై సంచరించుచు నభిమతభోగంబుల ననుభవించి యనంతరమునందు ముక్తుం డగును.

ఇఁక యోగప్రయోగముం గూర్చి వర్ణించెద నాకర్ణింపుము. శుభసమయంబున నిశ్శబ్దంబును, నిర్జనంబు నగునుత్కృష్టప్రదేశమునందు

గాని, శివక్షేత్రాదికంబులందుగాని, సౌమ్యంబును, సుస్థిరంబును, గంధధూపాదివాసితంబును, ముక్తాపుష్పవితానంబును, విచిత్రచిత్రా నశోభితంబును, కుశపుష్పసమిత్తోయఫలమూలసంపూర్ణంబును నగు స్థలమునందు యోగాభ్యాసము చేయవలయును. జలాగ్నిసమీపంబు లందుగాని, శుష్కపత్రమయస్థానమునందుగాని, దంశమశకాకీర్ణక్షే త్రంబునందుగాని, సర్పవ్యాఘ్రాదిసంకులస్థానమునందుగాని యోగము చేయఁ గూడదు. శ్మశాన, చైత్య, వల్మీక, జీర్ణాగార, చతుష్పథ, నదీ, నద, సముద్రతీర, రథ్యా, జీర్ణోద్యానగోష్ఠాదులు యోగసాధనంబున కను కూలంబులు గావు. అజీర్ణము, అన్నాన్నారము, మలమూత్రదోషము, ఛర్ది, అతిసారము మొదలగు శరీరదోషంబులు గలసమయమునందు ను, అతిభోజనము, శ్రమ, విషయచింతాధిక్యము, ఆకలి, దాహము గలయప్పుడును యోగము చేయరాదు. ఉచితాహారవిహారియు, యు క్తచేష్టుండును, నిద్రాజాగరంబులయందు నియమసంపన్నుండును, అ నాయాసుండును నగుపురుషుండు యోగంబున కధికారి యగుచున్నాఁ డు. యోగంబునకు విస్తృతంబును, కోమలంబును, రమణీయంబును పవిత్రంబును, కోమలచర్మపరిధానంబును, మధుప్రభృతిద్రవ్యంబులచేఁ బ్రోక్షితంబును శుభ్రంబును, సుస్థిరంబు నగు నాసనంబును గల్పిం చుకొని, యందు సుస్థిరంబుగను, సుఖంబుగను నాసీనుండై పద్మకస్వ స్తికాద్యాసనంబుల నభ్యసింపవలయును. గురుపర్యంతముగను వందనీ యులగువారి కందఱకును యథాక్రమంబుగ నభివందనంబు గావించి నతరువాతనే యోగాభ్యాసము గావింపవలయును. ఋజుగ్రీవుండును, ఋజువక్షోమస్తకుండును, నాతిశ్లిష్టోష్ఠలోచనుండును, కించిదున్నమిత శిరుండును, నై దంతంబులచే దంతములను స్పృశింపనీయక, దంతా గ్రసమీపంబున నిశ్చలంబుగా జిహ్వను స్థాపించి జననేంద్రియమును

ముష్కంబులను బ్బార్ణిభాగంబులచే రక్షితంబులుగాఁజేసి, యప్రియ త్నముగా బాహువుల నూరువులందుఁ జేర్చి, దక్షిణకరపృష్ఠమును వామకరపృష్ఠంబున నుంచి పృష్ఠ మించుకయున్నతంబుగను, వక్షస్థలంబు సుస్థిరంబుగను జేసి నాసాగ్రంబున దృష్టి నిలుపవలయును.

పిమ్మట శ్వాసనిరోధపూర్వకంబుగా నిశ్చలుండై యాత్మశరీరాసనంబునందు హృత్పద్మపీఠంబున నంబికాసహితుం డగుశివుని భావించుచు ధ్యానయజ్ఞంబుచేఁ బూజింపవలయును. మఱియు మూలాధారము, నాసాగ్రము, నాభి, కంఠము, తాలురంధ్రములు, భ్రూమధ్యము, బ్రహ్మరంధ్రము, లలాటము, మస్తకము, వీనియం దెందైనను శివస్మరణంబు గావింపవచ్చును. అందు దేవదేవులకుఁ బరమాసనకల్పనంబు చేయవలయును. అందు సావరణంబుగఁగాని, నిరావరణంబుగఁగాని ద్విదళాదిపద్మంబులయందు యథావిధిగ శివుని స్మరింపవలయును. భ్రూమధ్యంబునందు విద్యుత్సమంబగుద్విదళపద్మము గలదు. విద్యుద్వర్ణంబులగు దానిపత్రంబులు రెండును దక్షిణోత్తరంబుల విరాజిల్లుచుండును. షోడశదళపద్మంబునకు మూలమునుండి పూర్వాదిక్రమంబుగా షోడశస్వరములును షోడశపత్రములై శోభిల్లుచుండును. ద్వాదశదళపద్మంబునకు కకారాది ఠకారాంతమువఱకును గల పండ్రెండువర్ణములును బత్రములగుచున్నవి. ఆపద్మమును హృదయాభ్యంతరమున భావింపవలయును. నాభికుపరిభాగంబున నధోముఖముగనుండు దుగ్ధశ్వేతంబగుపద్మమునకు డకారాది ఫకారాంతమువఱకును గలదశవర్ణంబులును బత్రములు. అధోముఖంబును, తప్తాంగారసన్నిభంబునగు స్వాధిష్ఠానపద్మమునకు బకారాది లకారాంతములగు షడ్వర్ణములును పత్రములై యున్నవి. స్వర్ణవర్ణంబగుమూలాధారపద

మునకు వకారాది సకారాంతంబు లగు చతుర్వర్ణంబులును బత్రము లై యున్నవి. ఈపద్మంబులలోఁ సంకిష్టమైన దానియందు నిశ్చలబుద్ధియుక్తుండై దేవదేవులను జింతనంబు గావింపవలయును. అంగుష్ఠమాత్రుండును, నిర్మలుండును, తేజోమయుండును, దీపశిఖోజ్జ్వలుండును, స్వశక్తిపూర్ణుండును, నగుశివుని చంద్రరేఖాసమునిగఁగాని, నక్షత్రతుల్యునిగఁగాని, నీవారశూకము, మృణాలసూత్రము, వీనితోఁ దుల్యునిగఁగాని, కదంబకుసుమగోళాకృతిగఁగాని, హిమకణసదృశునిగఁగాని భావింపవలయును. పృథివ్యాదిపంచతత్త్వములను జయింపవలయునను కోరికయున్నచో ఆతత్త్వంబుల కధిపతిస్వరూపులగు స్థూలమూర్తులను చింతింపవలయును. బ్రహ్మాదిసదాశివాంతంబులగు భవాద్యష్టమూర్తులును మహాదేవుని స్థూలమూర్తులని శివశాస్త్రములు బోధించుచున్నవి. భోగాభిలాషు లగువారు ఘోర, మిశ్ర, శాంతాదిమూర్తులను ధ్యానింపవలయును. ఘోరమూర్తిచింతనంబునఁ బాపక్షయంబును, మిశ్రమూర్తిధ్యానంబున సర్వసిద్ధిప్రాప్తియు, శాంతమూర్త్యుపాసనంబున శాంతిలాభంబు నగును. అందుఘోరమూర్తి శీఘ్రంబుగను, మిశ్రమూర్తి యాలస్యంబుగను, సౌమ్యమూర్తి యనతిశీఘ్రంబుగను, అనతివిలంబంబుగను సిద్ధించును. సౌమ్యమూర్తి చింతనంబున ముక్తియు, శాంతియు, ప్రజ్ఞయు విశేషించి సిద్ధించును. దీనివలనఁ గ్రమముగా సకలసిద్ధులును లభించుననుట కెట్టిసంశయంబును లేదు.

శ్రీకంఠనాథునిస్మరించుట సర్వసిద్ధిప్రదంబని తెలిసికొని యనేకయోగు లమ్మహాదేవునే ధ్యానించుచుందురు. కొందఱు యోగులు చిత్తంబున కేకాగ్రతం గల్పించుకొనుటకై స్థూలమూర్తులను ధ్యానించుచుందురు. స్థూలమునందు చిత్తము స్థిరం బైనచోఁ బిమ్మట సూక్ష్మమునందును నిశ్చలంబు గాఁగలదు. శివచింతనంబువలననే సకలసి

ద్ధులును లభించును గాని యన్యమూర్తిధ్యానంబువలన శైవసిద్ధి లభింపఁబోదు. అన్యమూర్తులను ధ్యానించినను శివస్వరూపముగనే భావించి యుపాసింపవలయును. శివమూర్తులయం దెవ్వరి కేమూర్తి ప్రియంబగునో వారామూర్తినే ధ్యానించుచు మనంబునకు నిశ్చలత్వమును సంపాదించుకొనవలయును. మొట్టమొదట సవిషయకధ్యానముం గావించి పిమ్మట నిర్విషయకధ్యానము చేయవలయును. నిర్విషయమునుగూర్చి ధ్యానమే లేదని పండితులు చెప్పుదురు. బుద్ధిపరిణామవిశేషమే ధ్యానము. విషయము లేకున్నచో బుద్ధికిఁ బరిణామము గలుగదు. సూక్ష్మవిషయధ్యానమే నిర్విషయధ్యాన మగుచున్నది. సాకారధ్యానము సవిషయకంబనియు, నిరాకారంబగునాత్మధ్యానమే నిర్విషయకజ్ఞాన మనియు నెఱుంగవలయును. నిరాకారసాకారభేదముచే ధ్యానము నిర్బీజం బనియు సబీజంబనియు రెండువిధంబు లగుచున్నది. కావున మొదటసవిషయకం బగుసబీజధ్యానమును దరువాత నిర్విషయంబగు నిర్బీజధ్యానంబును గావింపవలయును.

ప్రాణాయామమువలన శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదము నను నీదివ్యసిద్ధులు క్రమముగా సిద్ధించును. విపత్తుల యుపశమమే శాంతి యనియు, బాహ్యాంతరతమోనాశనమే ప్రశాంతి యనియు, తత్ప్రకాశమే ప్రదీప్తి యనియు, చిత్తస్వాస్థ్యమే ప్రసాద మనియు నెఱుంగునది. బుద్ధిప్రసన్నం బైనచో బహిరంతరింద్రియంబు లన్నియు ప్రసన్నంబులగును. ధ్యాత, ధ్యానము, ధ్యేయము, ధ్యానప్రయోజనము అను విషయంబుల నెఱింగియే ధ్యానము గావింపవలయును. ధ్యానవైరాగ్యసంపన్నుండును, నిత్యోద్యోగియు, శ్రద్ధావంతుండును, ప్రసన్నాత్ముండు నగువాఁడే ధ్యాత యని పండితులు చెప్పుదురు. ఏకాగ్రచిత్తంబున శివచింతనంబు గావించుచుండుటయే ధ్యానము.

బుద్ధివికాసమహాసంపదను సిద్ధింపఁజేయు కేవలంబగు ధ్యానమే ధ్యేయము. చిత్తశుద్ధియు సకలమానసిక్తిగుణసంపదలును మోక్షప్రాప్తియు శివధ్యానముచేఁ బడయఁదగినవియు. ధ్యానఫలంబుచే నైహికాముష్మికసుఖంబులు రెండును లభించును గావున మానవులు సకలంబును బరిత్యజించి ధ్యానమునందుంట నావశ్యకము. ధ్యానము లేక జ్ఞానము లభింపదు. అట్టి ధ్యానము యోగసాధనంబులంగాని సులభసాధ్యంబు గాఁబోదు. ధ్యానజ్ఞానసంపన్ను లగువారు మాత్రమే భవసముద్రమును దరింపఁగలరు. నిష్కాములగువారి హృదయములు మాత్రమే ధ్యానజ్ఞానముల కధిష్ఠానంబులగును. పాపాత్ములకు వానిప్రాప్తింపనేమి మార్గమైయుండును. యోగులు విషయసంగవర్జితులై యేకాగ్రచిత్తంబున నిర్మలజ్ఞానంబును బడయుదురు. ప్రదీప్తానలము శుష్కంబులు, నార్ద్రంబులు నగు నింధనంబుల నన్నిటిని దగ్ధంబులుగాఁ జేయునట్లు జ్ఞానానలము శుభాశుభకర్మంబుల నన్నిటిని నిమిషములో దహింపఁజేయఁగలదు. ప్రదీప్తం బగుదీపం బల్పంబయ్యు నంధకారమును నశింపఁజేయునట్లు యోగాభ్యాసం బల్పం బయ్యును బాపసమూహంబును నశింపఁజేయఁగలదు.

శ్రద్ధాసహితంబుగా క్షణకాలము పరమేశ్వరుని ధ్యానించుటచేతనే యనంతములగు ఫలంబులును సాధ్యంబు లగును. తీర్థంబును, తపంబును, యజ్ఞంబునుగూడ ధ్యానసమంబులు గాఁజాలవు. కావున తప్పగా ధ్యానమునే యనుష్ఠింపవలయును. యోగులగువారు ఆత్మవిదులు గావున జలపూర్ణంబు లగుతీర్థంబులకడకును, మృత్పాషాణమయంబు లగు దేవతామూర్తులకడకు నెన్నటికిఁ బోవఁజాలరు. మృత్పాషాణములచేఁ గల్పితంబు లగు దేవతావిగ్రహములు లౌకికుల కెట్లు ప్రత్యక్షంబులై యుండునో యట్లే యోగులకు మనోదేవుని సాక్షాత్కారము ప్ర

త్యక్షంబై యుండును. బాహ్యచరులకంటె గూఢచారులే రాజునకుఁ బ్రియులైనట్లు కర్మనిష్ఠులకంటె యోగులే పరమేశ్వరునకుఁ బ్రీతిభాజను లగుచున్నారు. రాజమందిరమునందలి బాహ్యచరులవలెనే కర్మనిష్ఠులు విశేషఫలభాగులు గానేరరు. జ్ఞానయోగాభ్యాసమాత్రంబు గావించి మధ్యకాలంబుననే మృతుం డగువాఁడుగూడ యోగమాత్రఫలంబుచే రుద్రలోకప్రాప్తుం డగును. అట నాతఁడు సుఖభోగంబులనుభవించి యోగివంశంబున మరల జనించి జ్ఞానయోగమును సాధించి ముక్తుం డగును. యోగపురుషులకు లభించుసద్గతు లెట్టిమహాయజ్ఞంబులచేనైనను లభింపవు. ఒక్కశివయోగికి భిక్షాదానంబు గావించుటచే వేదజ్ఞులగు కోటిమంది బ్రాహ్మణులను యథావిధిగఁ బూజించిన ఫలంబు చేకూరును. యజ్ఞములు, అగ్నిహోత్రములు, దానములు, తీర్థయాత్రలు మొదలగువానివలనం గలుగుసత్ఫలంబు లన్నియును యోగులకు అన్నదానంబు గావించుటచేతనే సిద్ధింపఁగలవు. శివయోగులను నిందించువారు శ్రోతలతోఁగూడ నాకల్పంబును నరకభోగు లగుదురు. శ్రోతలు లేకున్నచో నట్టియోగులను నిందించుట గలుగదుగావున పాపమునకుఁ గారకులగు శ్రోతలుగూడ దండార్హులైరి. శివయోగులను భక్తితో భజించువారు ప్రథమంబున మహాభోగంబుల ననుభవించి యంతంబున శివయోగప్రాప్తు లగుదురు. కావున భోగయోగార్థు లగువారెల్లరును వివిధోపచారంబులచే శివయోగుల నారాధింపవలయును. యోగధర్మము సారవంతమైనది గావున నది పాపముద్గరంబులచే ఛేదింపఁబడదు. వజ్రము తండులంబులచే విదీర్ణంబు గానట్లే యోగి పాపంబులచే యోగనాశంబు నందఁడు. శివయోగి నివసించుదేశమే పవిత్రం బగునని చెప్పుచుండఁగా శివయోగి యెట్టిపవిత్రుఁడో వేఱుగ వర్ణింపనేల? కావున విచక్షణుండగువాఁడు సర్వకర్మం

బులను బరిత్యజించి దుఃఖనాశంబుఁ గోరుచు శివయోగము నాశ్రయింప వలయును.

సిద్ధుం డగుయోగి లోకహితంబుఁ గోరుచు సకలవిషయభోగంబు ల ననుభవించుచు యథేచ్ఛావిహారంబు చేయుచుండును. ఏదేనొకస్థానంబున నివసించినను నుండును. విషయసుఖంబులు క్షుద్రంబు లని యెంచి వైరాగ్యముచే సకలంబును త్యజించి కర్మత్యాగియై యుండును. లక్షణంబులనుబట్టి మృత్యువు సమీపించినదని యెఱింగినవాఁడు యోగాభ్యాసము నారంభించి శివక్షేత్రమున వసించుచు అనశనవ్రతము, శివాగ్నిప్రవేశము, శివతీర్థజలప్రవేశము మొదలగువానివలన రోగము లేకుండగనే ధైర్యముతోఁ బ్రాణత్యాగంబు గావించినచో నాతఁడు సద్యోముక్తుం డగును. అందువలన నాతని కాత్మహత్యాదోషమించుకంతయును లేదు. శివక్షేత్రవాసియై వైరాగ్యసంపన్నుండగు నాతనికి రోగాదులచే మరణంబు సంభవించినను పూర్వమువలెనే ముక్తిలాభంబగును. దేహము నివృత్త్యాదికర్మమార్గానుసారంబుగా భూగర్భంబునందు విలీనం బగుచున్నది. స్వేచ్ఛాక్రమంబున యోగము నవలంబించి ప్రాణవాయువు నూర్ధ్వముఖంబుగ జెలించి మరణించుటయే యుత్తమమరణము: ఉత్క్రాంతిశక్తి సంప్రాప్తి కలిగియే మేలగు. అట్టి మరణము శివక్షేత్రమునందైనచో మరింతయుఁ బ్రశస్తము.

శివనిందారతునకు వినాశంబుఁ గోర్చి గాని యుద్ధప్రాప్తంబో యు స్వయముగ నాఘాతంబు గాంచిగాని ప్రాణత్యాగంబు గావించువానికిఁ బునర్జన్మంబు లేదు. శివనిందారతునివధించుట కసమర్థుండై యాత్మహత్యగావించుకొనువాఁ డేకవింశతిపురుషులతోఁగూడ సద్యోముక్తుఁ డగును. శివుఁడు, శివభక్తుఁడు, శివాచారము, శివవిద్య, వీనికొఱకు బ్రాణత్యాగముగావించినచో నుత్తమముక్తిపదంబుఁ జేరఁగలఁడు. యు

భాక్రియంబుగ షడధ్వశుద్ధిప్రాప్తిం గాంచి మృతుండగువానికి పశువులకుంబోలె నుత్తరక్రియల నాచరింపనక్కఱలేదు. ఆ మరణముతలన నాతనిపుత్రాదుల కాశౌచంబు గలుగదు. ఆశరీరమును భూగర్భంబునఁ బూడ్చుటగాని, యనలంబున దహించుట గాని, యుత్తమతీర్థజలంబులయందు విడుచుటగాని, కాష్ఠలోష్టాదులంబోలె నహారకత్యజించుటగాని, చేయవలయును. ఆవ్యక్తినుద్దేశించి కర్మంబు సేయ శక్తి లభించినచోఁ గల్యాణకర్మం బాచరించి శివభక్తులకు సంతృప్తులం గావింపవలయును. ఆతనిధనము నాతనిశిష్యసంతతి యున్నచో విభజించుకొనవలయును. లేకున్నచో శివార్పితంబుగాఁ జేయవలయును. అంతేకాని యాధనము నాతనిపశుసంతాన మనుభవింపఁగూడదు.

సమాలోచనము.

సూతుం డిట్లనియెను. వాయుదేవుం డీరీతిగా వాసుదేవున కుపమన్యుండు బోధించినజ్ఞానయోగమును బ్రీతులగు మునిగణంబులకుపదేశించి యాత్మతత్త్వంబును బ్రకటితంబుగాఁ జేసి సాయంసమయమునం దాకాశంబున కంతర్హితుం డయ్యెను. అనంతరము ప్రభాతకాలంబున నైమిశారణ్యవాసులగుమునివరు లందఱును యజ్ఞాంతంబున నవభృథస్నానంబు గావింపఁ బ్రయత్నించుటయు బ్రహ్మదేవు నాజ్ఞచే స్వయముగా సరస్వతీదేవి వారియెడలఁ బ్రసన్నయై నిర్మలస్వాదుసలిలంబులతో నదీరూపంబున వారియెదుటఁ బ్రవహింపఁదొడంగెను. మునీంద్రు లాసరస్వతీనదిం గాంచి పరమానందభరితులై యారంభంబగుయజ్ఞంబును ముగించి యందవగాహనంబు గావించి యాజలంబులచే దేవాదితర్పణంబులం గావించి పూర్వవృత్తాంతమును స్మరించి కాశీనగరాభిముఖులై బయలుదేఱిరి. వారప్పుడు హిమాలయమునుండిదక్షిణాభిముఖంబుగాఁ బ్రవహించుచున్నభాగీరథిం గాంచి యందు

స్నానంబు లాచరించుచుఁ దక్షిణమునుండియే పయనంబు సాగించి కాశికిం జేరి యందుత్తరవాహినియగు గంగానదియందు స్నానంబాచరించి యథావిధిగ అవిముక్తేశ్వరశివలింగమును బూజించి గమనోద్యుక్తు లగుచుండగా నప్పు డాకాశమండలమునఁ గోటిసూర్యప్రభాభాసమానంబగు నొకదివ్యతేజము వారికి గోచరించెను. వేలకొలఁది భస్మాచ్ఛాదితదేహులగు పాశుపతగణంబు లాతేజమునందు విలీను లగుచుండిరి. తపస్విగణంబు లందు విలీను లగుచుండిరి. అట్లుండి యంతలోనే యాయద్భుతతేజ మంతర్హితమైపోయెను. ఆయద్భుతవ్యాపారముం గాంచి మునులెల్లరు నాశ్చర్యముతో నేమియు నిర్ణయింపఁజాలక బ్రహ్మవనాభిముఖులై పోవఁగొడంగిరి. అంతటఁ బూర్వమే వాయుదేవుండు బ్రహ్మయొద్దకుంబోయి తానునైమిశంబున మునివరులం గలిసికొనిసంభాషించుటయు, వారిసత్రయాగంబు పూర్తియగుటయు మొదలగుసంగతులను మనవిచేసి యవ్వనజాసనునొద్ద సెలవు గైకొని స్వస్థానంబునకుం బోయెను.

ఇట బ్రహ్మసభయందు గానవిషయంబున నారదతుంబురులకు వివాదమగుటయు విరించి గంధర్వాప్సరోగణసహితముగా మధ్యస్థుండై వారిగానవిశేషంబులఁ బరీక్షించి యిరువురును సమాను లగుటచే వారికి మైత్రిం గల్పించెను. అప్పుడు నారదుండు గంధర్వాప్సరోగణపరివృతుండై నకులీశ్వరుని సేవింపఁబోవుచుండ మునిగణంబు లాతనిం గాంచి ప్రణమిల్లి విరించిసందర్శనంబున కిదిసమయమేగద యని ప్రశ్నించిరి. నారదుండు „ఇదియే సమయము; లోపలికిఁ బొండు" అని చెప్పి యతిత్వరితముగాఁ దనత్రోవం బోయెను. అనంతరము ద్వారపాలకులు పితామహునకు మునిగణంబుల రాక నెఱింగించి యనుమతిం గాంచి మునులను లోనికిఁ బంపించిరి.

అప్పుడత్తపోధనులందఱును బ్రహ్మభవనంబున నొక్కసారిగఁ బ్రవేశించి దూరమునుండియే వనజోదరునకు దండప్రణామంబు లాచరించి చతుర్ముఖునియనుజ్ఞం గాంచి సమీపంబున నుపవసించి యుండిరి. పద్మాసనుం డప్పుడు వారినుద్దేశించి కుశలప్రశ్నంబు చేసి "మునులారా! మీవృత్తాంతం బంతయు నాకవగతంబై నది. వాయుదేవుం డతిశ్లాఘితుం డైనంతనే మీరేమి చేసితిరో చెప్పుఁడు!" అనుటయు సంయమిగణంబులు తమయవభృథస్నానానంతరంబున గంగాతీర్థంబునకును కాశీనగరంబునకును జనుటయు, నచ్చట దేవస్థాపితంబు లగు లింగంబులను దర్శించుటయు, అవిముక్తేశ్వరునిఁ బూజించుటయు, నచ్చట గగనతలంబునం దొకదివ్యతేజము కానఁబడి యంతలోనే యంతర్థానం బగుటయు మొదలగువిషయముల నన్నిటి నెఱిఁగించిరి. చతురాననుండును వారిమాట లాలించి యించుక తలయూచి గంభీరస్వరముతో మునులారా! ఆముష్మికపరమసిద్ధి మీకు సమీపమునందే యున్నది. మీరందఱును దీర్ఘసత్త్రయాగంబున బహుకాలము నుండి ప్రభుని సేవించియున్నారు. అందుచే నమ్మహాదేవుఁడు మీయెడలఁ బ్రసన్నుండయ్యెను. కాశీధామంబున మీరు గాంచినమహాతేజమే మహేశ్వరుని తేజోమయలింగస్వరూపము. నైష్ఠికులును, నిష్కాములు నగుపాశుపతవ్రతులందు విలీనులై ముక్తిలాభంబు నందుచుందురు. మీకుఁగూడ నట్టిముక్తి లభించు ననియే యావన్మసము సగాచించుచున్నది. మీకుఁ గల్యాణప్రాప్తికి శుభసమయము తటస్థించినది. మీరిప్పుడు దేవసేవితం బగుసుమేరుదక్షిణశృంగంబునకుఁ బొండు. అచ్చట నాపుత్త్రుం డగుసనత్కుమారుండు నందిరాకకై నిరీక్షించుచున్నాఁడు. నేనే సకలయోగీశ్వరుండ ననుగర్వముచే నాఁడొక్కప్పుడు పరమేశ్వరుండగు శివునింగూడ గౌరవించుట తెలిస్క॥

గావించెను. అప్పుడు నందీశ్వరుండు క్రుద్ధుండై యాతని మహోగ్రంబుగా శపించెను. అందుచే సనత్కుమారుండు పశ్చాత్తప్తుండై చిరకాలము భవానీభర్తల నుపాసించి నందీశ్వరుని ప్రార్థించి దుష్ట్రో శాపమోక్షణంబు గావించుకొనియెను.

అప్పుడు శంకరుండు బ్రహ్మకుఁ బ్రియముప్పతిల్ల సనత్కుమారుండు మూఁగుండగుట యుచితంబు గాదని తలంచి నవ్వుచు నందీశ్వరునిం బిలిచి కుమారా! ఈసనత్కుమారుండు నన్నెఱుంగజాలక యహంకృతుండై యున్నాఁడు. నీవితనికిఁ దత్త్వబోధంబు గావింపుము. ఈశిష్యుండు నీవలనఁ బరమజ్ఞానలాభంబు నంది లోకంబున ధర్మప్రచారంబు చేయఁగలఁడు. అని యాజ్ఞాపించుటయు నంది యంగీకారసూచకంబుగా మస్తకంబును వంచెను. మునులారా! సనత్కుమారుం డిట్లు నాయాజ్ఞచే సుమేరుదక్షిణశృంగంబున నందీశ్వరునిరాకకై నిరీక్షించుచున్నాఁడు. నంది వచ్చుటకుఁ బూర్వమే మీరాతని దర్శింపుఁ డని బ్రహ్మ బోధించుటయు మునులు పరమానందములో మేరుశైలాభిముఖులై పోయిరి. సుమేరుదక్షిణశృంగంబున నగాధంబును, స్వాదువిమలశీతలజలపూర్ణంబు నగుసహస్రసరోవరంబు గలదు. అది మహాసాగరముంబోలి విశాలమై చతుష్కోణంబును స్ఫటికసోపానంబులచే విరాజిల్లుచుండును. వివిధవర్ణంబులగు వికసితకుసుమంబులచేతను, స్వర్ణమయంబులగు పద్మోత్పలంబులచేతను, హాటకనిభంబులగు కుసుమంబులచేతను, మేఘసదృశంబులగు తరంగంబులచేతను నాసరోవరము భూతలంబున కవతరించినయాకాశమో యనునట్లు గానవచ్చుచుండును. అందు నిరంతరము మును లవగాహనంబు లాచరించుచుందురు. సకలదిక్కులను నందనవనంబులు శీతచ్ఛాయాయుక్తంబులై యుండును. దానిచుట్టును సుమఫలభరితంబులగు తరులతా

షండంబులు చల్లనిచాయలచే జీవలోకంబును దనుపుచు కలవిహంగ కలాలాపంబులచేఁ గుశలప్రశ్నంబులుసేయుచు సురభిశీతలమందపవనంబులచేఁ బ్రీతిం గూర్చుచుండును.

ఆసరోవరతీరంబునఁ గల్పతరుమూలంబున వజ్రమణిమయవేదికపైఁ గోమలమృగచర్మాసనంబున నప్పుడే సమాధియుండి లేచిన శిశుస్వరూపుం డగుసనత్కుమారుని మహాముని లుపాసించుచు ననేకవిధంబులఁ బూజించుచుండ నైమిశారణ్యమునిగణంబు లంతయుం గాంచి ప్రణామపూర్వకంబుగా సమీపించి సమయంబు చేసికొని తమయాగమనవృత్తాంతమును సనత్కుమారునకుఁ దెలియఁజేసిరి. ఇంతలో గగనభాగంబున నతిమధురంబుగా దుందుభిధ్వనులు శ్రవణగోచరంబులయ్యెను. అప్పుడు బహుగణనాయకపరివృతంబును, సూర్యసన్నిభంబునగు దివ్యవిమానము గానంబడియెను. ఆవిమాన మతిలోకమనోహరమై గంధర్వాప్సరోగణనృత్తగీత పరిశోభితమై యలరారుచుండెను. తన్మధ్యమునందు చామరద్వయాంతరాళంబున, చంద్రసదృశంబును, శుక్లమణిదండకలితంబు నగుఛత్రంబున కధోభాగంబున దివ్యసింహాసనంబున సుయశాసహితంబుగ నాసీనుండై త్రిలోచనుండును, శూలధారియు, విశ్వేశ్వరగణాధ్యక్షుండును, విశ్వేశ్వరతుల్యుండును, నిగ్రహానుగ్రహసమర్థుండును, చతుర్బాహుండును, చంద్రభూషితుండును, కాలకళంకాలంకృతుండును నై యున్ననందికేశ్వరునవలోకించి సనత్కుమారుండు మునిగణసహితంబుగాఁ గృతప్రణాముండై లేచి యాత్మార్పణంబు గావింపనుద్యుక్తుండై నట్లు కానంబడియెను. అప్పు డవ్విమానము భూతలంబున కవతరించి . . . తే సనత్కుమారుండు నం దీశ్వరునకు దండప్రణామంబు గావించి . . . . తే . . . గ నాతనికిఁ బరిచితులం గావించి బ్రహ్మదేశంబున వీరు నివసించువారై

యుటకేతెంచి రని యెఱింగించెను. అప్పుడు నందీశ్వరుండు తన కటాక్షావలోకనమాత్రముచేతనే వారిపాశబంధమోచనంబు చేసి శైవధర్మమును, ఈశ్వరయోగమును వారికి బోధించి మరల శివసాన్నిధ్యంబునకుం బోయెను. మునివరులారా సనత్కుమారుండు స్వయముగా నాగురుండగువేదవ్యాసున కాతత్త్వం బంతయు నుపదేశించెను. గురుకరుణావశంబున నేనును దానిని సంక్షేపించి మీకెఱింగించితిని. ఈశివపురాణము వేదానభిజ్ఞులకును, అభక్తులకును, నాస్తికులకును బోధింపరాదు. విధివిధానంబున నీపురాణమును బ్రదానముచేయుట, గ్రహించుట, పఠించుట, ఆకర్ణించుట మొదలగువానివలన నిహలోకంబునందు ధర్మార్థకామసుఖంబులును బరంబున మోక్షంబును లభించును. మునివరులారా! మీరును, నేనునుగూడఁ బౌరాణికయోగమార్గంబునఁ బరస్పరోపకృతులమై కృతార్థులమైతిమి. మనకు నిరంతరమును సర్వవిధంబులఁ గల్యాణంబగుంగాక! అని సూతుం డాశీర్వదించి వెడలుటయు మునిగణంబులు ప్రయాగయందు యాగసమాప్తిం గావించి విషయకలుషిం బగుకలికాలంబునఁ గాశీధామంబున నివసించి పశుపాశమోక్షాభిలాషులై పాశుపతవ్రతాచరణంబు చేసి జ్ఞానప్రాప్తులై పరనిర్వృతిలాభంబు నందఁగలిగిరి.

ఇది వాయవీయసంహిత.

పురాణగ్రంథమాలిక, పిఠాపురము.

ఇందు పురాణగ్రంథములు తెలుఁగువచనరూపమున రెండేసి నెలల కొక్కొక్క సంపుటముచొప్పున 200—250 పుటలవఱకుండున డెమ్మీసైజునఁ బ్రకటింపఁబడుచుండును.

నిబంధనలు.

1. ఇందు చందాదారులగువారు రు 0-4-0 ప్రవేశరుసుము చెల్లింపవలయును.
2. చందాదారులకు పోస్టేజిమనియార్డరు ఖర్చులు మేమే భరించి ఒక్కొక్కసంపుట మొకరూపాయకుమాత్రమే పంపుచుందుము. (చందాదారులుకానివారికి పోస్టేజీగాక రు 1-8-0 లు.)
3. నైజాము ఇలాకాగ్రామములవారికి వి. పి. సౌకర్యములు లేవు కావున నట్టివారు ప్రవేశరుసుముసహా రు 5-4-0 ముందుగాఁ జెల్లించినచో వారికి ఆఱుసంపుటములు ప్రకటింపఁబడినపుడెల్ల రిజస్టర్డు బుక్కుపోస్టుగాఁ బంపుచుందుము.

సహాయులు:—సంవత్సరమునకు ముందుగ రు 10 ల నొసఁగువారిని సహాయులుగాఁ జేర్చుకొని వారినామములను సహాయులపట్టికలోఁ బ్రకటించుచు వత్సరమున వెలువడు ఆఱుసంపుటములను అన్‌రిజిస్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

పోషకులు:—ఒక్కసారిగ నూటపదియాఱు రూప్యములు గ్రంథమాలికకు విరాళముగనొసఁగిన భాషాభిమానులను పోషకులుగాఁ జేర్చుకొని వారినామములను గ్రంథములలోఁ బ్రకటించుచు నీగ్రంథమాలికనుండి వెలువడు గ్రంథములన్నిటి నెప్పటికప్పుడు అన్‌రిజిస్టర్డుపార్సెలుగాఁ బంపుచుందుము.

రాజపోషకులు:-ఒక్కసారిగ రెండునూటపదార్లనుగాని అంతకుఁ బైఁగ వారియుదారహృదయమునకుఁదోఁచునంతటిద్రవ్యముగానిదయచేయు శ్రీమంతులనుజమీందారులను రాజపోషకులుగాఁ జేర్చుకొని యిందు ప్రకటింపఁబడుగ్రంథములన్నిటిరిజిస్టర్డుబుక్కుపోస్టుగా నంపుచుందుము.

పురాణగ్రంథమాలిక, } నడకుదుటి వీరరాజుపంతులు,
పిఠాపురము, తూర్పుగోదావరిజిల్లా } సంపాదకుఁడు.

స్త్రీల వ్రతకథలు.

(బాలాంత్రపు వేంకటరావుగారిచే రచింపఁబడినవి.)

ఇవి బాలికలకును స్త్రీలకందఱకును అత్యంతోపయుక్తములుగ నుండునట్లు రచింపఁబడినవి. ఆంధ్రులలో నోములు పట్టని స్త్రీలుండరు. పూర్వమునుండి కథలు వచ్చిన పెద్దముత్తైదువలు లేని యీయిరువదియవశతాబ్దిని, స్త్రీలలో విద్య వ్యాపించుచున్న యిప్పుడు, స్త్రీలందఱును సులభముగఁ జదువుకొని యీనోములు పట్టుటకై సులభశైలిని రచింపఁబడినవి. ఎంతకాలముక్రిందటనో 1-2 కూర్పులు చెల్లిపోయినవి. మరల మూఁడవకూర్పు ముద్రించినాము.

ఇవి రెండుభాగములు. భాగమునకు 32 నోములు (ఉద్యాపనములసహా) చొప్పున రెండుభాగములలోను 64 నోములు కలవు. వెల భాగము 1 కి 0—8—0 పోస్టేజి కొనువారే భరింపవలెను. 1—2 భాగములు వెలకు సిద్ధముగ నున్నవి.

ప్రథమ భాగము.

1 పోచేటిపద్మము(మూఁగనోము) 2 పదారుకుడుముల తద్దెకథ, 3 ఉండ్రాళ్లతద్దెకథ, 4 అట్లతద్దెకథ, 5 శ్రావణమంగళవారము కథ, 6 వరలక్ష్మీవ్రతకథ, 7 చిట్టిబొట్టుకథ, 8 పసుపుగౌరికథ, 9 మొగవోలెక్కకథ, 10 చిత్రగుప్తునినోముకథ, 11 విఘ్నకాంతకథ, 12 కందగౌరికథ, 13 ఉప్పుగౌరికథ, 14 గోపునినోముకథ, 15 గౌడిసెనోము కథ, 16 వాకిల లక్ష్మీవారము కథ, 17 మారేడుదళముకథ, 18 సంపదశుక్రవారము నోముకథ, 19 మార్గశిరలక్ష్మీవారముకథ, 20 శోకములేనిసోమవారముకథ, 21 పూర్ణాదివారముకథ, 22 గ్రామకుంకుమనోముకథ, 23 సెనగలగౌరికథ, 24 ఆపదలేని ఆదివారముకథ, 25 ముప్పదిమూఁడు పుణ్యములనోము కథ, 26 సంజేటి అమావాస్యనోముకథ, 27 దంపత్తాంబూలమునోముకథ, 28 పదహారుఫలములనోము కథ, 29 సౌభాగ్య తదియలకథ, 30 మాఘపాదివారముకథ, 31 సూర్యపద్మముకథ, 32 నందికేశ్వర వ్రతకథ.

ద్వితీయ భాగము.

1 గాజుల గౌరీదేవికథ, 2 గ్రహణగౌరి కథ, 3 పోలిక్షేత్రమునకువైశ్యకథ, 4 పోలాలమావాస్యకథ, 5 కదుళ్లగౌరీదేవికథ, 6 నిత్యశృంగారముకథ, 7 ఉదయకుంకుమనోముకథ, 8 కుంకుమగౌరినోముకథ, 9 చిక్కుడుపుగౌరికథ, 10 కైవడుగౌరికథ, 11 శాకదానము కథ, 12 చద్దికూటిమంగళవారములకథ. 13 రేగులగౌరికథ, 14 పంచతాంబూలములనోముకథ, 15 మునికార్తికవ్రతము, 16 కన్నెతులసిమ్మకథ, 17 కాటుకగౌరికథ, 18 అట్లమీఁదఆవపువ్వులకథ, 19 పసుపుపువ్వులనోముకథ, 20 కార్తీకచలిమిళ్లనోముకథ, 21 తిరగనాదివారములకథ, 22 గుమ్మడిగౌరికథ, 23 పుణ్యతాంబూలములనోముకథ, 24 గంధంతాంబూలాలనోముకథ, 25 పసుపుతాంబూలములకథ, 27 మాఘగౌరికథ, 28 బాలాదివారములకథ, 29 బచ్చలిగౌరికథ, 30 ఐశ్వర్యలక్ష్మీకథ, 31 చిలుకముగ్గులనోముకథ, 32 బొమ్మలనోముకథ.

రెండుభాగములును ముద్రితమై సిద్ధముగానున్నవి. విరివిగా కొనువర్తకులకు మంచి కమీషను ఇయ్యఁబడును. ఆంధ్రప్రచారిణీచందాదారులకు పోస్టేజీలేదు.

పీఠాపురము — బాలాంత్రపు వేంకటరావు.